వెల రూ. 10

అరుణతార

తెలుగు సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి 26 • సంచిక 3 • విజయవాడ • డిసెంబర్ 2006

సాహిత్య విమర్శకులు

వల్లంపాటికి జోహార్లు

సద్దాం సూర్యుడు!

రాంకి

నీకోసం
మేమూ
కన్నీళ్లు విడిచాం...

గొప్ప సైనికుడిగా
గుర్తుపెట్టుకుంటాం

సాహసానికి ప్రతీకగా
తలచుకుంటాం

నువ్వు
గోచికి పెట్టుకున్న
గుండుసూదికే
వాని మెటల్ డిటెక్టర్
బిగ్గరగా గగ్గోల్లు పెట్టింది

సద్దాం!
నువ్వు స్వేచ్ఛను
ప్రేమించావనే సత్యాన్ని
నువ్వు పంచి ఇచ్చిన
రొట్టెలు తిన్న పక్షులు
రెక్కల చప్పుళ్లతో
లోకమంతా వినిపిస్తున్నాయ్...

నువ్వు తాపిన నీళ్లతో
మొక్కలు నిశ్శబ్దంగా
నీ రైతు హృదయాన్ని
చాటుతూ భవిష్యత్తు
మొలకలవుతున్నాయ్...

నీ కథలు
అరేబియన్ నైట్స్
వీరగాథలుగా చెప్పుకుంటాం

వీరులను తలుచుకున్నపుడల్లా
సద్దాం! వీరుడా!!
అనుకుంటాం

సామ్రాజ్యవాదుల
సింహస్వప్నంగా
నీ తెగువను స్మరించుకుంటాం

ప్రకృతి కూడా
ఈదురుగాలైతే
ఆ రాత్రి భయపడి
కారులో దాక్కున్న
బుష్ సంగతీ చెప్పుకుంటాం

ఉరి కంబంపై
ఏ ముసుగూ లేకుండా
ముత్యంలా నువ్వు మెరిస్తే
వాడు భయపడి
ముసుగుమాటున
ముఖం చాటేసుకున్నాడు

ఇప్పుడందరూ
ముక్తకంఠంతో
సద్దాం! అమర్ హై!!
సద్దాం! అమర్ హై!!

ఏ డిటెక్టర్లకూ అందని
సాయుధులై
జనం అదనుకోసం
ఎదురుచూస్తున్నారు...

ఇరాకీ ప్రజలారా!
మేమూ మీతో ఉన్నాం!!

KRSA 10 1M 106

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

2006
డిసెంబర్

262

సంపాదకుడు
సి.ప్రసాద్

మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307,
దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు,
కడప జిల్లా - 516 360.
సెల్ : 98660 21257

సంపాదకవర్గం
పాణి
కృష్ణాబాయి
వి.చెంచయ్య
మోహన్
నాగరాజు

రచనలు పంపవలసిన చిరునామా :
టి. కృష్ణాబాయి
9-19-3
CBM కాంపౌండ్
విశాఖపట్నం - 530 003.

సంపాదక లేఖ

నవంబర్, డిసెంబర్ సంచికలు కలిపి సాహిత్య విమర్శతో ప్రత్యేకంగా తేవాలనుకోవడం వల్ల ఆలస్యమయింది

సంచిక అచ్చుకు వెళ్ళబోతుండగా జనవరి 2న ప్రముఖ మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య చనిపోయారు. నిజానికి ఈ సంచికలో వల్లంపాటి రచన కూడా ఉంటే బాగుంటుందనుకున్నాంగాని, అప్పటికే నాలుగు నెలలుగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు .

జీవిత పర్యంతం సాహిత్య విమర్శారంగంలో మార్క్సిజాన్ని కరదీపికగా తీసుకొని మహత్తరమైన కృషి చేసిన వల్లంపాటి స్మృతికి ఈ సంచికను సగౌరవంగా అంకితం చేస్తున్నాం

'అనుశీలన'తో ప్రారంభించి 'నవలా శిల్పం', 'కథాశిల్పం', 'విమర్శాశిల్పం'గా విస్తరించిన ఆయన విమర్శా ప్రస్థానం ఇటీవల 'రాయలసీమ ఆధునిక సాహిత్యం - సామాజిక సాంస్కృతిక ప్రతిఫలనం'తో అత్యున్నత స్థాయికి చేరుకున్నది

పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రభావంతో ప్రాచీనసాహిత్యాన్ని, అలంకారశాస్త్రాలను లోతుగా చదువుకున్న వల్లంపాటి పాశ్చాత్య సాహిత్యాన్ని, సాహిత్య సిద్ధాంతాలను ఆకళింపు చేసుకొని విమర్శారంగంలో మార్క్సిస్టు దృక్పధాన్ని శక్తివంతం చేశారు. ముఖ్యంగా కధ, నవల ప్రక్రియలపై అద్భుతమైన విశ్లేషణద్వారా విమర్శారంగానికి తనదైన వొరవడిని అందించిన మనకాలపు మార్క్సిస్టు చింతనాపరుడాయన

వల్లంపాటికి ముందే వచన ప్రక్రియల అన్వయంలో, విశ్లేషణలో మార్క్సిస్టు విమర్శాకృషి చాలా జరిగి ఉన్నా దాన్ని అకుంఠితదీక్షతో విస్తరింపజేసిన ఘనత ఆయనదే. మార్క్సిస్టు దృక్పధంలో భాగంగా ఆయన సాహిత్య శిల్పాన్ని పట్టించుకున్న తీరు అద్భుతమైనది. అలంకారశాస్త్రాల మౌలిక స్వభావంపట్ల విస్పష్టమైన వైఖరి ప్రకటిస్తూనే, మార్క్సిస్టు విమర్శ మరింత సుసంపన్నం కావడానికి అలంకారశాస్త్రాల నుండి కొన్ని భావనలు స్వీకరించడానికి అవకాశం ఏమైనా ఉన్నదా? అనే ఆసక్తితో కూడిన ఆయన అన్వేషణ చర్చనీయాంశమే అయినా, కల్లోలభరిత తెలుగు సాహిత్యరంగంలో మార్క్సిజాన్ని దృఢంగా నిలబెట్టడానికి ఆయన చేసిన కృషి గౌరవనీయమైనది

వల్లంపాటి మార్క్సిస్టు ఆలోచనా సంస్కారంలో నిరంతర అధ్యయనం, అంతకు మించిన సంయమనం, సాహిత్యంపట్ల గాఢమైన ప్రేమ, సాహిత్య ప్రయోజనంపట్ల అచంచలమైన నమ్మకం అవిభాజ్యం కావడం వల్లనే ఆయన సుదీర్ఘ విమర్శా ప్రయాణం సారవంతం అయింది, తొట్రుబాటు లేకుండా కొనసాగింది

కధ,నవల రచయితగా సాహిత్య జీవితాన్ని ప్రారంభించినా, విమర్శారంగానికి అంకితమైన వల్లంపాటికి తెలుగు సాహిత్య విమర్శ చరిత్రలో ప్రత్యేకమైన చోటు ఉన్నది. తెలుగు సాహిత్య విమర్శకు ఆయన చేర్పును కూడా విమర్శనాత్మకంగా, లోతుగా అంచనా వేయటం ద్వారా మాత్రమే ఆయన కృషిని మనం కొనసాగించిన వాళ్ళమవుతాం, విస్తరించిన వాళ్ళమవుతాం.

ఈ సంచిక వెల : 10 రూ.
సంవత్సర చందా : 100 రూ.
జీవితచందా : 1000 రూ.

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి. డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.

ఈ సంచికలో...

తెలుగు సాహిత్య విమర్శకు స్త్రీవాద పరికరాలు : కాత్యాయని విద్మహే

రెండు విప్లవ కథలు - ఒక పరిష్కార మార్గం : పాణి

కవిత్వం - తాత్విక వ్యక్తీకరణ : ఎ.నాగరాజు

తెలుగు సాహిత్యంలో వైవిధ్యమైన పాత్రలు - మధురవాణి, రాగో : ముదునూరి భారతి

రండి! ఇండియా తమకు శిరస్సు వంచింది : కాశీం

చెప్పని కథలు : డా.కాకుమాని శ్రీనివాసరావు

విరుగుతున్న మగ్గం బతుకులు : కె. నాగేశ్వరాచారి

వాచక కేంద్ర విమర్శ - మైదానం లోతుల్లోకి : ధరణి

స్త్రీ కన్నీళ్లు లేని రాజ్యం : వి.ప్రతిమ

గవాయి - ముస్లిం వాదాన్ని ఏకాకిని చేసే కుట్ర : మహమూద్

వేంపెంట వైపు నుండి దళిత సాహిత్య పరిశీలన : పెద్దరామస్వామి

ఓరుగల్లు నుండి మూడు పుస్తకాలు : కృష్ణాబాయి

నూరేళ్ల అమ్మ : చలసాని ప్రసాద్

మిడ్కో కథలు : పి. వరలక్ష్మి

విప్లవ కవిత్వ పరిణామం : సగిలేటి

తెలంగాణావాద విమర్శ - అధిగమించవలసిన పరిమితులు : కె.శ్రీనివాస్

ముస్లింలు- దేశ చరిత్ర : చలసాని ప్రసాద్

ప్రపంచీకరణ దశాబ్దిలో పట్టుసడలని మార్క్సీయ 'శృతి' : రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

కాలం - అవగాహన : డా. కొడవటిగంటి రోహిణీ ప్రసాద్

దుఃఖిత ఆదిమానవుని చిత్రలిపి : వరవరరావు

సాహిత్యంలో అరాచకత్వంలో సమర్థనీయమేనా : డాక్టర్ జి.వి.కృష్ణయ్య

'ఆమె తలాక్ అన్నది' : కథపై చర్చ : షేక్ కరీముల్లా, అబ్దుల్ బాసిత్

అమేజాన్ ఆదివాసులిపుడు మాట్లాడుతున్నారు : అనువాదం ఉదయమిత్ర

తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ - పునరాలోచనలు : ఎన్.వేణుగోపాల్

దున్నేకొద్దీ దుఃఖం : ఆర్. శశికళ

సాహిత్య విమర్శలో చేరా : వి.చెంచయ్య

గురజాడ సాహిత్యం : ఉ.అ.నరసింహమూర్తి

ముస్లిం అస్తిత్వ వ్యక్తీకరణ - అలావా : షఫి

తెలుగు సాహిత్య విమర్శకు స్త్రీవాద పరికరాలు

☆ కాత్యాయనీ విద్మహే

ఒక అంతర్జాతీయ చారిత్రక అనివార్యతగా భారతదేశంలోను, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ దేశీయ ప్రాంతీయ ప్రజాచైతన్యంతో ముడిపడి మహిళా ఉద్యమం 1970లలో అభివృద్ధి చెందింది. మహిళా ఉద్యమానికి చోదకశక్తి స్త్రీవాదం. సాంఘిక ఆర్థిక రాజకీయ రంగాలను నియంత్రిస్తున్న, నిర్దేశిస్తున్న 'లైంగిక రాజకీయాల'ను గురించిన గుర్తింపు, విమర్శ ఇందులో ప్రధానాంశాలు. వివక్షాపూరిత పితృస్వామిక సామాజిక రాజకీయ నిర్మాణాలలో మార్పు ఈ విమర్శకు లక్ష్యం. దీనిని సాంస్కృతిక రంగానికి విస్తరింపచేయడంలో భాగంగా అభివృద్ధి చెందింది స్త్రీవాద సాహిత్య విమర్శ. మహిళా ఉద్యమ ప్రయోజనాలను ప్రజలలో వ్యాపింపచేయటంలో సాహిత్య రంగంలో స్త్రీవాద విమర్శ నిర్వహించిన పాత్ర గణనీయమైంది. అందువల్లనే స్త్రీవాద సాహిత్య విమర్శకులు ప్రపంచమంతటా మహిళా ఉద్యమంలో అత్యంత ఉపయోగకరమైన భాగం కాగలిగారు.

స్వీయ సామాజిక రాజకీయ జీవితానుభవాలు, స్త్రీవాద సిద్ధాంత అధ్యయన అవగాహనల వలన కలిగిన కొత్త విమర్శనాత్మక దృక్పథం - తెలుగులో సాహిత్య వస్తువును, అభివ్యక్తి రీతిని విశేషంగా ప్రభావితం చేస్తూ స్త్రీలు సాహిత్య సృజనరంగంలోకి ప్రభంజనం వలె ప్రవేశించటానికి కారణమయ్యాయి. 1980లో వచ్చిన 'జానకి విముక్తి' నవలతో ప్రారంభించి చాలా స్పష్టమైన, నిర్దిష్టమైన పద్ధతిలో స్త్రీ పురుష సంబంధాలను, కుటుంబంలో వాళ్ళ స్థానాన్ని విమర్శకు పెట్టటం, పునర్నిర్వచించటం ఇక్కడి నుండి ప్రారంభమైంది. 90వ దశకం నాటికి ఇది పూర్తి స్త్రీవాద రాజకీయ పదునును సంతరించుకొన్నది. 'వ్యక్తిగతమంతా రాజకీయమే' నన్న అవగాహన బలపడింది. కుటుంబం, కుటుంబంలో స్త్రీల జీవితం వ్యక్తిగతమైనవి అని చెప్పటం ద్వారా అక్కడ స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షను పీడనను సామాజిక చర్చల్లోకి రాకుండా విజయవంతంగా ప్రక్కకు నెట్టివేయటం జరిగిందని, స్త్రీల అధీనతను కొనసాగింపచేస్తూ పురుషాధికారానికి ఎదురులేకుండా చేసే అణచివేత రాజకీయాలలో ఇది భాగమని, తెలిసి వచ్చాక స్త్రీల వ్యక్తిగత విషయాలుగా, సమస్యలుగా ఇన్నాళ్ళు నిర్లక్ష్యం చేయబడుతూ వచ్చిన జీవిత పార్శ్వాలన్నీ ఇప్పుడు సాహిత్యవస్తు గౌరవాన్ని పొందాయి. స్త్రీలు తమలోకి తాము చూచుకొని తమను తాము తెలుసుకొని ఆవిష్కరించుకొనటం దగ్గర నుండి, నిర్వచించుకొనటం దగ్గర నుండి స్త్రీలుగా తమ అనుభవ కోణం నుండి, ప్రయోజనాల కోణం నుండి సమస్త సమకాలీన సామాజిక రాజకీయార్థిక పరిణామాలను వ్యాఖ్యానించి విలువ కట్టటం వరకు సాగించిన ఈ పాతికేళ్ళ ప్రస్థానంలో తెలుగు సాహిత్యాన్ని ముఖ్యంగా కవిత్వాన్ని, కథను - గుణాత్మకంగా అభివృద్ధి చేశారు.

అయితే స్త్రీవాదం అందించిన ఈ విమర్శా దృక్పథంలో సాహిత్యసృజన జరిగినంత విస్తృత స్థాయిలో సాహిత్యవిమర్శ వచ్చిందా అన్నది ప్రశ్న. 'స్త్రీవాద సాహిత్యం మీద నిర్మాణాత్మకమైన విమర్శ, స్త్రీవాద దృక్పథంతో కూడిన విమర్శ యింకా రాలేదు' అని ఓల్గా నీలిమేఘాలు కవితా సంకలనానికి రాసిన (1992) ముందుమాటలో అన్నారు. స్త్రీవాద సాహిత్య సృజన ప్రారంభమైన తరువాత పదిపన్నెండేళ్ళకు అన్నమాట ఇది. ఈ మాట అని కూడా పన్నెండేళ్ళు దాటింది. మరి అంతకు ముందు కానీ ఆ తరువాత కానీ స్త్రీవాద విమర్శ తెలుగు సాహిత్యంలో ఏ స్థాయిలో వున్నది? ఏ మేరకు బలపడింది? స్త్రీవాద దృక్పథంతో విమర్శ స్త్రీవాద సాహిత్యానికే పరిమితమైందా? సమస్త సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి, విలువకట్టడానికి స్త్రీవాద దృక్పథాన్ని ఎంతవరకు వినియోగించు కోగలిగాం? అనే అనేకమైన అనుబంధ ప్రశ్నలు ఈ సందర్భం నుండి పుడతాయి.

సాహిత్య సృజన జరిగినంత ఉధృతంగా సాహిత్య విమర్శ రావటం సాధ్యంకాదు. అది ఉద్వేగానికి సంబంధించినదైతే ఇది వివేచనకు సంబంధించింది - కావటమే అందుకు కారణం. అంతమాత్రాన తెలుగులో స్త్రీవాద విమర్శ వెనుకబడిపోయిందని కూడా అనుకోవలసిన అవసరం లేదు. 1980లో జానకి విముక్తి నవల వస్తే 1983 నుండి ప్రారంభించి ఏడాదికి పైగా ఆ నవల మీద అరుణతార,సృజన వంటి పత్రికలలో విస్తృతంగా జరిగిన చర్చలు స్త్రీవాద దృక్పథంలో సాహిత్యవిమర్శకు తొలిదారులు వేసాయి. స్త్రీ పురుష సంబంధాలు ఎలా ఉండాలి? అందుకు పెళ్ళి అవసరమా కాదా? స్త్రీలు చైతన్యవంతులయ్యే క్రమంలో కుటుంబం నిలుస్తుందా? పోతుందా? - ఇలాంటి ప్రశ్నల ప్రాతిపదిక మీద జానకి విముక్తి నవలేతివృత్తం విశ్లేషించబడింది. 'జానకి విముక్తి' నిర్మాణపరమైన వైఫల్యమని ఎవరెంత అన్నప్పటికీ తెలుగుదేశీయ సమాజంలోని సాహిత్య సాంస్కృతిక భావజాల రంగాన్ని ఒక్క కుదుపు కుదిపిన నవలగా జానకివిముక్తి నవల నిర్వహించిన చారిత్రక పాత్రను మాత్రం గుర్తించి చూపాయి ఈ విమర్శలు. అతడు - ఆమె నవలపైన, భూమిపుత్రిక నవలపైన (ఎగ్నెస్‌స్మెడ్లీ) కొత్త పద్ధతులు (కొకు) కథపైన వచ్చిన విమర్శలు స్త్రీవాద దృక్పథంలో సాహిత్య విమర్శ రూపొందుతున్న ఒక కోశస్థ దశను చూపుతాయి. సంప్రదాయ కుటుంబ చట్రంలోనే, తమ తమ జీవన పరిధులలోనే ఉనికి నిలబెట్టుకోవడానికి, నిరూపించుకోవడానికి స్త్రీలు పడిన ఆరాటాన్ని, జీవితంతో, కుటుంబంతో, సమాజంతో సంఘర్షించిన తీరును ప్రాచీన, ఆధునిక సాహిత్యాలలోని ఇతివృత్తాల విశ్లేషణ ద్వారా వెలికితీసి చూపించే ప్రయత్నాలు తెలుగుసాహిత్యంలో స్త్రీల పనిభావనా ప్రతిఫలనాలు, భారతంలో భార్యాభర్తల సంబంధాలు వంటి వ్యాసాలలో జరిగింది. ఈ విధమైన రచనలను పరిశీలిస్తే 1990 నాటికి స్త్రీవాద దృక్పథం తెలుగు సాహిత్య విమర్శకు కొత్త రూపాన్ని గుణాన్ని ఇస్తున్న క్రమం ఒక కొలిక్కి రావటం కనబడుతుంది.

స్త్రీవాద కవిత్వం మీద నిందలతో ఆరోపణలతో జరిగిన దాడికి సమాధానం ఇయ్యవలసిన సందర్భం నుండి కవిత్వంపై స్త్రీవాద దృక్పథంతో కూడిన విమర్శను అభివృద్ధి చేసే బాధ్యతను స్వీకరించటానికి చాలా మంది చొరవ చూపారు. పితృస్వామ్యం, జండర్, అణచివేత, ఇంటిపని, లైంగికత, పునరుత్పత్తి మొదలైన అంశాల గురించిన సైద్ధాంతిక జ్ఞానం స్త్రీవాద సాహిత్య విమర్శకు అత్యవసరమని తెలిసి వచ్చింది. స్త్రీవాదానికి మార్క్సిజానికి వైరుధ్యం ఉన్నదా అన్న ప్రశ్న కూడా ఈ సందర్భంలో చర్చలోకి వచ్చింది. పీడితులలోకెల్ల పీడితులుగా - మావో అన్నట్లు బానిసకొక బానిసకొకబానిసగా - వున్న స్త్రీలకు తమ బాధలను, గుండెబరువులను విప్పి చెప్పుకొనే హక్కు, అవసరం వున్నాయని చెప్పిన స్త్రీవాదానికి సాంఘిక ఆర్థిక రాజకీయ పీడనలకు అణచివేతకు గురవుతున్న శ్రామిక జన సౌభాగ్యాన్ని కాంక్షించే మార్క్సిజానికి వైరుధ్యం ఏమీలేదని కూడా ఈ సందర్భం నొక్కిచెప్పింది.

90వ దశకంలోకి ప్రవేశించే నాటికే చలం, కె.రామలక్ష్మి, పి.సరళాదేవి, రంగనాయకమ్మ మొదలైన పాతతరం రచయితల కథలను స్త్రీవాదం అందించిన జండర్ దృక్పథం నుండి విశ్లేషించే పని ప్రారంభమైంది. 90వ దశకంలో స్త్రీవాద రచయిత్రుల కథల విశ్లేషణగా అది కొనసాగింది. జీవితాన్ని, అనుభవాలను స్త్రీల కోణం నుండి చూడాలన్న అవగాహన ఈకాలంలో బలపడింది. కవిత్వ విమర్శలోనైనా, కథా విమర్శలోనైనా అది స్పష్టంగా కనబడుతుంది. స్త్రీల శరీరాన్ని, మనసును, వ్యక్తిత్వాన్ని ఒకదాని సంబంధంలో మరొకదానిని, ఒకదాని దగ్గర ప్రారంభించి మిగిలినవాటిని అణచివేసే అంతరగతితర్క పితృస్వామ్య అధికార రాజకీయాల లక్షణం తెలియటం

విమర్శకు అవసరమని ఈ దశకంలో నిరూపితమైంది. పితృస్వామ్య నియంత్రణ అనేది కుటుంబంలో పుట్టి కుటుంబంలో మాత్రమే అమలయి ఆగిపోదని అది సమాజంలోని అన్నిరంగాలకు వ్యాపించి రాజ్యం వరకు విస్తరించి వేళ్ళు తన్నుకుపోయిందని, అందువలన ఈ దృష్ట్యా చూస్తే తప్ప స్త్రీల జీవితాన్ని మొత్తంగా అర్థం చేసుకొనటం సాధ్యకాదని ఈ దశకంలో స్పష్టమైంది. నవల, కథ మొదలైన విస్తృత సామాజిక భూమిక కలిగిన సాహిత్య ప్రక్రియల అధ్యయనానికి స్త్రీ వాదం ఈ విధంగా ఒక కొత్త కోణాన్ని ఇచ్చింది.

90వ దశకంలో జండర్, లైంగిక రాజకీయాలు సాహిత్య అధ్యయనానికే కాక సాహిత్య శాస్త్రాల అధ్యయనానికి కూడా ఉపకరించే పరికరాలేనని నిరూపిస్తూ రసము - మహిళల అనుభూతి, మహిళావాద భూమిక నుంచి కావ్యశాస్త్ర దర్శనం వంటి వ్యాసాలు వచ్చాయి. జానపద సాహిత్య అధ్యయనంలో కూడా స్త్రీవాద దృక్పథం ప్రవేశించింది. 90వ దశకంలో వికసించిన దళిత వెనకబడిన కులాల ఉద్యమాలు, మైనారిటీ ఉద్యమాలు పితృస్వామ్య అధికార రాజకీయాలను కుల మత అణచివేత ఆధిక్య రాజకీయాల నుండి కూడా పరిశీలించవలసి వున్నదన్న అవగాహనను అభివృద్ధి చేసాయి. స్త్రీవాద విమర్శకు మరొక పార్శ్వం, మరింత నైశిత్యం ఇందువల్ల సమకూరాయి. ఇది కూడా తెలుగు సాహిత్య విమర్శకు మరొక చేర్పు అయింది.

20వ శతాబ్దిలోకి ప్రవేశించిన ఈ అయిదారేళ్ళలో నూతన ఆర్థిక విధానాల వలన సంభవించిన సామాజిక సాంస్కృతిక పరిణామాలు, ప్రభావాల నేపథ్యంలో స్త్రీలు స్త్రీలకోణం నుండి ప్రయోజనాల నుండి సామ్రాజ్యవాదాన్ని వ్యాఖ్యానించగల సత్తాగల విమర్శపరికరంగా స్త్రీవాదాన్ని గుర్తించి ఉపయోగించుకొనటం కనిపిస్తుంది. స్త్రీవాద భావనలతో మతాన్ని వ్యాఖ్యానించి అది స్త్రీల జీవితాన్ని సాహిత్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నదో విమర్శకు పెట్టటం కూడా ఈ కాలంలో ప్రారంభమైంది. మొత్తం మీద స్త్రీవాదం ఈనాడు సాహిత్యాన్ని సమాజాన్ని, సమాజంలో మానవ సంబంధాలను, ఆర్థిక రాజకీయ సంబంధాలను, సాంస్కృతిక సంబంధాలను నిర్ధారిస్తూ, నిర్దేశిస్తూ వచ్చిన మనుస్మృతి, అర్థశాస్త్రం, కామశాస్త్రం, నాట్యశాస్త్రం వంటి ప్రాచీన రాజకీయార్థిక నిర్మాణాలను వర్తమాన రాజకీయార్థిక సాంస్కృతిక నిర్మాణాలను, పరిణామాలను శాస్త్రీయంగా, సమగ్రంగా విమర్శించటానికి కొత్త పరికరాలను, భావనలను అందించిందన్నది ఈ ఐదారేళ్ళలో పూర్తిగా స్పష్టమంది.

ఈ క్రమంలో విశ్వవిద్యాలయ సాహిత్య విభాగాలలో స్త్రీల సాహిత్యంపైన, స్త్రీవాద సాహిత్యం పైన పరిశోధనలు ఊపందుకొన్నాయి. అయితే ఈ పరిశోధనలలో ఏ కొన్నింటిలోనో తప్ప స్త్రీవాద సిద్ధాంతాన్ని గానీ, అది అందించిన విమర్శ పరికరాలను గానీ స్పష్టంగా గుర్తించి నిర్దిష్టంగా ఉపయోగించుకొనటం అంత సమర్థవంతంగా, నిజాయితీగా జరగటం లేదు. స్త్రీవాద సాహిత్య సిద్ధాంతాన్ని, విమర్శ సూత్రాలను పరిచయం చేసే రచనలు తెలుగులో లేకపోవటం కూడా అందుకు కారణం కావచ్చు. కనుక స్త్రీవాదం సాహిత్య విమర్శకు ఇచ్చిన దృక్కోణం, పద్ధతి, పరికరాలు, సూత్రాలు ఇవి అని నిర్ధారించి చూపటం తెలుగు సాహిత్య విమర్శ ఆరోగ్యకరంగా అభివృద్ధి చెందటానికి అత్యవసరం.

1

స్త్రీవాద విమర్శ సాహిత్యాన్ని అర్థం చేసుకొనటానికి పితృస్వామ్యాన్ని ఒక సాధనంగా అందించింది. పితృస్వామ్యం అంటే తండ్రి అధికారం గల వ్యవస్థ. వంశవారసత్వం, ఆస్తివారసత్వం పురుషుడి వైపు నుండి నిర్ణయించబడటం, వీటిని అమలుచేసి కొనసాగించే వ్యవస్థగా కుటుంబం స్థిరీకరించబడటం, కుటుంబానికి పరిమితంచేసి స్త్రీల జీవితం నిర్వహించబడటం, మగవాడి వంశానికి, ఆస్తికి వారసులైన సంతానాన్ని కనిపెంచటమే, స్త్రీల పనిగా నిర్దేశించబడటం, కుటుంబ యజమాని అయిన పురుషుడి సంబంధంలోనే స్త్రీల హోదా స్థితిగతులు నిరూపించబడటం, పురుష ప్రయోజనాల దృష్ట్యానే స్త్రీల మధ్య సంబంధాలు సైతం నియంత్రించబడటం - పితృస్వామ్య వ్యవస్థ లక్షణాలు. మానవ సంబంధాలను, జీవితాలను శాసించే శక్తి ఇది. స్త్రీ పురుష లింగబేధం ప్రకృతి సహజంగా పుట్టుకతో వస్తున్నది కాగా పితృస్వామ్యం భావజాల నిర్మాణం ద్వారా స్త్రీ పురుషులకు ప్రత్యేకమైన భిన్న లక్షణాలను, స్వభావాలను ఆపాదించి, అలవాటు చేసి వాళ్ళమధ్య అంతులేని బేధాన్ని పెంచి పోషించింది. వారిని అసమానులుగా చేసింది. వివక్షా పూరిత ద్వంద్వ విలువలను అభివృద్ధి చేసింది. ఈ క్రమంలో స్త్రీ శరీరం, చైతన్యం, లైంగికత, పునరుత్పత్తి శక్తి, సమస్త జీవితం నియంత్రణకు, నిఘాకు గురి అవుతూ వచ్చాయి. తద్వారా స్త్రీలు తమ జీవితంలో భాగమైన హింసను విధ్వంసాన్ని, గాయాలను గురించిన కనీస స్పృహ లేని విధంగా 'కండీషన్' చేయబడ్డారు. ప్రాణాంతకమైన ఈ స్త్రీ పురుష వివక్షను నిర్మూలించటం లక్ష్యంగా అభివృద్ధి చెందింది స్త్రీవాదం.

సామాజిక నిర్మాణంలోని లింగ వివక్షను నిర్మూలించే లక్ష్యంతో అభివృద్ధి చెందిన స్త్రీవాదం ఆ సామాజిక నిర్మాణాన్ని అందులో భాగమైన లింగవివక్షను అనివార్యంగా ప్రతిఫలించి, ప్రచారం చేసి, సర్వజనాకర్షక, 'సర్వజనామోదాన్ని' సాధించి పెట్టే రాజకీయ స్వభావం కలిగిన సాహిత్యాన్ని అర్థం చేసుకొనటానికి కొన్ని కొత్త భావనలను అందించింది. ఇవి సాహిత్య విమర్శలో గుణాత్మకమైన మార్పును తెచ్చాయి. అవి.1. స్త్రీలకోణం, 2. వాచక అధ్యయనం 3. ఇతివృత్తానికి, భాషకు జండర్‌కు వున్న సంబంధం. 4. సాహిత్యానికి రాజకీయాలకు వున్న సంబంధం.

2

సాహిత్య నిర్మాణాన్ని అధ్యయనాన్ని ప్రశ్నించి గొప్ప కుదుపుకు లోనుచేసిన భావన స్త్రీలకోణం. సాహిత్య నిర్మాతలు, పాఠకులు పురుషులు మాత్రమే అయినప్పుడు సాహిత్యవస్తు నిర్వహణ, అవగాహన రెండూ సంకుచితం అవుతాయి. జనాభాలో సగమైన స్త్రీల భాగస్వామ్యం లేకపోవటం వలన సాహిత్య రచన, అధ్యయనం అసమగ్రం కూడా అవుతాయి. పందొమ్మిది వందల అరవయ్యవ దశకంలో ప్రారంభమై అభివృద్ధి చెందిన న్యూఫెమినిస్టు ఉద్యమంలో భాగంగా అధ్యయన అధ్యాపన రంగాలలోకి ప్రవేశించిన స్త్రీలు తమ అనుభవాలు, ఆలోచనలు ప్రాతిపదికగా ఈ భావనను ప్రచారంలోకి తెచ్చారు. సాహిత్య విమర్శలో స్త్రీల కోణం అంటే సాహిత్యాన్ని స్త్రీ అనుభవకోణం నుండి అధ్యయనం చేయటం. అంచనావేయటం. ఇది రెండు రకాలుగా వుంటుంది. సాహిత్య పాఠకురాలిగా స్త్రీ అనుభవ ప్రతిస్పందనలకు అవగాహనకు సంబంధించిన అంచనా ఒక రకం. దీనినే పెమినిస్టు క్రిటిక్ (Feminist Critique) అన్నారు. స్త్రీల సాహిత్యానికి పాఠకురాలిగా స్త్రీ అనుభవ ప్రతిస్పందనల విశ్లేషణ మరొక రకం. దీనిని గైనోక్రిటిక్స్ (Gyno Critics) అంటారు.

ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో ఎక్కడైనా సాహిత్య నిర్మాతలు, వినియోగ వాదులు కూడా పురుషులే కావటం, అనుకోవటం సర్వసాధారణం. పురుష ప్రయోజనాలకనుకూలంగా రూపొందిన వ్యవస్థలు సాహిత్యాన్ని కూడా పురుషుల కొరకే వ్రాశారు. స్త్రీలను పురుష ప్రయోజనాలకనుకూలంగా నిర్వచించారు. వ్యాఖ్యానించారు. ఈ సాహిత్యానికి పాఠకులుగా స్త్రీలు ముందుకు వచ్చిన కొత్త సామాజిక సందర్భంలో వాళ్ళ ప్రతిస్పందన భిన్నంగా వుండటానికి వీలుంది. పురుషుడు ఒక రచన పేరు మీద తెలివితక్కువతనం చంచలత్వం, వంచన స్త్రీ లక్షణాలుగా ఆరోపించినప్పుడు దానికి స్త్రీ పాఠకుల ప్రతిస్పందన తప్పనిసరిగా ప్రతిఘటనాత్మకమవుతుంది. పురుష సాహిత్య న్యాయం స్త్రీని తనకు భిన్నమైన, వ్యతిరేకమైన భావజాల వ్యవస్థతో తాదాత్మ్యం చెందవలసిన అనివార్యతను కల్పిస్తుంది. తనను తాను విభజించుకొని, నియంత్రించుకొని, కుదించుకొని జీవించే ఒత్తిడికి లోను చేస్తుంది. ఈ పరిస్థితి పాఠకులుగా స్త్రీలను తీవ్రమైన మానసిక హింసకు, విధ్వంసానికి గురి చేస్తుందని గుర్తించటం దగ్గర ఫెమినిస్టు

క్రిటిక్ ప్రారంభమవుతుంది. పురుషుల రచనలలో స్త్రీ పాత్రలు, జీవితాలు ఏ మూసలో అచ్చు తీయబడినవో పరిశీలించటం ప్రధానంగా జరుగుతుంది. సాహిత్యాన్ని పాఠకుల జీవితానుభవంతో అనుసంధానించి వ్యక్తి చైతన్యాన్ని ప్రోది చేయటం దీని లక్ష్యంగా వుంటుంది. పురుష నిర్మిత సాహిత్యంలో స్త్రీల ప్రతిబింబ ప్రతిఫల విమర్శలో అధ్యయనం రచయిత జీవితానుభవానికి, పాఠకుల జీవితానుభవానికి మధ్య భావ ప్రసార మాధ్యమంగా పరిగణింప బడుతుంది. పాఠకుల స్వీయ జీవిత అనుభవమే ఫెమినిజానికి సాహిత్యానికి మధ్య లంకె కుదిర్చే అంశంగా వుంటుంది. ఆ ప్రాతిపదిక మీదనే పురుషుల రచనలలో స్త్రీల గురించి చదవటం విమర్శించటం జరుగుతుంది.

ఇక స్త్రీల కోణం నుండి అధ్యయనంలో మరొక నమూనా స్త్రీల రచనలను స్త్రీలు తమ అనుభవ కోణం నుండి అధ్యయనం చేసి అంచనా వేసేదిగా వుంటుంది. దీనిని గైనో క్రైటిక్స్ అంటారు. తెలియకుండానే స్త్రీ రచయితల పట్ల సాహిత్య ప్రపంచంలో అమలవుతున్న వివక్ష సాహిత్య రంగంలో కృషిచేస్తున్న స్త్రీల గురించిన అధ్యయనంపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని కలిగించింది. ఉపాంతీకరించబడుతున్న, ఉపేక్షించబడుతున్న స్త్రీ రచయితల సాహిత్య సృజనశక్తుల గురించి ప్రత్యేకం మాట్లాడుకోవలసి వచ్చింది. పితృస్వామ్య సమాజంలో సాంఘిక రాజకీయార్థిక ఆధిక్యత మాత్రమే కాక పురుషుడికి సాంస్కృతిక రంగంపై ఆధిపత్యం కూడా వుంటుంది. పురుషుల సాహిత్యం అది ప్రబోధించే విలువలు సాధారణంగా స్త్రీలను నొప్పించేవిగా వుంటాయి. అటువంటప్పుడు స్త్రీలకు తమ కష్టసుఖాలకు సంబంధించిన ప్రతిస్పందనను నమోదు చేసిన స్త్రీల సాహిత్యం గొప్ప ఊరటనిస్తుంది. రచయితలుగా స్త్రీల దృష్టికోణం ఏమిటో తెలుసుకొనటం, అంచనావేయటం ఇక్కడ ప్రారంభమవుతుంది. స్త్రీలకు స్త్రీల రచనలు చదవటమంటే తోటి స్త్రీలతో చేసే సన్నిహితమైన, సంతోషకరమైన సంభాషణగా ఉంటుంది. స్త్రీ పాఠకులు స్త్రీల రచనలతో ఒక ఆత్మీయ సంబంధాన్ని సంఘీభావాన్ని అనుభవిస్తారు. స్త్రీలు స్త్రీల సాహిత్యం చదవటం ప్రారంభమైన తరువాతనే ఆ సాహిత్యం వేగవంతమైన శక్తివంతమైన అంతర్గత విద్యుత్తుగా ప్రధాన స్రవంతి పురుష సాహిత్యం నీడలలోనో, సాహిత్యానికి సమాంతరంగానో ప్రవహిస్తున్నదని గుర్తించి చెప్పటం జరిగింది. గొప్పరచనలు, గొప్పరచయితలు అన్న ప్రధాన స్రవంతి సాహిత్య భావనల పరిధిలోకి రాకుండా సమాజపు చివరి అంచులకు నెట్టివేయబడిన స్త్రీల రచనల గురించిన అధ్యయనానికి ఇది దారి తీసింది. విస్తృత స్త్రీల సాహిత్య చరిత్ర నిర్మాణానికి దారితీసింది. అనివార్యంగా స్త్రీలందరూ ఏ పితృస్వామిక సామాజిక చట్రంలో భాగమయ్యారో ఆ సామాజిక చట్రంలో అమలయ్యే అణచివేతను ఎదుర్కొనటానికి తమవైన వ్యూహాలను ఎలా ఏర్పరచుకుంటారో స్త్రీల సాహిత్యం చదివినపుడు అర్థమవుతుంది.

స్త్రీలు పురుషుల కంటే భిన్నమైన పాఠకులు. పురుషులకన్నా భిన్నంగా ఆ రచన తమ గురించి ఏమి చెప్తున్నదో, తమ జీవితాన్ని ఎలా శాసించాలని చూస్తున్నదో ఆ దృష్టి నుండి చదువుతారు. అందువల్లనే ఫెమినిస్టు క్రిటిక్ అనేది సాహిత్యాన్ని అనుమానాస్పదంగా పరిశీలించే పద్ధతిగా, ప్రతిఘటన ప్రధానమైన అధ్యయన విధానంగా విమర్శకు గురి అయింది. అలాగే స్త్రీల రచనలను స్త్రీలు చదవటం (గైనోక్రిటిక్స్) అనే విధానం స్త్రీల జీవితాన్ని సామర్థ్యాలను విస్తృత పరచటానికి బదులు సంకుచిత పరుస్తుందని, సెక్స్ కారణంగా కళారంగంలో స్త్రీలు చాలా వాటికి పరాయివారయిపోతారని, వాళ్ళ ప్రపంచం చిన్నదై పోతుందని విమర్శించబడింది.

సంప్రదాయ మానవీయ కళా దృక్పథం భిన్న జీవితాలను సాహిత్యం ద్వారా అనుభవానికి తెచ్చుకొనటం పాఠకులను మరింత సున్నితంగా సామాజిక బాధ్యతగల వ్యక్తులుగా మలుస్తుందని మనవలె లేని ఇతరుల కళ్ళద్వారా ప్రపంచాన్ని చూచి వారి కష్టాలను, బాధలను, సంతోషాలను అనుభవంలోకి తెచ్చుకొనటంద్వారా ఒక సామాన్య మానవత్వాన్ని గుర్తించగలుగుతామని, భిన్న సామాజిక వర్గాల అనుభవాలను చదివి తాదాత్మ్యతను, సానుభూతిని భజించటం ద్వారా మరింత న్యాయబద్ధమైన సమాజాన్ని గురించి ఆలోచించగల ప్రేరణ పొందుతామని చెప్తుంది. ఈ సంప్రదాయ కళా మానవతావాదాన్ని స్త్రీవాదులు అనుమానిస్తారు. ఈ సంప్రదాయ కళా మానవతా వాద దృష్టికోణం అంటే ప్రధానంగా పురుష దృష్టికోణమే. ఇది భిన్న సామాజిక వర్గాల అనుభవాలతో తాదాత్మ్యాను సూత్రప్రాయంగా అంగీకరించినా ఆ భిన్న సామాజిక వర్గాలలో స్త్రీలు ఉన్నారని గుర్తించటానికి నిరాకరిస్తుంది. అటువంటప్పుడు తానుమాత్రం లేని సామాజిక వర్గాల జీవితంతో దృష్టికోణంతో తాదాత్మ్యం చెందిన స్త్రీ తన స్వంత అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అందువల్ల పంచుకోవలసిన మానవత్వం కంటే జండర్ వివక్ష అధికంగా వుంది కనుక సాహిత్యాధ్యయనంలో ఊనిక దానికే.

అయితే స్త్రీగా పురుష నిర్మిత సాహిత్యాన్ని చదవటం అయినా, స్త్రీల సాహిత్యాన్ని చదవటం అయినా స్త్రీకావటం వలన సహజంగా అబ్బే కళకాదు. స్త్రీగా చదవటం అంటే స్త్రీవాద విమర్శన దృక్పథంతో చదవటం. ఇది అభ్యసనం వల్ల సంపాదించగలిగినది. ఈ విధంగా 'స్త్రీలకోణం' సాహిత్య విమర్శకు ఒక ప్రధాన పరికరంగా అభివృద్ధి చెందింది.

3

నిజానికి తెలుగు సాహిత్యానికి 'స్త్రీకోణం' అన్న భావన కొత్తదేమీ కాదు. గురజాడ అప్పారావు తాను వ్రాయతలపెట్టిన నవల కొరకు వ్రాసుకొన్న నోట్సులోనే స్త్రీల అనుభవం పురుషుల అనుభవం కంటే భిన్నంగా వుంటుందని సూచించాడు. 'నేను అసహ్యించుకునే మనిషితో శాశ్వతంగా ఎలా కాపురం చేసేది' అన్న ప్రశ్న స్త్రీ నుండి వస్తే దానికి జవాబు చెప్పగల సత్తా పురుషుడికి లేదని గురజాడ భావించాడు. స్త్రీల ప్రశ్నలు స్త్రీల జీవితానుభవాల నుండి వస్తవి కనుక పురుషుడు వాటికి జవాబు చెప్పలేని అశక్తుడేనని గురజాడ అభిప్రాయం. ఆ రకంగా స్త్రీల కోణం గురించిన తొలి స్పృహ గురజాడలో కనబడుతుంది. 1910లో 'కవిత్వతత్త్వ విచారము' వ్రాసి ఆధునిక సాహిత్య విమర్శకు ఆద్యుడైన కట్టమంచి రామలింగారెడ్డి పాతివ్రత్యతత్త్వాన్ని బోధపరచటం లక్ష్యంగా చేసుకొన్న సాహిత్యం స్త్రీలను దాసానుదాసులుగా నిరూపిస్తున్నదని నిరసించటమే కాక మోహం పురుషుల విషయంలో దక్షిణ నాయకత్వంగా కీర్తించబడి స్త్రీల విషయంలో పాపకార్యంగా భావించబడుతున్న విషయాన్ని ప్రస్తావించి 'మగవారికొక న్యాయం స్త్రీలకొక న్యాయం' అమలవుతున్న ద్వంద్వ విలువల సమాజవైఖరిని సాహిత్యం కేంద్రంగా విమర్శకు పెట్టాడు. ఆ రకంగా ఆయన కూడా స్త్రీల కోణం గురించి ఆలోచించినట్లయింది. చలం సాహిత్య సృజనకు స్త్రీల అనుభవకోణమే కారణమన్న విషయం స్పష్టమే. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ రాయలనాటి రసికత అనే వ్యాసంలో రసికుల ప్రవృత్తిని గురించి చేప్పే సందర్భంలో "అప్పటి దృష్టి యంతయు మగవారి దృష్టి తాము తప్ప తక్కిన సృష్టియంతయు తనకొరకై ఏర్పడినదనియే వారు తలంచినట్లున్నది" అని చెప్పిన మాటలు స్త్రీ దృష్టి నుండి సామాజిక సంబంధాలను ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాలను చూడవలసిన అవసరాన్ని గుర్తించి చెప్పినట్లుగా వున్నాయి. అదే విధంగా మగతజీవి చివరి చూపు అనే కథల సంకలనానికి (శివరాజు సుబ్బలక్ష్మి కథలు) ముందుమాట వ్రాస్తూ పింగళి లక్ష్మీకాంతం స్త్రీ ప్రకృతిని చిత్రించినప్పుడు పురుషుడు ఎంత నిపుణ రచయిత అయినా పురుష నేత్రాలలో ప్రతిఫలించిన దృశ్యాన్నే చిత్రించగలడని చెప్పి స్త్రీల స్వభావాన్ని స్త్రీలు వర్ణించినప్పుడే అది వాస్తవికతకు సన్నిహితంగా వుంటుందని అభిప్రాయపడ్డాడు. ఆ విధంగా స్త్రీవాద ఉద్యమం స్త్రీవాద సాహిత్య విమర్శ పాశ్చాత్యదేశాలలో కొత్తగా వికసించిన అరవైయ్యవ దశకం నాటికే తెలుగు సాహిత్యరంగంలో సమాజాన్ని, సాహిత్యాన్ని స్త్రీకోణం నుండి విమర్శకు

పెట్టవలసిన అవసరాన్ని, స్త్రీలకోణం నుండి సాహిత్య సృజన జరగవలసిన అవసరాన్ని గుర్తించి చెప్పటం జరిగింది. ఈ దేశీయ ఆలోచనాబీజం ఎనభయ్యవ దశకంలో స్త్రీవాద సాహిత్యోద్యమ నేపథ్యం నుండి 'స్త్రీల కోణం'గా ఒక రాజకీయ పదునుతో మొలకెత్తి రెమ్మలు కొమ్మలతో ఎదిగింది.

తెలుగు సాహిత్యరంగంలో సాహిత్య సృజనకారులు,పాఠకులు కూడా పురుషులే కావడం చాలాకాలం కొనసాగుతూ వచ్చిన వాస్తవం. రాజరాజనరేంద్రుడి ఆస్థానం నుండి ఏ ఆస్థానంలోని పండిత సత్సభలలోనైనా ఉన్నది అందరూ పురుషులే. కావ్యం వ్రాయమని కోరింది పురుషులే. పురుషులనే వ్రాయమని కోరారు. వ్రాసిన పురుషులు కృతి భర్తకు కావ్యం చదివి వినిపించినప్పుడు సభలో వుండి విన్నదీ పురుషులే - కావ్య రచయితలు, శ్రోతలు - పురుషులే అయిన చరిత్ర గమనంలో మొల్ల, తిమ్మక్క, వెంగమాంబ మొదలైన వేళ్ళమీద లెక్కింపదగిన స్త్రీలు రాజాస్థానాలకు వెలుపలే సాహిత్య సృజన చేయవలసి వచ్చింది. తంజావూరు మధురనాయకరాజుల కాలం నాటికిగానీ స్త్రీలు రాజాస్థానాలలో గౌరవించబడుతూ రచనలు చేయటం కనిపించదు. వ్రాసిన స్త్రీలే తక్కువ అనుకొంటే వాళ్ళ రచనలలో సాహిత్య కళావిలువలు లేవనో, స్త్రీలుగా వ్రాయవలసిన పద్ధతిలో వ్రాయలేదనో, వ్రాయకూడనివి వ్రాసారనో తక్కువ చేసి ఉపాంతీకరించటం తెలుగు సాహిత్య చరిత్రలో ప్రారంభకాలాల నాటికే మొదలైంది. కందుకూరి వీరేశలింగం పంతులు ఆంధ్రకవుల చరిత్ర (1886-1894)లో ముద్దుపళని గురించి వ్రాసినది ఇందుకు మంచి ఉదాహరణ. స్త్రీ జన స్వభావమైన సిగ్గును విడిచి ఆమె రాధికాసాంత్వనం కావ్యంలో సంభోగ శృంగారాన్ని పచ్చిగా వర్ణించిందని అందుకు ఆమె వేశ్యకావటమే కారణమని పేర్కొన్నాడు. స్త్రీల సాహిత్యాన్ని ఉపాంతీకరించటానికి అది మొదలు. వీరేశలింగం అభిప్రాయాల పట్ల ప్రతిస్పందించి బెంగుళూరు నాగరత్నమ్మ పురుషుల రచనల పట్ల ఒక రకంగా స్త్రీల రచనలపట్ల మరొక రకంగా సమీక్ష జరుగుతున్న ద్వంద్వ ప్రమాణాల సాహిత్య విమర్శరీతిని నిరసించింది. ముద్దుపళని వేశ్యఅని ఆమె కవిత్వం సంభోగ శృంగార వర్ణనలతో నిండి వున్నదని వీరేశలింగం రాధికా సాంత్వనం కావ్యాన్ని తిరస్కరించగలిగాడు కానీ అంతకంటే పచ్చి శృంగారాన్ని వ్రాసిన గౌరవనీయులైన మగవాళ్ళ రచనల మాటేమిటి అని ప్రశ్నించింది. స్త్రీ లైంగికానుభవాన్ని, అనుభూతిని సాంద్రతను వస్తువుగా చేసి కావ్యం వ్రాస్తే పురుష సాహిత్య విమర్శ ప్రపంచం సహించలేకపోయింది కానీ, స్త్రీగాను వేశ్యకులంలో పుట్టిన తన స్వీయజీవితానుభవకోణంతోనూ నాగరత్నమ్మ రాధికాసాంత్వనాన్ని సగౌరవంగా పునర్ముద్రించింది. ఆ రకంగా రాధికా సాంత్వనంపై విమర్శతో బెంగుళూరు నాగరత్నమ్మ 1910లోనే తనకు తెలియకుండానే గైనోక్రిటిక్స్‌గా ఆతరువాతికాలంలో పాశ్చాత్య సాహిత్య విమర్శ ప్రపంచంలో చెప్పబడిన విమర్శరీతికి ప్రారంభకురాలయింది.

1980ల నుండి స్త్రీలు తెలుగులో సాహిత్య విమర్శను స్త్రీకోణం నుండి అభివృద్ధిపరుస్తూ వస్తున్నారు. స్త్రీలు పాఠకులుగా భావకవిత్వం నుండి ప్రారంభించి దిగంబర కవిత్వం వరకు తమదైన కోణం నుండి చదివి వ్యాఖ్యానించారు. బుచ్చిబాబు కథల నుండి కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి వంటి వారి కథల వరకు స్త్రీ కోణాన్ని విస్తరింపచేశారు. స్త్రీ కోణం నుండి సంప్రదాయ సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆసక్తికరమైన అంశాలను వెలుగులోకి తెచ్చారు. సంప్రదాయ సాహిత్యాన్ని స్త్రీగా స్త్రీకోణం నుండి స్త్రీవాద దృక్పథంతో విమర్శించి విలువ కట్టే ఈ పద్ధతి అలంకార శాస్త్ర పాండిత్య కోణం నుండి సాహిత్యాన్ని అధ్యయనం చేసే సంప్రదాయ పండితులకు మింగుడు పడలేదు. సాహిత్యాన్ని జండర్ దృక్పథం నుండి చూడటం అంటే వాళ్ళదృష్టిలో దానిని సంకుచితపరచటం, చిన్న చిన్న అంశాలకు, పైపై విషయాలకు ప్రాధాన్యత నిచ్చి సాహిత్య కళావిలువలను మంటగలపటం - జండర్ అనేది సామాజిక వివక్షకు సంబంధించిన అధికార రాజకీయాల ఫలం పరిణామం అంటున్నారు కనుక దానిని పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంటు వాళ్ళకు వదిలెయ్యటం మంచిదంటారు వాళ్ళు. 1984లో ఆంధ్రప్రదేశ్ ఓరియంటల్ కాన్ఫరెన్స్‌లో కాత్యాయనీ విద్మహే భారతంలో భార్యభర్త సంబంధాలు అనే పత్రం సమర్పించినప్పుడు 1987లో మళ్ళీ అదే ఆంధ్రప్రదేశ్ ఓరియంటల్ కాన్ఫరెన్స్‌లో 'మొల్లరామాయణం' - స్త్రీ స్వభావ చిత్రణం' అనే పత్రం సమర్పించినప్పుడు ఆయా ఇతిహాసాలలోని స్త్రీల జీవితం చుట్టూ వున్న మాయను తొలగించి సాధారణ స్త్రీ పురుషులుగా చూపిస్తూ స్త్రీ పురుష సంబంధాలను నిర్దేశించే లైంగిక వివక్ష ఇతివృత్త నిర్మాణాలలో ఎలా భాగమైందో విశ్లేషించి చెప్పినపుడు అవి తెలుగు సాహిత్యానికి సంబంధించిన పేపర్లే కాదని, సామాజిక శాస్త్రాల సదస్సులో సమర్పించుకొనమని తీవ్రస్వరంతో వ్యతిరేకించిన సందర్భాలు, స్త్రీలకోణం నుండి, స్త్రీవాద దృక్పథం నుండి తెలుగు సాహిత్యంలో ప్రారంభమైన విమర్శ ఎంత ప్రతిఘటనను ఎదుర్కొనవలసి వచ్చిందో సూచిస్తాయి. ఏమైనా ఈనాడు జండర్ దృక్పథం నుండి సమస్త సాహిత్యాన్ని విలువకట్టే పద్ధతి బలపడుతున్నది. కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల తెలుగు విభాగం 'ఆధునిక సాహిత్యంలో జండర్ స్పృహ' అనే సదస్సును యుజిసి సహకారంతో నిర్వహించి ఆ సదస్సు పత్రాలను పుస్తకంగా తీసుకొని రావటం (2005) దీనికొక ప్రతీక.

స్త్రీల సాహిత్యం నవల, కథ మొదలైన వచన ప్రక్రియలతో విస్తరిస్తున్నా దానినంతా కాలక్షేపపు సాహిత్యంగా తీసిపారేస్తూ ఉపేక్షిస్తూ ఉన్న క్రమంలో సాహిత్య చరిత్రలలో స్త్రీల స్థానం లేకుండా పోతున్నది. స్త్రీల రచనలపై అధ్యయనాన్ని కేంద్రీకరించి సాహిత్య చరిత్రలో ఖాళీలను పూరించాలనే దృక్పథంతో స్త్రీ రచయితలపై పరిశోధనలు చేయటం పందొమ్మిది వందల ఎనభయ్యవ దశకంలో ఎక్కువైంది. ద్వివేదుల విశాలాక్షి, శివరాజు సుబ్బలక్ష్మి, రంగనాయకమ్మ, కోడూరి కౌసల్యాదేవి, పొట్లంపల్లి శాంతాదేవి ఇలా స్త్రీలు వ్రాసిన సాహిత్యంపై పరిశోధనలు ముమ్మరం అయినాయి. పితృస్వామిక అధికార బంధనాలను స్త్రీలు ఎంతవరకు గుర్తిస్తున్నారు? ఎక్కడ ఛేదించటానికి ప్రయత్నిస్తున్నారు? ఎందుకు ఆ ప్రయత్నాలన్నీ మానుకొని యధాతథస్థితిలో జీవిస్తున్నారు? - ఎందుకు రాజీపడుతున్నారు? ఈ మొదలైన ప్రశ్నలతో స్త్రీల తెగింపును, రాజీధోరణిని వాళ్ళ సాహిత్యం ద్వారా గుర్తించి వ్యాఖ్యానించే విమర్శ గుణాత్మకంగా అభివృద్ధి చెందింది. 20వ శతాబ్ది రాజకీయార్థిక పరిణామాలు, తెలుగులో స్త్రీ సాహిత్యం సెమినారు పత్రాలు (2003) ఈ కోవలో ప్రచురితమైనవే. ఆచంట శారదాదేవి, మాదిరెడ్డి సులోచన, కోడూరి కౌసల్యాదేవి, శ్రీదేవి వంటి వాళ్ళ రచనలపై వ్యాసాలు ఈ సందర్భంలో గుర్తు చేసుకోదగినవి.

4

స్త్రీలకోణం నుండి ఒక పుస్తకం చదవటానికి అనుసరించవలసిన పద్ధతి ఏమిటన్నది తరువాతి ప్రశ్న. ఇది వాచక విమర్శ గురించి అనేక విషయాలను ముందుకు తీసుకొని వచ్చింది. రచయిత ఉద్దేశ్యాలు, నిర్దేశ్యాలు కాక వాచకం దానంతట అది ఏ విషయాన్ని చెప్తుందో దానిని పట్టుకొనటానికి ప్రయత్నించే హక్కు సంపూర్ణంగా పాఠకులదేనన్న అభిప్రాయం ఇందులో ముఖ్యమైనది. రచయిత ఏమి చెప్తున్నాడన్నది కాక రచన ఏమి చెప్తున్నది అన్నది ప్రధానం. రచయిత ఉద్దేశాన్ని బట్టి యదభిముఖముగా విమర్శను సాగించాలన్న సంప్రదాయ ధోరణిని ఇది తిరస్కరించింది. సాహిత్యవాచకాన్ని దాని సహజ ప్రాథమిక స్వభావానికి భిన్నంగా (against the grain) చదివి అర్థం చేసుకొనటానికి కలిగిన ఈ వెసులుబాటు సాహిత్యంలో స్త్రీల కోణం నుండి కొత్త వ్యాఖ్యానాలకు అవకాశం కలిగించింది. ఒక రచనను దాని చుట్టు వున్న మాయ (మిత్)ను తొలగించి సామాజిక సాంస్కృతిక సందర్భం నుండి అధ్యయనం చేయటం ప్రముఖంగా ముందుకు వచ్చింది.

పితృస్వామ్య సమాజంలోని లింగవివక్షా స్వభావం నుండి రూపొందిన

మానవ మనస్తత్త్వాలు, ఆలోచనా విధానం, సంస్కారం, ఆధిక్యత ఒద్దిక మొదలైన అంశాల గురించిన అవగాహనతో వాచకాన్ని చదివినప్పుడు ఆ వాచకం కొత్త అర్థాలకు, వ్యాఖ్యలకు తలుపులు తెరుస్తుంది. అందుకనే సాహిత్య రచన అంటే ఒకే ఐక్య నిర్మాణం గల మొత్తం కాదు. కవి లేదా రచయిత ఇచ్చే తిరుగులేని సందేశం కాదు. సందర్భాలు మారినపుడు, పాఠకులు మారినపుడు, పాఠకుల లౌకిక జ్ఞానాన్ని పరంపరాగత సామాజిక మానవ సంబంధాలకు సంబంధించి ఏర్పడి ఉన్న అవగాహనను బట్టి ఆ వాచకమే కొత్త విషయాలను తెలుపుతుంది. ఒక వాచకం నిర్దిష్ట అభిప్రాయాల ప్రకటన ద్వారా కన్నా ఎక్కువగా మౌనంద్వారా, ఖాళీద్వారా, వైరుధ్యాల ద్వారా భావజాలాన్ని, జీవితసారాన్ని శక్తిమంతంగా వ్యక్తీకరిస్తుంది. కనుక విమర్శ ఆ మౌనాన్ని, ఖాళీని, వైరుధ్యాన్ని పట్టుకొని మాట్లాడించగలగాలి. వ్యాఖ్యానించగలగాలి. స్త్రీ కోణం నుండి అధ్యయనంలో ఇది మరింత ముఖ్యమైనది. ఎందుకంటే పితృస్వామిక సామాజిక నిర్మాణం భావజాలం నిశ్శబ్దంగా చేసుకుపోయే నియంత్రణను, ఆ నియంత్రణల మధ్య మౌనాన్ని అన్యాపదేశాన్ని, అసంబద్ధతను ఆశ్రయించి తమ నిరసనలను, ఆందోళనలను వ్యక్తీకరించే స్త్రీల మనో ప్రవృత్తులను - వాచకం యొక్క సంక్లిష్ట నిర్మాణంలో భాగమైన వాటిని - గుర్తించి వ్యాఖ్యానించటానికి అది అవసరమవుతుంది.

తెలుగులో సంప్రదాయ సాహిత్యాన్ని స్త్రీకోణం నుండి అధ్యయనం చేస్తూ వచ్చిన విమర్శ ప్రధానంగా వాచక విమర్శే. వాచకం అంటే పైకి కనిపించే పదాల కూర్పు, వాక్యాల నిర్మాణం కావచ్చు. కానీ కవులు, రచయితలు ఒక నిర్దిష్టార్థంలో పదాలను కూరుస్తూ వాక్యం నిర్మాణం చేసుకుంటూ పోవచ్చును కానీ ఆ పదం ఆ సందర్భంలో ఎంత శక్తితో ప్రయోగించబడింది ఏ ప్రయోజనాన్ని ఆశించిందీ మొదలైన ప్రశ్నలతో చేసే విమర్శ రచనలోని అర్థాన్ని ప్రకాశమానం చేస్తుందని మన సంప్రదాయవిమర్శకులు కూడా అంగీకరించినదే. నన్నయ కవితా లక్షణాలుగా చెప్పబడుతున్న వాటిలో 'ప్రసన్న కథాకవితార్థ యుక్తి' అన్న దానిని విశ్వనాథ సత్యనారాయణ వ్యాఖ్యానించి చెప్తూ ప్రసన్నమైన కథచేత కూడుకొనిన అర్థయుక్తి అని దానికి విగ్రహవాక్యం చెప్పి కథ ప్రసన్నం కావటమంటే కథలోని పరమార్థం ప్రసన్నం కావటమేనని అది అట్లా ప్రసన్నం కావటానికి కవి శబ్దాల కూర్పులో తన పని తనమంతాచూపిస్తాడని అందువలన కథలో అర్థాన్ని ప్రసన్నం చేయగల కీలక వాచకాలను గుర్తించాలని వివరించాడు. ఈ సూత్రం ఆధారంగా నన్నయ భారతంలోని కొన్ని కథలను వ్యాఖ్యానించి చెప్పాడు. భీష్ముడు ధృతరాష్ట్రుడికి భార్యకాదగిన స్త్రీగా గాంధారిని గుర్తించి ఆమె తండ్రి దగ్గరకు వివాహ రాయబారానికి పెద్ద మనుషులను పంపిన కథా భాగం వాటిలో ఒకటి. భీష్ముడు పంపిన ప్రతిపాదనను గాంధారి తండ్రి సుబలుడు అంగీకరించాడు. ధృతరాష్ట్రుడికి 'గాంధారి 'నిచ్చితిని' అని భవిష్యత్తులో చేయాల్సిన పని అప్పటికే చేసినట్లు ప్రకటించాడు. ఇక్కడే ఈ కథలోని అర్థం ప్రసన్నమయ్యేటట్లు చేసే కీలకం ఉన్నదని అంటాడు విశ్వనాథ. ఇచ్చితిని అని ప్రకటించటంలో సుబలుడి తిరుగులేని నిర్ణయాధికార శక్తి లక్షణం ఎంతగా వ్యక్తమవుతుందో అది ఆ కథలో ఎంత కీలకమైందో వివరించాడు.

ఈ సూత్రాన్ని ఇదే కథకు స్త్రీవాద కోణం నుండి అనువర్తింపచేసి వాచకం ఆధారంగా పితృస్వామిక సమాజ నిరంకుశాధికారాన్ని, స్త్రీ అస్వతంత్రాన్ని, దానిని మరుగుపరుచుకొని స్త్రీలు సహజంగా ఆనందంగా జీవిస్తున్నట్లు నటించటానికి సిద్ధపడుతున్న వైఖరిని ఎంతయినా వివరించటానికి వీలుంది. సుబలుడు భీష్ముడి ప్రతిపాదనకు అంగీకరించిన విషయం, ధృతరాష్ట్రుడు గుడ్డివాడన్న విషయం బంధువులు అనుకొనే ఆ మాటా ఈ మాటా వినటం వలన గాంధారికి తెలిసింది - 'ధృతరాష్ట్రునకు బిత్రు వచనదత్తగా దన్ను నిర్ణయించుకొంది' - తండ్రి తనతో ప్రత్యక్షంగా మాట్లాడలేదు. పెళ్ళి గురించి తన అభిప్రాయం అడగలేదు. 'ఇచ్చితిని' అని ప్రకటించాడు. ఆ మాటే శాసనం. తాను ధృతరాష్ట్రుడికి పితృవచన దత్త అని నిర్ణయించుకోవటంలో తండ్రి నిర్ణయాన్ని తన నిర్ణయంగా పరివర్తింపచేసుకొనటం వుంది. ఈ నిర్ణయానికి రావటానికి ముందరి ఆమె మనస్థితిని ఈ వాచకాన్ని బట్టి అంచనా వేయాలి. 'అమ్మహీపతియ కాని యొరులనొల్లనని' అనుకొనటానికి పడిన హృదయ సంఘర్షణను రాజీని ఆ వాచకం ద్వారానే ఊహించాలి. ఆ క్రమంలోనే పరపురుష దర్శనం చేయనని నేత్రపట్టం కట్టుకొంది. ఈ చర్యకు వెనక ఆమె అంతరంగంలో రేగిన అలజడి, కసి, ప్రతీకార వాంఛ, నిస్సహాయత - ఆ చర్యను బట్టే ఊహించాలి. తనను తాను శిక్షించుకొని ఒక ప్రశాంతతకు తననుతాను చేర్చుకొని సమాధాన పడ్డ ఒక విషాద వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. ఇచ్చితిని, 'పితృవచన దత్తగా తన్ను నిర్ణయించుకొని' 'అమ్మహీపతియ కాని యొరుల నొల్లనని' నేత్ర పట్టంబు కట్టుకొని - ఈ నాలుగు వాచకాల మధ్య ఈ చిన్న కథా సందర్భం విశాలమైన పితృస్వామిక సామాజిక సంస్కృతిని అందులో నలిగి సంఘర్షించి, సమన్వయం చేసుకొని రాజీపడి బ్రతకటానికి సిద్ధపడే స్త్రీల జీవన విషాదాన్ని ఎంతో విస్తృతంగా వ్యక్తపరుస్తుంది. ఈ వాచకాల మధ్య గాంధారి మాట్లాడని మాటలన్నీ వున్నాయి. ఆ వాచకాలను పూరిస్తుంది స్త్రీవాద కోణం.

దీనినంతా కవి ఉద్దేశించలేదు, కవి ఉద్దేశించని విషయాన్ని చెప్పటం విమర్శకాదు అనే వాదం వుంది. 'కవి యదభిముఖంగా వ్రాస్తాడో విమర్శ తదభిముఖంగా సాగాలన్న' విశ్వనాథ సంప్రదాయవాదుల విమర్శ ధోరణి ఇది. అయితే కవి ఏమి ఉద్దేశించాడన్నది కాదు, కవి ప్రయోగించిన వాచకం ఏమి చెప్తున్నది ముఖ్యం. వాచక ప్రయోగం వరకే కవి ప్రమేయం. తరువాత పాఠకులకు ప్రత్యక్ష సంబంధం ఏర్పడేది వాచకంతోటే. ఆ వాచకం ప్రత్యక్షంగా ఏమి చెప్తుందీ, వాచకాల మధ్య ఎడం దేనిని సూచిస్తుంది అనేది పాఠకులు తమ తమ లౌకిక ప్రాపంచిక అనుభవ పరిమితులు పరిధులను అనుసరించి గ్రహించగలుగుతూ వుంటారు. అందువల్లనే సాహిత్యం కొత్త అర్థాలతో వ్యాఖ్యానాలతో సజీవం అవుతుంటుంది. సార్వకాలిక ధర్మాన్ని సంతరించు కొంటుంది. వాచకాన్ని దాని నిర్దేశిత స్వభావానికి భిన్నంగా against the grain చదవటం అంటే ఇదే. డా॥ జంధ్యాల కనకదుర్గ వ్రాసిన "తెలుగు స్వతంత్ర కథాకావ్యాలు - స్త్రీ జన జీవన చిత్రణ" అనే పిహెచ్‌డి సిద్ధాంత వ్యాసం ఈ పద్ధతిలో వచ్చిందే. ఉదాహరణకు మంచన కేయూరబాహు చరిత్రలో 'మొగమాటం మంచిది కాదన్న' విషయాన్ని అందులోనూ ఆలి దగ్గర మొగమాట పడటం అసలే మంచిది కాదని మొగవాళ్ళ ప్రయోజనాల దృష్ట్యా చెప్పబడిన నిపుణిక కథను కనకదుర్గ స్త్రీకోణం నుండి స్త్రీ ప్రయోజనాల దృష్ట్యా వ్యాఖ్యానించి గర్భధారణ ప్రసవం స్త్రీలను ఒంటరివాళ్ళను చేసి స్త్రీలపై కలిగించే సామాజిక మానసిక ఒత్తిడులను, అలజడులను ఆందోళనలను - సమర్థవంతంగా బయట పెట్టగలిగిన కథగా నిరూపించిన విషయం గమనించదగినది. ఇలాంటి విమర్శ సాహిత్య అధ్యయనానికి స్త్రీవాదం వలన సమకూడినదే.

ఇక్కడ గమనించవలసిన విషయం మరొకటి ఉంది. ఈ విమర్శ అంతా పురుషుల రచనలు కేంద్రంగా జరిగింది. పురుషుల రచనలలోని స్త్రీల వాచక విశ్లేషణగా జరిగింది. స్త్రీల రచన వాచక విశ్లేషణ మరింత ముఖ్యమైంది. పితృస్వామిక సామాజిక అధికార సంబంధాల చట్రంలో స్త్రీలు అధీన వర్గం. ఉపాంతీకరించబడిన జాతి. కనుక వాళ్ళ సామాజిక అనుభవం భిన్నంగా ఉంటుంది. పుట్టినప్పటి నుండి పితృస్వామిక భావజాలం నడిపిస్తే నడిచిన మనుషులు వాళ్ళు. ఆలోచనల మీద నిఘా, కదలికల మీద నిఘా, ప్రవర్తనమీద నియంత్రణ నిరంతరం కొనసాగుతుండగా స్వీయ ఆకాంక్షలకు, ఆశలకు భిన్నంగా తమను తాము పితృస్వామిక వ్యవస్థా ప్రయోజనాలకు కుదించుకొనటం ఒక అనివార్య జీవన విధానం అవుతుంది వాళ్ళకు. ఈ క్రమంలో పితృస్వామ్య సమాజం ఆశించిన విధేయ స్త్రీలు తయారవుతారు నిజమేగాని ఈ సంఘర్షణ క్రమంలోనే స్త్రీలు పితృస్వామిక అణచివేత గురించిన చైతన్యాన్ని పొందుతుంటారు. దానిని తమ తమ పరిధులలో ఎదిరించే

వ్యూహాలను నిర్మించుకొంటూ ఉంటారు. ప్రస్ఫుటంగా పైకి కనబడని ఈ అంశాలు స్త్రీల సాహిత్యంలో, స్త్రీల వాచకంలో అంతర్లీనమై వుంటాయి - స్త్రీల రచనల వాటిని గుర్తించి వెలికితీయటం స్త్రీవాద విమర్శ చేయవలసిన పని. చేస్తున్నపని. తెలుగులో మొల్ల మొదలైన ప్రాచీన కవయిత్రుల రచనలపైన, శివరాజు సుబ్బలక్ష్మి, ఆచంట శారదాదేవి - మొదలైన ఆధునిక రచయిత్రుల రచనలపైన ఇటువంటి విమర్శ ఇప్పటికే జరిగింది. పితృస్వామిక అధికార చట్రంలో ఒదిగి జీవిస్తూనే ఆ క్రమంలో కలిగే వేదనను, ఊపిరాడనితనాన్ని, విసుగును, భయాన్ని, అసహ్యాన్ని లోపలికి నెట్టేసుకొంటూ మర్యాదస్తులుగా పితృస్వామిక సమాజానికి ఆమోదయోగ్యంగా తమనుతాము అనుక్షణం కత్తిరించుకొని నియంత్రించుకొని సర్దుబాటుచేసుకొనే స్త్రీల ఆరాటపోరాటాలు వాళ్ళ వాళ్ళ రచనలు జాగ్రత్తగా చదివితే అర్థమవుతాయి.

పురుషుల సాహిత్య రచనలను పరిశీలించేటప్పుడు స్త్రీలకొరకు మాట్లాడుతున్నారా? స్త్రీల స్థానంలో నిలబడి మాట్లాడుతున్నారా? స్త్రీల కొరకు అన్న పేరు మీద పితృస్వామిక విలువలనే వాళ్ళకు ఆదర్శంగా చూపెడుతున్నారా అన్న ప్రశ్నలతో వాచక అధ్యయనం చేయాలి. స్త్రీల కొరకు మాట్లాడటంలో సానుభూతి వుంటుంది. స్త్రీల స్థానంలో నిలబడి మాట్లాడటంలో సహానుభూతి వుంటుంది. స్త్రీల కొరకు మాట్లాడటం నామమాత్రమే అయితే యధాతధ స్థితిని సమర్థించటం వుంటుంది. వీరేశలింగం పంతులు వంటివాళ్ళు స్త్రీల కొరకు మాట్లాడారు. గురజాడ, చలం - ఆధునికులలో కవనశర్మ, కేతు విశ్వనాథరెడ్డి వంటి వారు స్త్రీలస్థానంలో నిలబడి స్త్రీల అనుభవ కోణం నుండి వ్రాశారు. విశ్వనాథ వంటి వారు స్త్రీలకు వాళ్ళ సుఖం, అభివృద్ధి పితృస్వామిక అధికార సంబంధాల కుటుంబాలలోనే వుందని బోధించే పని నిరంతరాయంగా చేశారు. ఈ రచనలు స్త్రీల ప్రయోజనాలను ఏ మేరకు నెరవేర్చాయన్నది నిగ్గు తేల్చటం స్త్రీల కోణం నుండి జరిపే స్త్రీవాద విమర్శ పని.

ఇక. స్త్రీల రచనలను అధ్యయనం చేసేటపుడు స్త్రీలు స్త్రీలుగా వ్రాస్తున్నారా? లేక స్త్రీలన్నది నామమాత్రమై పురుషుల ప్రతినిధులుగా పితృస్వామిక ప్రయోజనాలకే వ్రాస్తున్నారా? - స్త్రీల స్థానంలో నిలబడి మౌనంగా వున్న స్త్రీ జాతి ప్రతినిధులుగా వాళ్ళ మనోభావాలను ఉద్వేగాలను, ఉద్విగ్నతులను గురించి వ్రాస్తున్నారా? స్త్రీల కొరకు స్త్రీల ప్రయోజనాలను ఆశించి వ్రాస్తున్నారా అన్న ప్రశ్నలను ప్రమాణాలుగా స్వీకరించవలసి వుంటుంది. అప్పుడే స్త్రీల సాహిత్యానికి వున్న ప్రత్యేకతలు, పరిధులు, పరిమితులు కూడా అవగతమవుతాయి.

5

స్త్రీవాదం సాహిత్య విమర్శలోకి తెచ్చిన మరొక అంశం - ఇతివృత్తానికి జండర్‌కు మధ్య వున్న సంబంధం. పితృస్వామ్య సమాజంలో రెండు ప్రపంచాలున్నాయి. అవి 1. పబ్లిక్ ప్రపంచం 2. ప్రైవేటు ప్రపంచం. పబ్లిక్ ప్రపంచం బయటి ప్రపంచం. ప్రైవేటు ప్రపంచం లోపలి ప్రపంచం. బయటి ప్రపంచం సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక వైజ్ఞానిక అంశాలతో అభివృద్ధితో సుసంపన్నమైన విస్తృత ప్రపంచం. లోపలి ప్రపంచం కుటుంబానికి ఇంటికి పరిమితమైన ప్రపంచం - బయటి ప్రపంచం పురుషుడిది. లోపలి ప్రపంచం స్త్రీది. పురుష ప్రపంచంలో సాధించవలసిన లక్ష్యాలుంటాయి. అందుకు వ్యూహాలుంటాయి. సవాళ్ళు వుంటాయి. పోరాటాలు వుంటాయి. నాయకత్వం వుంటుంది. విజయాలు, ఉత్సాహాలు వుంటాయి. స్త్రీల ప్రపంచంలో కుటుంబం, పోషణ, సేవ వుంటాయి. త్యాగం వుంటుంది. ఇవన్నీ లోపలి ప్రపంచానికి సంబంధించినవి కనుక ఎవరికీ పట్టవు. కనబడవు.

సాహిత్యానికి ఎప్పుడైనా వస్తువు రచయిత స్వీయ జీవితానుభవ చైతన్యమే. అందువలన పురుషుల సాహిత్య ఇతివృత్తాలు ప్రపంచ జీవిత పరిణామాలు, సంఘర్షణలే అవుతాయి. యుద్ధం, నాయకత్వం విజయం వీటి చుట్టూ పరిభ్రమించే పురుష ప్రపంచపు ఆకాంక్షలకు అవి ప్రాతినిధ్యం వహిస్తాయి. దండి వంటి ప్రాచీన ఆలంకారికుల దగ్గర నుండి వాలా వరకు అందరూ సాహిత్య ఇతివృత్తం యుద్ధం, యుద్ధ ప్రయాణం, నాయక విజయం అనే చెప్పారు. ఇతిహాసాల దగ్గర నుండి సమస్త సాహిత్యం దీనికి నిదర్శనంగానే వున్నది. కారణం అక్కడ సాహిత్య సృష్టికర్తలందరూ పురుషులు కావటమే. అయితే ఆధునిక కాలంలో స్త్రీలు కూడా సాహిత్య పాఠకులు అవుతున్నారన్న గ్రహింపు కలిగిన సందర్భం నుండి సాహిత్య ఇతివృత్తాలు మారుతూ వచ్చాయి. నవలా ప్రక్రియ, నవల వస్తువు ఈ సందర్భం నుండే పరిణితి చెందుతూ వచ్చిన విషయం గమనించవచ్చు. ఆ క్రమంలోనే నవలకు కుటుంబ జీవితం కొంతవరకు వస్తువు కాగలిగింది. పురుషులు వ్రాసిన నవలలో కంటే ఎక్కువ వాస్తవంగా, నిజాయితీగా కుటుంబ జీవితం పూర్తి స్థాయిలో స్త్రీల నవలలకు వస్తువు అయిందన్నది స్పష్టం. స్త్రీలకు తెలిసింది, స్త్రీలు ప్రేమించింది, స్త్రీలు ప్రాణమిచ్చింది కుటుంబమే కనుక కుటుంబ జీవితమే స్త్రీల నవలలకు వస్తువు కావటం సహజంగా జరిగింది.

అయితే యుద్ధం నాయకత్వం విశ్వజనీన సాహిత్య వస్తువుగా గౌరవాన్ని పొందినట్లు కుటుంబ జీవితం సాహిత్య వస్తువుగా అంత గౌరవాన్ని పొందలేదు. ఎందుకంటే అది బయటి ప్రపంచానికి పురుషుల ప్రపంచానికి సంబంధించినది కాగా ఇది లోపలి ప్రపంచానికి స్త్రీల ప్రపంచానికి సంబంధించినది కావటమే అందుకు కారణం. ఈ జండర్ దృక్పథమే సాహిత్య వస్తు విమర్శ స్వరూప స్వభావాలను నిర్దేశించిన సూత్రం. స్త్రీలను ఉద్దేశించి వ్రాయబడివి కనుక నవలలు తక్కువ పాండిత్యం, తక్కువ ప్రతిభ, తక్కువ ప్రాధాన్యత, తక్కువ విలువ కలిగిన రచనలుగా చిన్నచూపుకు గురికావటం, నిర్లక్ష్యానికి గురికావటం జరిగింది. ఇతివృత్తానికి జండర్‌కు మధ్య వున్న సంబంధం స్పష్టపడిన సందర్భం ఈ విధంగా తెలుగు సాహిత్య చరిత్రలో నవలా ప్రక్రియకు సంబంధించి కనబడుతుంది.

స్త్రీలు కుటుంబ జీవిత పరిధులను దాటి సమాజంలోకి విస్తరించటం, సమాజగమనాన్ని నిర్దేశించటం, నడిపించటం పితృస్వామిక సమాజం ఊహించలేదు. భరించలేదు. అందుకనే పురుషులు సృష్టించిన సాహిత్యంలో స్త్రీల సాహసం భర్తల గౌరవ మర్యాదలను కాపాడటానికో, భర్తల విజయాలకు ప్రోత్సాహక శక్తిగా వుండటానికో, భర్తల ఆకాంక్షలకు, ద్వేషాలకు, భయాలకు సాధనాలుగా మిగలటానికో పరిమితం చేయబడుతుంది. స్త్రీ విద్య, స్త్రీల తిరుగుబాటు, స్త్రీల ఆకాంక్షలు, ద్వేషాలు, భయాలు, స్త్రీల విజయాలు - ఇవన్నీ ఆ కుటుంబ జీవితం అనే ఆదర్శానికి లోబరచబడి ఉపాంతీకరించబడతాయి. స్త్రీల జీవితం, స్త్రీల కథ వివాహంతోనో మరణంతోనో ముగియటం సర్వసాధారణం. వైరుధ్యం ఏమిటంటే స్త్రీలదిగా చేయబడిన కుటుంబం - లోపలి ప్రపంచం పురుషుల భిన్న చూపుకు ఎంతగా గురవుతుందో అంతగా అది స్త్రీలకు ఆదర్శచేయబడటం - ఈ క్రమంలో స్త్రీలు సాహిత్య రచనకు పూనుకొన్నప్పుడు వాళ్ళకు మిగిలే సాహిత్య వస్తువు కుటుంబ జీవితం - ప్రేమ - పెళ్ళి - పిల్లలను కనటం, పెంచటం - వాళ్ళ కొరకు తన జీవితాన్ని సమస్తం ధారపోయటం. తనకు తాను ఏమీ కాకుండా మిగిలిపోవటం. ఈ రకంగా వచ్చిన సాహిత్యాన్ని మాత్రమే రెండవ రకపు మూడవ రకపు సాహిత్యంగానైనా పరిగణిస్తూ దయతలచి బ్రతకనిస్తుంది పితృస్వామ్య సమాజ ప్రధాన సాహిత్య స్రవంతి. ఇందుకు భిన్నంగా స్త్రీలు మానవులుగా సమస్త ప్రపంచ పరిణామాలు, జీవితానుభవాలు మావి కూడా అని వాటిని సాహిత్య వస్తువులుగా చేసుకొన్నప్పుడు తీవ్రమైన నిరసన, దాడి ప్రారంభమవుతాయి. 1990లలో స్త్రీవాద సాహిత్యం మీద జరిగిన దాడి ఈ రకమైనదే.

లైంగికానుభవం, ఆనందం, అనుభూతి పురుషపరంగా నిర్వచించబడటం, వ్యాఖ్యానించటం అలవాటైన సమాజంలో అది పురుషులకు

సాహిత్య వస్తువైంది. సంభోగ శృంగార వర్ణన కవిత్వంలో సర్వసాధారణమైనది. స్త్రీలు ఈ అనుభవంలో మేము కూడా వున్నాం కదా, ఇది మాకు ఆనందాన్నిస్తున్నదో, దుఃఖాన్నిస్తున్నదో మేము చెప్తామని కవితా వస్తువుగా దానిని స్వీకరించినపుడు అది 'నీలికవిత్వం'గా నిరసనకు నిందకు గురి అయింది. మాతృత్వం స్త్రీలక్షణంగా, స్త్రీకి తన శరీరంలో స్త్రీత్వం వలన కలిగే మార్పులకు స్పందిస్తూ, మాతృత్వం తమకు విధించబడిన ఒంటరి శిక్షగా భావిస్తూ కవిత్వం వ్రాయటం ప్రారంభించేసరికి అది తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ సందర్భం స్త్రీల జీవితాన్నే కాదు స్త్రీల అనుభవాలను, అనుభూతులను నియంత్రించే ఆలోచనల మీద నిఘావేసే పితృస్వామిక సామాజిక స్వభావం సాహిత్య వస్తు స్వీకరణలో, అభివ్యక్తిలో స్త్రీల స్వాతంత్ర్యాన్ని సయితం అణచివేస్తున్నదని స్పష్టం చేసింది. కనుక వస్తువుకు జండర్‌కు మధ్య ఉన్న, ఇతివృత్త నిర్మాణానికి జండర్‌కు మధ్య వున్న ఈ సంబంధాన్ని సాహిత్య విమర్శకు ఒక సూత్రంగా గుర్తించవలసిన అవసరం వుంది. అదే విధంగా సమాజంలో తమకు వున్న అధికార స్థానం కలిగించిన అహంకారంనుండో, ఆత్మవిశ్వాసం నుండో పురుషుల సాహిత్యంలో ఇతివృత్త నిర్మాణంలో ఒక అధికారలక్షణం తీర్పులు ఇచ్చే లక్షణం, అప్పీలుకు అవకాశంలేని రీతిలో సమస్తాన్ని నిర్దేశించే లక్షణం కనబడుతుంది. సమాజంలో స్త్రీలకు వున్న ఒదిగి వుండే లక్షణం, నిర్ణయాలలో భాగస్వామ్యం కాక అమలు చేయవలసిన స్థానం స్త్రీలకు నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏర్పరచుకొని నిర్ద్వంద్వంగా వ్యక్తీకరించే అవకాశం ఇవ్వవు. స్త్రీల సాహిత్య వస్తు నిర్మాణంలో ఈ స్థితే ప్రతిఫలిస్తుంది. ఒక ఆశ ఒక ఆకాంక్ష వారి సాహిత్య ఇతివృత్తానికి రూపు రేఖలనిచ్చినా దానికి వాళ్ళు చివరివరకు అంటిపెట్టుకొని సాధికారంగా నిర్మించలేరు. లోకంలో లేని అధికారం సాహిత్యలోకంలో వుండటం సాధ్యంకాదు. స్త్రీల రచనలలో ఈ ఒడిదుడుకులు అన్నీ కనబడతాయి. స్త్రీల నవలల్లో కథలల్లో ఇతివృత్తాలను ఈ దృష్ట్యా విమర్శకు పెట్టవలసిన అవసరం ఉంది. ఈ విధంగా సామూహిక సందర్భం నుండి చూచినపుడు మాత్రమే స్త్రీల సాహిత్యంలోని ప్రత్యేకతలను అర్థం చేసుకొనగలుగుతాం. లేకపోతే తక్కువ రకపు సాహిత్యంగా దానిని అణచివేసే పాత ధోరణే కొనసాగే ప్రమాదం ఉంది. ఇది సాహిత్య విమర్శ ఆరోగ్యకరంగా ఎదగటానికి అవరోధమవుతుందని గ్రహించాలి.

6

సాహిత్యంలో వస్తువు ఏదైనా భాషా మాధ్యమం ద్వారానే వ్యక్తమవుతుంది. పితృస్వామిక సమాజ సంస్కృతిలో అభివృద్ధి చెందిన భావజాలం ఎలాగైతే పురుష ప్రయోజనానుకూలమైందో భాష కూడా అదే విధంగా పురుష ప్రయోగానుకూలమైందే. సూటిగా నిర్భయంగా, స్పష్టంగా భావాలను ప్రకటించటానికి వీలులేని వాళ్ళ ప్రయోగం పరిమితంగానైనా వుంటుంది. ప్రత్యేకంగా నైనా వుంటుంది. పరాశ్రయతను, అధీనతను, తక్కువ స్థాయిని సూచించేదిగా ఉంటుంది. సామాజిక అధికార సంబంధాలలో అధీన వర్గాల సామాజిక అనుభవం భాషతో వాళ్ళ సంబంధాన్ని భిన్నంగా నిర్మిస్తుందని అందులో భాగంగా జండర్‌కు భాషకు వున్న సంబంధాలను చూడాలని స్త్రీవాదం చెప్తుంది.

భాషా ప్రయోగం స్త్రీ పురుషులకు భిన్నభిన్నంగా వుంటుందని భారతీయ అలంకార శాస్త్రం కూడా గుర్తించినట్లుగానే కనబడుతుంది. ప్రభు సమ్మితం, మిత్ర సమ్మితం, కాంతా సమ్మితం అని సాహిత్యంలో అభివ్యక్తిరీతులు మూడు వున్నాయి. మొదట రెండు పురుష అభివ్యక్తిరీతులు. ప్రభువులుగా అధికార స్థానంలో మిత్రులుగా సామాజిక స్నేహ సంబంధాలలో వుండేవాళ్ళు పురుషులే కనుక అవి పురుష అభివ్యక్తిరీతులు. ఇక మూడవది స్త్రీ అభివ్యక్తి రీతి. స్త్రీలు అధికార స్థానంలో వుండి ఆజ్ఞాపించినట్లుగానీ, సమస్థాయిలో వుండి చర్చల ద్వారా సమాధానపరిచే పద్ధతిలోగాని మాట్లాడటం పితృస్వామ్య సమాజ సంస్కృతి ఆమోదించదు. స్త్రీలు పురుషుల అభ్యుదయాన్ని కాంక్షిస్తూ, పురుష ప్రయోజనాలను కాపాడుతూ ఒద్దికగా జీవించాల్సిన క్రమంలో మృదువైన పద్ధతిలో అన్యాపదేశంగా ఆహ్లాదకరంగా మాట్లాడాలి. ఈ మాట్లాడే పదాలే కావ్యంలో అభిలషణీయం అని అలంకార శాస్త్రాలు పేర్కొంటున్నాయి.

ఒక అనుభవం స్త్రీపురుషులిద్దరికీ ఒకే రకంగా వున్నా సమాజంలో వాళ్ళకున్న హోదాస్థితి గతులు, వాళ్ళు పెంచబడిన తీరు అనీ వాళ అభివ్యక్తిని భిన్నంగా చేస్తాయి. ఒకే సందర్భం పురుషుడికి కోపాన్ని తెప్పిస్తే స్త్రీకి భయాన్ని కలిగిస్తుంది. ఈ కోణం నుండి చూచినపుడు సాహిత్య సందర్భాలను సమానమై వాటిని తీసుకొని స్త్రీ పురుషుల అభివ్యక్తిరీతులలోని భిన్నత్వాన్ని అంచనా వేయటానికి వీలవుతుంది. సంప్రదాయ సాహిత్యంలో ద్రౌపది సీత మొదలైన వాళ్ళ అభివ్యక్తికి ఉపయోగింబడిన భాషను, మొల్ల మొదలైన స్త్రీల భాషా ప్రయోగాలను, ఈ దృష్ట్యా ప్రత్యేకంగా పరిశీలించవచ్చు. శివరాజు సుబ్బలక్ష్మి, ఆచంట శారదాదేవి వంటి రచయిత్రులు స్త్రీలుగా చెప్పవలసినది ఎంతో వుండి తమ భావాలను ఎలా నియంత్రించుకొన్నది, వ్యక్తీకరించిన భావానికైనా ఎలాంటి భాషను ఉపయోగించిందీ ప్రత్యేకంగా అధ్యయనం చేస్తే తెలుగు కథా సాహిత్య విమర్శకు అది గొప్ప చేర్పు అవుతుంది. ఉదాహరణకు - శివరాజు సుబ్బలక్ష్మి - అక్క చనిపోయిన తరువాత అక్క బిడ్డ పోషణకొరకు బావకు రెండవ భార్యగా వచ్చిన స్త్రీ అనుభవాన్ని ఆలోచనలను వస్తువుగా చేసి వ్రాసిన కథ ఒకటి ఉంది. బావతో కాపురం చేసిన క్రమంలో అక్క చావుకు బావే కారకుడని, అతని బాధపడలేక అక్క బావిలో దూకి ఆత్మహత్య చేసుకొందని ఆమెకు తెలుస్తుంది. నేనేంచెయ్యను నీళ్ళంటే నాకు భయం అని ముగుస్తుంది ఆ కథ. అక్క ఆత్మహత్య సంగతి తెలిశాక అందుకు కారకుడైన బావ మీద కోపం రావలసిన సందర్భం అది. కోపం రావలసిన సందర్భంలో అధీన స్త్రీ కావటం వలన, తన బ్రతుకు గురించిన ఆందోళన కారణంగా ఆమెకు భయం కలిగింది. 'భయం' అన్న ఆ పదప్రయోగం దగ్గర ప్రారంభించి ఆ కథను స్త్రీవాద కోణం నుండి విమర్శకు పెడితే కొత్త ప్రపంచమే మన కళ్ళముందు ప్రత్యక్షమవుతుంది

పురుష నిర్మిత భాషను ప్రయోగించవలసిన అనివార్యత నుండి స్త్రీలు పడే ఇబ్బంది, మొహమాటం, తమ అనుభవాలు చెప్పటానికి తగిన పదజాలం లభించక పడే ఆందోళన, అవమానం ఇవన్నీ - స్త్రీల రచనలలో వాక్యాలను, వాక్యనిర్మాణాన్ని, పదాలకు ఇచ్చిన ఊనికను, కొన్నింటిని మింగెయ్యటాన్ని, గుటకలు వెయ్యటాన్ని నిశితంగా పరిశీలించి విశ్లేషించినపుడు అవగతమవుతాయి. తెలుగు సాహిత్యంలో ఇటువంటి విమర్శ ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు.

7

స్త్రీవాద విమర్శ సాహిత్య విమర్శకు ఇచ్చిన 'విలువల వ్యవస్థ' చాలా ముఖ్యమైనది. స్త్రీవాద విమర్శలో విలువల స్పృహలేదని వున్నా అవి తప్పుడు విలువలని, అవి రాజకీయ విలువలే కానీ సాహిత్య విలువలు కావని స్త్రీవాద సాహిత్య విమర్శ గురించిన ఆరోపణలు అన్ని దేశాలలోనూ అన్ని భాషా సాహిత్యాలలోనూ వున్నాయి.

సాహిత్య విలువ కానీ మరే విలువైనా కానీ ఒక ప్రత్యేక సందర్భంలో వున్న ప్రజాసమూహాల చేత ప్రత్యేక ప్రాతిపదికలపైన నిర్దేశిత ప్రయోజనాల రీత్యా నిర్వచించబడేదే కానీ నిరపేక్షమైనది కాదు. ఈ దృష్ట్యా చూచినపుడు స్త్రీవాద విమర్శ పై వున్న ఆరోపణలు పితృస్వామిక సమాజ సాహిత్య సాంస్కృతిక కళా విలువల నుండి వచ్చినవేనని స్పష్టమవుతుంది. సాహిత్య విమర్శ అంటే సాహిత్యాన్ని అనుకూల దృక్పథం నుండి చదవటం, మెచ్చుకొనటం అన్న సంప్రదాయ విమర్శ ధోరణిని స్త్రీవాద విమర్శ తిప్పికొట్టింది. పితృస్వామ్య సమాజంలోని వివక్షాపూరిత లైంగిక రాజకీయ సంస్కృతి నుండి రూపొందిన సాహిత్యాన్ని అనుకూల దృక్పథం నుండి చదివి మెచ్చుకొనటం వివక్షా పూరిత

లైంగిక రాజకీయాల పట్ల వ్యతిరేకత కలిగినవారికి సాధ్యం కాదు. స్త్రీవాదం ప్రశ్నించిందీ తిరస్కరించిందీ ఆ వివక్షాపూరిత లైంగిక అధికార రాజకీయ వ్యవస్థనే. అందువల్ల అది తప్పనిసరిగా విమర్శనాత్మకంగానే వుంటుంది. దానిని సాహిత్యవిలువ కాదనటంలో. యథాతథస్థితి కొనసాగింపుపట్ల ఆకాంక్షే ప్రధానమైంది. అందువల్ల ఒక సమూహం సాహిత్య విలువ అని దేనిని అంటున్నారో అది కూడా పాక్షిక విలువేనన్నది స్పష్టం.

స్త్రీలు వ్రాశారనో, స్త్రీవాద రాజకీయాలనో చెప్తున్నాయనో రచనలను గొప్పవిగా చేసి చెప్పటం స్త్రీవాద విమర్శ చేస్తుందని అది సాహిత్య విలువ కాదని కూడా అంటారు. స్త్రీలు వ్రాసిన వాటిని సాహిత్య విలువలు లేవని ఒక పథకం ప్రకారం ఎప్పుడూ పక్కకు నెట్టివేస్తున్న పితృస్వామిక సాంస్కృతిక అణచివేత విధానాలను చైతన్యంతో ఎదుర్కొనటానికి అణచివేతకు గురవుతున్న వర్గాల నుండి చొరవ కనిపించినపుడు అధికారవర్గం తమ విలువల కోణం నుండే వారి కృషిని అంచనా వేసే సందర్భం నుండి ఇటువంటి వ్యాఖ్యానాలే వస్తాయి. సాహిత్యాన్ని రాజకీయాల స్థాయికి కుదిస్తున్నారని ఆరోపించటంలో స్త్రీల కోణం, జండర్ దృక్పథం అనేవి సాహిత్య విమర్శరంగంలో వేరూనుకోకుండా చేయాలనే దురాలోచన, దూరాలోచన కూడా ఉన్నాయి.

సాహిత్య విమర్శ వస్త్వైక్యతకు, వ్యంగ్యానికి, అలంకారానికి, నైతిక ఉపదేశానికి సంబంధించినది మాత్రమేనా? ఏమి చెప్పారు? ఎవరు చెప్పారు? ఎందుకు చెప్పారు అన్న ప్రశ్నలతో నిమిత్తం లేకుండా ఎలా చెప్పారు అని చూడటమేనా? చెప్పటంలోని సౌందర్యాన్ని ఆనందించి అభినందించటమేనా? - అంటే స్త్రీవాద విమర్శ కాదంటుంది. కళ కళకొరకే అనేవాళ్ళు కూడా ఆ ముసుగులో అస్తిత్వంలో వున్న తమకు ఆమోదయోగ్యమూ, ప్రయోజనకరమూ అయిన భావజాల విలువలను చాపకింద నీరులా జనసమూహంలోకి ప్రవహింపచేస్తున్నారన్న గుర్తింపు నుండి స్త్రీవాద విమర్శ రూపొందింది. స్త్రీలకు, స్త్రీల ప్రయోజనాలకు స్థానమూ ప్రాధాన్యత వున్న సమాజంగా అస్తిత్వంలో వున్న సమాజాన్ని మార్చుకోవటానికి ఒక శక్తిగా సాహిత్యాన్ని ఉపయోగించుకొనాలన్న స్పష్టత నుండి అది బలపడింది. స్త్రీలు స్త్రీలుగా తమ భవిష్యత్తుకు పాటుపడటానికి స్త్రీలకు హానికరమైన యథాతథస్థితిని కొనసాగించే విలువల వ్యవస్థకు ఇక తలవొగ్గి జీవించకుండా తిరస్కరించటానికి సాహిత్యాన్ని, ఇప్పటివరకు తమ ప్రయోజనాలకొరకు పురుషులు ఎంత సమర్థవంతమైన అహింసాయుత ఆయుధంగా వాడుకున్నారో - ఇకపై స్త్రీలు కూడా అలాగే వాడుకొనాలనే ఉద్యమస్థాయి సంకల్పం స్త్రీవాద విమర్శ అభివృద్ధికి కారణమైంది.

నిజానికి నిర్ధారిత విలువలతో రాజకీయం కాకుండా సాహిత్యం కాని సాహిత్య విమర్శకానీ లేవంటే అది అతిశయోక్తికాదు. అందులోనూ సాహిత్య విమర్శ సాహిత్యం కన్నా మరీ చైతన్యవంతమైన చర్య. అది సాహిత్యంలో కథద్వారా, మానవ సంబంధాలలోని వైరుధ్యాలు వైవిధ్యాల చిత్రణ ద్వారా - పాత్రల ప్రవృత్తులకు సంబద్ధతలను సమకూర్చి చూపటం ద్వారా ఏయే మానవ సమూహాలను ఏయే విలువల చట్రంలో ఇమిడించటానికి, ఏ విలువల ప్రాతిపదిక మీద నిరాకరించటానికి, ఉపాంతీకరించటానికి, నిర్లక్ష్యం చేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నదీ ఏయే మానవ సమూహాల ప్రయోజనాలు పరమార్థాలు తద్వారా ఉద్దేశించబడుతున్నదీ నిరూపించి చూపుతుంది. అందువలన సాహిత్య సౌందర్య శాస్త్రం ఎప్పుడూ రాజకీయాలతో మిళితమై వున్నదే.

సాహిత్యాన్ని విమర్శించటమంటే ఆ సాహిత్యం వెనుక వున్న విశ్వాసాలను, విలువలను విమర్శించటం. ఆ విశ్వాసాలు, విలువలు ఒక సామాజిక అధికార నిర్మాణ సంబంధాల నుండి రూపొంది వుంటాయి కనుక వాటిని విమర్శించటమంటే అధికార రాజకీయాలను విమర్శించటమే. ఉదాహరణకు - దుష్యంతుడు శకుంతలను గాంధర్వవిధిని పెళ్ళిచేసుకొన్న కథ తీసుకుంటే ఆమెతో కొంతకాలం సుఖించి తన నగరానికి పిలుపించుకొంటానని చెప్పి వెళ్ళిన దుష్యంతుడు మళ్ళీ ఆ మాటే తలపెట్టకపోవటం, తనంతతానుగా వెళ్ళిన శకుంతలను నువ్వెవరో నాకు తెలియదు పొమ్మని బూకరించటం - చివరకు ఆకాశవాణి చెప్పిన మీదట ఆమెను స్వీకరించటం ఆ కథలో ఉంది. దుష్యంతుడు - అందుబాటులోకి వచ్చిన స్త్రీని అవసరానికి వాడుకొని - వదిలేసే రకంగా మూలకథలో కనబడతాడు. దుష్యంతుడులోని ఈ దుర్మార్గ లక్షణాన్ని తొలగించి అతనిని నాయకుడిగా నిలబెట్టటం కొరకు దుష్యంతుడు ఇచ్చిన ఉంగరాన్ని శకుంతల పోగొట్టుకొనటం నెపంగా చేయబడి తప్పంతా దుర్వాసుడికి కోపం తెప్పించి శపించటానికి కారణమైన శకుంతల మైమరుపు మీదికి నెట్టబడటంలో వున్నది నిస్సందేహంగా స్త్రీలను దోషులుగా ఒంటరి వాళ్ళుగా నిలబెట్టే పితృస్వామిక రాజకీయమే. రామాయణ కథ కూడా అంతే. రాముడు అగ్నిప్రవేశం ద్వారా సీతకు శీలపరీక్ష పెట్టి నమ్మకం కలిగిన తరువాతే అయోధ్యకు తెచ్చుకొని కూడా లోకాపవాదానికి వెరచి ఆమెను ఒంటరిగా అడవులలో విడిచి రమ్మని లక్ష్మణుడుని పంపిన కథాంశం ఉంది. భార్య శీలాన్ని గురించిన నిత్య శంకితుడైన భర్తవలె కనబడతాడు రాముడు. రాముడి ప్రవృత్తిలోని ఈ దోషాన్ని పరిహరించే సాహిత్య రాజకీయాలలో భాగంగా పద్మ పురాణంలో ఒక కథ కల్పించబడింది. ఆ కథ ప్రకారం జంట పక్షులను విడదీయటం వలన సీత పొందిన శాపకారణంగా ఆమెకు భర్త నుండి ఎడబాటు కలిగింది. ఆ విధంగా ఈ కథ దోషాన్ని రాముడి పై నుండి తప్పించి సీతపైకి నెట్టింది. ఈరెండు కథా సందర్భాలలోను ఇద్దరు పురుషులు స్త్రీల పట్ల ప్రవర్తించిన తీరులోని అన్యాయ అధర్మ అసమ అవమానకర ధోరణిని మరుగుపరచటం, స్త్రీల దైన్యానికి స్త్రీల అల్పప్రవర్తనలే కారణమని నిరూపించటం - పితృస్వామ్య అణచివేత రాజకీయాలలో భాగమేనన్నది స్పష్టం. అందువల్ల సాహిత్యంలో, సాహిత్య విమర్శలో రాజకీయాలు కొత్త అంశం కాదు. సాహిత్య వస్తువు ఏది వుండాలో నాయకుడు ఎవరై ఉండాలో, నాయిక స్వభావం ఎటువంటిదిగా ఉంటుందో, నిరూపించిపెట్టిన, ఉత్తమ అధమ నీచ పాత్రలంటూ మనుషులను వర్గీకరించి పెట్టిన, స్త్రీల నీచ ప్రవృత్తిగా లెక్కవేసిన ప్రాచీన అలంకార శాస్త్రాలు వర్ణవర్గలింగరాజకీయాలతో సమ్మిళితమై వుండటం కనిపించే వాస్తవమే. అయితే వీటిలో రాజకీయాలు వున్నాయని గుర్తించి చెప్పటం మాత్రమే రాజకీయంగా నిరసనకు, నిందకు గురికావటం ఒక వైరుధ్యం. ఏమైనా సాహిత్యాన్ని అధికార సంబంధాల అణచివేతల రాజకీయ కోణం నుండి చూడవలసిన అవసరాన్ని గుర్తింప చేయటం ద్వారా స్త్రీవాద విమర్శ అది కొత్తగానూ, అనూహ్యంగానూ వుండటానికి వీలైన అత్యంత గొప్పదైన విలువను సాహిత్య విమర్శకు సాధనంగా సమకూర్చింది. ఈ విలువ జానపద కథలల్లో నాయకుడి ప్రవేశానికి నిషేధించబడిన మార్గాలు, ద్వారాలు వంటి అనేక సాహిత్య సందర్భాలలోనికి ప్రవేశించటానికి తాళం చెవివలె ఉపయోగపడుతుంది.

మొత్తం మీద స్త్రీవాద విమర్శ వలన అందివచ్చిన స్త్రీల కోణం, వాచక అధ్యయనం, జండర్ సంబంధంలో ఇతివృత్తాన్ని భాషను విశ్లేషించటం, విలువను నిర్ధారించటం - అనే కొత్త పరికరాలు తెలుగు సాహిత్య విమర్శ ప్రాంతాన్ని విస్తరింపచేశాయి. ఆకాశమే హద్దు అని నిరూపించాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. RITA FELSKI - Literature after feminism,
   The University of Chicago Press - 2003
2. TORIL MOI - Sexual textual Politics
   Feminist literary theory,
   clays Ltd., St Ives Plc, England 1985.
   reprinted in 1986 (Three times) and 1987.
3. కొడవటిగంటి కుటుంబరావు - సాహిత్యవ్యాసాలు
   వ్యాసప్రపంచం - 5, విరసం ప్రచురణ, 2001 మే.

*

☆ పాణి

రెండు విప్లవ కథలు : ఒక పరిష్కార మార్గం

విప్లవ కథల్లోని 'పరిష్కారం' గురించి విప్లవసాహిత్యోద్యమం లోపలి నుండి, బైటి నుండి కూడా పరిశీలనలు జరిగాయి. తొలితరం విప్లవ కథలను - భూషణం, ప్రకాశరావు, కారాలాంటి వాళ్ళ కథలను చదివితే, విప్లవకథ గురించి ఆరోజుల్లోనే వాళ్ళకు నిర్మాణాత్మకమైన, ప్రజా ఉద్యమ సంబంధమైన దీర్ఘకాలిక అవగాహన ఉన్నదని తెలుస్తుంది. పాట, కవిత్వం, ఉపన్యాసం నెరవేర్చే ప్రయోజనాలకు భిన్నంగా కథ విప్లవోద్యమంలో తీర్చవలసిన అవసరాలు ఏమిటో, అవి ఎట్లా తీర్చవలసి ఉన్నదో, కథా రచనలోని వస్తుశిల్పాల్లో, దృక్పథంలో ఏ జాగ్రత్తలు తీసుకుంటే అవి తీరుతాయో కూడా అప్పట్లోనే స్పష్టత ఉన్నట్లు తేలుతుంది.

అయితే ఈ స్పష్టత యింతగా ఉన్నవాళ్ళేగాక అనేక మంది కథా రచనలోకి రావడంలోనే విప్లవ సాహిత్యోద్యమం బలం ఉన్నది. విప్లవోద్యమంతోపాటు విప్లవ కథ పుట్టి, కలిసి నడవడానికి, ఉద్యమ స్వరూపస్వభావాలు కథను ప్రభావితం చేయడానికి, అవన్నీ కథాప్రక్రియలోకి రావడానికి కారణం అక్కడే ఉన్నది. దీనివల్ల తెలుగుకథా చరిత్రలోకి కొత్త సందర్భం వచ్చి చేరింది. యిక్కడే విప్లవ కథ వస్తువు మీద, ముగింపు మీద బైటి నుండి అనేక విమర్శలు వచ్చాయి. ఈ విమర్శల్లోని కొన్ని అంశాలు అప్పట్లో వచ్చిన కొన్ని కథల దృష్ట్యా నిజమే అయినా విప్లవ కథను విశ్లేషించడానికి కావలసిన పరికరాలు విమర్శకుల దగ్గర లేకపోవడంతో అనేక దురభిప్రాయాలు, దుర్వాఖ్యానాలు పొగుపడక తప్పలేదు. వాస్తవానికి విప్లవ కథలోని వస్తువు, ముగింపుల విషయంలో ఎంత విస్తృతికి, ప్రయోగానికి, శిల్ప నైపుణ్యానికి అవకాశం ఉన్నదీ విప్లవ సాహిత్యోద్యమానికి మొదటి నుండీ అవగాహన ఉన్నది. సమాజానికి సాహిత్యానికి సంబంధం ఉంటుందని చాలా మామూలుగా నమ్మి, కథను ఒక సాహిత్యరూపంగా మాత్రమే చూచే విశ్లేషకుల దగ్గర విప్లవోద్యమ ప్రాధాన్యాలు, అవసరాలు, ఆచరణ రూపాలు, పరిష్కారాల ప్రభావంలో కొనసాగుతున్న విప్లవ కథ లోపాలను చర్చించడానికి తగిన సామాజిక సాహిత్య దృక్పథం లేకపోవడం వల్ల కొత్త పరిశీలనలు ఏవీ అందివ్వలేకపోయారు. యిప్పటికైనా విప్లవకథ పరిణామాన్ని కొన్ని ముఖ్యమైన ధశలుగా విభజించి, విప్లవోద్యమ నేపథ్యంలో వస్తు శిల్పాల చర్చ చేయడం, ఆయా కాలాల్లో విప్లవ కథ మీద వచ్చిన విమర్శల్లోని సామంజస్యాన్ని పరిశీలించడం అవసరం. అప్పుడు విప్లవ కథ బలాబలాలు మాత్రమే గాక, విమర్శ ఎట్లా సాగిందో కూడా తేలుతుంది. ప్రజా ఆచరణ కేంద్రంగా విస్తరించిన విప్లవకథను, దాని మీద వచ్చిన విమర్శకు కలిపి చదవడం వల్ల తప్పనిసరిగా కొత్త నిర్ధారణలకు వచ్చేందుకు అవకాశం ఉన్నది.

అయితే విప్లవ కథలో లోపాలు, సమస్యలు ఏవీ కావా? అంటే తప్పనిసరిగా ఉన్నాయి. విప్లవోద్యమ ప్రత్యక్ష ఆచరణ నుండి వచ్చిన, వస్తున్న కథలనూ, ఉద్యమరంగానికి కొంచెం దూరంలో ఉంటూ విప్లవ చైతన్యంతో రాస్తున్న కథలనూ ఈ దృష్ట్యా చూడాల్సి ఉన్నది. ఇప్పుడు సౌకర్యం కోసం విప్లవకథను రెండురకాలుగా విభజించుకోవచ్చు. నేరుగా విప్లవోద్యమ ఆచరణ యితివృత్తంగా వస్తున్న కథలు, విప్లవోద్యమ దృక్పథంలో సమకాలీన జీవితంలోని అనేక యితివృత్తాల మీద వస్తున్న కథలు. మొదటి తరహా కథల మీద యిప్పటికీ అనేక మొరటు అభిప్రాయాలు, విమర్శలు చెలామణిలో ఉన్నాయి. కథలోపలికి, వస్తువు ద్వారా విప్లవోద్యమం లోపలికి వెళ్ళి విశ్లేషించగలిగే ఓపిక, సదుద్దేశ్యం, దృక్పథం చాలా మంది విమర్శకుల్లో ఉండటం లేదు. దీనివల్ల నిజమైన లోపాలు, సమస్యలు నిశితమైన విమర్శకు గురికావడం లేదు. ఈ దిశగా విప్లవ విమర్శకులు ఎంతో కొంత కృషి చేసినా, యింకా చేయవలసే ఉన్నది. ఎందుకంటే ఒకానొక విస్తృత ప్రజా ఆచరణ రంగం నుండి వస్తున్న కథలను, అక్కడ తయారవుతున్న కథకుల రచనా నైపుణ్యాన్ని ఎలా చూడాలి? అనే విషయంలో నలుగురిని ఒప్పించగల శాస్త్రీయ పద్ధతి యింకా రూపొందవలసి ఉన్నది. యింక రెండోరకం కథలనుకుంటున్న వాటిలో అపారమైన వస్తుశిల్ప వైవిధ్యం ఉన్నా, అనేక పద్ధతుల్లో విశ్లేషణలు సాగినా విప్లవోద్యమ దృక్పథం నుండి వచ్చే ఒక ప్రశ్నను స్వీకరించవలసి ఉన్నది. విప్లవోద్యమ చిత్రణే విప్లవ కథకు గీటురాయికానవసరం లేదని, విప్లవ దృక్పథంలో ఏ యితివృత్తాన్ని తీసుకొని రాసినా అది విప్లవ కథ అవుతుందనే అవగాహన మీద నిలబడి ఆ కథల్లోని వైరుధ్యాల స్వభావాన్ని దాని అవ్యక్త రూపాల నుండి వెలికితీసి పాఠకుల్లో ఎలాంటి వైఖరి కలిగేలా ప్రేరేపించింది? అనేదాన్ని బట్టి అందులోని విప్లవదృక్పథాన్ని పరీక్షకు పెట్టవలసి ఉన్నది.

ఈ వ్యాసంలో మొదటి రకం విప్లవ కథల మీద చర్చకు దోహదపడేలా రెండు కథలను స్వీకరిస్తున్నాను. జూన్, జూలై 2005 అరుణతారలో జమీన్ రాసిన 'తుపాకులు గుంజుకోండ్రి బిడ్డా', పి.మోహన్ రాసిన 'పైసా గూడ కట్టొకండ్రి' అనే కథలు అచ్చయ్యాయి. ఆమధ్య ఒరిస్సాలోని క్వోరాపుట్ ప్రభుత్వ ఆయుధాగారంపై విప్లవసైన్యం చేసిన దాడి ఘటన జమీన్ కథకు ప్రేరణ. అనంతపురం జిల్లాలో భూస్వామ్య ముఠానాయకుల అక్రమ వడ్డీ పత్రాలను విప్లవకారులు దగ్ధం చేసిన ఘటన మోహన్ కథకు ప్రేరణ. యిలాంటి ఘటనలు అనంతపురం జిల్లాలో జరిగినట్లు పత్రికలు కూడా రాశాయి. జమీన్ విప్లవోద్యమ కార్యకర్త అయితే, పి.మోహన్ విప్లవ దృక్పథంలో ప్రజాపోరాటాలను రచనలోకి తీసుకొని వస్తున్న రచయిత.

* * *

మొదట ఈ కథల శీర్షికలను గమనిద్దాం. ఒకటి - రాజ్యం దగ్గరున్న తుపాకులను స్వాధీనం చేసుకోమని ప్రజలు విప్లవకారులకు చెప్తున్నట్టుంది. రెండు - భూస్వాములు అక్రమ వడ్డీ అప్పుల్లో పైసా కూడా కట్టొకండి అని విప్లవకారులు ప్రజలకు పిలుపునిస్తున్నట్టుంది. ఆయుధాలు, అప్పులు రెండూ పేదప్రజలను అణిచివేసేవే. ఉత్పత్తిలో పాల్గొంటున్న శ్రామికుల రక్తమాంసాలు పీల్చి, నెత్తురు ప్రవహింపజేసే వర్గం అక్రమంగా సంపదను పోగుచేసుకొని, దాన్ని కాపాడుకోవడానికి ఆయుధాలను, అధికారాన్ని ప్రయోగిస్తుంటాయి. విప్లవోద్యమం ఆధిపత్య వ్యవస్థను నిర్మూలించే లక్ష్యంగా పోరాటాలను నిర్మించడమంటే ప్రజల శ్రమశక్తిని దోచుకొనే శక్తుల ఆటకట్టించి దోపిడికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడం. అప్పులు, ఎడ్డీలు గ్రామీణ భూస్వామ్యంలోనే గాక, ప్రభుత్వం నిర్వహిస్తున్న బ్యాంకింగ్ వ్యవస్థలో కూడ ఒక దోపిడీ రూపం. అందువల్ల 'పైసాగూడా కట్టొకండి' అని పిలుపునిచ్చింది. సమస్త దోపిడీ రూపాల్లో పోగుచేసుకున్న సంపదను, తద్వారా నిలబెట్టుకున్న అధికారాన్ని కాపాడుకోడానికి రాజ్యం సాయుధంగా ఉంటుంది కాబట్టి, దాన్ని ఎదిరించాలంటే ప్రజలు కూడా సాయుధం కావాల్సి వస్తుంది. లేదా దోపిడి రూపాలపై అవగాహన పెంచుకొని పైసాకూడా కట్టకుండా ఉంటే దోపిడీ వర్గాలు చూస్తూ ఊరుకోవు, కాబట్టి ఆత్మరక్షణకు సాయుధం కాక తప్పదు. దానికోసం ఆయుధాలు గుంజుకోవడం అనివార్యం.

ఈ రెండు యితివృత్తాల్లో ప్రకటితమయ్యే అంశాలు నేరుగా కథా శీర్షికలుగానే ముందుకొచ్చాయి. వీటిని పక్కపక్కనే చూడగానే పేర్లదగ్గరే ఫ్లాష్ వెలుగుతుంది. కథాంశాల్లోని తీవ్రతను పేర్లు సూచిస్తున్నాయన్నంత వరకే ఈ వివరణ.

* * *

శీర్షికల్లో తీవ్రత వ్యక్తమయ్యే సన్నివేశాల వెనుక అసలు కథలు ఉన్నాయి. అంటే పోలీసుల్ని కట్టిపడేసి ఆయుధాలు గుంజుకోవడం, భూస్వాముల్ని కట్టిపడేసి అప్పుపత్రాలు తగలపెట్టడం అనే సన్నివేశాల ముందూ వెనుకా రచయితల కథన పద్ధతిలో భాగంగా ఆ పతాక సన్నివేశాలదాకా నడిచిన అసలు కథలు ఉన్నాయి.

జమీన్ కథలో గెరిల్లా సైన్యం ఆయుధాగారంపై దాడి సన్నివేశం మధ్యలో 'అయిలమ్మ కథ' ఉన్నది. ఈ కథను నడిపించిన పాత్రలు - దాడికి వచ్చిన గెరిల్లాలు, అయిలమ్మ (యింకా అలాంటి 'పౌరసమాజం'లోని ప్రజలు)లను ప్రతీకాత్మంగా వారు, వీరు అనే రెండు రకాల పాత్రలు అనుకుంటే కథ ఆసాంతం ఈ పాత్రలు కనిపిస్తాయి. ఓ మోస్తరు పట్టణంలోని

ఆయుధాగారంపై దాడి చేయడానికి అజ్ఞాతంగా ఉండే గెరిల్లా సైన్యం వ్యూహాత్మకంగా బైటికి వస్తుంది. పోలీసులందర్నీ కట్టిపడేసి ఆయుధాలు స్వాధీనం చేసుకుంటున్న సన్నివేశాన్ని ఆ ఊళ్ళో వాళ్ళంతా వచ్చి ఆసక్తిగా, ఉత్సాహంగా చూస్తుంటారు. అయిలమ్మ అట్లా లక్ష్యానికి వస్తుంది. పోలీసులు ఆమె కూతురును సామూహికంగా రేప్‌చేసి చంపి ఉంటారు. కూతురు శవాన్ని తెచ్చుకోవలసి వస్తుంది. ఈ ఘటన అయిలమ్మ జీవితాన్ని అతలాకుతలం చేస్తుంది. ఆ విషాదమంతా అయిలమ్మ మనసును ఆవరించి, వెర్రి ఆవేశంతో కసితీరేలా బందీలుగా ఉన్న పోలీసుల్ని అలసిపోయేదాకా కొడుతుంది.

అప్పుడు పద్మ అనే మహిళా గెరిల్లా

"ఏ రెయిడ్ అయినా రాజకీయంగా మన పార్టీకి పెద్ద విజయంగా ఉంటుందనీ, ప్రజలక్కూడా పెద్ద ఉత్సాహాన్నిస్తదని తెల్సుగానీ ఈ అమ్మలెక్క ఎంతమంది తమ కసి తీరిందని సంతోషపడుతుండ్రో, తలచుకుంటే సంతోషంతో కన్నీళ్ళాగుతలేవు" అంటుంది.

"అవును మరి ప్రజాయుద్ధం ఎందరి ఆకాంక్షలనో ప్రతిఫలింపచేస్తూ ముందుకు సాగుతది" అన్న జహీర్ మాటలకు అంగీకారపూర్వకంగా చిరునవ్వు నవ్విందామె.

ఈ సంభాషణతో కథ ముగుస్తుంది.

ఇప్పుడు మోహన్ కథలోకి వద్దాం.

మల్లయ్య, రామక్క, భార్యభర్తలు. వాళ్ళ కొడుకు ఆదెప్ప. మల్లయ్య మూడేళ్ళ కింద నాగిరెడ్డి దగ్గర ఇరవైవేలు అప్పుతీసుకొని ఉంటాడు. మూడేళ్ళలో బాకీతీర్చలేకపోతే పొలం, ఊళ్ళో ఉండే నాలుగుసెంట్ల స్థలం స్వాధీనం చేసుకుంటానని నాగిరెడ్డి రాయించుకున్నాడు. మల్లయ్య చేసేదిలేక - ఎకరా పదహైదు వేల ప్రకారం నాలుగెకరాలు తీసుకొని, అప్పు అసలు వడ్డీ ముప్పైమూడు వేలు పోను మిగితాది ఇవ్వమని అడుగుతాడు. దానికి నాగిరెడ్డి. అగ్రిమెంట్ ప్రకారం ఈ రోజుతో నీ నాలుగెకరాల చేను నాదయిపోయింది. దానిలో 'అడుగుబెట్నావో తలకాయ తెగి నేలమీద దొర్లుతది... నియ్యమ్మ' అని తిడతాడు. పెద్ద కొట్లాట అవుతుంది. మల్లయ్య వైపు మాట్లాడేవాళ్ళెవరూ ఉండరు.

చేను ఎవరికైనా అమ్మి అప్పు కట్టాలనుకొని పేటలో ఉండే హనుమంతప్ప దగ్గరికిపోతారు. ఆయన పొలాలు కొనుగోలు, అమ్మకాలు చూసిపెట్టే దళారి. ఈ సంగతి తెలిసి నాగిరెడ్డి పదిమందిని జీపులో తీసుకొని వెళ్ళి హనుమంతప్పను బెదిరించాడు. ఊరికొచ్చి మల్లయ్యను పిలిపించి బెదిరించారు. లోపల్నుండి కాగితాలు తెచ్చి చూపించి 'వాటి ప్రకారం మీరు వేరేవాల్లకి సేనమ్మేకిలేదు. నేను దాన్ని కొన్నికీలేదు. మీరు దాన్ని నాకిడ్సి పెట్టిపోవల్ల' అంటాడు.

యిదయ్యాక ఓబులేసు ఆదెప్పను పిలిపిస్తాడు. అతనికీ నాగిరెడ్డికి పదిహేనేళ్ళ వైరం. ఒకరి మనుషుల్ని ఒకరు చంపించారు.

'లే. మీ సేన్ను నేనే కొనల్లని అనుకుంటి, ఆ రెడ్డి అలగా నాల్గుబెట్టే కట్టలు సూసేశి సాలయితండాయి. కాని మీకి తెల్సుగదా. ఆ రెడ్డిగాన్తో పెట్టుకుంటే నానాక పన్లు జేయల్ల. ఇప్పుడే వొగనిమిందొగరం గొంతుల కాడికుందాం..... 'ముల్లును ముల్లుతోనే తీయల్ల' అని 'నేను మీకు పదివేలు యిత్త... వాని సేనాతోట్లో సెట్లన్నీ నరకర్రి. బాయోల్లల్తో పెట్టుకుంటే ఏం జర్గుతాదో అబ్బుడిగ్గాని వాన్కి తెలిసిరాదు..' అంటాడు. ఆదెప్ప భయపడతాడు. ఈ పని చేస్తే వరిమడిలోంచి అరెకరా రాయిస్తా అని కూడా ఓబులేసు ఆశ చూపిస్తాడు.

ఆదెప్ప ఒప్పుకోడు. ఈ ఘర్షణలో ఆదెప్పకు విప్లవకారులతో పరిచయం కలుగుతుంది. వాళ్ళతో కలిసి తిరగడం మొదలుపెడతాడు. అతని తండ్రి కాళ్ళా వేళ్ళా పడతాడు. ఆదెప్ప భూమి సమస్య అప్పు పత్రం గురించి దళ కమాండర్ విని,

"మీ బాయగేర్లో మీదిక్కు నిలిసి మాట్లాడేకి ఎవరూ లేరాప్పా!" అని అడుగుతాడు.

దానికి ఆదెప్ప గేర్లో చాలా మందే ఉన్నారు. వాళ్ళంతా రెడ్డికో, ఓబులేసుకో అప్పులు ఉన్నవాళ్ళే. వాళ్ళు ఎవర్ని చంపమంటే వాళ్ళను చంపుతారు అని అంటాడు.

దానికి కమాండర్ - వాళ్ళ దిక్కు నిలబడేవాళ్ళు వచ్చినప్పుడు వాళ్ళెందుకు అట్లా ఉంటారు? అని అంటాడు.

ఆ తర్వాత దళం ఊర్లోకి వచ్చి నాగిరెడ్డిని కట్టేసి యింట్లో ఉండే బాండు కాగితాల్ని తగలబెట్టిస్తుంది.

మేం పోయినాక మల్లా మిమ్మల్ని అప్పులు కట్టమని ఈ రెడ్డిగాని యింకోడుగాని పీడిత్తే వీల్ల కత మేం జూత్తాం... అంటాడు.

'మొదటి కథకంటే యిది చాలా లోతయిన కథ.

అనంతపురం గ్రామీణ జీవితంలోని సంక్షిప్త కథలో కనిపిస్తుంది. కుల వైరుధ్యాలు, ముఠా వైరుధ్యాలు కలిసి అగ్రవర్ణ భూస్వాముల ఆధిపత్యాన్ని చిత్రించిన కథ. నాగిరెడ్డి - ఓబులేసుల వైరం కూడా ప్రధానమైందే. వేరే ఎవరికైనా పొలం అమ్మేసి నాగిరెడ్డి అప్పు చెల్లించాలనుకొని దళారీని కలవడం. అతణ్ణి నాగిరెడ్డి బెదిరించడం, ఆ తర్వాత నాగిరెడ్డి ప్రత్యర్థి ఓబులేసు (బహుశా యితను బి.సి.కులస్తుడు కావచ్చు) సమస్య సాకుగా ఆదెప్పను తన ముఠాలోకి లాక్కోవాలని చూడ్డం, తద్వారా నాగిరెడ్డిపై తన పగతీర్చుకోవాలనుకోవడం (ఎందుకంటే ఓబులేసు అప్పటికే నాగిరెడ్డి చేతిలో నష్టపోయి ఉంటాడు), దానికి ఒప్పుకోని ఆదెప్ప తన బంధువుల పిల్లవాడి ద్వారా నక్సలైట్ల పరిచయాల్లోకి వెళ్ళడం....

నిజానికి ఈ విస్తృతి నవలా నిర్మాణానికి సరిపోయేది. కానీ రచయిత కథగా కుదించే ప్రయత్నం చేశాడు. యిందులో కూడా పైన చెప్పిన కథ అంతా ఆదెప్ప కుటుంబం. ఆధిపత్య సంబంధాలు - విప్లవకారులు అనే రెండు రకాల పాత్రల ద్వారా నడిచిందని అనుకుంటే కథా విశ్లేషణకు సౌకర్యంగా ఉంటుంది. కమాండర్ బాండు కాగితాలను రోడ్డు మీద తగలపెట్టిన. అప్పుడు జనం మధ్యలో ఉన్న మల్లయ్య సంబరం తట్టుకోలేక కండ్లనీళ్ళిడుస్తా 'యిదంత మన ఆదెప్ప జేసిండేపనేగదా!' అనుకుంటాడు. ఈ వాక్యంతో కథ ముగుస్తుంది.

* * *

'తుపాకులు గుంజుకోండ్రి బిడ్డా!'లో కథ మధ్యలోకి అయిలమ్మ కూతురు సంగతిని తీసుకోవడానికీ, ముగింపులో పద్మ, జహీర్ సంభాషణలోని సందేశానికీ మధ్య సంబంధం ఉంది. దాని కోసమే అయిలమ్మ కథ మధ్యలో అంత జాగా ఆక్రమించింది. ఆ తరహా ముగింపు కోసమే అయిలమ్మ అనుభవం, రెయిడ్ సందర్భంగా ఆమె ప్రతిస్పందన అవసరం అయింది. కథా నిర్మాణం వైపు నుండి చూస్తే యిది అసంతృప్తి కలిగించేదే.

'పైసా గూడ కట్టాకర్రి'లో కనీసం రెండు చోట్ల కథ అనవసరంగా సాగినట్టనిపిస్తుంది. మొత్తంగానే కథా రచనలో ఉండాల్సిన క్లుప్తత అనే భావన నుండి చూస్తే - కథలోని సన్నివేశాలన్నింటి వైపు నుండి కేంద్రీకృతం అయ్యే మౌలిక అంశాన్ని చేరడానికి పాఠకులకు జాప్యం కలిగించేలా ఉన్నది. అది అంత పెద్ద సమస్య కాదనుకున్నా, హనుమంతప్ప దగ్గర, దళకమాండర్‌ను ఆదెప్ప కలిసిన చోట కథ నడక వేగంగా ఉండాల్సింది. అంత వివరంగా చెప్పడం కాకుండా యింకో పద్ధతి ఏదైనా పాటించి ఉండవచ్చు.

ఈ కథల్లోని ముఖ్య సన్నివేశాలు రెండూ సైనిక చర్యలే. సైనిక చర్యలు కూడా నిస్సందేహంగా ప్రజాకార్యకలాపాల్లో భాగమే. పైన చెప్పినట్టు ప్రతీకాత్మకంగా వారు - వీరు అనే రెండు రకాల పాత్రలుగా గుర్తించదలుచుకుంటే జమీన్ కథలోని అయిలమ్మ గెరిల్లాల సహకారంతో బందీలుగా ఉన్న పోలీసులను కొడుతే, మోహన్ కథలో ఆదెప్ప- యువకుడు కావడంవల్ల నక్సలైట్లతో కలిసి, నాగిరెడ్డిపై చర్య తీసుకునేలా చేస్తాడు. పైగా అతను ఓ చిన్న ఆయుధాన్ని దగ్గర పెట్టుకుంటాడు కూడా. అంటే 'వీరు' అనదగిన పాత్రల్లో నుండి అయిలమ్మ, ఆదెప్ప ఆ మేరకు క్రియాశీలురు అవుతారు. అందుకే మొదటి కథ చివర్లో పద్మ అనే మహిళా గెరిల్లా అయిలమ్మ చర్యను ప్రజాయుద్ధంలో ప్రతిఫలించిన ఆకాంక్షగా గుర్తిస్తే, రెండో కథ చివర్లో మల్లయ్య 'యిదంతా మన ఆదెప్ప జేసిండే పనిగదా! అని సంతోషిస్తాడు. అట్లా యివి విప్లవ ప్రజాపంథాలో ప్రజల భాగస్వామ్యాన్ని, వాళ్ళ ఆకాంక్షల వ్యక్తరూపాలని

సూచిస్తాయి.

అంతవరకు ఈ కథలు మంచి విప్లవ కథలే.

కాని ఈ ముగింపుల దగ్గరే ప్రారంభించి ఉద్యమ నేపథ్యంలోకెళ్ళి యింకొన్ని పరిశీలనలు చేయవచ్చు. అవి ఈ రెండు కథలకే పరిమితం కానవసరం లేకుండా, మొత్తంగా విప్లవ కథ అవగాహనకు, కథలోకి యితివృత్తరూపంలో ప్రవేశిస్తున్న విప్లవోద్యమానికి సంబంధించినవిగా భావిస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఆ పరిశీలనలు ఈ కథలకు కొత్త వ్యాఖ్యానాలు సమకూర్చగలగడమే గాక, కథా చిత్రణవైపు నుండి సాగే విప్లవోద్యమ చర్చ కూడా అవుతుంది.

జమీన్ రాసినకథలో విప్లవ గెరిల్లాలు భారీస్థాయిలో ఆయుధాలు స్వాధీనం చేసుకుంటూ ఉంటే ఆ ఊళ్ళో ఉండే ప్రజలంతా సంతోషాతిశయాలతో చూస్తూ ఉంటారు. గెరిల్లాలకు షేక్‌హ్యాండ్ యిస్తుంటారు. పి.మోహన్ రాసిన కథలో దళం నాగిరెడ్డిని కట్టిపడేసి, అప్పుపత్రాలు తగలబెట్టడానికి వస్తే, గేర్లో వాళ్ళంతా, ఊర్లో వాళ్ళంతా చుట్టూ గుంపై గొప్పగా ఆనందిస్తారు.

పైన చెప్పిన 'క్రియాశీలత' అనేదానితోపాటుగా ఈ సన్నివేశాలసారాన్ని కూడా గుర్తించాలి. వారు - వీరు అనే విభజన యింకో తరహా వాదన చేసేవాళ్ళకు చాలాబాగా ఉపయోగపడుతుంది. వాళ్ళేమంటారంటే - ప్రజలు, విప్లవకారులు వేరువేరుగానే ఉండిపోయారు, ప్రజలను వదిలి విప్లవకారులు ముందుకెళ్ళి పోయారు. ప్రజలు లేని దళచర్యలు... వగైరా విమర్శలు ఉత్సాహంగా చేస్తారు. యిదొక చచ్చువాదన. విప్లవోద్యమ తొలిదశలో యిలాంటి అనేక వాదనలు, పద్ధతులు రావడం అనివార్యం కావచ్చు అనుకున్నా, యిప్పుడైతే కాలాంతర అవశేషం తప్ప యింకెందుకూ అక్కరకు వచ్చేవి కాదు. నిష్క్రియాపరత్వాన్ని పెంచడానికి ఎప్ప మరెందుకూ పనికిరాదు కాబట్టి దాన్నలా వదిలేసి అసలు విషయానికి వస్తే, ఈ స్థితిని ప్రేక్షక పాత్ర అనవచ్చు. 1980ల ప్రారంభంలో ఉత్తర తెలంగాణ నుండి వచ్చిన విప్లవకథల్లో ప్రజలు సామూహికంగా కనిపిస్తారు. అద్భుతమైన క్రియాశీలంగా ఉంటారు. వాళ్ళ ఆలోచనలు, సంఘర్షణలు, చర్యలు అనేక రూపాల్లో వ్యక్తమవుతూ ఉంటాయి. నిర్బంధం పెరగడంతోపాటు వారితో పెరగుతున్న సృజనాత్మకతను, లోలోపలి నుండి పెల్లుబికి వచ్చే విప్లవాదర్శాలను ఆ కథల్లో చదువుతాం. విప్లవోద్యమం లోపలి నుండి వచ్చిన కథల్లో దీని విస్తృత రూపాలను చూడాలంటే 'నేలతల్లి విముక్తి కోసం' అనే కథా సంకలనం చదవాల్సిందే. అడవి నుండి, గ్రామాల నుండి, సింగరేణి గనుల నుండి అలాంటి కథలు వచ్చాయి.

ఇటీవలి విప్లవోద్యమ కథల్లో ఉన్నత పోరాటరూపాలు, గతానికంటే గాఢమైన అనుభవాలు ఉన్నప్పటికీ ప్రజల సంబంధాలు, ప్రజల క్రియాశీలత కేంద్రంగా చిత్రించబడినవి తగ్గిపోతున్నాయి. అజ్ఞాత విప్లవకథలో పెరుగతున్న వస్తు వైవిధ్యం గురించి, శిల్పం గురించి ఏ సందేహం లేదు. దాని గురించే సవివరంగా చర్చించవచ్చు. కాని విప్లవ కార్యక్రమాలు, చర్యలు కేంద్రంగా రాస్తున్న కథల్లో - ఎవరు రాసినా - ప్రజల సామూహిక వ్యక్తీకరణ ప్రబలంగా లేకపోవడం గురించి రచయితలు లోతుగా ఆలోచించాలి.

నిర్దిష్టంగా ఈ రెండు కథల్లోనే ప్రజలు తీవ్ర వైరుధ్యాలను అనుభవిస్తున్నారు. 'తుపాకులు గుంజుకోండ్రి బిడ్డా'లో అయితే పోలీసులు అయిలమ్మ కూతుర్ని రేప్‌చేసి చంపినప్పుడు. దాని మీద ఆ వీధిలో ఉన్నవాళ్ళంతా మానవీయంగా స్పందించారు. జరిగిన దాని మీద చాలా ఆవేశానికి లోనయ్యారు. యిలాంటి దుర్మార్గాలు వ్యవస్థ కల్పితం. వ్యవస్థను సాయుధంగా కాపాడుతున్న పోలీసులు కూడా ఈ దుర్మార్గాలకు పాల్పడుతుంటారు. మానవీయమైన ఆగ్రహం నిర్మాణాత్మకమైన పోరాటంగా మారవలసి ఉంటుంది. పైగా ఈ కథలోని కమలకుగాని, ఆమె భర్తకుగాని వాళ్ళ గ్రామాల్లో నడిచిన ఉద్యమాల స్పృహ ఉన్నది. అయిలమ్మకు కూడా విప్లవకారుల పట్ల గొప్ప సానుభూతి ఉంది. యిదంతా ఉద్యమ ప్రభావానికి, చైతన్యానికి గుర్తు. యిలాంటి మనుషులను క్రియాశీలం చేయడం ద్వారానే - వాళ్ళు అనుభవిస్తున్న ఆధిపత్య సంబంధాలను ఛేదించగలుగుతారు. అయిలమ్మ కూతుర్ని పోలీసులు చంపేయడం అనే ఘటన విప్లవకారుల దృష్టిలో కూడా పడింది.

"అరె! మనమీ వార్త పేపర్ల చూసినం గుర్తుందా? అప్పుడే అనుకున్నం మనం. యిది లాకప్‌డెత్ కాదు, పోలీసులే సంపుటారని. కానీ అత్యాచారం అనేమాటే పేపర్లు రిపోర్టు చేయలేదు. జాడు ఎంత ఘోరమో..." అని మాధవి అనే గెరిల్లా కథలో అంటుంది.

సరిగ్గా యిలాంటి స్థితే 'పైసాగూడ కట్టాకర్రి'లో కనిపిస్తుంది.

నాగిరెడ్డి మల్లయ్య పొలాన్ని దురాక్రమించదలచుకోవడం ఊళ్ళో అందర్నీ కలిచివేస్తుంది. ముఖ్యంగా గేర్లో వాళ్ళంతా బాధపడతారు. కానీ గ్రామీణ వ్యవస్థలోని పేదరికం, అప్పులబాధలు, ఆధిపత్య సంబంధాలు, కులం అన్నీ కలిసి ఎవరూ ఏమీ మాట్లాడలేరు. వాళ్ళ ఆగ్రహం అట్లా అణగారిపోయి ఉంటుంది. అయితే సమస్యల గురించి విప్లవకారులకు తెలుసు. కథలో తిరుపాలు అనే కార్యకర్త ఆదెప్పతో "పార్టీ ఓల్లు నిన్ను రమ్మంటండారు - నాగిరెడ్డితో రచ్చ జరిగిందంటగా..." అంటాడు.

ఆదెప్పతో దళ కమాండర్ "జిల్లాలో మీ వూరి రెడ్ల్యాకట్ల, ఓబులేసుకట్లా జనాన్ని కాల్చుకొని తినేవాళ్ళి వంగదీసేకి యత్నం చేస్తాండము" అని అంటాడుగాని, అది నిజమే అయినా, ఆ పని ఆదెప్ప వాళ్ళ ఊర్లో చేయలేదు. యిలాంటి దుర్మార్గుల్ని లొంగదీసేకి యత్నం చేస్తాండాము అనే మాటను చాలా జాగ్రత్తగా చదవాలి. ఎట్లా చేస్తున్నారు? అనే ప్రశ్న అక్కడి నుంచి పుట్టుకొని వస్తుంది. కథ చివర్లో చేసినట్లేనా? తప్పక అట్లా కూడా చేయాల్సిందే. కాని కథలో నాగిరెడ్డి, ఓబులేసుల ముఠా ఆధిపత్యాలు, ఒకరి మీదికి ఒకర్ని ఉసికొల్పడాలు - ఓబులేసు అయితే నేరుగా ఆదెప్పతోనే నాగిరెడ్డి చీని చెట్లు నరికించి, తద్వారా నాగిరెడ్డిని దెబ్బదీయడం, ఆదెప్ప కుటుంబాన్ని తన ముఠాలోకి లాక్కోవడం అనే వ్యూహాన్ని విసురుతాడు. అంటే - ఊర్లో కరువు, అక్రమవడ్డీల మీద నడిచే అప్పులు, కుల వివక్ష, రెండు ముఠాల ఎత్తులుపైఎత్తులు.... యిన్ని సమస్యలున్నాయి. రచయిత చాలా జాగ్రత్తగా, పాఠకుల సమ్మతి పొందేలా కథలోకి చాలా సహజంగా, జీవిత చిత్రణద్వారా యిన్నిటిని తీసుకొని వచ్చాడు. ప్రజలు క్రియాశీలం అయితే తప్ప పరిష్కారంకాని వైరుధ్యాలు యివి. కథలో కమాండర్ యింకో మంచి మాట అంటాడు. 'వాళ్ళదిక్కు నిలబడేవోల్లు వచ్చినప్పుడు వాళ్లెందుకు అట్లా ఉంటారు?' అని. అంటే ఉద్యమానికి పరిస్థితిమీద, దాని పరిష్కారం మీద స్పష్టమైన అవగాహన ఉన్నది.

ఆదెప్ప తమ కులంవాళ్ళ చైతన్య రాహిత్యం మీద, క్రియారాహిత్యంమీద, ముఠా తగాదాల్లోకి కూరుకపోవడం మీద విసుగ్గా 'బాయికారి నా కొడుకులు వాల్లగురించి ఎందుకు లేప్పా!' అంటే కమాండర్ పై మాట అంటాడు. ఈ మాట 'వీరు' అనదగిన పాత్రల చైతన్యస్థాయి ప్రతిబింబిస్తే, కమాండర్ మాట 'వీరి'మీద (ప్రజలమీద) 'వారికి' (ఉద్యమకారులకు) ఉండాల్సిన సవ్యమైన వైఖరిని సూచిస్తుంది. అవగాహన రీత్యా కథలో యింత ప్రస్ఫుటంగా విప్లవోద్యమం చిత్రించబడింది.

ఈ రెండు కథల్లోని పాత్రలన్నీ సహజమైన భావోద్రేకాలతో సజీవంగా ఉంటాయి. అయిలమ్మ సమస్య అయినా, ఆదెప్ప సమస్య అయినా వ్యవస్థ దుర్మార్గాలకు ప్రతీకలయినట్టే, వాళ్ళు, వాళ్ళ చుట్టూ ఉన్న యితర సాధారణ పాత్రల భావోద్రేకాలు ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహిస్తాయి. అయితే అయిలమ్మ బందీలుగా ఉన్న పోలీసులను కొట్టడం, ఆదెప్ప ఉద్యమ సంబంధాల్లోకి వెళ్ళిపోవడం అనేవి కూడా అట్లా ప్రాతినిధ్యం వహించగలరని చెప్పడంకష్టం. సామూహిక క్రియాశీలతను అవి ప్రతిబింబించలేవు. ఈ కథల ప్రకారమే చూచినా, అసంఖ్యాక పీడితులు, ఉద్యమాల్లో ఏదో ఒక స్థాయిలో కలిసి నడవాల్సిన ప్రజలు, ఉద్యమాల పట్ల ఆరాధన ఉన్నవాళ్ళు ప్రేక్షకులుగా ఉండిపోతారు. ఆనందాన్ని వ్యక్తం చేయడం, అన్నం తెచ్చి పెడతామని అనడం (తుపాకులు గుంజుకోండ్రి బిడ్డాలో) వాళ్ళు అనుభవిస్తున్న వైరుధ్యాల పరిష్కారానికి సరిపోవు. ఒక పక్క సమస్యల పరిష్కారానికి యింకా యింకా తీవ్ర పోరాట రూపాలు అందివస్తూ ఉండటం, ప్రజలు క్రియారహితంగా ఉండటం మధ్య ఒక వైరుధ్యం ఉంది. తీవ్రరూపాలు తప్పనిసరే అయినా, అనేక

స్థాయిల పోరాట రూపాల్లోకి ప్రజలు తమ సంసిద్ధతను బట్టి వచ్చినప్పుడు ఈ వైరుధ్యం పరిష్కారం కావడమే గాక, ఆ క్రమంలో కలిగిన అనుభవం వల్ల పోరాటరూపాల స్థాయి కూడా పెరుగుతుంది. అప్పుడు కథలోకి వచ్చిన పాత్రలను వివరించడంలో వారు,'వీరు అనే విభజన అవసరం లేకపోగా, అదొక కృతక విభజనగా తయారవుతుంది. మళ్ళీ 80నాటి విప్లవోద్యమ కథల దగ్గరికిపోతే - అశేష ప్రజానీకాన్ని కదిలించడంలో చోదకంగా పనిచేసిన పాత్రలు కూడా వారు, వీరు అనేదగివట్టు కనిపించవు.

అంటే కథల్లో కనిపిస్తున్న అతి సంక్లిష్టమైన, దుర్మార్గమైన వైరుధ్యాలు అనుభవంలో ఉండటం, వాటి గురించిన ఎరుక కలగడం ఒకటికాదు. రెండు కథల్లోని పాత్రలు గాఢమైన అనుభవం కలిగినవే. మొదటి కథలో కమలకుగాని, రెండ కథలో ఆదెప్పకుగాని ఎరుక కలిగిన క్రమాన్ని కూడా రచయితలు చిత్రించారు. కథలోని పాత్రలు సాధారణీకరించబడి అనేక మంది సరిపోల్చుకొనేటట్లు ఉండాలి.

కాని రచయితలుగా జమీన్, మోహన్ అక్కడ విఫలమయ్యారు. దీన్ని కథా రచనలోని లోపంగానే కాక, విప్లవోద్యమ ఆచరణకు - విప్లవకథా చిత్రణకు ఉన్నా సంబంధం రీత్యా కూడా ఆలోచించగలిగితే ఉద్యమానికి - సాహిత్యానికి ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

గత సాహిత్యంలో నిలిచిపోయిన పాత్రలను గుర్తు చేసుకుంటే, వాటి వ్యక్తిత్వం, స్వభావం, క్రియాశీలతల వల్ల ఆ రచన పుట్టిన కాలాన్నే గాక తర్వాతికాలాన్ని కూడా పలికించగల శక్తి వాటిలో కనిపిస్తుంది. విప్లవ సాహిత్యంలోని పాత్రలు అయితే సామూహికతకు ప్రాతినిధ్యం వహించడం వల్ల కూడా నిలబడిపోయాయి. అందువల్లనే సాహిత్యం ప్రజాపోరాటాలకు ప్రేరణగా ఉంటుంది. సామూహిక క్రియాశీలత యిటీవలి విప్లవకథల్లో ఎంతవరకు వ్యక్తమవుతున్నది? అనే కోణంలో పరిశీలించడం అవసరం.

* * *

తాను అనుభవిస్తున్న వైరుధ్యాల పట్ల, సంక్షోభాల పట్ల సమాజం సామూహిక క్రియాశీల శక్తిని ప్రదర్శించకపోవడం అంటే - ఆమేరకు స్తబ్దంగా, ప్రేక్షకురాలిగా ఉండిపోయినట్టే. విప్లవ చర్యలపట్ల భిన్న ప్రజానుకూల శక్తులు మౌనంగా, మౌన అంగీకారంగా, ప్రేక్షకులుగా ఉన్నప్పుడు పౌరసమాజం మీద రాజ్యం అజమాయిషీ క్రమంగా పెరగడానికి అవకాశం ఉన్నది. రాజ్యానికి సమాజానికి మధ్య ఉండే సంబంధం నిరంకుశంగా మారిపోతుంది. అది చాలా ప్రమాదానికి దారితీస్తూ, అతి పెద్ద సామాజిక విషాదంగా కొనసాగుతుంది.

'తుపాకులు గుంజుకొంద్రి బిడ్డా' కమల - మల్లేశంల ఊళ్లో జరిగిన పరిణామాల గురించి కూడా చెప్తుంది. కమల అత్తవారింటికి వెళ్ళేటప్పటికి, అంటే ఇరవై ఏళ్ళ కిందట 'అప్పటికా ఊరికి పోరు కెరటం' అయితే కొద్దికాలానికి నిర్బంధం విరుచకబడి బీభత్సమైపోతుంది. దాంతో పిల్లలతో కలిసి పట్నానికి వలసపోతారు. 'ఆమెకు, ఆమె భర్తకూ ఊర్లో ఉన్నవే తాము బతికిన రోజులు అన్పిస్తుంటుంది'. చుట్టపుచూపుగా ఊరికి వెళ్ళాలంటే భయం.

కాని ఈ మధ్య దసరా పండక్కి వెళ్ళినపుడు మల్లేశం వాళ్ళ చిన్నమ్మ కమలతో 'ఊరు నన్నొద్దుల వూరు లెక్క లేదు బిడ్డా! ఇన్నొద్దుల్లెక్క జనం పోలీసులకు భయపడ్తలేరు.. మర్లబడుడు నేర్చింద్రు...' అంటుంది. నిర్బంధం వల్ల అణగారిపోవడం, యిక అక్కడ ఉండలేక బైటికి వలసపోవడం, మళ్ళీ ఎన్నటికో తలెత్తడం... అనే క్రమం అనివార్యమే అయినా అంతా నిశ్శబ్దంగా మారిపోయినప్పుడు రాజ్యం ఆధిక్యత సమాజాన్ని ఎన్నెన్ని రకాలుగా ప్రభావితం చేసి తమకు అనుకూలమైన రూపాల్లో తీర్చిదిద్దుకుంటుందో గమనించవచ్చు. 'మర్లపడుడు నేర్చింద్రు... యిప్పుడు ఊళ్ళకు రావాలంటే పోలీసులే బయపడుతుండ్రు' అని కూడా మల్లేశం వాళ్ళ చిన్నమ్మ అంటుంది.

ఈ కథలో పోలీసులు ఊర్లోకి రావడానికి భయపడ్డట్టే, 'పైసాకూడా కట్టా కద్రి'లో ఆదెప్పవైపు నిలబడి నాగిరెడ్డి దుర్మార్గాన్ని (నిజానికి సమస్య ఆదెప్పది మాత్రమే కాదు, అందరూ అలాంటి యిబ్బందుల్లో ఉన్నారు) తప్పని చెప్పడానికి ఊళ్ళో వాళ్ళు భయపడుతూ ఉంటారు. పోలీసు నిర్బంధం వల్ల ఊళ్ళు వదిలి వలసపోవడం, ఊళ్ళోకి రావాలంటే పోలీసులు భయపడ్డం అనే సంఘర్షణ కంటే, నాగిరెడ్డికి గ్రామంలోని వాళ్ళంతా భయపడ్డం అనే సంఘర్షణ చాలా భిన్నమైంది. లోతైంది. యిక్కడ వ్యవస్థాగతమైన వైరుధ్యాల అణచివేత, ఆధిక్యత ప్రబలమైంది. అట్లాగే అయిలమ్మ కూతుర్ని రేప్‌చేసి చంపేసిన ఘటనలో దోషులు పోలీసులు అయినట్టే, సమాజంలోని ఏ మగవాళ్ళయిన కావడానికి అవకాశం ఉన్నది. పితృస్వామ్య అణచివేత వ్యవస్థాగతమైన దుర్మార్గం. ఈ ఘటన గురించి పత్రికల్లో చదివికూడా విప్లవకారులు ఏమీ చేయలేకపోతారని కథ ద్వారా తెలుస్తుంది. నిత్యం జరిగే వ్యవస్థాగతమైన దుర్మార్గాలను ఎదిరించడానికి సామూహిక రాజకీయ పోరాటాలు నిర్వహించే వీల్లేని స్థితి ఉన్నదంటే సమాజం మౌనంగా ఉన్నట్టే లెక్క. 'పైసా గూడ కట్టాకద్రి'లో దీనికి ఒక పరిష్కార మార్గం కనిపిస్తుంది. కానీ కథలోని అనేక యితర వైరుధ్యాలు పరిష్కారం అయ్యాయా? వాటి స్వభావాన్ని గుర్తించి, రద్దు చేసుకోవాలనే ఎరుక, సంసిద్ధత గ్రామస్తులకు కలిగిందా? అనే ప్రశ్నలు మిగిలే ఉంటాయి. కథలో చూపిన పరిష్కార మార్గం వల్ల కలిగే ప్రేరణ మిగితా సమస్యల పరిష్కారానికి దోహదపడవచ్చు. కానీ అది అంత తేలికయిన పనేం కాదు. ముఖ్యంగా ఆ పరిష్కారరూపమే మిగితా సమస్యలకు ఎంత మాత్రం పనికి రాకపోవచ్చు. దళ కమాండర్ ఆదెప్పతో మాట్లాడినప్పుడుగాని, ముగింపు సన్నివేశంలోని మాటలను బట్టిగాని ఈ వైపు నుండి ఉద్యమం ఆలోచించినట్టు అనిపించదు. అలాంటి అవగాహన ఉండి ఉంటే 'చెప్పాల్సిన కథ' యింకా చాలా ఉండేది. యిప్పుడు అదంతా 'చెప్పని కథ'. అనంతపురం, రాయలసీమ ఉద్యమ అనుభవాల నుండే చూచినా, నాగిరెడ్డి దగ్గర ఉన్న అప్పు పత్రాలు కాల్చేసి, అతణ్ణి 'లొంగదీసుకోవడం'తో సమస్య పరిష్కారం అవుతుందని నమ్మలేం. ఒకవేళ అతను బలహీనపడినా, ఓబులేసు ఉండనే ఉన్నాడు. అతను బి.సి.కులస్తులు (బహుశా బోయ కావచ్చు). అతన్ని కూడా అదుపు చేయదలుచుకుంటే అతని కులం నుండే తీవ్ర నిరసన వస్తుంది. లేదా అతను చక్కగా నాగిరెడ్డి స్థానంలో అమరిపోయే అవకాశం కూడా ఉంది.

యిట్లా చెప్పుకుంటూపోతే, ఈ రెండు యితివృత్తాల నుండి సాగే కథ యింకా చాలా ఉంటుంది. అదంతా ఉంచనా 'ఒక వైరుధ్యం పరిష్కారం అయినచోటనే యింకో వైరుధ్యం తలెత్తుతుందని, నిరంతరాయంగా వైరుధ్యాల పరిష్కారానికి ప్రయత్నం చేయవలసిందే' అనే వాదన పోటీగా రావచ్చు. పోటీగా వచ్చినా అదే సరైంది. అయితే అంత విస్తృత అవగాహనను ఈ కథలు ప్రతిబింబించకపోగా, ఒకానొక పరిష్కారాన్ని బలంగా ప్రతిపాదిస్తున్నాయి. దీన్ని పూర్తిగా ఆమోదించినా సరే, వైరుధ్యాల స్వభావం, పరిష్కార మార్గాలు, ప్రజల సామూహిక క్రియాశీలత అనే వాటి గురించి లోతుగా చర్చించడానికి యివి నిలబడే కథలని చెప్పవచ్చు.

పైసా గూడా కట్టాకద్రి'లో నుండి ఒక ఆసక్తికరమైన విషయాన్ని గుర్తుచేసి ముగిస్తాను. దళ కమాండర్ - ఆదెప్పతో మాట్లాడుతూ "అవును గాని... మీ బోయగేర్లో మీ దిక్కు నిలిసి మాట్లాడేకి, ఎవురూ లేరాప్పా?" అని అడుగుతాడు. 'మీ ఊర్లో' అనకుండా మీ బోయగేర్లో అని ఎందుకన్నాడు? బహుశా యిలా చెప్పుకోవచ్చునేమో. కులం అనే వ్యవస్థ గ్రామీణ సమాజంలో ఒక రక్షణ కవచంగా కూడా పనిచేస్తుంది. నాగిరెడ్డి మల్లయ్యను బెదిరించి పంపించాక బోయగేర్లో పెద్ద తలకాయలన్నీ గుంపై మల్లయ్యకు వచ్చిన ఆపద గురించి చర్చిస్తాయి. ఎందుకు? తమ 'సమూహం'లోని ఒకరికి కష్టం వస్తే ఆ కులంవాళ్ళు 'సమూహం'గానే పట్టించుకోవడం, ఆ వ్యక్తిని నిలబెట్టడం తమ బాధ్యత అని భావిస్తారు. కులమే కాదు, అన్ని సామాజిక వ్యవస్థలకూ ఈ స్వభావం ఉంటుంది. కథలో విప్లవ నాయకుడు కూడా అదే మాట అంటాడు. రక్షణకవచంగా కూడా ఉండే కులం అనే వ్యవస్థ స్వభావాన్ని గుర్తించగలిగితే, ఆ వ్యవస్థ సామూహికంగా ప్రకటించుకొనే ఆకాంక్షలపట్ల, విలువల పట్ల, విశ్వాసాలపట్ల ఎలాంటి వైఖరి తీసుకోవాలి? అన్నిటినీ ఆమోదించడం వీలు కాదు కాబట్టి వాటితో ఎట్లా వ్యవహరించాలి? అనే ప్రశ్నలతోపాటు ఆదెప్ప సమస్య పరిష్కారంలో ఈ రక్షణ కవచానికి చోటు ఏమైనా ఉంటుందా? అనే ప్రశ్న వేసుకోవడం ఆసక్తిదాయకమే కాదు, ఆలోచనాత్మకం కూడా.

*

కవిత్వం - తాత్విక వ్యక్తీకరణ

☆ ఎ. నాగరాజు

వివిధ సాహిత్య ప్రక్రియలతో పోలిస్తే కవిత్వానికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. కవిత్వానికున్న ఈ ప్రత్యేకతల కారణంగానే మిగిలిన అన్ని సాహితీ ప్రక్రియలకన్నా ముందుగానే అది సామాజిక వాస్తవికతకు అనుగుణంగా ప్రతిస్పందించగలుగుతుంది. సామాజిక వాస్తవికతకు అనుగుణంగా తలెత్తే వివిధ ధోరణులు, సామాజిక ఉద్యమాలకు కవిత్వం అడుగుజాడ కాగలుగుతుంది. కవిత్వం మాత్రమే నిర్వర్తించగల ఈ విశిష్ట పాత్రను వివరించడానికి సాహిత్య చరిత్రలో వివిధ కీలక సందర్భాల నుండి ఎన్నో ఉదాహరణలను చెప్పవచ్చు.

కవిత్వం ఈ రకమైన పాత్రను నిర్వహించడానికి దానిలో ఉన్న సామాజిక అంశమే ప్రధాన కారణం. ఈ సామాజికాంశ గూడా మిగిలిన సాహితీ ప్రక్రియలలో కనిపించే సామాజికాంశకంటే కొన్ని ప్రత్యేకతలను కలిగి వుంటుంది. కవిత్వం మానవోద్వేగాలు, అనుభూతులు కలగలిసి నిర్మాణపరంగా ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటుంది. మనిషి తన తొలినాళ్ళలో చుట్టూ ఉన్న బాహ్య వాస్తవికతను అర్థం చేసుకొనే ప్రయత్నంలో భాగంగా కవిత్వం కూడా ఆవిర్భవించింది. సమూహంలో భాగంగా మనిషి తన చుట్టూ ఉన్న సమాజంతో, ప్రకృతితో ఏకకాలంలో నెరపిన సంబంధం కవిత్వానికి దోహదం చేసింది. రూపంలోనూ, సారంలోనూ సామూహికతను ప్రతిబింబించే లక్షణాలు కవిత్వంలోకి వచ్చాయి. కవిత్వంలోని లయ, ధ్వని ఇంకా ఇతర రూప సంబంధ అంశాలు కవిత్వంలోని సామూహికతను తెలియజేస్తాయి. కవిత్వంలో ఉపయోగించే భాష కూడా సాధారణ వాడుకలో ఉండే భాష కాదు. కవిత్వ భాష ప్రత్యేకమైన భావావేశిత స్థితిలో 'ఉన్నతస్థాయికి' చేరుకున్న రూపం. పైకి మార్మికతతో కనిపించే కవిత్వ భాష రూపొందడం వెనుక సమాజంలోని శ్రమ విభజన, సంస్కృతి, సంప్రదాయాలు కారకాలుగా పనిచేస్తాయి. నృత్య, చిత్రలేఖనం వంటి ఆదిమ కళల మాదిరిగానే కవిత్వం కూడా తొలినాళ్ళలో భ్రమాత్మక వాస్తవికతను వెల్లడించేదే అయినప్పటికీ అది వెల్లడి చేసే ఆకాంక్షల రీత్యా అది వాస్తవికమైనది. రూపం ద్వారానూ, సారం ద్వారానూ వెల్లడయ్యే సామూహికతే దాని వాస్తవికత.

సమాజం అభివృద్ధి చెంది వర్గాలు ఏర్పడినపుడు కవిత్వం కూడా ఆ ప్రభావానికి లోనయ్యింది. వర్గ ప్రయోజనాలకనుగుణంగా కళలు, సాహిత్యం రూపొందడం మొదలయ్యాయి. సమాజం అనేక దశలుగా అభివృద్ధి చెందుతూ వుండే కొలది కవిత్వం పాలకవర్గాల ప్రయోజనాలకు ప్రధాన పనిముట్టుగా మారింది.

అయితే కవిత్వం మనిషికీ, ప్రకృతికీ నడుమ ఉన్న వైరుధ్యం నుండి ఆవిర్భవించింది. కనుక - ఎన్ని రకాల వర్గ సమాజాలు వచ్చినప్పటికీ దానిలోని సామూహిక లక్షణాలు మాత్రం కొన్నయినా కొనసాగుతూ వస్తున్నాయి. మనిషికీ ప్రకృతికీ నడుమ ఏర్పడిన ఈ వైరుధ్యం ప్రకృతిలో భాగంగా మనిషి చేసే సామూహిక కృషితోనే పరిష్కారమవుతుంది. ఈ వైరుధ్యం పరిష్కారమయ్యేంత వరకు కవిత్వమూ, కవిత్వంలోని సామూహిక స్వభావమూ కొనసాగుతూనే ఉంటాయి.

కవిత్వానికుండే మరో ప్రత్యేకత హేతువుకు లొంగకపోవడం, తనకర్థంకాని ప్రాకృతిక శక్తులతో మనిషి తీవ్ర భావావేశిత స్థితిలో చేసిన సంభాషణ వల్ల, సామూహిక శ్రమలో మనుష్యుల కదలికలో కనిపించే లయబద్ధత వల్ల కవిత్వానికి ఈ లక్షణం సంక్రమించింది. కవిత్వంలో కనిపించే ఉద్రిక్తపూరితమైన ఈ అహేతుకతనాధారంగా చేసుకొనే భావవాదులు కవిత్వాన్ని ఒక అతీతమయిన శక్తిగా భావించారు. తీవ్ర భావావేశిత స్థితిని ఆధారంగా కవిత్వాన్ని బాహ్య వాస్తవికతకు దూరంచేసి దానిని దైవిక విషయంగా ప్రచారం చేశారు. అయితే కవిత్వంలో కనిపించే ఈ అహేతుకత వెనుక ఉండే హేతువును మార్క్సిస్టు విమర్శకులు సామాజిక సంబంధాల వెలుగులో వివరించగలిగారు. ఆ హేతువుకు, హేతువుకు నడుమ ఉన్న గతితార్కిక సంబంధాన్ని విప్పి చెప్పగలిగారు.

బాహ్య వాస్తవికత పట్ల శాస్త్రీయమైన అవగాహనతో నిమిత్తం లేకుండానే భావావేశిత స్థితిలో ప్రతిస్పందించడం, హేతువుకు లొంగకపోవడం అనే ప్రత్యేక లక్షణాలు సామాజిక చరిత్రలో కవిత్వానికి పుట్టుకతోనే సంక్రమించాయి. ఈ ప్రత్యేకతల కారణంగానే చరిత్ర గతిలో మిగిలిన సాహితీ ప్రక్రియల కన్నా కవిత్వం ముందుగా స్పందించగలుగుతుంది. సామాజిక వాస్తవికతను వెల్లడి చేయడంలో అడుగు జాడ కాగలుగుతోంది. ఇది ఒక ప్రక్రియగా కవిత్వానికున్న వెసులుబాటు అనుకుంటే, ఈ వెసులుబాటు ఆధారంగా కవిత్వం సాహిత్య చరిత్రలో రెండు పనులను నిర్వర్తిస్తూ వస్తున్నది. సామాజిక వాస్తవికతకనుగుణంగా వ్యక్తమయ్యే వివిధ ధోరణులు, ఉద్యమాలకు కవిత్వం మిగిలిన ప్రక్రియలకన్నా, ముందుగానే వాహిక కాగలగడం దీనిలో ఒకటి. దీనికి మరోవైపు కూడా ఉంది. సామాజిక వాస్తవికతను వెల్లడి చేసే వివిధ ధోరణులు తిరిగి ఆ వాస్తవికతతో ప్రతిస్పందించేటపుడు అనేక పరిమితులకు లోనుకావడం, ఉద్యమాలలో సంక్షోభాలు ఏర్పడడం వంటి సందర్భాలలో కూడా కవిత్వమే ముందుగా ఈ స్థితిని నమోదు చేయగలుగుతుంది. ఈ రెండింటిలో మొదటిది కవిత్వానికి గొప్ప ఆకర్షణనూ, పురోగామి స్వభావాన్ని కలుగుజేస్తూ ఉంటే, రెండవది స్తబ్దతనూ, కొన్నిసార్లు గతంలోకి జారుకునే స్వభావాన్ని కలుగజేస్తుంది. ఈ రెండు విధులను కవిత్వం నిర్వర్తిస్తూ ఉండడం వల్ల సమకాలీన సామాజిక చరిత్రలో వివిధ ధోరణులను అధ్యయనం చేసేందుకు సమకాలీన కవిత్వం దోహదం చేస్తుంది.

ఒక వైపు విప్లవ సాహిత్యోద్యమం కొనసాగుతూ ఉండగానే 80,90 దశకాలలో సామాజిక చలనంలో వచ్చిన వివిధ మార్పులు, స్త్రీవాద దళిత, ముస్లీం మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వాలతో కూడిన అవగాహనను బౌద్ధిక, సృజనాత్మక రంగాలలోకి తీసుకొని వచ్చాయి. ఫలితంగా సాహిత్యమూ వివిధ బౌద్ధిక రంగాలూ మునపటి కన్నా ప్రజాస్వామికం అయ్యాయి. అయితే 90 దశకం చివరినాటికి వీటి ఉరవడి బాగా తగ్గిపోయింది. 80,90దశకాలలో ఏ సామాజిక చలనాల కారణంగా ఈ విధమైన ధోరణులు వచ్చాయో, తిరిగి ఆయా సామాజిక చలనాలకున్న వస్తుగత పరిమితులు కారణంగా అవి అనేక పరిమితులకు గురయ్యాయి. 90లలో దేశంలో అమలు పరచబడ్డ నూతన ఆర్థిక విధానాలు కూడా ఈ స్థితిని వేగవంతం చేయడానికి తమ వంతు పాత్ర వహించాయి. వీటిలో ఇప్పుడు ముస్లిం మైనారిటీ ప్రాంతీయ అస్తిత్వాలు మాత్రమే ప్రభావశీల స్వభావంతో కొనసాగుతున్నాయి. హిందూ మతతత్వం, అభివృద్ధి విధానాలలోని అసమానతలను ఇవి ప్రశ్నిస్తున్నాయి.

80,90 దశకాలలో బౌద్ధిక, సృజనాత్మక రంగాలలో బలమైన, విస్తృతమైన స్థానాలను ఆక్రమించిన స్త్రీవాద, దళితవాదాల వంటి ధోరణులలో ఏర్పడిన పరిమితుల మొత్తం సమాజం మీదనే పెద్ద ప్రభావాన్ని వేశాయి. అంతే కాకుండా ఆయా ధోరణులు పరిమితులకు గురవుతున్న కాలాన్ని పరిశీలించిన, సమాజంలోకి నూతనంగా చొచ్చుకొని వస్తున్న రాజకీయార్థిక విధానాల కారణంగా ఆ కాలానికి సామాజిక చరిత్రలో విభజన రేఖవంటి ప్రాధాన్యత కనిపిస్తుంది.

ఈ విభజన రేఖనాధారం చేసుకొనే సామాజిక శాస్త్రవేత్తలు అనేక సమకాలీన అంశాలను వివరించగలుగుతున్నారు.

సామాజిక వాస్తవికతను అర్థం చేసుకొని దానిని మార్చడానికి దోహద పడాల్సిన వివిధ ధోరణులు పరిమితులకు లోనుకావడం, మరోవైపు సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాల దాడి - మొత్తంగా 90వ దశకం చివరి నాటికి అవగాహనలోనూ వ్యక్తీకరణలోను అనేక సంక్లిష్టతలకు లోనయ్యింది. వ్యవసాయరంగంలోనూ, ఇతర చేతి వృత్తులలోను పెద్ద ఎత్తున సంక్షోభం మానవ హనన రూపంలో వెల్లడి కావడం మొదలయింది. మానవ సంబంధాలు తీవ్రంగా విధ్వంసం కావడం మొదలయ్యాయి. ఈ సామాజిక సంక్షోభంలో బుద్ధి జీవులు, సృజనకారులలో మనిషిని ఏకాకిగా భావించుకొనే నిరాశామయ, దుఃఖపూరిత, స్వీయహనన భావజాలంతో కూడిన వ్యక్తీకరణలు ముందుకు రావడం మొదలయింది. మరొక వైపు సమాజంతో నిమిత్తం లేని వ్యక్తివాదనలు, కెరియరిజం తిరిగి బలాన్ని సంతరించుకునేందుకు ప్రయత్నం చేయసాగాయి.

ఈ స్థితి కవిత్వంలో 90వ దశకం చివరినాటికి చోటు చేసుకుంది. దుఃఖాన్ని, నిరాశని ప్రేమిస్తూ దానిలోనే పడికొట్టుకొనే విధ్వంసకర ధోరణిని విమర్శకులు, కవులు, నిర్విమర్శగా ఆహ్వానించారు. ఈ ధోరణిని కొత్త వ్యక్తీకరణలుగా పిలుస్తూ మనిషి అస్తిత్వ వేదనకు సంబంధించిన కవిత్వంగా పైకెత్తారు. మనిషి అస్తిత్వాన్ని ఒంటరితనంలోనూ శిథిలమయిపోతున్న జీవితం మధ్య, నిరాశతోనూ, నిస్సత్తువుగా పలవరించడంలోనూ చూడగలగడం 60 ల తర్వాత కవిత్వ పరిణామంలో గొప్ప వెనుకడుగుగానే చూడాలి. దీనిని కొందరు సామాజిక వాస్తవికత పట్ల నిరసనగా సమర్థింపజూస్తున్నారు. కానీ దీనికి అంతలోతు ఉన్నట్లు కనిపించదు.

ఇదే సమయంలో మరొకవైపు అనుభూతి ప్రధాన కవిత్వం వేలం వెర్రిగా వ్యాపించడం ఎక్కువయింది. అప్పటి వరకు ఏ కొద్ది మందికో పరిమితమై ఉన్న ఈ కవిత్వం 'శుద్ధమైన కవిత్వం' పేరుతో విమర్శకులుగా పిలువబడుతున్న వారి మన్ననలను, ఆదరణను పొంది విస్తృతిలోకి వచ్చింది. విచిత్రమేమిటంటే అప్పటివరకు కవిత్వంలో సాహిత్య ప్రయోజనం గురించి సిద్ధాంత వ్యాసాలు వ్రాసిన ప్రముఖ విమర్శకులు 'ఏదైనా సరే అది కవిత్వమై ఉంటేచాలు' అనే ప్రాతిపదిక మీద ఈ కవిత్వాన్ని పైకెత్తారు. హైకూ వంటి కవితా నిర్మాణ పద్ధతి ప్రభావంతో ప్రముఖ కవులు ఉనికిలోకి తెచ్చిన చిన్న కవితా రూపాలు, విశేషంగా అనుకరణకు గురై తామరతంపరలా కవిత్వాన్ని పేజీలకొద్దీ నింపేందుకు కారణమయ్యాయి. ఏ రకమయిన స్పృహ లేకుండా కేవలం అనుకరణ దృష్టితో ఈ రకమైన కవిత్వాన్ని రాస్తున్నవాళ్లను పక్కన పెట్టినా కేవలం కవిత్వమైతే చాలు అనే అవగాహనతో ఈ కవిత్వాన్ని రాస్తున్నవాళ్లను, వారి సమర్థకులను నిర్విమర్శగా, మౌనంగా అంగీకరించడం సమాజంలో నెలకొని ఉన్న ఒక రకమైన స్తబ్దతకు చిహ్నంగా భావించాలి.

ఈ విచ్ఛిన్నకర ధోరణులకు మరొకవైపు పరిశీలిస్తే జీవితం గురించి గొప్ప ఆర్తితో, జీవితాన్ని పోరాడి గెలుచుకోవాలనే ఆకాంక్షతో వచ్చే కవిత్వం రాశిలోనూ, వాసిలోనూ తక్కువేమీ కాదు. అయితే దీనిలో కూడా అవాంఛనీయమైన, పరిహరించుకోవలసిన ధోరణులు అనేకం ఉన్నాయి. వీటిలో ప్రధానమైనది గతానికి మళ్లే వైఖరి. గతాన్ని కీర్తిస్తూ నోస్టాల్జియాలో మునిగిపోయే వైఖరి. సామ్రాజ్యవాద అనుకూల విధానాల కారణంగా గ్రామీణ సమాజంలో వస్తున్న విధ్వంసకర మార్పుల పట్ల కవుల స్పందన మిగిలిన అంశాల కంటే చాలా ఎక్కువగా ఉంది. వెనుకబడిన సమాజాల్లో సామ్రాజ్యవాద తాకిడికి గురి కావడానికి ఎక్కువ అవకాశమూ, విస్తృతీ గ్రామీణ సమాజం, అక్కడి సంబంధాలకే ఉంటుంది. కాబట్టి ఈ స్పందన వాంఛనీయమూ, సమర్థనీయమూ కూడా. కానీ ఈ సందర్భాలలో కవుల స్పందన గతమే ఘనమైంది అనే వైపుకు ప్రయాణించడం జాగ్రత్తగా గమనించాల్సిన అంశం. సామ్రాజ్యవాద వ్యతిరేకత సరైన తాత్విక అవగాహనను సంతరించుకోకపోవడం ఇక్కడి సమస్య.

సామ్రాజ్యవాద వ్యతిరేకత తాత్వికంగా సరయిన రూపాన్ని సంతరించుకోకపోవడానికి సామ్రాజ్యవాదం పట్ల ఉన్న అవగాహనలోని లోపమే ప్రధాన కారణం. సామ్రాజ్యవాదం పట్ల రూపమాత్రమైన వ్యతిరేకతను మాత్రమే కలిగి ఉన్న ఆచరణ, సమాజంలో బలంగా కొనసాగుతూ ఉండడం వల్ల సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించవలసిన చోట దానికి బదులుగా గతాన్ని కీర్తించే వైఖరి ముందుకొస్తున్నది. ఈ ప్రమాదాన్ని నివారించడం కోసం సరియైన విమర్శను ఎప్పటికప్పుడు తీసుకొని రావలసిన అవసరం ఉంది.

దీనితోపాటుగా మానవ సంబంధాలలో వస్తున్న చలనశీలతను పట్టుకోవడంలో సృజనకారులలో సరయిన అవగాహన కొరవడడం కూడా కవిత్వంలో కన్పిస్తూ ఉన్నది. గత పదేళ్ళ కాలంలో మానవ సంబంధాలలో నిత్యమూ వస్తూ ఉన్న మార్పులను కేవలం ముడిగాతప్ప, వాటిని చలనశీలంగా పట్టుకోగలడం - నాటికి గల భిన్నకోణాలను అవగాహన చేసుకోగలగడం, మొత్తం ఓ సమగ్ర రూపంగా వ్యక్తీకరించగలగడం కవులలో బాగా కొరవడింది. ఈ కారణంగా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే కవిత్వం రూపంలోనూ, వస్తువులోనూ మూసగా మారిపోయింది. అనేక మంది కవులు ఒకే కవితను రూపంలోనూ సారంలోనూ ఏ మాత్రం మార్పు లేకుండా రాస్తున్నారు. సాధారణంగా సాహిత్యంలో రూపం కంటే వస్తువు ఎక్కువ చలనశీలంగా ఉంటుంది. కానీ ఇప్పుడు వస్తువులో కూడా పెద్ద మార్పులేవీ లేకపోవడం వల్ల రూపంలో ఏ మార్పులు లేకుండా అయిపోయి ఒకే కవిత మరలా మరలా పాఠకుల ముందు ప్రత్యక్షం అవుతోంది. ఈ సమస్యను తాత్వికంగా పరిష్కరించుకోవడమెట్లో తెలియని అనేక మంది కవులు 'మానవ సంబంధాల కవిత్వం' పేరుతో ఆత్మాశ్రయ కవిత్వం రాసుకుంటూ తమని తాము మోసం చేసుకుంటున్నారు. మానవ సంబంధాల గురించి రాస్తున్నామనుకుంటూ తాత్వికంగా తమ బలహీనతను గడిచిపోయిన స్మృతుల మాటున, బోలుబారిన మూస వ్యక్తీకరణల మాటున దాచుకునేందుకు వృథా ప్రయత్నం చేస్తున్నారు. ఏ సమస్యనైతే తప్పించుకొనేందుకు కవులు ఈ దారి ఎంచుకున్నారో తిరిగి ఈ దారి అదే మూసలోకి దారితీయడం ఇక్కడి విషాదం.

కవిత్వంలో నెలకొని ఉన్న ఈ సంక్లిష్టమైన స్థితిని యథావిధిగా కొనసాగించడం అంటే ఉన్న స్థితిని మౌనంగా అంగీకరించడమే అవుతుంది. సమాజ చలనశీలతను దాని సమగ్రరూపం నుండి కాకుండా ముడిగా, యాంత్రికంగా చూడడమే అవుతుంది. కవిత్వాన్ని సున్నితమయిన, లోతయిన, గాఢమయిన, తాత్విక వ్యక్తీకరణగా ప్రేమించేవారికి ఇది ఓ పరీక్షా సమయం.

*

రచయితలకు విజ్ఞప్తి

అరుణతారకు రచనలు పంపండి.

కథలు, కవిత్వం, పుస్తక సమీక్షలు, విమర్శా వ్యాసాలు, సామాజిక రాజకీయ సిద్ధాంత వ్యాసాలు, యితర భాషల్లోనుండి తెలుగు పాఠకులకు అవసరమైన అనువాదాలు పంపించండి.

అరుణతారలో అచ్చవుతున్న రచనలపై ఉత్తరాలు రాయండి. రచనలను మెచ్చుకునే ఉత్తరాలకంటే గుణదోష చర్చలు చేయగల ఉత్తరాలు పత్రిక ప్రమాణాలు పెంచుతాయి. పాఠకుల విమర్శనాత్మక ఉత్తరాలు పత్రికా నిర్వహణకూ తోడ్పడుతాయి.

మీ రచనలు అరుణతార సాహిత్య, సిద్ధాంత స్థాయిని పెంచుతాయని నమ్ముతూ - - సంపాదకవర్గం

తెలుగు సాహిత్యంలో వైవిధ్యమైన పాత్రలు:

మధురవాణి

రాగో

☆ ముదునూరి భారతి

తెలుగు సాహిత్యంలో స్త్రీపాత్రలు ప్రధానంగా గురజాడ వారి 'కన్యాశుల్కం'లోని మధురవాణితో (1892)లో మొదలుపెట్టి ఎన్నోమలుపులు తిరిగి సాధన రచించిన 'రాగో' నవలలో రాగోకి (1993) చేరింది. ఇదే ఈ వ్యాసానికి ప్రధానాంశం.

'కన్యాశుల్కం'లో మధురవాణి.

బ్రిటీష్ వలసపాలనలో తెలుగు సమాజానికి ఆధునీకరణ క్రమం ఆరంభమైంది. ఈ సంధికాలంలో సమాజాన్ని విశ్లేషించటం, ఆ విశ్లేషణలో స్త్రీ సమస్యలను ప్రధానంగా తీసుకుని తన రచనా వ్యాసంగం ద్వారా తెలుగు ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే కార్యక్రమంలో ఒక 'కన్యాశుల్కం' నాటకం, అందులో ప్రధానపత్రాగా మధురవాణి సృష్టించబడ్డాయి. ఈ మధురవాణి తెలుగు సాహిత్యానికి గురజాడ అందించిన ఒక అద్భుతమైన పాత్ర. ఆధునీకరణ కార్యక్రమం ద్వారా సమాజంలో వ్యవస్థాపరమైన మార్పులు ప్రవేశపెట్టి, ఆధునిక దేశాలో లభ్యమౌతున్న జ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. వ్యవస్థీకృతమైన జ్ఞానాన్ని మన సమాజానికి అందుబాటులో తెచ్చే క్రమంలో స్థానికంగా ఉన్న సాంప్రదాయ వ్యవస్థలు ఆధునిక వ్యవస్థలుగా మారిపోయాయి. వీటిలో విద్య, న్యాయవ్యవస్థ ముఖ్యమైనవిగా చూడవచ్చును. జ్ఞానాన్ని అందచేయగల విద్య, దానికవుసరమైన మాధ్యమం కూడా మారిపోయాయి. పాఠశాలలో భాషాపరంగా ఇంగ్లీషు ప్రాధాన్యతని సంతరించుకోవటం, సైన్సు లెక్కలు ఆల్జీబ్రా జాగ్రఫీ లాంటి బోధనాంశాలను ప్రవేశపెట్టటం జరిగాయి. సమాజంలో ఆధునీకరణ కారణంగా వచ్చే మార్పుల వలన వచ్చే తగాదాలను పరిష్కరించే ఉద్దేశంతో న్యాయవ్యవస్థ కూడా మార్పుచెందింది. జ్ఞానం. వ్యవస్థీకరించబడి పుస్తకరూపంలో అందరికీ అందుబాటయింది. ఈ జ్ఞానం వలన సమస్య ఒకటి అయినా సమాధానాలు అనేక రూపాలలో ఉండవచ్చుననే గ్రహింపుతో వ్యక్తి ఆలోచనా పరిధి విస్తృతం అయింది. చైతన్యం పెరిగిన కారణంగా సమస్య పరిష్కారం అవుతుందన్న భావన కలిగింది. మన సమాజం ఆధునీకరణ చెందే క్రమంలో జ్ఞానం ఆధారంగా అంటే ఆలోచనలద్వారా, రూపంలో మార్పుల ద్వారా, ఇది సాధ్యమనా మౌలికంగా సారాంతరం చెందవలసిన అవసరం లేదనే భావజాలం ప్రబలంగా ఉండేది. ఇటువంటి నేపథ్యంలోనే గురజాడ 'కన్యాశుల్కం' రచించడం జరిగింది.

ఇంగ్లీషు భాషతో సాన్నిహిత్యం, దానికి తగిన పాండిత్యం, సమాజం మీద ప్రకృతి మీద అబ్బిన జ్ఞానం ఆధారంగా తనకనుభవంలో ఉన్న బాల్యవివాహాలు, కన్యాశుల్కం, వితంతు వేశ్యాసమస్యలు మొదలైన సామాజిక దురాచారాల మీద దృష్టికేంద్రీకరించి గురజాడ ఒక సర్వేచేసాడు. బహుశ సామాజిక అధ్యయనంలో ఒక పరిశీలకుడు ఒక సమస్యని గుర్తించి, అవగాహన చేసుకొనే ఉద్దేశ్యంతో చేసిన మొట్టమొదటి సర్వే అనుకోవచ్చును. ఇలా తయారైన పట్టీలో కన్యాశుల్కం తీసుకున్నట్లుగా ఒప్పుకున్నవి సగటున ఏడాదికి 344 వివాహాలు జరిగాయనీ, ఏడాది శిశువులు కూడా యిందులో ఉన్నారని, వారికి చెల్లించిన ధర రూ.350-400 అనీ రికార్డు చేసాడు. సమాజంలో ఈ సమస్యల తీవ్రత, స్పందించిన కారణంగా 'కన్యాశుల్కం' రూపుతీసుకుంది. ఈ నాటకంలో వివాహవ్యవస్థలో స్త్రీల దుస్థితి, బాల్యవివాహాలు వాటి పర్యవసనాల మీద గురజాడ వెలుగు సారించాడు. వ్యవస్థీకృతమైన ఆధునిక జ్ఞానాన్ని పామరులైన ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలనే సదుద్దేశ్యంతో 'కన్యాశుల్కం' ఇతివృత్తానికి ఒక ప్రదర్శన యోగ్యమైన నాటకరూపాన్ని ఎంచుకోవటం, సంభాషణలకు పాత్రోచితమైన వాడుక భాషను ఉపయోగించటం చేసాడు. ఈ నాటకం ద్వారా సమాజంలో వ్యక్తుల ఆలోచనల పరిధి విస్తృతం అయి నూతన చైతన్యంతో సమాజంలో సమస్యలకు ఒక పరిష్కారం దొరకగలదని ఆశించాడు. ఇలా చూచినపుడు నాటకం ఆలోచన నుండి కొత్త ఆలోచనకు చేసిన ప్రయాణంగా చూడవచ్చును.

'కన్యాశుల్కం' నాటకం అగ్నిహోత్రావధానుల రెండవ కూతురు సుబ్బి పెండ్లితో మొదలయి, మొదటి కూతురు బుచ్చమ్మని పూనాలో విడోస్‌హోమ్‌కి పంపమనే సలహాతో ముగుస్తుంది. ఈ నాటకంలో ప్రధాన సమస్య బ్రాహ్మణ కుటుంబాలలో ఆనవాయితీగా వస్తున్న బాల్యవివాహాలు, కన్యాశుల్కం లాంటి దురాచారాలతో ముడిపడి ఉన్న సమస్యలు. అతి చిన్న వయస్సులోనే ఆడపిల్లను వయస్సుమీరిన ముసలివాడికిచ్చి పెండ్లి చేయటం, దీనికి ప్రతిగా డబ్బు రూపంలో కన్యాశుల్కం తీసుకోవటం అనేవి ఆడపిల్లను బజారులో అమ్మకానికి పెట్టినట్లు అయింది. వరుని యోగ్యతలు, గుణగణాలతో నిమిత్తం లేకుండా ఎవరు ఎక్కువ డబ్బు చెల్లిస్తే వారితోనే పెండ్లి, వారింట్లోనే జీతం, బత్తెంలేని నౌకరులా చాకిరి చేయవలసి వస్తుంది. వీరి వయస్సులో అంతరం చాలా ఎక్కువగా ఉండటంతో భర్త చనిపోవడం, (కొన్ని సమయాలలో తాళి కట్టే సమయంలోనే చనిపోవటం) చాకిరీ చేస్తూ నికృష్ట జీవితం గడపవలసి వస్తుంది. పెద్ద కూతురు బుచ్చమ్మని రూ.1500 కన్యాశుల్కం తీసుకుని 83 సం.ల ముదుసలికి, డబ్బున్నవాడు చావుకి దగ్గరపడ్డవానికి, ఇచ్చి పెండ్లి చేయబూనితే పెండ్లిలోనే అతడు చనిపోయాడు. వితంతువైన బుచ్చమ్మ తండ్రి ఇంటికి చేరి అన్ని పనులకు తానే అయి నిస్సారమైన జీవితం గడుపుతుంది. అదే పద్ధతిలో రూ.1800 కన్యాశుల్కం కుదుర్చుకొని లబ్ధావధానులనే ముసలి వానితో పెండ్లికి అగ్నిహోత్రావధానులు తాంబూలాలు పుచ్చుకొని వస్తాడు. ఈ పెండ్లిని తప్పించటానికి వివిధ పాత్రలు చేసే ప్రయత్నాలతో కథ ముందుకు నడుస్తుంది. వెంకమ్మ భర్తను ఎదిరించి బావిలో దూకడం, గిరీశం ఆమెను రక్షించడం, వెంకమ్మ కరటక శాస్త్రుల సహాయం కోరటం, బుచ్చమ్మ తనవంతుగా గిరీశంతో లేచిపోవడానికి అంగీకరించి అతనితో వెళ్ళిపోవటం, కన్యాశుల్కం కోసం జరిగే బేరసారాలు, మధురవాణి చతురత, శిష్యుడికి ఆడవేషం వేసి లుబ్ధావధానితో పెండ్లి జరిపించటం, శిష్యుడు తరువాత వేషం విప్పేసి పారిపోవటం, అగ్నిహోత్రావధానులు కోర్టుని ఆశ్రయించటం ఇలా నాటకం ఎన్నో మలుపులు తిరుగుతుంది. చివరిగా సౌజన్యారావు పంతులు పూనుకుని మధురవాణి సహాయంతో సమస్యకి ఒక పరిష్కారం సూచించడంతో నాటకం ముగుస్తుంది. సుబ్బిపెండ్లితో మొదలయిన నాటకం సుబ్బిపెండ్లి ఆగిపోవటం, బుచ్చమ్మని పూనాలో విడోస్‌హోమ్‌కి పంపవచ్చుననే పరిష్కారంతో ముగుస్తుంది.

'కన్యాశుల్కం' నాటకానికి సుబ్బికి జరుగబోయే కన్యాశుల్క బాల్య వివాహం కీలక సమస్య అయితే దీనిని తప్పించగల చాతుర్యం, తెలివితేటలు ఉన్న ఒకేవొక వ్యక్తి మధురవాణి. ఈ సమస్యకి పరిష్కార మార్గాలు చూపించే క్రమంలో ఈమె ఒక మహోన్నత వ్యక్తిగా రూపొంది నాటకానికి కీలక పాత్ర అయింది. వెంకమ్మ సుబ్బి పెండ్లి విషయంలో భర్తను ఎదిరించింది, బెదిరించింది. అయినా ఆయన తన పట్టుని వదలకపోవడంతో కరటక శాస్త్రితో గుంభనగా మంతనాలు జరిపి పెండ్లి తప్పించే ఉపాయం చూడమని బ్రతిమాలింది. కరటక శాస్త్రి మధురవాణి సహాయం కోరటంతో శిష్యుడిని స్త్రీవేషం వేసి లుబ్ధావధానులుతో పెండ్లి జరిపించి వేయమని ఈమె సలహా ఇచ్చింది. రామప్పంతులు సహాయంతో ఫోర్జరీ ఉత్తరం వ్రాయించి లుబ్ధావధాన్లుకే సుబ్బి సంబంధం ఇష్టం లేదనిపించటం, కన్యాశుల్కం తక్కువగా ఉన్న నెపంతో శిష్యుడిని లుబ్ధావధాన్లుకిచ్చి చవకలో పెండ్లి తతంగం జరిపించటం, పెండ్లి చేసుకొని పారిపోయి వచ్చిన మహేశాన్ని తప్పించే సులుమార్గం చూపించటంలాంటి కార్యక్రమాలన్నీ ఒక క్రమంలో జరిగి సుబ్బి పెళ్ళి తప్పిపోతుంది. ఇంకొకవైపు సుబ్బిపెళ్ళి తప్పించడానికి బదులుగా గిరీశంని పెండ్లి చేసుకోవడానికి బుచ్చమ్మ ఒప్పుకొని గిరీశంతో వెళ్ళిపోయింది. గిరీశం బారి నుండి రక్షించే ఉద్దేశ్యంతో సౌజన్యారావు దగ్గర గిరీశం నిజస్వరూపం బట్టబయలు

చేసింది. పూనాలో విడోస్‌హోమ్‌కి పంపమని, ఆమె చదువుకొని ప్రాజ్ఞురాలై తన ఇష్టం వచ్చిన వారిని చేసుకుంటారు. లేకుంటే మానుకుంటారా అనే పరిష్కార మార్గాన్ని సౌజన్యారావు ఇచ్చేటట్లు చేసింది. ఇంకొక ప్రక్క కరటక శాస్త్రిమీద మోపబడిన హత్యానేర రహస్యాన్ని కూడా సౌజన్యారావుకి చెప్పి అతడిని రక్షించింది. మధురవాణి ఇచ్చిన ఇంకొక పరిష్కారం వితంతువైన మీనాక్షిని తండ్రి ఇంటి నుండి తరిమివేస్తే మధురవాణి ఆదరించి రామప్పంతుల్ని మీనాక్షితో పెండ్లికి ఒప్పిస్తుంది.

నాటకంలో మధురవాణి తెలివితేటలతో సుబ్బి పెండ్లి తప్పిపోయింది, బాల్యవివాహానికి పర్యవసానమైన వితంతు సమస్య (బుచ్చమ్మ సమస్య)కి సమాధానం దొరికింది. కాని సుబ్బి వివాహ సమస్యకి మాత్రం సమాధానం దొరకని కారణంగా అది నాటకంలో తెరమరుగయ్యిపోయింది.

'రాగో'లో రాగో :

'నల్ల దొరల' హయాం వచ్చిన తరువాత, వారు ఎంచుకొన్న అభివృద్ధి మార్గం, అందులో భాగంగా ఎంచుకున్న పథకాలు సమాజంలో తాము అనుకున్న మార్పులు తీసుకుని రాలేని కారణంగా సమాజం పూర్తిగా మారిపోవాలి, అంటే సమాజం సమూలంగా సారాంతరం చెందాలి అనే భావన బలంగా రూపుతీసుకుంది. ఈ ఉద్దేశంతోనే ఎం.ఎల్.పార్టీలు ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గం అన్వేషించే క్రమంలో అనేక కార్యక్రమాలు ఆచరణలో చేపట్టాయి. ఒక దళం నేతృత్వంలో వీటిని అమలు చేయటం, ప్రజలను సమీకరించి చైతన్యవంతుల్ని చేసే పని మొదలు పెట్టింది. ఆ కొత్త ఆచరణ క్రమంలో దళానికి ఎదురైన అనుభవాలను ఒక నవలా రూపంలో మన ముందుకు తెస్తుంది సాధన వ్రాసిన 'రాగో' నవల. ఆదివాసీ సమాజంలో మాడియా గోండు తెగకి చెందిన రాగో అనే యువతి సాంప్రదాయాలను ఎదిరించి తన కిష్టంలేని పెండ్లిని తప్పించుకునేందుకు ఇంటి నుండి పారిపోయి, అనుకోకుండా దళంలో కలిసిపోవటం, దానిలో భాగమయిపోయి ఆ భావజాల ప్రభావంతో చైతన్య వంతురాలై వివాహవ్యవస్థ దానంతటదే మారిపోదనీ, అది మారటానికి సమాజసారం మారవలసిన అవసరం ఉందని గ్రహించి ఆ కార్యక్రమాలలో భాగమవుతుంది. రాగో జైనిగా మారిపోయి డిప్యూటి కమాండరుగా దళంలో కొత్త బాధ్యతలను చేపట్టడంతో నవల ముగుస్తుంది.

'రాగో' నవలలో ఆదివాసీ సమాజంలో పురుషాధిక్య ప్రభావం వలన స్త్రీలకు ఎదురయ్యే సమస్యలు, ముఖ్యంగా వివాహ వ్యవస్థ, దానితో ముడిపడి ఉన్న జీవసారె (కన్యాశుల్కం) లాంటి సామాజిక సంబంధాలను వెలుగులోకి తీసుకొని వస్తుంది. వివాహవ్యవస్థలో ముఖ్యపాత్ర స్త్రీకి బదులుగా ఇవ్వబడే జీవసారె వహిస్తుంది. ఒక యువకుడు తను పెండ్లి చేసుకోగోరే యువతి తండ్రికి జీవసారె చెల్లించిన తరువాతే దీనికి బదులుగా ఆ యువతిని పెండ్లి చేసుకోవడానికి అనుమతి లభిస్తుంది. ఇటువంటి సమాజంలో కూతురు చాలా చిన్న వయస్సులో ఉన్నప్పుడే మేనరికపు పెండ్లి నిశ్చయించటం జరిగిపోతుంది. ఈ మేనరికపు పెండ్లి చేయడంలో ముఖ్య ఉద్దేశ్యము ఆ యువతి తండ్రి తన వివాహ సమయంలో తను చెల్లించిన జీవసారెను తన కూతురు పెండ్లి ద్వారా తిరిగి సంపాదించటమే. ఈ సమాజంలో మరొక విధమైన వివాహము 'లామ్' పద్ధతి కూడా ప్రబలంగానే ఉంటుంది. ఈ పద్ధతిలో తండ్రికి పొలం పనులలోనూ, ఇతర పనులలోనూ మరొక మనిషి సహాయం తక్కువైనపుడు పెండ్లి కావలసి జీవసారె ఇచ్చుకోలేని యువకుడిని ఇల్లరికం తెచ్చుకుని, ఆరు సంవత్సరాలు వెట్టిచాకిరి చేసిన తరువాతే తనకూతురుని ఇచ్చి పెండ్లి చేస్తానని ఒప్పందం చేసుకుంటాడు. ఇది మొదటి పద్ధతిలో ఉండే జీవసారెకి ప్రత్యామ్నాయం అవుతుంది. వివాహవ్యవస్థకి చెందిన ఈ రెండు సాంప్రదాయాలు తండ్రి తన అవసరాలను తీర్చుకునే హక్కుగానో, కూతురు తప్పనిసరిగా తండ్రి ఆదేశానుసారం ఖాయిదాగానో - మనసుకి నచ్చకపోయినా సరే పెండ్లి చేసుకోవలసిన ఖాయిదాగానో ఆదివాసీ సాంప్రదాయాలకే పరిమితమైతే తగువు ఉండదు. కాని ఇవి సమాజపు ఆర్థిక సంబంధాలతోనూ, ఉత్పత్తి సంబంధాలతోనూ పెనవేసుకొని ఉంటాయి. ఈ కారణంగా ఎవరైనా ఈ సాంప్రదాయాలను వ్యతిరేకించి వివాహవ్యవస్థలో మార్పులకు ప్రయత్నిస్తే సమాజంలో ఉత్పత్తి ఆస్తి సంబంధాల మధ్య సమతుల్యం పోతుంది. అందుచేత వివాహవ్యవస్థని స్థిరంగా ఉంచటానికి స్త్రీకి మనస్సుకి నచ్చిన భర్తను ఎంచుకునే స్వేచ్ఛనివ్వకపోవడం, తండ్రి మాటే పై చేయిగా ఉండటం, అంతటితో ఆగక పెండ్లి అయిన స్త్రీని అర్ధనగ్నంగా వికృతంగా చేయడం, రీతి రివాజులల పేరిట స్త్రీ జీవనశైలినే అదుపులో ఉంచటం జరుగుతుంది. ఒక వేళ స్త్రీ ఈ వివాహపు రీతి రివాజులను ఎదిరించే ప్రయత్నం చేస్తే ఆ స్త్రీని సామూహికంగా అందరిముందు కొట్టి, తిట్టి, తన్ని అయినా సరే కట్టడిలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతుంది. ఈ రెండు పద్ధతులను ఎదిరించి తన మనస్సుకి నచ్చినవాడిని చేసుకొనే అవకాశం కోసం నచ్చిన వాని 'ఇల్లు చొచ్చడం' ఇద్దరూ ఎవరికీ అందకుండా ఊరి పొలిమేరలు దాటి వెళ్ళిపోయి, గొడవ సద్దుమణిగిన తరువాత తిరిగి వచ్చి గ్రామపెద్దల సహకారంతో ఎంతో కొంత జీవసారె చెల్లించడం మరొక పద్ధతి. ఏ కారణంగానయినా తన మనస్సుకు నచ్చని భర్తను వదలి మరొక సంబంధం వెతుక్కునే స్త్రీని 'కేర్ది'గా ముద్రవేసి ఎన్నో అవమానాలకు గురిచేయడం కూడా ఉంది.

నవలకి 'రాగో' అని పేరు పెట్టడం ద్వారా రచయిత నవలని రాగో అనే యువతి కేంద్రంగా చూడాలని పాఠకులకు సలహా ఇచ్చాడు. రాగో ఒక ఆదివాసీ సమాజాలలో మాడియాగోండు తెగకి చెందిన యుక్త వయస్కురాలైన స్త్రీ. ఆమె తండ్రి రాగో చిన్నప్పుడే నిశ్చయించిన మేనరికపు పెండ్లి జరిపేందుకు ప్రయత్నాలు మొదలు పెడతాడు. రాగో ఈ మేనరికపు పెండ్లి తప్పించుకొని ఇంటి నుండి పారిపోయి తన మనస్సుకి నచ్చిన, తన ఈడైన, చురుకైన నాన్సు అనే వ్యక్తి ఇల్లు చేరుతుంది. నాన్సు ఈమెతో సహకరించకపోవటం, తండ్రి - మిగతా పెద్దలు వెతికి పట్టుకొని తన్ని కొట్టి ఇంటికి తీసుకొని వెడతారు. రాగో మళ్ళీ తిరిగి ఇంట్లో నుండి పారిపోయి మరో ఊరిలో ఉన్న తన చిన్ననాటి స్నేహితురాలు మైసి ఇంటికి వెడుతుంది. అక్కడ అడవిలో తిరుగుతున్నప్పుడు తిరిగి మేనమామ చేతిలో చిక్కిపోతుంది. మళ్ళీ పెండ్లి ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఇంకోసారి పారిపోతుంది. ఈ సారి అడవిలో జిల్లా బందు చేసే సంగంతో తనకు తెలియకుండానే, యాదృచ్ఛికంగా అందులో కలిసిపోయి వాళ్ళలో భాగమైపోయింది. సంగం అప్పచెప్పిన పనులన్నీ సమర్థవంతంగా చేసి దాని మెప్పుపొందింది. ఆ కారణంగా సమాజం సమూలంగా మారవలసిన అవసరాన్ని గ్రహించి తగిన కార్యక్రమాలు చేపడుతున్న దళంలో సభ్యత్వం పొందంది. దళంలో క్రమంగా డ్రస్సువేసుకోవటం, చదువు నేర్చుకోవటం, తుపాకి కొట్టడం, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనటం, సెంట్రీగా ఉండి శత్రువుదాడి తిప్పికొట్టడం వంటి అనేక విషయాలతో శక్తిసామర్థ్యాలు పొందిన రాగో చైతన్యవంతురాలైన జైనిగా మారిపోయింది. అంతేకాకుండా ఒక సందర్భంలో మాడియా గోండు స్త్రీల క్షోభను వారి మనస్సులకు హత్తుకునేటట్లు వివరించింది. ఆమె చెప్పినటువంటి ఆదివాసీ సమాజంలో పనులన్నిటికి స్త్రీ కేంద్రంగా ఉంటుంది. పొలం పనులలో పురుషునికంటే ఎక్కువ శ్రమ చేస్తూనే, ఇంటికి కావలసిన కట్టెలు, ఆకులు, అలమలు, కాయలు, గడ్డలు జమచేయటం వంటి పనులతో తీరిక లేని స్త్రీ శ్రమ చుట్టూ ఆదివాసీ సమాజం ఆధారపడుతుంది. అందుకే ఇంటికాడ ఆడదాని ఆసరా లేకుంటే ఆ ఇల్లెదుగదు అనే నానుడి కూడా ప్రబలంగా ఉంటుంది. సమాజంలో స్త్రీ శ్రమకి విలువ ఉన్న కారణంగా స్త్రీపై రీతి, రివాజుల పేర తన అధికారం చూపుతుంది. మరొక ముఖ్యవిషయం - పనులన్నింటిలో స్త్రీ భాగం ఉన్నా కూడా ఫలితాన్ని అనుభవించే సమయం వచ్చేసరికి కట్టుబాట్ల మిషతో స్త్రీని దూరంగా ఉంచుతుంది. అక్కడ ఉన్న ప్రతి స్త్రీకి తన జీవితాన్నే తమ ముందు ఉంచిందన్న భావన కలగటం, అవి మనస్సుకి హత్తుకునేటట్లుగా రాగో వాటిని వివరించటంతో వారిని కూడా చైతన్యవంతులుగా మార్చి సంగం పెట్టుకునేటట్లు చేస్తుంది. రాగో చైతన్యానికి కొలమానం తనకు నచ్చని 'లామ్' వివాహ ఖాయిదాని తప్పించుకోవటానికి ఇంటి నుండి పారిపోయి దళం సహకారంతో సామాజిక సంబంధాలను అవగాహన చేసుకుని, గ్రామ ప్రజల తగాదాలలో ఒకటయిన ఈ లామ్ పద్ధతి

మీదే తీర్పునిచ్చే స్థాయికి ఎదిగింది. గ్రామంలో బూది అనే యువతి తండ్రి కుదిర్చిన లామడేని రెండు సంవత్సరాల తర్వాత తనకు ఇష్టం లేదనే కారణంగా నిరాకరించి దళం ముందుకు పంచాయితి తెస్తుంది. తండ్రి వాదం ప్రకారం, తమ తెగలో ఉండే లామ్ పద్ధతి రివాజు ప్రకారం, పోరీ అవునన్నాకే పెట్టుకున్నానని, ఇది కాదంటే చేతికందిన కొడుకులు లేకపోవటంతో నాగతేంటి అని ప్రశ్నించి ఈ రివాజు న్యాయమైనదే అంటాడు. లామిడేవాదం ప్రకారం గొడ్డుచాకిరి చేసానని ఇప్పుడు రానంటే నాగతేమిటి? బూది కాకపోతే బూది చెల్లెలయినా మంచిదేనని రివాజు న్యాయమైనదేనని అంటాడు. కాని బూది మాత్రం లామ్ పద్ధతిలో తనకు అన్యాయం జరిగిపోతుందని, బ్రతికినన్నాళ్ళు ఇష్టంలేని వాడితో కాపురం చెయ్యటానికి నిరాకరించి రివాజు యొక్క నిబద్ధతనే ప్రశ్నించింది.

రాగో తీర్పు చెబుతూ బిడ్డల్ని ఆశ చూపే ఈ పద్ధతి మంచిది కాదని దానిని రద్దు చేయాలని ఈ పద్ధతికి వ్యతిరేకంగా తీర్పునిచ్చింది. లామిడే చేసిన ఈ రెండేళ్ళ చాకిరికి తండ్రి జీతం కట్టి పైసలో, గింజలో ఇవ్వాలి తప్ప బిడ్డల్ని ఆశచూపే పద్ధతి రద్దుకావాలని చెప్పింది. సమస్యకుండే సారాన్ని మార్చే ప్రయత్నం చేసింది.

తులనాత్మక పరిశీలన :

'కన్యాశుల్కం' నాటకం, 'రాగో' నవల, ఈ రెండూ కూడా ఒకే సమస్యని - వివాహ వ్యవస్థ దాని పర్యవసానాలుగా స్త్రీలు సమాజంలో ఎదుర్కొనే సమస్యలు - పరిష్కార మార్గాలు వెతికే ప్రయత్నాలు చేసాయి. ఇవి రెండూ ఒకే సమస్య మీద దృష్టి సారించినా కూడా, కథాగమనానికి ఇవి రెండు వేర్వేరు ప్రక్రియలను చేపట్టాయి. 'కన్యాశుల్కం' నాటకంలో బ్రాహ్మణ కుటుంబాలలో కన్యాశుల్కంతో పెనవేసుకున్న బాల్య వివాహాలు, దాని పర్యవసానంగా వచ్చే విపరీత పరిణామాలు ప్రధాన సమస్యగా ఎంచుకొని మధురవాణి పాత్రద్వారా పరిష్కార మార్గాలు ప్రతిపాదించబడ్డాయి. సుబ్బిపెళ్ళి ఆపించటం, బుచ్చమ్మని పూనాలో విడోస్‌హోమ్‌కి పంపి ప్రాజ్ఞురాలు అయి తన భర్తను ఎంచుకోమనటం, మీనాక్షిని పునర్వివాహం చేసుకోమని రామప్పంతుల్ని బలవంతపెట్టడంలాంటి విభిన్న పరిష్కారమార్గాలు సూచించింది. ఈ క్రమంలో సుబ్బిపెళ్ళి తప్పిపోయింది కాని బాల్యవివాహాలకి ఒక పరిష్కారం దొరకలేదు. పైగా బాల్యవివాహాలు, కన్యాశుల్కం కూడదని చెప్పిన సౌజన్యరావుకే వెర్రి కాబోలునని అగ్నిహోత్రావధానులు అనుకోవడంతో భవిష్యత్‌లో కూడా ఇదే సమస్య తలెత్తగలదని అనిపిస్తుంది. నాటకంలో మధురవాణి ప్రమేయంతో బాల్యవివాహాల పర్యవసానాలైన వితంతుసమస్యకి పరిష్కారం లభ్యమైంది కాని ప్రధాన సమస్య అయిన బాల్య వివాహాలకు సమాధానం దొరకలేదు. అంతేకాకుండా సుబ్బిపెళ్ళి తప్పించటానికి ప్రతిపాత్ర వేసే ఎత్తులు వీటి అమలులో ఎటువంటి అడ్డంకులు వచ్చినా కూడా మధురవాణి వాటిని తప్పించుకునే మార్గాలు చూపింది. కారణంగా నాటకంలో మధురవాణి ఒక అపూర్వమైన, అనన్యమైన, అద్వితీయమైన... పాత్రగా నిలిచిపోయింది. 'రాగో' నవలని పరిశీలిస్తే, దానితో ఆదివాసీ జీవితాలలో జీవసారెతో కూడిన వివాహాలు, దాని పర్యవసానంగా మనస్సుకి నచ్చని భర్తతో కాపురం ప్రధానంగా సమస్యగా ఎంచుకొని రాగో కేంద్రంగా కథ నడిచింది. 'లామ్' వివాహ పద్ధతి నుండి తప్పించుకునే కోరికతో ఇంటి నుండి పారిపోయి అనుకోకుండా దళంలో కలిసి పోయి వారి కార్యక్రమాల ద్వారా చైతన్యవంతురాలైంది. ఆదివాసీ యువతులైన బూదిని ఆమె చెల్లెలుని లామా వివాహం నుండి తప్పించటమే కాక ఈ పద్ధతినే రద్దుచేసే ఉద్దేశ్యంతో ఒక ప్రత్యామ్నాయ మార్గంగా లామడీకి కూలీ డబ్బులు కట్టి ఇచ్చేయాలని, స్త్రీ తన మనస్సుకి నచ్చని వివాహానికి బలవంత పెట్టకూడదనే ప్రతిపాదనలు చేసింది. అందరి సమ్మతి సంపాదించింది. ఈ క్రమంలో లామ్ పద్ధతికి సమాజంలో ఉండే మూలాలను వెతికే ప్రయత్నం చేసింది. కొత్త ఆచరణ ద్వారానే సమస్యకి పరిష్కారం చూడాలని సూచించింది. తన చైతన్యంతో ఆచరణని మార్చుకోవలసిన అవసరాన్ని ఎత్తిచూపింది. వారి చైతన్యాన్ని కూడా పెంచింది. ఈ క్రమంలో ఆదివాసీ సమాజంలో ఉండే రాగోలకు ఆదర్శవంతమై వారికి స్ఫూర్తినిచ్చింది సమాజ గమనానికి తనవంతు బాధ్యత నెరవేర్చింది.

'కన్యాశుల్కం' రచనాకాలంలో సమాజంలో ఆధునిక విజ్ఞానం చదువులద్వారా సమాజాన్ని మార్చే శక్తి కలిగిఉన్నదనే భావజాలం ఉండేది. కొత్త ఆలోచనల ద్వారా సమాజంలో సమస్యలకి పరిష్కారం దొరకగలదనే నమ్మకం ఉండేది. ఈ చట్రంలోనే ఆలోచన ప్రధానంగా నాటకం ముందుకు నడిచింది. సమస్యకి అన్ని కోణాల నుండి పరిష్కార మార్గాలు తన ఆలోచనా పటిమతో సూచించిన మధురవాణి లోకాతీతమైన పాత్రగా భావించబడింది. ఒక వ్యక్తికి ఆచరణ ద్వారా కాక ఆలోచనల ద్వారా కొత్త ఆచరణ సాధ్యమనీ, లేక కొత్త ఆలోచనలు వచ్చి కూడా అవి ఆచరణ యోగ్యం కాకపోయినా కూడా ఆ వ్యక్తిని సజీవవ్యక్తిగా ఊహించలేము. అందుచేత మధురవాణిని లోకాతీకవ్యక్తిగా భావించగలరేమో కాని సజీవపాత్రగా గుర్తించే అవకాశముండదు. వ్యక్తి ఆలోచనలకు సమాజ సంచలనానికి పరస్పర సంబంధం ఉండక వ్యక్తి ఆలోచనలో మార్పు ఉండదు. ఆలోచన ద్వారానే సమాజం మారగలదు అనే భావజాలం గురజాడకి పరిధులు ఏర్పరిచితే, ఈ పరిధుల్ని దాటే ఒక సాధనంగా గురజాడ ఒక మధురవాణిని మలుచుకొన్నాడు. ముచ్చటపడ్డాడు. ఇంక 'రాగో' రచనా కాలంలో సమాజం సారాంతరం అయితే కాని సమస్యలకు పరిష్కారం దొరకదనే భావజాలం సమజల్లంలో అంతర్లీనంగా ఉన్న సమయం. తమ ఆచరణలో వచ్చే సమస్యలను ఆధునిక జ్ఞానం ద్వారా వచ్చే కొత్త ఆలోచనలు పరిష్కారం చూపలేవని, తమ సమస్యలకు మూలం తమ వ్యవస్థలోనే ఉందనే జ్ఞానం, తమ ఆచరణలో మార్పుల ద్వారానే సమాధానం సాధ్యమనే భావనతో ఆచరణ కేంద్రంగా 'రాగో' నవల ముందుకు సాగుతుంది. తమ ఆచరణద్వారా లోపాలు గ్రహించి ఆలోచనలు మార్చుకొని, వీటిని ఆచరణలో పెట్టగల వ్యక్తిని సజీవవ్యక్తిగా గుర్తించవచ్చును. వ్యక్తికి ఆచరణ - కొత్త ఆలోచన - కొత్త ఆచరణ అనే క్రమం ఉన్నపుడు వ్యక్తి చలనానికి సమాజ చలనానికి సమన్వయం ఉంటుంది. రాగో ఈ క్రమంలో తను చైతన్యవంతురాలవటమేకాక మిగిలిన స్త్రీల చైతన్యం పెంచే ప్రయత్నం చేసింది. ఈ చట్రంలో చూస్తే రాగో ఒక సజీవ వ్యక్తిగా మనకు కన్పిస్తుంది.

తాత్త్విక నేపథ్యంతో చూస్తే, కన్యాశుల్కం నాటకంలో ప్రధానసమస్య పెండ్లి సమస్య అనడంలో స్త్రీలకు మిగతా సమస్యలు ఉన్నా అవి ప్రధానంకావు అనే ఊహ కలుగుతుంది. ఈ వివాహ సమస్యకి పరిష్కారమార్గాలు అనేక రూపాల్లో (ఆధునిక సమాజంలో ఉండవచ్చును, మన సమాజంలోనే మిగతా వర్గాల దగ్గర ఉండవచ్చును) ఇప్పటికే ఉన్నాయని నమ్మకం కూడా ఉంటుంది. ఉదాహరణకు ఇంగ్లీషు సమాజంలో రెండోపెళ్ళి, కాపుకులంలో మారు మనువులుగా గుర్తించవచ్చును. ఈ రూపాల మీద సమాజానికి జ్ఞానం అందివ్వగలిగితే (చదువులు ఆ పని చేస్తాయని) ఈ జ్ఞానం ఆధారంగా సమస్యకి రూపం మారిపోతుందని అనుకోవచ్చును. అప్పుడు సమస్యకి ఉండే పరిష్కారం రూపాంతరానికి చెందినదని, దీనినే Epistomological Problem అని అనుకోవచ్చును. అందుచేత నాటకంలో వివాహ వ్యవస్థలో ఉండే అనేక రూపాలను చూపిస్తూ, చదువుకొని ప్రాజ్ఞులైతే సమస్యకి పరిష్కారం దొరకగలదని సూచించారు. పెండ్లి సమస్యని సమాజంలో ఉండే మిగతా సమస్యలతో సంబంధం లేని స్వతంత్రప్రతిపత్తిగల సమస్యగా చూపించారు. ప్రజ్ఞకి ఆచరణకి సంబంధం చూపలేదు. 'రాగో' నవలలో రాగో సమస్యకి - దళం సాన్నిహిత్యంలో - సమాజం సమూలంగా మారవలసిన అవసరాన్ని గుర్తించినందున ఇది సారాంతర సమస్య (Ontological Problem)గా పేర్కొనవచ్చును. సమాజం మారే క్రమంతో నిమగ్నమవడంతో రాగోకి పెండ్లి సమస్య అప్రధానమైపోయింది. మిగతా సమస్యలకు దీనికి సంబంధం ఉందని గుర్తించి సారం మారే ఆచరణలో భాగమైంది. ఈ చైతన్యాన్ని విజ్ఞతగా చూడవచ్చును. వంద సంవత్సరాల కాలం గడిచేసరికి ఒక సమస్య యొక్క స్వరూప, స్వభావాలు మారిపోగలవనీ, ఒక సాహిత్యప్రక్రియ ద్వారా ఇవి సమాజం ముందుకు వస్తాయని చెప్పుకోవచ్చును. *

3-A

☆ కాశీం

రండి! ఇండియా తమకు శిరస్సు వంచింది

జూకంటి జగన్నాథం సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ వ్యంగ్యంగా రాసిన మాట ఇది. తెలుగు సమాజం చైతన్యశీలమైంది. ప్రపంచ ప్రజలకు వ్యతిరేకమైన ఏ సంఘటన జరిగిన వెంటనే స్పందించే గుణం ఈ మట్టిలో ఉంది. ఈ మట్టి భాషను అలవాటు చేసుకున్న తెలుగు కవులకు ఈ లక్షణం ఉంది. అందుకే జూకంటి జగన్నాథం లాంటి కవులు ప్రపంచీకరణ ప్రారంభం కాగానే ఇది ప్రజలకు మేలు చేసే ప్రపంచీకరణ కాదు, సామ్రాజ్యవాద దేశాలకు వర్తమాన దేశాలు ఎర్రతివాచీ పర్చి ఆహ్వానం పలికే ప్రపంచీకరణగా భావించి కవిత్వం రాశారు. ప్రపంచంలో అతి పెద్ద మార్కెట్ కలిగిన భారత పాలకవర్గాలు అమెరికన్ సామ్రాజ్యవాదానికి శిరస్సు వంచి ఆహ్వానం పలికారు. ఎనభై దశకంలోనే ప్రపంచీకరణకు పునాది పడినప్పటికి దాని నగ్న స్వరూపం తొంభైవ దశకంలో స్పష్టంగా బయటపడింది. నూతన ఆర్థిక విధానాలతో అది మన ఇంటిలోకి, జీవితాలలోకి వచ్చింది. ఈ విషయాన్ని చెరబండ రాజు 'ప్రపంచ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన' పద్ధతిని ఎప్పుడో చెప్పి ఉన్నాడు. అయితే 1995 తరువాత ప్రపంచీకరణకు వ్యతిరేకంగావచ్చిన కవిత్వం రాశిలో వాసిలో చెప్పుకోదగినదిగా ఉంది. దాని మంచి చెడ్డలు పరిశీలించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

'సముద్రాల ఆవతల మట్టిలో బయల్దేరి
సముద్రాల మట్టిలో సారంగాలు చేసుకుంటూ
కొండ చిలవల వేళ్లతో
మణికట్టు లేని మట్టి చెయ్యి
ఇక్కడి మట్టి నిండా
నిండిపోవటానికి వస్తుంది" (అద్దెపల్లి, గ్లోబల్ ఖడ్గం, పుట4)

కొండచిలవను సామ్రాజ్యవాదానికి ప్రతీకగా తీసుకొని ఇక్కడి మట్టి నిండా సామ్రాజ్యవాద విష సంస్కృతిని నింపటానికి ప్రపంచీకరణ పేరుతో వస్తున్నారని కవి భావన. కవిత నిండా ప్రతీకలు అధికంగా ఉన్నాయి. 'పొలాలు గాలికేసి తలబాదుకుంటె" అని చెప్పటం మంచి వ్యక్తీకరణ. ప్రపంచీకరణ వలన వ్యవసాయరంగానికి కలిగే ముప్పును హృద్యంగా చెప్పాడు.

"పడమటి దిక్కునుంచి రెక్కల జంతువేదో
పొలిమేరలో రంకేసినట్టు
కంచం, మంచం, తట్ట, బుట్ట, కుండ, కుదురు
అన్నీ వాటంతటవే దారినిబడి వలస పోతున్నట్టు
....
పక్కవీధిలో చుక్కమ్మకి తొలిచూలులోనే
పండంటి కంప్యూటర్ పుట్టినట్టు" (పాపినేని - ఒక పుష్యం - పుట5)

ఈ కవిత గ్రామమంతా ధ్వంసమైన తీరును కళ్లకు కట్టినట్లు చిత్రించింది. పడమటి దిక్కును అగ్రరాజ్యాలకు ప్రతీకగా తీసుకుని ఆ దేశాల నుంచి వస్తున్న జంతువే బహుళజాతి కంపెనీలని వాచ్యంగా చెప్పటం బాగుంది. మధ్యలో కొన్ని పాదాలు వచనంలా కనిపించినా 'చుక్కమ్మ పండంటి కంప్యూటర్‌ను' కనటం అనే భావ చిత్రణతో కవి రక్తికట్టించాడు.

"కుమ్మరి వాముల తుమ్మలు మొలిచెను
సాలెల మగ్గం సడుగులిరిగినది
పెద్దబాడిసె మొద్దుబారినది
చేతి వృత్తుల చేతులిరిగినవి' అని

గోరటి ఎంకన్న గొప్ప పాటను రాసి రాష్ట్రమంతా వినిపించాడు. చేతి వృత్తులను ఆధారం చేసుకున్న మనిషి అస్తిత్వం కోల్పోయిన స్థితిని పాపినేని శివశంకర్ చెప్పినా, గోరటి ఎంకన్న చెప్పినా పాతగోడల గోడు మనకు వినిపిస్తుంది.

ఇక నుంచి ప్రపంచంలో జరగబోయేవి నీటి యుద్ధాలేనని మేధావుల అభిప్రాయం. ఈ నీటిని కొన్ని అగ్రదేశాలు ఆక్రమించనున్నాయి. ఇపుడైతే అమెరికన్ సామ్రాజ్యవాదం పెట్రోల్ కోసం గల్ఫ్ దేశాలపై యుద్ధం చేస్తుంది. ప్రపంచంలో విలువైన వస్తువు ఏది ఉన్నా దానిపై ఆధిపత్యం కోసం అగ్రదేశాలు ప్రయత్నం చేస్తాయి. అందుకోసం యుద్ధానికైనా వెనుకాడవు. ఎందుకంటే వాటిది జలగ బతుకు. ప్రపంచాన్నంతా పీల్చేస్తాయి. రేపు నీరు విలువైన వస్తువవుతుంది. దానిపై ఇవాల్టి అమెరికన్ సామ్రాజ్యవాద దేశం ఆధిపత్యం కోసం అర్రులు చాస్తుంది. బహుళ జాతి కంపెనీలకు నీటి అవసరం ఎక్కువవుతుంది. ఆ అవసరాన్ని తీర్చే బాధ్యతను మనలాంటి దళారీపాలక వర్గాలకు అప్పచెపుతుంది. వాళ్ళు చెప్పిందే తడువుగా మన పాలకులు నీటిని మళ్లిస్తారు. ప్రజలను ముంచుతారు. ఇపుడు ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణను ఎండ పెట్టి 3లక్షల గిరిజనులను నీట ముంచి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం విశాఖ పట్టణంలో ఏర్పాటు చేయబోయే బహుళజాతి కంపెనీలకు మంచి నీటిని అందించటం కోసం పోలవరం ప్రాజెక్టుద్వార గోదావరి జలాలను తరలిస్తుంది. ఇది నీటి దోపిడి. అనంతపురం ప్రజలకు ఇతర వెనకబడిన ప్రాంత ప్రజలకు ఎండా కాలం వస్తే త్రాగటానికి నీళ్ళు దొరకవు. కాని మన ప్రభుత్వం బహుళజాతి కంపెనీల (వాటర్ బాటిల్స్ కోసం)కు 75 పైసలకు లీటరు చొప్పున సరఫరా చేస్తుంది. ఆ కంపెనీలు ఆ నీళ్లను తిరిగి మనకు 12రూ. లీటరు చొప్పున అమ్ముతుంది. దీనికోసం దేశంలోని నీటి వనరులన్నింటిని మాయం చేసే పనిలో పాలకులు ఉన్నారు.

మా ఊరి కంఠానికి
ముత్యాల హారంలా మెరిసే
ప్రాణం నీరును మాయం చేసినవాడు
దేశ భూత వైద్యుడో
ప్రపంచ మాంత్రికుడో
వాణ్ణి
భూమధ్య రేఖ మీద నిలబెట్టి
రవి బింబం ఉరి కంబానికి పంపండి
(కందుకూరి శ్రీరాములు - కవిత 2004 - పుట.48)

దోపిడి చేసేవాడు ఎవడైన శిక్షించాల్సిందేనని కవి కాలాన్ని సాయుధం చేస్తున్నాడు. కాళోజి అన్నట్లు "ప్రాంతేతరులు మోసం చేస్తే ప్రాంతం వరకు తన్ని తరుముదాం. ప్రాంతం వాడే మోసం చేస్తే ప్రాంతంలోనే పాతరవేడుదాం". అమెరిక వాడు మన నీళ్లను దోచుకున్నా లేదా రాజశేఖర రెడ్డి పోలవరం, పులిచింతల, పోతిరెడ్డి పాడు ద్వారా తెలంగాణ నీళ్లను తరలించుకపోయిన ఇద్దరిని ఒకే దృష్టితో చూడాలని, వాడు భూత వైద్యుడైనా, ప్రపంచ మాంత్రికుడైన ఉరి తీయాల్సిందేనని శ్రీరాములు కవిత్వీకరించాడు.

పల్లెపల్లెలా లేదు. వల్లకాడులా ఉంది. వరిమడిలో వేలాడుతున్న రైతు శవంలా ఉంది. ఆవుల మందలో తప్పిపోయిన లేగదూడలా ఉంది. వేటగాడి బాణానికి ఒరిగిపోయిన పాల పిట్టలా ఉంది. సున్నం లేని గోడలా ఉంది. ఎందుకంటే మాయ జలతారు మంత్రించిన ఇసుకను పల్లెపై చల్లింది. ఈ మంత్రం భూత వైద్యుడి మంత్రం కాదు. భూమండలంపై కర్రపెత్తనం చేస్తున్న సామ్రాజ్యవాదిది. ఉపాధి కరువైన గ్రామాన్ని వదిలి బతుకుతెరువు కోసం బయలుదేరుతే పల్లె ఒంటరి దుఃఖంను కవిగానం చేయాల్సి వచ్చింది.

బతుకు పేటెంటైన మనిషి బొందిలో

ప్రాణాలు నిలవవు
ఏ వూరు పోయినా ఏ రూపు చూసినా
ముంగిళ్లకు తోరణాల్లేవు
ద్వారాలకు తలుపుల్లేవు
....
వెన్నెల కురిసే నిశిరాత్రి ఆటల్లేవు
(మంచికంటి - కవిత 2004 - పుట 125)

ఉన్నదల్లా ఏమిటంటే చావుకు కాళ్లు చాపిన ముసలి తల్లిదండ్రులు. వారి ప్రాణం లాగే గుడ్డి దీపం మినుకు మినుకుమంటూ కనిపిస్తుంది. 'దేశానికి పల్లెలే పట్టుకొమ్మలు' గాంధీజీ కల వేగుజాము కలలాగే తెల్లారింది. దొరల పెద్దబోరు మాత్రం ఎంకన్న చెప్పినట్లు పొద్దంతా నడుస్తుంది. స్టార్ టీవి ఇంటింట్లో సకిలిస్తుంది.

సామ్రాజ్యవాదం తన సంస్కృతిని అలవాటు చేయటానికి అనేక వేషాలు వేస్తుంది. వాళ్ల దుర్మార్గ సంస్కృతిని బట్వాడా చేయాలంటే వాళ్లభాషను మనకు నేర్పించాలి. ఆనాడు బ్రిటీష్ వాడు ఈ ఉద్దేశంతోనే ఆంగ్లభాషను ప్రవేశపెట్టాడు. 'రక్తంలో, రంగులో, భారతీయులుగా ఉంటూ, ఆలోచనలో ఆంగ్లేయులుగా ఉండే ఒక వర్గం' వీడికి అవసరమొచ్చింది. అందుకే మెకాలే ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టాడు. అది ఒక దోపిడి భాష. ఇవ్వాళ ఆ భాషలోనే విముక్తి ఉందని దళిత మేధావులు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఇది ప్రపంచీకరణ కాలం. మరోరూపంలో వాడి ఆలోచనలు మనపై రుద్దటానికి ప్రయత్నిస్తున్నాడు. దానికి మన పాలకులు సిద్ధంగా ఉన్నారు.

"నిన్ను కొలవడానికి నీ పాదాల చెంత నిలవడానికి
మా భాష పనికిరాదనే
పుట్టుకతోనే మా నాలుకలు తెగ్గోసి
నీ నాలుక తగిలించుకోవాలని
వీధికో కాన్వెంటు స్థాపించాం
మా పిల్లల మీదా - వాళ్ల పిల్లల మీదా
పేటెంట్ రైట్లన్నీ నీవే ప్రభూ" (ప్రభు - పారిపోలేం - పుట.22)

ఈ నేల సిరులను ఈనింది. సంపదలను కాసింది. చెమటతో తడిసి పులకించింది. "భారతదేశం భాగ్యసీమరా / ఖనిజ సంపదకు కొదవలేదురా / బంగారు పంటలభూములున్నవి / చావు ఎరుగని జీవనదులురా" అని గద్దర్ రాసిన వ్యవసాయిక విప్లవం పాట వింటే ఈ దేశం ఎంతగా సిరులతో తుల తూగిందో అర్థమవుతుంది. అట్లాంటి నేలను 200 ఏండ్లు పాలించిన బ్రిటీష్ వాడు సర్వం దోచిండు. ఇపుడు మరో రూపంలో దోపిడికి సిద్ధమై మన వ్యవసాయ రంగాన్ని బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా మార్చుతున్నారు. ఈ మట్టిలో మమేకమైన రైతును ఆ మట్టి నుంచి వేరుచేసే కుట్ర ప్రపంచీకరణ చేసింది. ఈ ప్రపంచీకరణ రైతు జీవితాలలో తెస్తున్న విధ్వంసాన్ని గొప్పగా పట్టుకొని కవిత్వం వర్ణించడం తెలుగు కవులు చాలా కాలంగా చేస్తున్నారు. నేలకు రైతుకు ఉండే పేగు సంబంధం విడదీయలేనిది. రైతు ఉత్పత్తి చేసే దేని మీద అధికారం లేకుండా పోతుంది. అన్నింటిని నిర్ణయించేది సామ్రాజ్యవాది చట్టాలే. విత్తనం మొదలు అమ్మకం వరకు అన్ని పరాధీనం.

ఈనేల శరీరం మీద టెర్మినేటర్
నిలువెత్తు నెత్తుటి చారికలుగా మొలకెత్తనున్న నేపథ్యంలో
బహుళ జాతి కంపెనీల లాభాల పాటలకు
లయబద్ధంగా దరువెయ్యడానికి
డప్పు డోలు అరువిచ్చే రైతు బజార్లు వస్తున్నాయి
విధ్వంసమే యిక్కడి అభివృద్ధి క్రమ పరిణామం
(గౌరు నాయుడు - ప్రజాసాహితి నవంబర్ 2005 - పుట 108)

ప్రపంచీకరణ దేశంలో ప్రతిరంగాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ క్రమమే కరెంట్ చార్జీల పెంపు. వ్యతిరేకంగా ఉద్యమం జరిగితే కాల్పులు. నలుగురు అమరులు. పేలిన తూటా ఎ.పి.పోలీసుదైనా డైరెక్షన్ ఎన్‌రాన్ కంపెనిది.

ప్రపంచీకరణ
జిలుగు ముంగిట్లో తొలి అడుగు
కళ్లు తెరిచేసరికి కల్లంకల్లం
పంట నోటి కొచ్చె వేళ నీళ్లకు ఎద్దెంఎద్దెం
ఎంతని ఊడ్చేది ఎటని కుప్పపోసేది
భళ్లున కలలు చిట్లిపోతున్న భయంకర నిశ్శబ్దం
(జూకంటి జగన్నాథం - వాస్కోడిగామా. కామ్ పుట.51)

రచయిత కవిత్వంలో చెప్పే ఆశయాన్ని వస్తువనే దృక్పథంతో చూస్తే ప్రపంచీకరణను వ్యతిరేకించే కవులందరు తమ ఆశయాన్ని స్పష్టంగా చెప్పారు. గొప్ప శిల్పాన్ని కూడా సాధించారని చెప్పవచ్చు. శిల్పంలో భాగమైన ప్రతీకలు, భావచిత్రణ చాలా కవితల్లో కనిపిస్తుంది. కొన్ని కవితలను శిల్పం దృష్టితో చూస్తే సరితూగనప్పటికి విషయం దృష్టిలో ప్రపంచీకరణను వ్యతిరేకించే కవులందరు సఫలమైనట్లే. ఇంకా విషయాన్ని హృద్యంగా చెప్పటానికి కొందరు కవులు కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తిస్తూనే వారి కృషిని మెచ్చుకొనక తప్పదు.

అమెరికాను, డాలర్‌ను, బహుళజాతి కంపెనీలను నాలుగ్సార్లు తిట్టినంత మాత్రాన అదంత ప్రపంచీకరణ వ్యతిరేక గొప్ప కవిత్వంగా గుర్తించటం కష్టమే. వస్తువు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నప్పటికి శిల్పం మీద కూడా దృష్టి పెట్టాలి. వస్తువు శిల్పం రెండు గొప్పగా కలిసి పోయే సాహిత్యాన్ని మంచి సాహిత్యమని విమర్శకుల భావన.

వ్యవస్థాగత నిర్మాణ విధ్వంసం కోసం (కులం) ప్రపంచీకరణను సమర్థించేవాళ్లు కూడా ఉండటం ఆశ్చర్యమనిపించవచ్చు. అయితే వాళ్లంతా దాని పుట్టుకను, పెరుగుదలను, విస్తరణను గతితార్కిక భూమికతో అర్థం చేసుకొనకపోవటమే. ఉపశమనాలకు అలవాటు పడిన ఒక చిన్న వర్గం మనలోనే ఉండటం మొదటి నుంచి ఉంది. అయితే దీనిని బలమైన సిద్ధాంత భూమికతో ఓడించటమే పరిష్కారం. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా పోరాడటమే కాకుండా ఇది సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అనే అవగాహనను అందరిలో ప్రచారం చేయాలి.

పంటకంకిపై వాలిన
అమెరికా పక్షిని గురి చూసి కొట్టె
వడిసెలలకు సైగ చేద్దాం.

*

చందాదారులకు విజ్ఞప్తి

అరుణతార సకాలంలో, సక్రమంగా అందడం లేదనే ఫిర్యాదులు చందాదారుల నుండి వస్తున్నాయి. మీ ప్రాంతంలోని పోస్టాఫీస్‌లో కనుక్కొని, ఆ తర్వాత తెలియజేయండి. మీ అడ్రస్ మారి ఉంటే వెంటనే కార్డు మీద కొత్త అడ్రస్ తెలియజేయండి.

పత్రిక ఆర్థిక స్థితి గురించి అరుణతార పాఠకులకు తెలియంది కాదు. చందా గడువు అయిపోయాక వెంటనే రెన్యువల్ చేయించుకొని సహకరించగలరు. సంవత్సరాలుగా చందా కట్టని పాఠకులు కూడా ఉన్నారు. మీ బకాయి చెల్లించకపోతే పత్రిక మీకు పంపించలేకపోవడమే కాదు, పత్రిక నడవడమే కష్టమైపోతుంది.

- ఎస్. రవికుమార్, మేనేజర్

చెప్పని కథలు

☆ డా.కాకుమాని శ్రీనివాసరావు

అనగనగా ఒక కథ ఉంది.
కాని చదివే వాళ్ళే లేరన్నాడు జింబో.
కాని ఇంకా రావలసిన చోటు నుంచి కథలు రావడం లేదని, అసలు సాహిత్యంలో ఏ ప్రక్రియ అయినా జీవితాన్నిగాని సమాజాన్ని గాని సంపూర్ణంగా ఆవిష్కరించలేదన్నది నిజం. వివిధ రంగాల నుంచి ఇప్పటివరకు వచ్చిన కథలను ఒక పక్కన పెట్టి చెప్పని కథలేమిటో తెలుసుకోవడానికి ఎవరైనా ప్రయత్నిస్తే బావుంటుంది.

ఇవాళ ఉపాధ్యాయరంగం నుంచి, పత్రికా రంగం నుంచి ఎక్కువ మంది కథకులు వస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో, పత్రికా రంగంలోని రచయితలకున్నంత వెసులుబాటు ఇతరులకు లేదు. సాఫ్ట్‌వేర్ రంగంలోను, కార్పొరేట్ ఆఫీసులలో ఇంకా ఇతర రంగాలలోని వ్యక్తుల నుంచి కథలు ఆశిస్తే మరిన్ని మంచికథలు వచ్చే అవకాశం ఉంది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న అక్కిరాజు బట్టిప్రోలుగారు రాసింది తక్కువే అయినా అతి మంచి కథలు రాస్తున్నారు. ఇటీవల ఆయన రాసిన గేటెడ్ కమ్యూనిటీ అనే కథ గొప్ప కథల్లో ఒకటని నా అభిప్రాయం. సమాజంలో వర్గాలు అలానే ఉంటూ ఆయా వర్గాలలోని వ్యక్తులు మధ్యతరగతిగాను, ఉన్నత మధ్యతరగతిగాను ఎదిగి గేటెడ్ కమ్యూనిటీగా మారటం కథలో మనకి అంతర్లీనంగా కనిపించే అంశం. ఇటువంటి సున్నితమైన కథలు ఇటీవల కాలంలో చాలా అరుదు.

గత సంవత్సరం సునామి మీద వచ్చిన కథలకంటే నీటి కరువు మీద వచ్చిన కథలు తక్కువ. గత నాలుగైదు సంవత్సరాలుగా నీటి కరువు మరింతగా చాలా గ్రామాలను పట్టణాలను తాకింది. సునామి ప్రకృతి సహజంగా వచ్చింది. నీటి కరవు మనిషి చేజేతులా చేసుకున్నది. ఇక తదనంతర కాలంలో వచ్చిన వర్షాలకు వరదలకు దాని సంగతి అందరూ మరచిపోయారు. మళ్ళీ అతివృష్టిమీద కథలు. నీరు అమ్మకపు వస్తువుగా మారుతున్న దృశ్యం మన కథలలో ఏది? నీటి సమస్య మన ముందుకు రావాలంటే మళ్ళీ వేసవి రావాలేమో? నీరు ఇప్పుడూ నివురు గప్పిన నిప్పే.

ఇక కార్పొరేట్ కాలేజిలో ఉరేసుకున్న కథలెన్ని? రియల్ ఎస్టేట్ మీద కథలేవి? నిర్వాసితులయిన కథలు తమ నోరు విప్పలేదెందుకో? ఒక గంగవరం సంఘటన, బీడి కార్మికుల సమస్యల నుంచి మనం కథలు ఆశించలేమా? ఎంతో సాధించామని చెప్పుకుంటున్న స్త్రీవాద సాహిత్యంలో కూడా మహిళా కార్మికుల గురించి, వాళ్ళ ఉద్యోగ భద్రతా సమస్యల గురించిన కథలు తక్కువే. బొగ్గుగనుల జీవితాలను గురించి తుమ్మేటి రఘోత్తమ రెడ్డి ఆవిష్కరించినట్లు అన్ని రంగాల నుంచి కథలు వస్తే తెలుగు కథ మరింత విస్తృతిని పొందగలదు.

నేడు ప్రపంచీకరణ గురించి మనకెన్నో కథలున్నాయని చెప్పుకుంటున్న తరుణంలో అసలు ప్రపంచీకరణ అంటే ఎంత మందికి సరయిన అవగాహన ఉంది? ఎక్కువ మంది కాలంతో పాటు వచ్చిన మార్పులు, నాగరికత తెచ్చిన సంస్కృతే ప్రపంచీకరణ అని భ్రమపడుతున్నారు.

ఇక ప్రపంచీకరణ చట్రంలో చేతివృత్తులు నలిగిపోతున్న వైనాన్ని, వ్యవసాయ సంక్షోభాన్ని, రోజురోజుకూ మరింత ఛిద్రమవుతూ సంక్లిష్టమవుతున్న మనిషి జీవితాన్ని పెద్దింటి అశోక్ కుమార్, రాసాని, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, ఖదీర్ బాబు వంటి అనేక మంది కథకులు ప్రతిభావంతంగా ఆవిష్కరించగలుతున్నారు. ప్రపంచీకరణలో మారుతున్న కార్పొరేట్ చట్టాల గురించి ఆ చట్టాల కింద నలుగుతున్న కార్మికులు, ఉద్యోగుల గురించి మరిన్ని కథలు వస్తే బాగుండేది. వీటిపై సురేష్ - టైటానిక్, గొరుసు జగదీశ్వర రెడ్డి చీడ, గజ ఈతరాలు వంటి గొప్ప కథలు వచ్చినా మరింత విస్తృతిలో కథలు రావలసిన అవసరం ఉంది. గ్లోబలైజేషన్ మూలంగా మన దేశంల్లో అడుగుపెడుతున్న బహుళజాతి కంపెనీల అంతరంగమేమిటో వాళ్ళు సృష్టిస్తున్న ఉపాధి అవకాశాలలో ఔట్ సోర్సింగ్ అంతరార్థమేమిటో చెప్పేటందుకు ఆయా రంగాల నుంచి ఇంకా కథలు పుట్టవలసి ఉంది. అదే విధంగా ఔటర్ రింగురోడ్, రియల్ ఎస్టేట్ కోరలలో చిక్కుకున్న మధ్యతరగతి జీవులు, సాగుభూములు కోల్పోయిన రైతుల కథలు ఇంకా రావాలి. ఈ దృక్పథంతో సలీం కొన్ని మంచి కథలు రాశారు. ఇంకా కంపెనీల సంస్థానాలుగా అవతరించనున్న స్పెషల్ ఎకనమిక్ జోన్‌లలో మనిషి మనుగడ ఏమిటన్నది మన కథకులు ముందుగానే పసిగట్టకలగాలి. వస్తున్న మంచి కథలకంటే మరుగున పడిన గొప్ప కథలే ఎక్కువగా లేవా? ఇక అమెరికాలో స్థిరపడిన తెలుగువారి బాణీ బావుంది కాని అసలుచోట అష్టకష్టాలుపడుతున్న అజ్ఞాత జీవితాల కథలెన్నో?

గత దశాబ్దంలో నరసింహారావు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలితంగా తదనంతర కాలంలో అనేక పరిశ్రమలు మూతపడి, కొత్త కొత్త పారిశ్రామిక విధానాలతో అనేక మంది కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయి. పత్రికలు వామపక్ష భావాలున్న రచయితలను, వారి రచనలను చిన్న చూపు చూడటం వల్ల అనేక కడకండ్ల కథలు వెలుగులోకి రాలేదేమో? కథను కుదించివేస్తున్న పత్రికలకు మొదటి పేజీ కథనాల్లోనే వామ పక్షభావాలు కావాలి కాని కథలు అక్కర్లేదేమో?

రోజురోజుకి సంక్లిష్టమవుతున్న మనిషి జీవితంలో, స్త్రీ పురుష సంబంధాలలో, అపాద మస్తకం తలకిందులవుతున్న మనిషి బతుకు పరుగుపందెంలో నలుగుతున్న బాల్యం ఇంకా గొంతు విప్పలేక పోతోంది. బాల సాహిత్యం ఇప్పుడెలాగూ లేదు. పిల్లల చదువుల గురించి, వాళ్ళ పెంపకం గురించి చెప్పినవారెందరు? ఆడుకునే బొమ్మ దగ్గిర నుంచి అమెరికా చదువు వరకు ఇప్పుడు పిల్లలకు కావలసింది ధనార్జనే ధ్యేయంగాకల వ్యక్తిత్వ వికాసమేనా. ఈ కోణంలో డా.ఎం. హరికిషన్ కొంతగా కృషిచేసినట్లు కనిపిస్తున్నది కాని మిగతా ఉద్యమాలలాగా బాల్య హింసను కూడా మరింత ముందుకు తీసుకువెళ్తే బాగుంటుంది. ఇటీవల కొన్ని ఆదివారం సంచికలు కొంత దృష్టిపెట్టినట్లు అనిపిస్తుంది కాని ఇంకా రావలసినన్ని కథలు రాలేదన్నది సత్యం. ఈ యుగంలో సృజనాత్మకత ఇంజనీరింగ్ చదువులకే పరిమితమా?

జీవితాన్ని ప్రతిఫలించే ఘటనలు అన్ని చోట్లా నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. వాటి నాడి పట్టుకునే వాళ్ళే ఇక్కడ లేరు. అందరూ దానిలో భాగమవడానికో పంచుకోవడానికో అలవాటుపడుతునానిని ధిక్కరించే స్వరాలు ఎవరికి లేవు. అంతకు మించి ఆయా సంఘటనలను సమీకృతం చేసుకుని క్రోడీకరించే సృజనాత్మకత మన చదువులలో ఇప్పటికే లేదు. ఇక ముందు వస్తుందన్న ఆశ అంతకంటే లేదు. ఈ పరంపరలో అసలుకే మోసపోయి మాయమవుతున్న తెలుగుభాష గురించి ఔట్ సోర్సింగుకు తెలుగుభాషకు మధ్య సంబంధాన్నీ ఈ క్రమంలో ఉపాధి కల్పించలేకపోతున్న మాతృభాష గురించి మరింత చర్చ జరగవలసి ఉంది.

కొత్తగా రాస్తున్న కథకులు కూడా వస్తువును ఎంచుకోవడంలో కాని, శిల్పంలో కాని పాతవారినే మూసగా అనుకరిస్తున్నారు కాని వాళ్లంతట వాళ్ళు తము పెరిగిన, చూసి తెలుసుకున్న నేపథ్యం నుంచి కథలు రాయడం లేదు. కూర్మనాథ్ -కుక్క లాంటి కథలు అక్కడక్కడా తొంగిచూస్తున్నాయి. రాసిన వాళ్ళకు ప్రోత్సాహంగాని గుర్తింపుగాని తక్కువ. ఒకరికొకరు అంటరాని వారవుతున్న వాతావరణంలో ఇప్పటివరకు వచ్చిన వాటి మనుగడ ఎంతవరకు? వాటికీ తాళపత్ర గ్రంథాల దుస్థితి పట్టనుందా? జరుగుతున్న సంఘటనల మధ్య, నడుస్తున్న కథల మధ్య వాటిని పట్టితెచ్చే సృజనాత్మక నేపథ్యం తెలుగుభాషతోపాటు రాను రాను కనుమరుగవనున్నదా?

ఇటీవల పత్రికలలో కులాలవారీగా ప్రాంతాలవారీగా కథలను కవితలను ఆహ్వానిస్తున్నారు. అదే విధంగా కాల్ సెంటర్లలో పనిచేసే వారి నుంచి, కార్పొరేట్ ఆఫీసులో పనిచేసే వారి నుంచి కథలు ఆశిస్తే అత్యాస కాదేమో. మన దేశంలో ముప్పాతిక భాగానికి పైగా వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్న రైతాంగాన్ని వ్యవసాయరంగం నుంచి సేవారంగంలోకి రావాలని మన ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు పిలుపునిస్తున్నాయి. ఈ సందర్భంలో సేవారంగంలో ఉన్నవారి జీవిత భద్రత ఏమిటో బట్టబయలు కావాలి. దానిలో ఉన్న డొల్లేమిటో అందరికీ తెలియాలి. *

పుస్తక సమీక్ష

విరుగుతున్న 'మగ్గం బతుకులు'

☆ కె.నాగేశ్వరాచారి

"వాస్తవ లోకంలో ఇంకా అలివిగాని విషయాలను చైతన్య పరిధిలోకి తీసుకొచ్చి అసాధ్యాలను కూడా సాధ్యాలే అనిపించి తద్వారా మరింత తీవ్రమైన కార్యాచరణకు ప్రోత్సాహాన్ని కలిగించడమే అసలైన కవిత్వ ధర్మం. అదే కవిత్వ ప్రయోజనం కూడా" కె.వి.ఆర్.

సామాజిక సంబంధాలలో మార్పులేకుండా కొత్త ఉత్పత్తి విధానాలను ప్రవేశపెట్టడం వల్ల సామాజిక సంబంధాలు పూర్తిగా దెబ్బతిని పోతాయి. సాంప్రదాయ మగ్గం స్థానంలో మరమగ్గాలు (పవర్ లూమ్‌లు) ప్రవేశపెట్టడం వల్ల చేనేతరంగం మొత్తం అతలాకుతలమైంది. ఆత్మహత్యలు, వలసలు, దారిద్ర్యంతో నేతకారుల జీవితం మృత్యుకుహరమైంది. రాయితీలు ప్రభుత్వం ప్రకటించినా, సంస్కరణలకు కమిటీలు నియమించినా అవన్నీ నేతకారుల జీవితాల్ని మార్చలేదు. ఈ పెను సంక్షోభాన్ని "మగ్గం బతుకు" దీర్ఘ కవితలో రాధేయ చిత్రించారు.

ఈ కవితలో వృత్తి గొప్పదనం, సమాజంలో నేతన్నల అవసరం, వారి స్థితిగతులు, అక్కడక్కడ వాటికి కారణాలు, "కోబలీ" అంటూ తమ వృత్తిని రక్షించుకుంటామని ఖడ్గకేక వేయడంతో కవిత ముగుస్తుంది. నాగరిక సమాజానికి రాధేయ అన్నట్లు 'మొదటి సాక్ష్యం వస్త్రధారణే". వస్త్రధారణ సామాజిక అంతరాల్ని తెలిపే ప్రతీక. నేటికీ కొన్ని ప్రాంతాల్లో వడ్డెర స్త్రీలు రవికెలు వేసుకోరు. ఇంకొన్ని ప్రాంతాల్లో మోకాళ్ళ వరకుండే నల్లాడాలు పురుషులు వేసుకుంటున్నారు. ఇప్పడవి పట్టణాల్లో షార్ట్స్‌గా పిలుస్తారు. మరికొన్ని ప్రాంతాల్లో స్త్రీలు మోకాళ్ళ కింది వరకే చీరలు కట్టుకుంటారు. పూర్వం తలపాగా ధరించడం వారి గొప్పదనానికి ప్రతీకగా వుండేది. ఈ వస్త్రధారణ నేటికీ సామాజిక అంతరాల్ని తెలిపేవిగా వున్నది. ఈ కవితలో అనంతపురం జిల్లాలో వివిధ కారణాల వల్ల చనిపోయిన చేనేత వృత్తుల వారి జాబితా ఇచ్చి వారి చావుకు కారణం "పల్లవి ప్రపంచీకరణది, చరణం సామ్రాజ్యవాదానిది, పాపం పాలనా యంత్రాంగానిది" అని గుర్తిస్తాడు. స్వాతంత్ర్యోద్యమంలో 'ఖద్దరు' ఇచ్చిన స్ఫూర్తిని గుర్తించారు. ఇంటిల్లిపాది పాల్గొంటే తప్ప ఒక వస్త్రం తయారు కాదని వివరిస్తారు. వస్త్ర నిర్మాణంలో "హంసల్ని, సీతాకోక చిలుకల్ని, పగలంతా వెలుగు కిరణాల్ని అల్లి" జాతీయ స్థాయి ఉత్పత్తిలో రెండో స్థానం చేనేత రంగం సంపాదించుకొనిందని చేనేత రంగ గొప్పదనాన్ని కవి గుర్తు చేస్తాడు. ఇంత చేసినా "సామ్రాజ్యవాద చిద్విలాసం మా గంజి మెతుకుల్లో ఇసుకజల్లి వినోదిస్తూ వుంది, విఫణి వీధిలో విదేశీ విషం కలిపి తినిపిస్తోంది" అని చేనేత రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కవి వివరిస్తాడు.

ఈ కవితలో చేనేత రంగ ప్రస్తుత సంక్షోభాన్ని వివరించినంతగా సంక్షోభానికి కారణాలు వర్ణించలేదు. చూచినవి, విన్నవి, చదివినవి, తెలుసుకున్న వాటిని గురించి వ్రాయడం వాస్తవికత కాదు. వాటి స్వభావాన్ని వివరించాలి. జరుగుతున్న స్థితిని కవిత్వీకరించడం వల్ల ప్రయోజనముండదు. ఆదుస్థితికి దారి చూపిన కారణాలను వెలికితీయాలి. కారకులైన వారిని పిలిపించి పంచాయితీ పెట్టాలి. ఆ దారి ఎటువైపు పయనిస్తోందో వివరిస్తే చాలు. ఫలితాన్ని వివరించనక్కరలేదు. ఎందుకంటే ఆ ఫలితాన్ని వాస్తవంగా అనుభవిస్తున్నాం గనుక.

దేశంలో వ్యవసాయరంగం తరువాత చెప్పవలసింది చేనేత రంగమే. బ్రిటీష్ కాలం నుంచి నేటివరకు పాలకులు ఈ వృత్తిని రాచి రంపాన పెట్టిన క్రమం ఇప్పటి పాఠకులకు తెలియాలి. వ్యవసాయ చేనేత రంగాలు జమిలిగా నడుస్తూ నాశనం అవుతున్న తీరు కవిత వివరించివుంటే బాగుండేది. చేనేత రంగాన్ని గురించి రేఖా మాత్రంగానైనా కవితలో ఈ పని జరిగింది. "మా శ్రమ ఫలితాన్ని సొసైటీలు మింగేస్తున్నాయి" అని, బోగస్ సంఘాలు నేతన్నల్ని దోచుకుంటాయని అంటారు. ఇవ్వాళ ఈ వృత్తిలో అనేక కులాల వాళ్ళు వచ్చి చేరుతున్నారు. వృత్తిని ప్రోత్సహిస్తున్నామనే పేరిట ఏర్పడిన సొసైటీలు వ్యాపారుల చేతుల్లో కంప్యూటర్ మౌస్‌లు అయిపోతున్నాయి. కర్నూలు జిల్లాలో సొసైటీలు ఒక్కకుటుంబాన్ని మాత్రమే కోట్లకు పడగలెత్తించాయి. చేనేత రంగంలో ప్రారంభమైన పెట్టుబడులు ఇతర రంగాలకు కూడా విస్తరించినాయి.

ఇటీవల నేతన్నల ఆత్మహత్యలు పెరిగిపోవడంతో ప్రభుత్వం కంటితుడుపు చర్యలు ప్రారంభించింది. 1921న రాయల్ కమీషన్, 1996 నాటి మీరాసేఠ్ కమిటీలు కొంతైనా చేనేత కార్మికులకు ఊరట కల్పించాయి. సన్నటి సత్యం కమిటి చేనేత రంగానికి మరణ శాసనాన్ని తయారుచేసింది. ఒకనాటి కాలంలో మన దేశంలోని చేనేత డిజైనర్లు ఇంగ్లాండులోని ఆర్టిజన్స్ కాంప్లెక్స్‌లో ఇంగ్లాండు చేనేత వారికి శిక్షణనిచ్చిన గొప్పదనం సత్యం కమిటీ గుర్తించలేదు. కేవలం చేనేత రంగమే కాదు దానికి నూలు నందించే వ్యవసాయరంగం కూడా నూతన ఆర్థిక విధానాల ముప్పు కుళ్ళుసోకి నశించిపోతూ వుంది. రైతన్నలు, నేతన్నలు చావులో కూడా కలిసే వున్నారు?!

ఈ కవిత ఇంచుమించు చేనేత రంగం దుస్థితిని అన్ని వైపుల నుంచి తడిమినా ఒక పద్ధతిగా లేని కారణంగా పాఠకునికి సమగ్ర రూపం అందించలేకపోయింది. హీన స్థితి పట్ల పాఠకునికి ఆగ్రహం కానీ నైరాశ్యం కాని కలగదు. ప్యాకేజి స్కీములు టెక్స్‌టైల్స్ పార్కుల వల్ల బహుళజాతి కంపెనీలే బలపడతాయి గాని "మా శ్రమ జీవన సౌందర్యం షోరూముల్లోనూ ఆర్ట్ గ్యాలరీల్లోనూ మీకు కనువిందు చేస్తుంది" అని సాంప్రదాయ చేనేత మగ్గాలకు పవర్‌లూమ్‌కు వుండే తేడా గుర్తు చేస్తాడు. ఈ విభజన గురించి కవితలో చాలా చోట్ల ప్రస్తావించారు. సాంప్రదాయ వృత్తులను, అభివృద్ధి, యాంత్రీకరణలు ఎలా పాతరేస్తున్నాయో సూచించడం బాగుంది. ఐతే ఇటీవలి కాలంలో చేనేత కారులకు పవర్‌లూమ్ వాళ్ళకు జరిగిన గొడవల్ని కవి ఎక్కడా ప్రస్తావించలేదు. పవర్ లూమ్‌కు అందుతున్న రాయితీలు మగ్గం చేనేతకారులకు అందడం లేదు. వస్త్రోత్పత్తిరంగంలో పెట్టుబడులు ప్రవేశించిన కారణంగా సాంప్రదాయ మగ్గాలు అటకెక్కక తప్పడం లేదు. పరిశ్రమలో పెరుగుతున్న ఉత్పత్తులు సాంప్రదాయ ఉత్పత్తుల్ని ఎలా దెబ్బతీస్తున్నాయో పాఠకుడికి తెలియాలి.

కవి అవగాహనకు సంబంధించి ఒక్కమాట. "గురజాడ పూర్ణమ్మకు చలం అమీనాకు సాటి వచ్చే నా చెల్లిచంద్రమ్మ ఆరువేలిస్తే తప్ప తన అత్తగారింట్లో అడుగుపెట్టనివ్వరు... ఏడుస్తూ అలిగి కూర్చుంటే" అని ఆయా పాత్రల నేపథ్యం తెలియకుండా వ్రాయడం బాగాలేదు. పూర్ణమ్మ, అమీనా పాత్రల్ని వేరుగా ప్రస్తావించి శివసాగర్ చెల్లి చెంద్రమ్మ పాటను ధ్వనించే విధంగా ప్రస్తావించారు. ఆ పాత్రలన్నీ స్వతంత్రంగా వ్యవహరించినాయి. నిర్ణయాల్ని తమ మీద విచక్షణా రహితంగా రుద్దడాన్ని వ్యతిరేకించి తమ స్వేచ్ఛను ప్రకటించాయి. చెల్లి చెంద్రమ్మ తనపై అత్యాచారం చేయవచ్చిన భూస్వామి తల తెగనరికి అడివిలో అన్నలను చేరింది. వీరికి సాటివచ్చే చంద్రమ్మ కట్నం తీసుకునే భర్తను పెళ్ళిచేసుకోవడమేమిటి? ఆరువేల కట్నానికి అత్తగారింట్లో తరిమేస్తే పుట్టింటికి వచ్చి ఏడుస్తూ కూర్చోవడమేమిటి? పాత్రల నేపథ్యాన్ని వాటి ప్రాధాన్యాన్ని మరచి వ్రాయడం సాహిత్య పరిచయం లేకపోవడమే.

కవిత 31వ పేజీలో "పేదవుల మధ్య అదిమిపెట్టిన ఆగ్రహనైరాశ్యం మాసేవ చరిత్ర" అని 55 పేజీలో "వీరత్వం మా క్షేత్రంలోనే వుంది. ఖడ్గాలను చేబూని... త్యాగం మా రక్త నిష్ఠలోనే వుంది" అని పొంతన లేకుండా వ్రాయడం అనాలోచితమేనా?

పురోగామి స్వభావంగల వర్గాల జీవితాలు, అవసరాలు అనేక ఉత్పత్తి సాధనాలను రూపొందించినట్లే ఉపరితలంలో అనేక కొత్త రూపాలను రూపొందిస్తాయి. ఈ నేపథ్యంలోనే దీర్ఘకవితలు వెలువడుతున్నాయేమో! చేనేత రంగం ప్రైవేటు యాజమాన్యాల కింద నడుస్తున్న కారణంగా చేనేతకారులు శ్రమ శక్తిని అమ్ముకుంటున్నారు. వేతన కూలీలుగా మారిపోతున్నారు. కవిత ఈ మలుపుల్ని చిత్రించాలంటే కవి అవగాహన చరిత్రలో భాగమైనపుడే సాధ్యమవుతుంది. *

వాచక కేంద్ర విమర్శ: మైదానం లోతుల్లోకి

☆ ధరణి

'మనం ఇంతదాకా వెల్లడించడంలోనే సృజనాత్మక నైపుణ్యాన్ని చూశాం. కానీ మరుగుపర్చడం కూడా సృజనాత్మకమే'

ఈ వాక్యానికి యింకా కొనసాగింపు ఉన్నప్పటికీ, ఇంతవరకు పలికే అర్థంతో ఎవరికీ ఏపేచీ ఉండనవసరంలేదు. పైగా దీన్ని సాహిత్య ప్రక్రియలన్నిటిలో ఉత్తమ శిల్ప పద్ధతిగా గౌరవించవలసిందే. ఈ ఉటంకింపు చలం 'మైదానం' మీద అడ్లూరి రఘురామరాజుగారు రాసిన 'మైదానం లోతుల్లోకి' అనే విమర్శా వ్యాస సంపుటి నుంచి.

అన్నిటినీ ఏకరువు పెట్టడం కంటే గోప్యంగా ఉంచడం, వాటిని పసిగట్టి అన్వేషించడానికి పాఠకులకు కొన్ని ఆధారాలు వదలడం, వాటిని వెతుక్కొనే క్రమాన్ని సాధించడం వల్లనే వచన ప్రక్రియల ద్వారా పాఠకుల సాంస్కృతిక స్థాయి వికసిస్తుంది. మంచి విమర్శ అవసరం కూడా యిక్కడే. విమర్శ-వాచకాన్ని వివరించి చెప్పడమే గాక, ఎన్ని రకాలుగా దాని లోతులు వెతుక్కోవచ్చునో పాఠకులకు శిక్షణ యిస్తుంది. గురజాడ, చలం, కొ.కు, కా.రా లాంటి వాళ్ళ రచనలు పదేపదే చర్చనీయాంశం కావడం వెనుక వాళ్ళ వచన విన్యాసంలో, రచనా శిల్పంలో ఉన్న గాఢతే కారణం. అయితే అది కేవలం 'రచన'కు సంబంధించిన విషయం మాత్రమే కాదు. రచనను తీర్చిదిద్దడానికి, ప్రక్రియా రూపంగా నిర్మించడానికి తోడ్పడ్డ దృక్పథానికి సంబంధించింది కూడా. ఉదాహరణకు 'కన్యాశుల్కం'లోని వాచకం ద్వారా నేరుగా తెలిసే విషయాలకంటే, దాని వెనుక దాగి ఉన్నవి చాలా ఎక్కువ. ఈ రెంటికీ వాచకమే ఆధారం.

చలం 'మైదానం'లోని వాచక రహస్యాలను రఘురామరాజుగారు విప్పి చెప్తున్నప్పుడు మనకు అపారమైన సాహిత్యానుభవం కలుగుతుంది. ఈ పుస్తకం మీద ఎందుకో తగినంత చర్చ జరగలేదుగాని, వచన ప్రక్రియల విమర్శ గురించి ఆలోచించే వాళ్ళంతా పట్టించుకోవాల్సిన అంశాలు యిందులో ఉన్నాయి. వాచక అధ్యయనానికి సంబంధించిన భావనల ఆధారంగా రఘురామరాజుగారు ఒక విశ్లేషణ పద్ధతి నిర్మించే ప్రయత్నం చేశారు. ఈ పుస్తకం చదివాక శక్తివంతమైన ఏ వాచక పఠనంలోనైనా అన్వేషించాల్సిన లోతులను గురించిన స్పృహ మనకు పెరుగుతుంది. ఈ ప్రక్రియ గాఢంగా, ఆలోచనాత్మకంగా వచనాన్ని ఎలా చదవాలి? అనే ప్రశ్న వైపు మనలను ప్రేరేపిస్తుంది.

ఒక సాహిత్య నిర్మాణ రూపంగా వాచకాన్ని అర్థం చేసుకొని, అందులోని కళావిలువలను ఆస్వాదిస్తూ లోపలికి ఎలా వెళ్ళాలి? రచనలోని ప్రతిపదాన్ని, ప్రతి వ్యక్తీకరణను అంతర్గత పొరల నుండి ఎలా సమగ్రంగా దర్శించాలి? అనే వైపు నుండి ఆలోచనలు రేకెత్తడంద్వారా వాచకాన్ని యింకా ముందుకు తీసుకపోగలుగుతాం. వాచకాన్ని విశ్లేషించడం, ముందుకు తీసకపోవడం అంటే సాహిత్యానుభవాన్ని ముందుకు తీసకపోవడం అనే అర్థం. ఈ దిశగా రఘురామరాజుగారి కృషి స్వీకరించదగింది.

2

ఈ వాచక అధ్యయన పద్ధతి ఆలోచనాత్మకం అయ్యే కొద్దీ దానంతటదే తనదైన బలాన్ని ప్రకటించుకుంటుంది. పరిశీలన ఆలోచనాత్మకం కావడాన్ని ఎల్లవేళలా ఆహ్వానించవలసిందే. అయితే యిందులో చిక్కులు ఏమీ లేవా? అనే ప్రశ్న కూడా అక్కడి నుండే తలెత్తుతుంది. విశ్లేషకుడు మైదానంలోతుల్లోకి మనలను తీసికెళ్ళడం వల్ల కలిగే సంభ్రమంలో ఎగసి వచ్చే ఈ ప్రశ్నకూ, ఆ అన్వేషణా స్ఫూర్తి నుండే సమాధానాన్ని వెతకడం సమంజసం.

ఈ పద్ధతిలో ఎదురయ్యే చిక్కుల్లో ప్రధానమైనది - వాచక లోతులను తరచి చూసే క్రమంలో దానికి దూరం కావడం. రఘురామరాజుగారు ఈయిబ్బంది ఎదుర్కొన్నారు. నిజానికి ఇట్లా జరగడానికి వీల్లేదు. యిది ఆయన నిర్దేశించుకున్న ప్రయోజనానికి విరుద్ధమైనది. తన అధ్యయన దృక్పథాన్ని దేశీ పద్ధతులు, పోస్ట్ మోడర్నిజం రెండూ ప్రభావితం చేశాయని రచయిత చెప్పుకున్నారు. "అక్కడి పోస్ట్‌మోడర్న్, యిక్కడి ప్రీ మోడర్న్ కలయిక" అన్నారు.

'మైదానం లోతుల్లోకి' ముందుమాట రాసిన చిన వీరభద్రుడు రచయిత పాటించిన పద్ధతిలోని సామంజస్యాన్ని వివరిస్తూ "వాళ్ళు (సంప్రదాయవాదులు) సాహిత్యకృతిని కొన్ని కృత్రిమ సాహిత్యేతర ప్రమాణాల ద్వారా పరిశీలిస్తే, మనం కూడా కొన్ని సాహిత్యేతర ప్రమాణాల ఆధారంగా సాహిత్యాన్ని పరిశీలిస్తున్నాం. మనం మత ప్రమాణాల్ని వైజ్ఞానిక ప్రమాణాల్తో మార్చుకున్నంత మాత్రాన మన సాహిత్య విమర్శ సాధికారం కాబోదు. ఎందుకంటే రెండు చోట్లా కూడా సాహిత్య విలువలు సాహిత్యేతర ప్రమాణాల ద్వారా మాత్రమే పరిశీలనకు పెట్టబడుతున్నాయి. యథార్థానికి రెండు సందర్భాల్లోను కూడా వాచకం నిర్లక్ష్యానికి గురికాకతప్పదు" అన్నారు.

అంత కంటే ముందు యింకోమాట కూడా అన్నారు. 'సాహిత్యవాచకాన్ని అర్థం చేసుకోవడానికి మనం దానికి సాహిత్యపరంగా సన్నిహితులం కావల్సిందే' అని. కొత్త పాతల తేడా లేకుండా ముఖ్యంగా రఘురామరాజుగారు తన దృక్పథం మీద ఉన్న ప్రభావాల గురించి చెప్పుకున్న ప్రకారం యించుమించు వాచక కేంద్ర విమర్శను ప్రేరేపించి, దారిచూపే స్ఫూర్తి యిదే. దీని వల్లనే ఆయన వాచకానికి 'దూరంగా' వెళ్ళిపోయారు. అదెట్లానో తర్వాత చెప్తాను గాని ఈ అనివార్యత వాచకానికి సంబంధించిందే అని గుర్తించడం ముఖ్యం. సంప్రదాయ, ఆధునిక విమర్శా పద్ధతుల్లో ఉన్నాయనుకుంటున్న సాహిత్యేతర ప్రమాణాల మంచి చెడ్డల గురించి యిక్కడ చర్చించుకోనవసరం లేదుగాని, వాచకం కేంద్రంగా, సాహిత్యపరంగానే దానికి సన్నిహితులం అవుదామనుకున్నా వాచకమే నిర్దేశించే అంశాలు, పద్ధతులు అనేకం ఉంటాయి. అవి మనం సాహిత్యపరంగా సన్నిహితులం కావాలని రూపొందించుకున్న పద్ధతిని ప్రభావితం చేస్తాయి. వాటిని గుర్తించడం అవసరం అనీ, వాటిని విస్మరించడం వల్ల వాచకానికీ మనకూ దూరం పెరుగుతుందని చెప్పడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

సాహిత్యేతరం అని కొన్నిటిని తృణీకరించడం మన అభిమతం కావచ్చు. కాని రచన తాను రూపొందడానికి కారణమైన వాటన్నింటితో చలనశీలమైన కాలం పొడవునా సంబంధం కలిగి ఉంటుంది. వాటిని తృణీకరించి వాచకం కొనసాగజాలదు. ఒక సాహిత్య రూపాన్ని ఎక్కడ నిర్దేశించి చూస్తాం? అనేది చాలా ముఖ్యమైనది. సాహిత్యకృతిలోని భావాలలో ఏకీభావం ఉన్నదా? లేదా? అనేది వేరే విషయం. వాచకం నిర్జీవ భావాలతో, పదబంధాలతో తయారయ్యే నిర్మాణంకాదనే ఎరుక ఉంటే దాని ఉనికిని పట్టి ఉంచే సంబంధాల పాత్ర గురించి మనలో పట్టింపు పెరుగుతుంది.

రచన నేపథ్యమే రచన ఎట్లాకాదో, నేపథ్య విశ్లేషణ మాత్రమే దానిపై విమర్శకాదు. కానీ 1929లో రాసిన రచన యిప్పటికీ కొనసాగుతూ, విశ్లేషణకు నిలబడ్డదంటే అది ఒకానొకప్పుడు అచ్చయిన వాచకంగానే దాని ఉనికి సాధ్యంకాదు. యింకా ఏదో ఉండాలి. పాఠకులు భిన్న దృక్కోణాల్లో ఎన్ని పాఠాంతరాలు పేర్చుతూ వస్తే అంతగా వచనానికి తనదైన లోతు కాలానుగుణంగా సామాజిక సాంస్కృతిక సంబంధాల పరిణామాలరీత్యా పెరుగుతూ ఉంటుంది. వాచకం నిర్దిష్ట స్థలకాలాల్లో, అవి నిర్దేశించే సామాజిక

సంబంధాల్లో భాగంగా నిర్మాణమవుతుంది. ముఖ్యంగా కల్పనా సాహిత్యం మానవ సంబంధాల సంఘర్షణ, కల్లోలాలకు అనుసృజన అవుతుంది. రచయిత పొందిన జీవితానుభవం, దానిమీద ఏర్పరచుకున్న వైఖరి, దాన్ని నిర్దేశించే దృష్టికోణం నుండి సాహిత్యం రూపొందుతుంది. రచయిత ఉద్దేశ్యాల వైపు నుండి మాత్రమే పఠనం జరగాలన్నీ నియమం ఏమీలేదు. నిజానికి దాన్ని అతిక్రమణ వల్లనే వాచకం మీద విస్తృతమైన అధ్యయనం జరుగుతుంది. వాచక కేంద్ర విమర్శకు అక్కడ గౌరవనీయమైన పాత్ర ఉంటుంది. అతిక్రమణ ఎలా ఉంటుంది? అనే దాన్నిబట్టే పాఠాంతరాలు తయారవుతాయి. అయితే రచన తానుగా ఏం చేస్తోంది? అన్న పరిశీలనకు అవసరమయ్యే పద్ధతులను సాహిత్య అభిరుచి, సాహిత్య దృష్టి మాత్రమేగాక యింకా చాలా నిర్దేశిస్తాయి.

కాబట్టి సాహిత్యపరంగా సాహిత్యానికి దగ్గర కావడం అనే పద్ధతి మనం రూపొందించుకున్నా, సాహిత్యం 'సాహిత్యం'గానే మనకు దగ్గర కాలేదు. మన పద్ధతిలో నిమిత్తం లేకుండా అనివార్యంగా అది యింకా అనేక విషయాల్లోకి తానుగానే మనలను లాక్కెళ్ళుతుంది. అయితే అవన్నీ మనకు సాహిత్యానుభవంగా మిగలడమే మంచిసాహిత్యం విశిష్టత.

ఇదే రఘురామరాజుగారు తాను నిర్దేశించుకున్న లక్ష్యానికి భిన్నంగా ఆయన పరిశీలనలు సాగడానికి కారణమైంది. స్థూలంగా అది రెండురకాలుగా జరిగిందని చెప్పవచ్చు. ఒకటి - వాచకం లోతులను చూసే పరిశీలన ఆలోచనాత్మకంగా, సునిశితంగా సాగుతూ వాచకానికి భిన్నమైన నిర్ధారణలకు దారితియ్యడం; రెండు - వాచక కేంద్రంగానే ఉంటూ, అంతవరకే పరిమితం అవుదామనుకున్నా ఆ చట్రాన్ని అధిగమించి బైటికి వెళ్ళిపోవడం. ఇవి రెండూ పూర్తిగా విరుద్ధమైనవని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు కాని, ఇవి పుట్టింది మాత్రం రఘురామరాజుగారు తయారు చేసుకున్న పద్ధతి నుండే.

మొదటిదాని గురించి చెప్పుకునేటప్పుడు రచయితను దాటి రచనను అర్థం చేసుకోవడం అనే ప్రక్రియ గురించి ఎక్కువగా ప్రస్తావించాల్సి ఉంటుంది. రచయిత నేరుగా, సూటిగా, వాచ్యంగా, బోధనాత్మకంగా వ్యక్తీకరించిన పరిధిలోనే ఆగిపోకుండా యింకా ముందుకు పోవాలంటే వాచకం లోపలి పొరల్లోకి దృష్టి సారించవలసి ఉంటుంది. దానికోసం రచయితను దాటి ముందుకు పోవాల్సిందే. అట్లా వెళ్లినప్పుడు ఒక్కోసారి రచయిత ఉద్దేశ్యంతో నిమిత్తం లేని విషయాలు తెలిసి ఆశ్చర్యపోవలసి వస్తుంది, సంభ్రమానికి లోనుకావల్సి వస్తుంది. నిర్దిష్టంగా చూస్తే 'వేయిపడగలు' నవల వాచకంగా మహత్తరమైన నిర్మాణం. వచన రచయితగా విశ్వనాథ ప్రతిభకు నిదర్శనం. వాచకాన్ని శ్రద్ధగా పరిశీలించే కొద్దీ దాని విరాట్ రూపం కనిపిస్తుంది. ఆయన ఉద్దేశ్యంతో నిమిత్తం లేని వాస్తవికత, దానిపట్ల రచయిత తిరస్కారం, భీతి - ఈ రెండింటికి సంబంధించిన పాత్ర స్వభావం, పరిణామం ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. నవల పైపైన చదివినప్పటికంటే, లోపలికి వెళ్ళేకొద్దీ సాహిత్యానుభవంలో తేడా ఉంటుంది. రచయితను దాటి ఎంతదూరం వెళ్ళినా ఆయన దృక్పథానికి, ఉద్దేశానికి భిన్నమైన నిర్ధారణలకు రావడం కుదరదు. ఆధునికత పట్ల విశ్వనాథ విముఖను - సమర్థనగా, భీతిని - ధైర్యంగా గణించలేం. నిజానికి వాచకాన్ని శ్రద్ధగా చదువుతూ సాహిత్యపరంగా దగ్గరవుదామని ప్రయత్నించేకొద్దీ (సాహిత్య పరంగా దగ్గరవడానికి తగినన్ని విశిష్టతలు అందులో ఉన్నాయి కూడా), ఆ సాహిత్యాన్ని రూపొందించిన మానవ సంబంధాలు, అక్కడి నుండి నేరుగానూ, కాల్పనికంగానూ నవలలోనికి ప్రవేశించిన అనేకానేక జీవిత విశేషాలు, సాహిత్యేతర విషయాలు జీవితానుభవంగా, ప్రచ్ఛన్నంగా మన ప్రయత్నాన్ని యింకా గాఢతరం చేస్తాయి.

రచయితను దాటి ముందుకు పోయి రచనను అర్థం చేసుకోవడం అంటే ఎట్లా ఉంటుందో ఈ పుస్తకంలో రఘురామరాజుగారు రాజేశ్వరి గురించి చేసిన పరిశీలన ఒక ఉదాహరణ. పుస్తకంలో యిదే ప్రధాన భాగం. ప్రేమ అనే జీవితానుభవం కోసం సాగే ఆరాటం కేంద్రంగా రాజేశ్వరి - భర్త (సనాతన కుటుంబ వ్యవస్థ); రాజేశ్వరి - అమర్; రాజేశ్వరి - మీరా సంబంధాల సంఘర్షణను ఈ నవల లోపలికి వెళ్ళేకొద్దీ వివరించవచ్చు. రఘురామరాజు రాజేశ్వరి- ఆమె బాల్యం - సంప్రదాయ కుటుంబ వ్యవస్థ అనే కోణంలో వాచకాన్ని చదివారు. వాచకాన్ని కేంద్రం చేసుకొని, అందులో దొరికిన ఆధారాల ద్వారా లోతుల్లోకి వెళ్ళే క్రమంలో - వాచకాన్ని, రచయితను, రచన ఉద్దేశాన్ని కూడ దాటుకొని వెళ్ళిపోయారు. విస్మయం కలిగించేదే అయినా, యిక్కడ జరిగింది యిదే.

3

రచయితకు - పాఠకులకు మధ్య ఉండే సంక్లిష్టత గురించి చిన వీరభద్రుడు కూడా ముందుమాటలో ప్రస్తావించారు. "చురుకైన పాఠకుల వల్ల వాచకానికి అనేక పాఠాంతరాలు ఏర్పడతాయి. వాటిని పరిష్కరించి ఒక పఠన క్రమాన్ని ప్రతిపాదించాల్సి నపుడుతన స్వీయ దృక్పథానికి ప్రాధాన్యత తగ్గించి, వీలైనంత ఎక్కువగా వాచకాన్నే ముందుకు తీసకపోవాల్సి ఉంటుంది" అన్నారు. రఘురామరాజుగారు ఈ క్షాళన పద్ధతి పాటించారని ఆయన అన్నారుగాని, రాజేశ్వరి పాత్రచుట్టూ చేసిన పరిశీలన ఆయన స్వీయదృక్పథం ఆధారంగానే సాగింది. అందువల్ల వాచకం ప్రతిపాదించే విషయానికి భిన్నమైన నిర్ధారణ చేశారు. వాచక కేంద్రంగానే పరిశీలించాలని గట్టి నిర్ణయం తీసుకున్నా - మైదానం ఆద్యంతం వినిపించే చలం గొంతుకను విస్మరించి (రాజేశ్వరితో చలంను పోల్చే ప్రయత్నం స్వయంగా తానే చేశారు కూడా) వాచకంలోని రెండే రెండు వాక్యాల ఆధారంగా రాజేశ్వరి ధిక్కారానికి (లేదా పరివర్తనకు) ఆమె బాల్యంలో, మారుతల్లి దగ్గర కోల్పోయిన ప్రేమలో వెతకడం ఆశ్చర్యం కలిగిస్తుంది. బాల్యంలో కారణాలు వెతకిన తీరు మాత్రం పాఠకుల్లో చాలా గాఢమైన సాహిత్యాసక్తిని కలిగిస్తుంది. అయితే అది చలం భావనకు, ఉద్దేశ్యానికి దూరంగా లేదా భిన్నంగా సాగిన విశ్లేషణ. అయితే అది కూడా 'ప్రేమరాహిత్యం' ప్రధానంగా సాగడం ఒకటే చలం మౌలిక దృక్పథానికి సన్నిహితమైనది. ఆ మేరకు యింకోవైపు నుండి చలంకు దగ్గరగా ఉన్నట్టే.

"రాజేశ్వరి లేచిపోవడానికి గల మరికొన్ని కారణాలు ఈ నవలలోనే దొరుకుతాయి. ఆ కారణాలను బయటికి తీయడానికి, వాటిని పునర్నిర్మించడానికి..." 1. వైవాహిక జీవితంలోని వివరాలు 2. రాజేశ్వరి బాల్యం గురించిన వివరాలు పరిగణలోకి తీసుకోవాలి అంటూనే రెండోదానిమీద ఎక్కువ కేంద్రీకరించారు.

రాజేశ్వరి బాల్యం, యవ్వనం గురించి వాచకంలో మూడు సందర్భాల్లో ప్రసంగవశాత్తు వస్తుంది. వీటి ఆధారంగా రాజేశ్వరికి సొంతతల్లి లేదని, బాల్యంలో నిరాదరణకు గురైదని, అదే ఆమె స్వేచ్ఛాకాంక్షకు కారణమైందని చెప్పడం వల్ల ఆమె కంఠస్వరంలోని సామాజికతకు విలువ లేకుండా పోయింది. ఆమె యవ్వనకాలంలో ప్రస్తావనకు వచ్చిన వ్యక్తులు నరసుబావ, మామ... వీరిద్దరినీ విరుద్ధ వ్యక్తిత్వాలు వీరిద్దరిలో ఎవరూ తన దాహాన్ని తీర్చలేరు. భర్తసరేసరి. తనదాహాన్ని పూర్తిగా తీర్చగలిగే వ్యక్తికోసం తనకే తెలియని తహతహ. "ఈ తహతహ గురించి రాజేశ్వరికి చూచాయగా కాక స్పష్టంగా తెలిసి ఉంటే అలాంటి వ్యక్తికోసం వెతికేదేమో. కానీ అలా చెయ్యలేదు. చూచాయగా అనిపిస్తున్న ఈ పరిస్థితి గురించి రాజేశ్వరికి అమర్‌ను కలసింతర్వాత పూర్తిగా, స్పష్టంగా తెలిసింది. ఇలా అమర్, రాజేశ్వరిలో దాహాన్ని తీర్చడమేగాక, నివురుగప్పి నిద్రాణంగా సబ్ - కాన్షియస్‌లో అణిగి ఉన్న దాహాన్ని పైకి తెచ్చాడు (పేజీ 33).

యింత ఉటంకిపు దేనికంటే - రాజేశ్వరి జీవితంలో, వాచకంగా మైదానంలో, చలం దృక్పథంలో ఏదైతే అతిముఖ్యమైనదో దాని లోతులకు వెళ్ళవలసిన అధ్యయన క్రమం వాచకానికి ఎట్లా దూరమైపోయిందో చెప్పడానికే.

రఘురామరాజుగారు రాజేశ్వరి బాల్యంలో నుండి ఎత్తిచూపిన కారణాలు వాస్తవమైతే ఆ వైపు నుండి నవల మొత్తాన్ని పునర్మూల్యాంకనం (కనీసం రాజేశ్వరి ప్రవర్తన, స్వభావాలను) చేయాల్సి ఉంటుంది. అయితే దీనికి అనుగుణమైన పాఠాంతరం చలం మైదానానికి సంబంధించి కాజాలదు. రాజేశ్వరి యింట్లో నుండి మైదానానికి వెళ్ళడంలో ఏం పనిచేసిందో, దాని ద్వారా చలం ఈ బూజుపట్టిన, నిర్దాక్షిణ్యమైన లోకానికి తలతిరిగిపోయేలా ఏం చెప్పదలిచాడో దానికి భిన్నమైన పాఠాంతరం అవుతుంది. దేనికంటే నవల మొదటి వాక్యమే - 'లేచిపోయినా'నంటే ఎవరన్నా నన్ను నాకెంతో కష్టంగా ఉంటుంది అని. కష్టంగా అని అన్నదేకాని బాధగా, అవమానంగా ఉంటుంది అనలేదు. మొదటి వాక్యం దగ్గరి నుండి రాజేశ్వరి మాట్లాడే ప్రతిమాట రచన ఉద్దేశ్యాన్ని ప్రకటిస్తూ ఉంటుంది. అదేమిటో యిక్కడ ప్రత్యేకంగా వివరించనవసరం లేదు. రాజేశ్వరిలోని ప్రేమకాంక్ష సంప్రదాయ కుటుంబాల్లోని చచ్చు మొగుళ్ళ మీద, అలాంటి కుటుంబ వ్యవస్థ మీద, దాన్ని కొనసాగిస్తున్న సమాజం మీద ధిక్కారంగా గుర్తించవలసి ఉండగా ఆ స్థానంలోకి రఘురామరాజుగారు ఆమె బాల్యాన్ని ప్రముఖంగా తీసుకొని వచ్చారు.

వాచకంలోతును చూచే పద్ధతిలో ఇలాంటి పొరపాట్లు జరిగే అవకాశం అనివార్యంగా ఉంటుందా? అనే సందేహం కలగవచ్చు. యిది రఘురామరాజు ఎంచుకున్న వాచక అధ్యయన క్రమాన్ని మాత్రమే సూచిస్తుంది. ఈ సమస్య యితర రచనలపై విశ్లేషణ చేసేటప్పటికంటే - మైదానంలాంటి ప్రచలితమైన రచనల విశ్లేషణలో స్పష్టంగా కనిపిస్తుంది. రచయితను దాటి రచనను అర్థం చేసుకోవడం అనే ప్రక్రియ రచయితతో సంబంధంలేనిదిగా మారిపోయినప్పుడు వాచకం అర్థం అపార్థమవుతుంది. వాచకాన్ని కేంద్రం చేసుకొనే కొద్దీ రచయిత అతని / ఆమె దృక్పథం ప్రమేయం గాఢం కావాలి. అప్పుడు రచన లోపలి శక్తి అంతా వెలికితీయవచ్చు. లేకపోతే రఘురామరాజుగారులాగా 'రాజేశ్వరి వివాహ జీవితంలోని కారణాలు ముఖ్యమైనవే అయినా అవి కేవలం అనుషంగిక కారణాలు, అనుకూలించిన పరిస్థితులు మాత్రమే అవి మూలకారణాలు, ఆవశ్యక పరిస్థితులు కావు' అనే లోపభూయిష్ట నిర్ధారణలకు వచ్చే ప్రమాదం ఉన్నది.

యిక్కడి నుండి యిదే మార్గంలో రాజేశ్వరి 'మాతృప్రేమ'ను కూడా రఘురామరాజుగారు విశ్లేషించారు. అమీర్ వల్ల గర్భవతి అయి, అతని వత్తిడితో అతను వదిలేసి వెళ్ళిపోయాక (కొద్దికాలం) మీరా సాయంతో గర్భం తీయించుకోవడం అనే ఘట్టంలో ఆమెలోని మాతృప్రేమను, అదీ నిరాదరణకు గురయిన ఆమె బాల్య స్పృహ విస్తరణ రూపంగా దాన్ని చూడ్డంలో కూడా వాచకానికి దూరంగా వెళ్ళిపోయారు.

ఒక్కమాటలో స్థూలంగా చెప్పాలంటే మైదానంలోని పాత్రల స్వభావాలను, ప్రవర్తనలను పాత్రల మధ్య సంబంధాలను రఘురామరాజుగారు రాజేశ్వరి బాల్యం, బాల్యంలో ప్రేమ నిరాకరణ, ఆమెలోని మాతృప్రేమ అనే చట్రంలో పరిశీలించారు. గర్భం విషయంలో మాత్రమే రాజేశ్వరి సందిగ్ధత, సంఘర్షణలో స్త్రీ సహజమైన మృతృత్వ భావన వాచకంలో కనిపిస్తుంది. ప్రత్యేకంగా నిర్ధారించాల్సిన అవసరం లేనంతగా యిది అర్థమవుతుంది. దీని లోతుల్లోకి వెళ్ళుతూ "ఎవరి శ్రద్ధకూ నోచుకోని బాల్యం రాజేశ్వరిది. తను కోల్పోయిన బాల్యాన్ని, తన సంతానం ద్వారానైనా పొందాలనే తపన ఎక్కడ మనఃలోతుల్లోంచి, సుదూరాల నుంచి తనకే తెలియని తనను ఆడించే శక్తుల వల్ల వచ్చిన కదలికలు ఆమెలోనివి..." అంటూ "అందుకే (పిల్లలపై ప్రేమ) అమీర్ ద్వారా తీరుతుందని జీవన ప్రవాహంలో తనకే తెలియని శక్తులు తరుముతూ ఉంటే ఉధృతంగా కుటుంబ వ్యవస్థ కూకటివేళ్ళను తెంచుకుంటూ లేచిపోయి వచ్చేసింది అమర్‌తో మైదానంలోకి..." అని నిర్ధారించారు. అంటే బాల్యంలోని అసంతృప్తి, ప్రేమరాహిత్యం; తల్లి అయి తన బిడ్డద్వారా అది తీర్చుకోవాలనే వాంఛ.... ఇవి రెండూ ఆమెను అమీర్ సంబంధంలోకి తీసికెళ్ళాయి అనే సిర్ధారణ యిది. ఈ పరిశీలన ఆసక్తికరమైనది కావచ్చుగాని వాచకంలోని వాస్తవికతకు విరుద్ధమైనది. అయితే నవలను రాజేశ్వర - అమీర్; రాజేశ్వరి - మీరా సంబంధాల చర్చగా పరిశీలించడం, ముఖ్యంగా రాజేశ్వరి - మీరాల సంబంధం గురించి యింతదాక విశ్లేషకులు తక్కువగా పట్టించుకున్నారనడం సబబే. అయితే ఈ రెండు సంబంధాల్లో ప్రబలంగా రాజేశ్వరి మాతృప్రేమను చూడ్డం అ దృష్ట్యా పరిశీలించడం విడ్డూరం. రాజేశ్వరి - అమీర్ సంబంధాన్ని చాలా లోతుగా, విపులంగా చర్చించాలనే ఉద్దేశ్యం చాలా తాజాగా ఉన్నదికాని, దాన్ని కూడా రాజేశ్వరి మాతృత్వ భావన కేంద్రంగా చూడ్డం వాచకానికి పూర్తి బిన్నమైన పరిశీలన. రాజేశ్వరి మనస్తత్వానికి, చైతన్యానికి, ప్రవర్తనకూ సంబంధం లేనిది. వాచక కేంద్ర పరిశీలనకు వాచకంలోకి ప్రవహించిన వాస్తవికతను ఒక గీటురాయిగా స్వీకరిస్తే దాని చిత్రణ, వైఖరి, అవ్యక్తాంశాలకోసం తోలులకు వెళ్లితే వాచకానికి మేలు జరుగుతుంది.

"ఒకొక్కప్పుడు ప్రదర్శించని అంశాలు, ప్రదర్శించిన అంశాల ప్రాధాన్యాల్ని, గొప్పదనాన్ని పెంచుతాయి. తద్వార రచన కొత్తలోతులను పొందుతుంది" అంటారు రఘురామరాజుగారు. యిది నిజమే. ప్రదర్శితం కానివాటిని వాచకంలో శిల్పంగా చూడాలా? అనే ప్రశ్నకు వాచకం ఆధారంగానే యిమిద్దంగా చెప్పడం కష్టం. రచయితకు తెలియకుండానే ఒక అంశం తనలో అంతర్లీనంగా ఉండి ఎట్లా బయటపడుతుందో, అట్లా కొన్ని అంశాలు తెలిసీ అంతర్లీనంగా ఉండిపోతాయి. ఈ రెండు సందర్భాల్లోనూ రచయితను దాటుకొనిపోవడం వల్ల పఠనంలో అద్భుతాలను సాధించవచ్చుగాని అదే చిక్కు సమస్యను తెచ్చిపెడుతుంది. వాస్తవానికి రచనలో చెప్పినవాటికీ, చెప్పనివాటికీ మధ్య పరస్పర సంబంధం ఉంటుంది. చెప్పనివాటిని వెలికితీసి పాఠాంతరాలు నిర్మించే క్రమంలో రచయిత ప్రమేయంతో సాగినవీ, రచయితతో బొత్తిగా సంబంధం లేనివీ పోల్చి చదువుకుంటే ఏది వాచకానికి సన్నిహితమైందో, ఏది వాచకం లోతులను ఆవిష్కరిస్తుందో గమనించగలం. అసలు యింకోలాగా చెప్పాలంటే రచయిత మనసుల్లో పోగుపడినవి అప్రయత్నంగా వాచకంలోకి వచ్చినట్టే, పాఠకుల మనసులో పోగుబడినవి వాచక పఠనంలోకి జారి వాచకానికి - పఠితకు మధ్య తనదైన సంబంధాన్ని ఏర్పరచుకుంటాయి. యితరేతర రచనలు చదివేటప్పుడు ఎదురయ్యే అనుభవానికంటే వచన సాహిత్యం (కల్పన ప్రక్రియలు) చదవేటప్పుడు అనుభవం ప్రాతిపదిక మీద సాహిత్యానుభవంగా మారే ప్రక్రియలోని విశిష్టత, ప్రత్యేకత యిదే.

4.

వాచకం చుట్టూ యింత సంక్లిష్టమై అల్లిక సహజంగానే ఉంటుంది. సాహిత్య పరంగానే దానికి దగ్గర అవుదామనుకున్నాసరే, వాచకంలోకి వచ్చిన భావాల చరిత్ర, వాటి సామాజికత, కాలంతోపాటు విస్తరించీ. కొత్త అర్థాలను పలికే మానవానుభూతులకు సంబంధించిన వాస్తవికత విస్మరించడానికి వీల్లేని అల్లికగా నిలబడుతుంది. పాతరోజుల్లో అలంకార శాస్త్ర పునాదిపై సాగిన సాహిత్య విశ్లేషణ రచనలోని సాహిత్య విశేషాలను ఎంత లోతుగా పరిశీలించి నా రచనలోకి వచ్చిన, రచన చుట్టూ ఉన్న సామాజికతను విస్మరించడం వల్లనే దాన్ని ఆధునికులు తిరస్కరించవలసి వచ్చింది. రఘురామరాజుగారు ప్రధానంగా పోస్ట్‌మోడరన్ భావనలనే ఆసరా చేసుకున్నారని తెలుస్తున్నది, దానికి సంబంధించిన వాచక అధ్యయన పద్ధతులు రచనను - దాని చుట్టూ, దానిలోనూ ఉన్న సామాజిక వాస్తవికత నుండి వేరుచేసి వాక్యాల, అర్థాల భావాల పోగుగా పరిశీలిస్తాయని నమ్మవలసి వస్తున్నది. ఆధునికానంతర వాద పరిశీలనల మంచిచెడ్డల గురించి చర్చించనవసరం లేకుండానే - రఘురామరాజుగారు వాచక అధ్యయన పద్ధతిని అన్వయ విమర్శగా కూడా అభివృద్ధి చేసి, మైదానం నవల మీద యిచ్చిన నిర్ధారణల దృష్ట్యా పై మాట

అనవచ్చు.

మైదానంను క్షుణ్ణంగా చదివితే రాజేశ్వరి స్వభావం, ప్రవర్తనగాని అమీర్‌తో సంబంధంగాని బాల్యంలోని నిరాదరణ, మృత్యుత్వభావన పరిధిలో యిమిడేవికావని, సామాజిక స్పృహలేకుండా వివరించడానికి వాచకం అంగీకరించదని అర్థమవుతుంది. వచన రూపాల అధ్యయనంలో పాత్రల స్వభావం ప్రధానంగా ఉంటుంది. దీన్ని పాత్ర మానసిక ప్రపంచం నుండి అక్కడి సంఘర్షణ నుండి వాచకాన్ని పరిశీలించడం, వాచకంలో నుండి పాత్రల మనస్తత్వాన్నీ, దానికి కారణాలను వెతకడం - అనే రెండు పద్ధతుల్లో కొనసాగించడం వల్ల మేలు జరుగుతుంది. రచన లోతులను అర్థం చేసుకోవడానికి యిదొక ముఖ్యమై మార్గంగా నిలబడుతుంది. రఘురామరాజు గారు ప్రధానంగా పాత్రల మానసిక జగత్తు నుండి వాచకాన్ని పరిశీలించడానికే పరిమితం కావడం వల్ల వాచకంలోని ప్రకటిత, అప్రకటిత ప్రగాఢ అంశాలను వదిలేశారు. మనో విశ్లేషణలోకి వెళ్లిపోయి ఒకటి రెండు వాక్యాల ఆధారంగా నవలను భిన్నమైన చట్రంలోకి తీసికెళ్ళారు. రాజేశ్వరీ - అమీర్ - మీరా సరబంధాలను సాంఘిక సంబంధాల్లో భాగంగా అందులోని సాంఘిక ధిక్కారం చాలా ప్రబలమైనది. రఘురామరాజుగారి విశ్లేషణలో అది అప్రధానం కావడానికి, నిమిత్తం లేకపోవడానికి కారణం ఆయన పాత్రల మనస్తత్వం విశ్లేషణలో పడి వాచకానికి దూరం వెళ్ళిపోవడమే. వాస్తవానికి మైదానంలో సమాజం లేదనే అభిప్రాయం ఒకటి ఉంది. కాని వాచకాన్ని సునిశితంగా చదివితే రాజేశ్వరి - అమీర్- మీరా సంబంధాలను ప్రేరేపించినవి, ప్రభావితం చేసినవి సామాజిక సంబంధాలే. స్త్రీ - పురుష సంబంధాల్లోని దుర్మార్గం, ప్రేమరాహిత్యం రాజేశ్వరి ప్రవర్తనకు కారణమై మైదానంలోకి వెళ్ళడానికి కారణం అయ్యాయి. నేరుగా సామాజిక, ఆర్థిక సంఘర్షణ కోణాలు కనిపించకపోవచ్చుగాని, వాటి నిర్దేసితమైన అంశాలు చలంకు ప్రేరణ అయ్యాయి. ఉద్వేగానికి, భయానికి తేడా తెలియని భర్తతో కాపురం చేయవలసిన స్థితి, దాని ధిక్కారానికి కలిగిన ప్రేరణ, ఆ తర్వాత తీసుకున్న నిర్ణయాలు కేవలం వైయుక్తికం కాదు, భావనాత్మకమైనవీ కాదు. కల్పనా సాహిత్యంలోకి వచ్చే మానవ సంబంధాల చిత్రణలో సమాజం ఎన్నెన్ని రకాలుగా, ఎన్ని అంశాలు కేంద్రంగా ప్రతిబింబించే అవకాశం ఉన్నది? అని యింకా ఆలోచించమని 'మైదానం' మనల్ని హెచ్చరిస్తుంది. మైదానంలోని సమాజం దాని వాస్తవికత అనేవి వాచక అధ్యనంలో తప్పక మనలను నిర్దేశిస్తాయి.

రఘురామరాజుగారు వాచకాన్ని దాటివెళ్ళిన రెండోతీరు ప్రత్యేకంగా చెప్పనవసరం లేకుండా ఈ పుస్తకంలో ప్రస్ఫుటమవుతుంది. ఎందుకంటే మొట్టమొదటి వ్యాసంలోనే 'చలాన్నీ, చలం రచనలను, ఆయన జీవితంలోని కొన్ని అంశాలను పునఃపరిశీలిద్దాం. కొన్ని పోలికలను గుర్తించుదాం. కొత్త సంబంధాలను ఏర్పాటు చేద్దాం' అంటారు. 'మైదానం' విశ్లేషణ నేపథ్యంలో ఈ స్పృహ పనిచేస్తూనే వచ్చింది. చివరి రెండు వ్యాసాల్లో మైదానంను, చలంను అర్థం చేసుకోవడానికి వాచకం బైట సామాజిక విశ్లేషణలోకి వెళ్ళిపోయారు.

'ఈ నవల పాఠకుల పరిధి చాలా విస్తృతమైనది. ఈ నవల కేవలం ఒక గొప్ప వాచకమే కాదు. ఉద్భృతమైన ఉద్యమం కూడా. యిక్కడ ఈ చర్చని యిలా ప్రారంభిద్దాం' (పేజి 64) అంటూ హిందూ - ముస్లిం సంబంధాల చర్చలోకి వెళ్లిపోయారు. రచయిత పరిధి నుండి బైటికి వచ్చి వాచకానికి పాఠకునికి మధ్య సంబంధంలోని ప్రత్యేకతల చర్చలో పాఠకుల విస్తృత పరిధిని గుర్తించడానికి రచన నిర్మాణాన్ని దాటి సామాజిక వ్యవస్థా నిర్మాణం వైపు దృష్టి సారించక తప్పలేదు. ముందుమాటలోనే చలాన్ని స్థూల దృష్టితో చూచే ప్రయత్నం ('చలం : వ్యవస్థా నిర్మాతా లేక భావావిష్కర్తా' అనే వ్యాసంలో) గురించి చెప్పుకున్నారు. వాస్తవానికి వెలుపల ఉన్న సమాజం గురించి చాలా పరిశీలనలు చేస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే పైన ప్రస్తావించినట్టు మొదటి వ్యాసం నుండీ ఈ లక్షణాన్ని చూస్తాం.

ఈ మొత్తానికి మళ్ళీ ఆయనే అనుబంధ వ్యాసంలో వివరణ యిచ్చారా? అనిపిస్తుంది. 'స్థానిక' ముద్రతో మన ఆధునికోత్తర వాదం అనే ఉపశీర్షిక కింద చిట్టచివరగా యిలా ముగిస్తారు. 'ఒక వాచకం నుంచి రకరకాల భాష్యాలు తీసే సంప్రదాయం మనకుంది కాబట్టి మనం రచయితను ధిక్కరించవలసిన అవసరం, వాచకాన్ని తగలబెట్టాల్సిన అవసరమూ లేదు. రకరకాల భిన్నమైన అర్థవంతమైన, భాష్యాలను ప్రతిపాదించవచ్చు' అని.

ఇప్పుడు - వాచక విమర్శలో వాచకానికి దూరమైపోవడం ఎందుకు తటస్థించింది? అని ఆలోచించడం తప్పనిసరి. రచయితను వదిలి రచన ఏం చెప్తోంది? అనే పరిశీలించడం సాహిత్య అధ్యయనంలోకి సామాజిక సాంస్కృతిక శక్తుల ప్రాబల్యాన్ని, అది వాచకంలో వ్యక్తమైన తీరు గురించి అన్వేషణకు దారి చూపుతుంది. అప్పుడు రూపొందే పాఠాంతరాలు వాచకంను మారుతున్న సామాజిక సంబంధాల్లో గుర్తించి కొత్త అర్థాలను సమకూర్చడం ద్వారా లోతులను వెలికితీస్తాయి. లేకపోతే వాచక విమర్శ భాషా ప్రయోగం గురించి, వినియోగం గురించి మాత్రమే మాట్లాడినట్టవుతుంది. వీటి ఆధారంగా సాగే విశ్లేషణ అంతిమంగా వాచకానికి భిన్నమైన నిర్ధారణలు సాగడానికి యిదీ ఒక కారణం అవుతుంది. రచన పుట్టడానికి కారణాలైన వాటిని వదిలి రచన అంతర్గత నిర్మాణం గురించి మాట్లాడనప్పుడు; రచయిత ఉద్దేశ్యంతో కనీస నిమిత్తం లేని విశ్లేషణ చేసినపుడు వచ్చే నిర్ధారణలు ఎలా ఉంటాయి? అసలు అట్లా చేయడం సాధ్యమేనా? అనే రెండు ప్రశ్నలను 'మైదానంలోతుల్లోకి' లేవదీస్తుంది. రచయితను అధిగమించడం అనేది వాచకాన్ని అధిగమించడంగా మారే ప్రమాదం ఉంటుందా? అనే అప్రమత్తతను కలిగిస్తుందీ పుస్తకం. రచయిత ఉద్దేశ్యాలతో నిమిత్తం లేకుండా వాచకాన్ని చదివితే ఎలా ఉంటుందో మైదానమే ఉదాహరణ అవుతుంది. మైదానాన్ని విచ్చలవిడి శృంగారం గురించి రాసిన నవల అనుకొనే ప్రమాదం అక్కడి నుండి వస్తుంది. కన్యాశుల్కం కూడా అంతే. శ్రీశ్రీ బీభత్సరస ప్రధానం అని చెప్పడమే ఆనాటకం మీద సవ్యమైన అంతర్గత పరిశీతలనకు ఉదాహరణ. వాచక అధ్యయనంలో రచయితకు, వాచకాన్ని దాటిపోతే అది కేవలం హాస్యరచనగా అభిప్రాయపడవచ్చు. నిజానికి రచన అంతర్గత నిర్మాణ, భాషా విశేష, వినిమయ పరిశీలన సవ్యంగా సామాజిక సాహిత్య దృక్పథం ఆధారంగా చేయడం వల్లనే కన్యాశుల్కం లోతులు అర్థమయ్యాయి. దీనికి భిన్నమైన పద్ధతి ఏదైనా సరే వాచకంలోని రహస్యాలను వెలికి తీయడానికి ఉపకరించవచ్చునేమోగాని అది ఆ రచన నిజమైన లోతును ప్రకటించజాలదు. అది సమగ్రమైన వాచక అధ్యయనం కాజాలదు. అంతకు మించి అది అనివార్యంగా సాహిత్యానికి - వాచకానికి - స్వతంత్ర ప్రతిపత్తిని ఆపాదిస్తుంది. రఘురామరాజుగారు చివర్లో చెప్పినట్టు వాచకం నుండి రకరకాల భాష్యాలు తీసే 'మన' సంప్రదాయంలో కూడా ఈ లక్షణం ఉన్నది.

రఘురామరాజుగారు అక్కడి పోస్ట్‌మోడర్న్, యిక్కడి ప్రమోదర్న్ కలయికలో రూపొందించిన వైధానికంలోకి ఈ లక్షణం ప్రవహించింది. వాచకానికి వాచకమే పరమమై దాని నిర్మాణ అంతరాల్లోకి ప్రయాణించడం వల్ల కలిగే మేలు స్వీకరించదగిందైనా, దానికి తోడైన ఈ లక్షణం ఎప్పటికైనా చర్చనీయాంశమే అవుతుంది. దీనివల్ల వాచకానికి జరిగే అపచారం మొత్తంగా మన సాహిత్య అధ్యయన దృక్పథంలో లోపాలకు కారణం అవుతుంది.

*

మనవి

నవంబర్, డిసెంబర్ కలిపి సాహిత్య విమర్శ సంచికగా తీసుకురావడం వల్ల పత్రికలో మామూలుగా ఉండే ఇతర శీర్షికలు లేవు. రచయితలు, పాఠకులు గమనించగలరు. - సంపాదకవర్గం

పుస్తక సమీక్ష ✫ వి. ప్రతిమ

'దామదచ్చియలో...'
స్త్రీ కన్నీళ్ళు లేని రాజ్యం కోసం

సుహాసిని అప్పుడప్పుడూ మా యింటికి వస్తుంటుంది... వచ్చినపుడల్లా 'చాట్లో చెయ్యేస్తాను ప్రతిమా' అంటుంది.... శ్రమలో భాగం పంచుకోవడం, మనసులు దగ్గర కావడం ఒకదానికొకటి అనుబంధంగా వుంటాయని చెప్పకనే చెప్పినట్టయ్యేది...

'తోటి వారిని కలుపు బాట పాటన్నావు' అన్న వాక్యం చదవగానే చప్పున సుహాసిని మా యింటికొచ్చినపుడల్లా అనే మాట గుర్తుకొచ్చింది....

పాట నిజంగానే మనుషుల్ని కలిపి ముడేస్తుంది...

మధుర మంజుల గానం చెవిని సోకినపుడు ఆ గానాన్ని విన్పించిన గొంతుకని ప్రేమిస్తాం మనం మనకి తెలీకుండానే.. ముప్పయి మూడేళ్ళనాడు మరణించిన ఘంటసాలని యివ్వాల్టికీ ఎందుకు మరిచిపోలేకుండా వున్నాం.... ఆశాభోంస్లే, లతామంగేష్కర్, సుశీల, జానకి వీళ్ళందరినీ ఎందుకు యిష్టపడతాం?... కేవలం వాళ్ళ గొంతుల్లోని మెలోడీ... పాటకి అంత గొప్ప శక్తి వుంది మరి...

మన సమాజ పురోగతి క్రమంలో అంటే పోరాటాల్లోనూ, ఉద్యమాల్లోనూ ముఖ్యంగా విప్లవోద్యమంలో సాహిత్యమూ, కళలూ ఎంతటి ప్రముఖపాత్ర వహించాయో మనందరికీ తెలుసు... అందునా పాట చాల శక్తివంతమైన వాహికగా పనిచేసింది...

సాహిత్యంలోని మిగిలిన ప్రక్రియలు అంటే కథ, కవిత, నవల నాటకం వంటివి కేవలం పుస్తకాలకే పరిమితమైపోతే, ఒక్కపాట మాత్రమే ప్రజల నాలుకలమీద నిలిచి అలా అంటుకుంటూ పోతుంది.... అందుకే పాట ఒక శక్తివంతమైన వాహిక.....

డా. లక్ష్మీసుహాసిని వ్రాసిన "దామదచ్చియ్యలో....." అన్న ఈ పాటల పుస్తకంలో మొత్తం **41** పాటలున్నాయి. **17** పాటలు స్త్రీ వివక్ష, యితరాల మీద వ్రాసినవైతే **9** పాటలు సారా సమరం మీద, మూడు పాటలు సభలకు పిలుపునివ్వడం మీద మిగిలిన పన్నెండు పాటలూ అమరవీరుల స్మృతిలోనూ వ్రాసినవి... అన్ని విభాగాల్లోని పాటలు కూడ వేటికవే విలక్షణంగా వుండడం విశేషం....

'కలికి కన్నీళ్ళు లేని రాజ్యాన్ని తెద్దాంరమ్మని' బంజారాని పిలిచినా

'బతుకు తాకట్టు పెట్టి, తడికలల్లి చేతులు కాయలు కాసి చింకి చాపయిపోయిన 'చేటలల్లేచెల్లి' ని రమ్మన్నా... ముక్కు పచ్చేలారని మొగ్గల్ని మాతమ్మలుగా మార్చొద్దని వేడుకున్నా

'ఎవరో వస్తారని ఎన్నాళ్ళీ వెక్కిళ్ళు
పోరకుండా పోవు మనకున్న సంకెళ్ళు' అన్నదే అంతిమ సందేశం

'మనంపోరులోన సగమవుదాం
చెల్లీ నువు చేయి కలిపి బంధనాలు తెంచు
నాతల్లీ నువు చేయి కలిపి బంధనాలు తెంచు' అంటూ గొంతెత్తి పాడుతుంది.

'పిడికిళ్ళే మా ఆయుధమంటూ' పురుషపుంగవుల్ని ధిక్కరిస్తుంది.

'మంటలే మన చేతి ఆయుధాలు' అన్న పాటలో నెల్లూరు జిల్లాలోని వివిధ వూర్లలో కోడళ్ళు మంటల పాలయిన వైనాన్ని గురించి పేరు పేరునా ఆక్రోశిస్తూ యిందరి కోడళ్ళ స్టవ్వులూ ఒక్కసారే ఎట్లా పేలిపోయాయి తల్లీ అంటూ విషాదాన్ని ప్రశ్నిస్తుంది....

అలాగే 'ఇంటి చాకిరీ' 'ఏమిసెప్పనే' 'పోరక తీరని వ్యథలు' వంటి పాటలన్నీ కూడ స్త్రీల అణిచివేతకి సంబంధించి... పురుషుడి పెత్తనాన్నీ, ఆధిక్యతనీ నిలదీస్తూ తీవ్రస్వరంలో సాగినవే....

'పడగొడదాం' అన్న పాట కులపునిచ్చెనమెట్లనీ, కులమతాల అడ్డుగోడల్నీ... కులరక్కసి పొరల్నీ, దాడుల్నీ నిరసిస్తూ, ఎరడగడుతూ సాగుతుంది.... ఇదే బాణీలో సాగినపాట 'ముందూరు కొత్తబాట'

ఇకపోతే నెల్లూరులో దూబగుంట నుండి ప్రారంభమైన సారా వ్యతిరేకోద్యమాన్ని గురించి రాష్ట్రమంతటా తెలిసిన విషయమే... అరవయ్యేళ్ళ రోశమ్మ ఆనాటి కథానాయకి అయితే, ఆమె వెనుక ఆమెని ప్రోత్సహిస్తూ సారాని నిరసిస్తూ ఎందరో కార్యకర్తలు, ఎన్నో మహిళా సంఘాలు, మరెందరో మహిళలు జిల్లాలోంచి మారుమూల ప్రాంతాల నుండి కూడ తరలివచ్చి పికెటింగులు చేశారనీ, సారాజీవులను ఊళ్ళోకి రానివ్వకుండా తరిమితరిమికొట్టారనీ... కొండొకచో తగులపెట్టారనీ అప్పట్లో అందరమూ చదివిన వార్తలే... అయితే సుహాసిని వారితో స్వయంగా తిరగడమే కాకుండా వారి పోరులో భాగమయింది... వారి గొంతులో పాటయింది... వారితో కలిసి పిడికిళ్ళు బిగించింది.

ఆ క్రమంలో రాసినవే ఈ సారాపాటలు... అందుకే అవి అత్యంత సహజంగా రూపొందాయి... రాజ్యానికి జంకక, ఏ మాత్రం తలవంచక నిలదీస్తూ సాగుతాయి....

'మా కొంపలిట్ల కూల్చుడేంది నారాబాబు
అరె సారాతో సంపుడేంది సారాబాబు' అన్నా
'నీ జిమ్మిక్కులు సాలురోరి రాజశేఖరా
ఇక బ్రాందీలో ముంచబాకు బీరుశేఖరా' అన్నా ఆమె గొంతులో నిర్భయత్వాన్ని ఒక ధిక్కార స్వరాన్ని మనం గుర్తించగలం...

సుహాసిని తొలినాళ్ళలో విరసం సభ్యురాలుగానూ... ఆ తర్వాత చైతన్య మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగానూ పనిచేసింది.... అంటే పోరాడటం, ఉద్యమం అన్నవి ఆమె జీవితంలో విడదీయరాని భాగాలు... ఆ క్రమంలో విరసం సభలు ఎంత ఉత్సాహపూరితంగా, ఎంత విజ్ఞానవంతంగా, ఎంతబోధనాపరంగా జరుగుతాయో సుహాసినికి బాగాతెలుసు.

ఒక్క విరసం సభలనేకాక ఆస్థాయిలో జరిగే మిగిలిన సభలను కూడ గౌరవిస్తుంది.... అందుకే సభలకు పోదాం రమ్మంటూ కార్యకర్తల్ని బయల్దేరదీస్తూ గళం విప్పుతుంది.

ఇకపోతే చివరగా -నిజానికి ముందుగా-

ఉద్యమమే తమ ఊపిరిగా, ప్రాణాలే తృణప్రాయంగా పోరుకొరకు అమరులయిన అన్నల కోసం సుహాసిని పాడిన దుఃఖపుపాటలు శ్రోతల హృదయాలను చిన్న చిన్న కత్తులతో గాట్లు పెడతాయి....

"ఎర్రెర్రని మందారాలు ఏమయినవే" అని అడిగినా
'నిన్నపూసిన పొన్నపూలు ఏమయినాయి' ప్రశ్నించినా
'కవిత్వంపై ఎర్రజెండా'లో ఆమెపాట 'తురాయి పూల' ఎర్రదనాన్ని గురించి చర్చించినా ఆమెలో అమరవీరులకోసం ఆర్తి, ప్రేమ కన్పిస్తాయి... ఎదులో నెత్తురు పొంగులెత్తుతుండగా అమరవీరులకి అంజలి ఘటిస్తుంది...

చిన్నబాబుకీ, చిన్నశివాకి పరిపరిదండాలందిస్తుంది. వాళ్ళంతా చిరంజీవులేనంటుంది... పిడికిళ్ళు బిగిసేలా, హృదయాలు ఎగిసేలా వారితో పాడాలంటుంది....

విప్లవ రచయిత కె.వి.ఆర్‌కి స్వయానా శిష్యురాలు సుహాసిని.. అనంతమైన ఆయన సాహిత్యం మీద రీసెర్చి చేసి ఆ థీసిస్‌ని 'సాహిత్యంలో అరుణతార' అన్న పుస్తకంగా ప్రచురించింది... గురువు కె.వి.ఆర్. మీద కూడ ఒక పాటుంది యిందులో. "లాల్‌సలాం కె.వి.ఆర్." అంటూ...

మొత్తంమీద "దామదచ్చియలో..." లోని పాటలన్నీ కూడ మనమంతా మనసారా పాడుకోదగినవి... జీవితాల్లో నుండి పుట్టుకొచ్చినవి కాబట్టి వాటిలో ఆర్తి, సహజత్వమూ తొంగిచూస్తుంటాయి...

కొని దాచుకోదగిన పుస్తకం

*

పుస్తక సమీక్ష

గవాయి :

ముస్లీం వాదాన్ని ఏకాకిని చేసే కుట్ర

☆ మహమూద్

ఈ మధ్య కొంతమంది మేధావులు ముస్లీంల మీద కాస్తంత ఎక్కువ ప్రేమే చూపిస్తున్నారు. వీళ్ళు "ముస్లీంవాద సాహిత్యాన్ని" ఉద్ధరించాలనే బృహత్తర బాధ్యతను స్వీకరించారు. చీకటి సమయాల్లో ఎలుకలు ఆహారాన్వేషణ కోసం బయటికొచ్చి ఆహార పదార్థాన్ని కెలికినట్లు అవసరమున్నా, లేకున్నా ఏదో ఒక విషయాన్ని కెలుకుతూ, భూతద్దాలు పెట్టుకొని ఎవరెవరిలో ఎంతశాతం హిందుత్వం దాగి వుందో వెతుకుతూ, ఒక వేళ ఎవరిలో హిందూత్వ జాడ లేకపోతే వీరే దాన్ని ఆపాదించేసి వికృత ఆనందం అనుభవిస్తూ వుంటారు. శాస్త్రీయ ఆలోచనా విధానాలకు తిలోదకాలిచ్చి వీళ్ళు ఏది తోస్తే అది రాసేయడం చేస్తూ వుంటారు. తమలోని మేధావితనాన్ని(?) పుస్తకాల రూపంలో అచ్చేసి పంచుతూ వుంటారు. వీళ్ళ "మేధావిత్వం" ఎంత వరకూ వెళుతుందంటే - వీళ్ళు పనిగట్టుకొని తిట్టే కమ్యూనిస్టుల నుంచి వ్యాసాలు సేకరించి, తామూ ఓ వ్యాసంలో అదే కమ్యూనిస్టులను తిట్టిపోసి అచ్చేసి తమ మేధావితనాన్ని ప్రదర్శించుకుంటారు. దీనికి వీరు పెట్టే పేరు "చర్చ". ఇదో రకమైన వృత్తి. ఈ క్రమంలో అన్న పెలుపెలను తుంగలో తొక్కి వాదవివాదాలకు ఊపిరిపోసి బతికేస్తూ ఉంటారు.

అభిప్రాయాలు కలిగివుండడం తప్పుకాదు. తమ అభిప్రాయాలను కావలసినంత విపులంగా స్వేచ్ఛగా వ్యక్తీకరించుకునే హక్కు అందరికీ వుంది. తమకు నచ్చని ఏ స్రవంతినైనా, ప్రాపంచిక దృక్పథాన్నైనా విమర్శకు పెట్టవచ్చు. కాని ఒకరి విశ్వాసాలను దెబ్బతీయడం క్షమార్హం కాదు. ఒకరిలో లేని లక్షణాన్ని ఆపాదించడం, దాన్ని ప్రచారం చేయడం ఎవరికీ 'హక్కు' కాదు. తమది కాని వేదికపై బలప్రదర్శన నిర్వహించడం, హైజాక్ చేసి తమ సొంత అభిప్రాయాల ప్రచారం కోసం వినియోగించుకోవడం ప్రజాస్వామిక వాదుల లక్షణం కాదు. 'గవాయి' అనే పుస్తకంలో జిలుకర శ్రీనివాస్, చిట్టిబాబు ప్రదర్శించిన కోపం అదే!

ఇటీవల స్కైబాబా ప్రచురించిన ముస్లీంవాద కవితా సంపుటి 'జగ్‌నేకిరాత్'' పై వార్త (ఆదివారం) లో చర్చ జరిగింది. కందాళై ఆనందాచారి, చంద్రశేఖరరెడ్డి వంటి వారు జగ్‌నేకిరాత్‌పై అమానుష దాడి చేశారు. వార్త పత్రిక ఆ చర్చను అర్థాంతరంగా ఆపేయడం వల్ల జిలుకర శ్రీనివాస్ తన సంపాదకత్వంలో గవాయి అనే వ్యాస సంకలనం తెచ్చాడు. వార్తలో జరిగిన చర్చతోపాటు జగ్‌నేకిరాత్‌పై సదభిప్రాయం వున్న అనేక మంది నుండి వ్యాసాలు సేకరించి ఈ పుస్తకంలో అచ్చువేశారు. ఇందులో దాదాపు అన్ని ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న గౌరవనీయ స్థానంలో వున్న వ్యక్తుల వ్యాసాలున్నాయి. పైకి దళిత, ముస్లిం, స్త్రీ, విప్లవోద్యమాలు కలసి ఓ ప్రగతిశీల ముస్లింవాద కవి రాసిన 'జగ్‌నే కిరాత్' వైపు వకాల్తా పుచ్చుకొని నిలబడ్డ మంచి ప్రయత్నంగా "గవాయి" కనిపించినా లోపల మాత్రం 'విషం' ఉన్నదని పుస్తకం మొత్తం చదివాక అర్థం అవుతుంది. ముస్లీంలవైపు నిలబడి మాట్లాడుతున్నట్టుగా కనిపిస్తూనే ముస్లీంలను ఇతర ప్రగతిశీల సమూహాల నుండి దూరం చేయాలనే కుట్ర ఈ పుస్తకంలో కనబడుతుంది. ఈ మధ్యకాలంలో సాహితీ విలువలను ఇంతగా విస్మరించిన పుస్తకాన్ని నేను చూడలేదు.

"జగ్‌నేకిరాత్'' వంటి అద్భుతమైన కవిత్వంపై జరిగిన దాడిని ఖండించాల్సిన బాధ్యత ప్రజాస్వామిక వాదులందరిపై ఉంది. కాబట్టే దానిపై చాలా మంది స్పందించారు. ఇటీవలి కాలంలో సాహిత్యలోకంలోకి జొరబడిన సంఘపరివార్ శక్తులను ఉమ్మడిగా ఎదుర్కొనక తప్పని పరిస్థితి ఏర్పడిన ఈ సందర్భంలో ముస్లీంవాదాన్ని ఒంటరిగా మిగల్చాలనే జిలుకర ప్రయత్నించారని అనిపిస్తోంది. సంఘపరివార్ తన రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యాన్ని కాపాడుకోవడంలో భాగంగా సామాజిక సంబంధాలను ఛిన్నాభిన్నం చేస్తుంది. అసంఘటిత పరుస్తుంది. ఈ పుస్తకం ఒక రకంగా ఆర్ఎస్ఎస్ కుట్రను సులభతరం చేయడానికి ఉపయోగపడుతుంది. ఆర్ఎస్ఎస్ కమ్యూనిజాన్ని తన మొదటి శత్రువుగా భావిస్తుందని ఏ మాత్రం చారిత్రక జ్ఞానం ఉన్నవాళ్ళకైనా అనిపిస్తుంది. కాని ఈ పుస్తకంలో కమ్యూనిస్టులను, సంఘపరివార్‌లను ఒకే గాట కట్టే ప్రయత్నం జరగడమేకాకుండా కమ్యూనిస్టులు అంతిమంగా బ్రాహ్మణీయతనే ఈ దేశంలో ఆధిపత్య స్థానంలో నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నారనే దుర్మార్గమైన సూత్రీకరణ చేయడానికి వెనుకాడలేదు. ముస్లీంలను కమ్యూనిస్టుల నుండి దూరం చేయాలని కాకపోతే ముస్లీంవాదాన్ని సమర్థించే పుస్తకంలో కావాలని కమ్యూనిస్టులను ద్రోహులుగా చిత్రించే ప్రయత్నం ఎందుకు చేసినట్టు? ఇది ఆర్ఎస్ఎస్ పన్నే కుట్రలకంటే దారుణమైనది.

ఆర్ఎస్ఎస్ ముస్లీంలకు ఎంత ప్రమాదకరంగా పరిణమించిందో ఆదే కోవకు కమ్యూనిస్టులు చెందుతారని సూత్రీకరించడం ఎవర్ని మోసం చేయడానికి? భారత సమాజంలో అన్ని సమూహాలకు సంఘపరివార్ ఉమ్మడి శత్రువు అన్నది నిర్వివాదాంశం. సంఘ్‌భావజాలం, రాజకీయ లక్ష్యాల పట్ల వ్యతిరేకత ఉన్న అన్ని స్రవంతులను ఒక విశాలమైన ప్రాతిపదికపై బలమైన ప్రజాస్వామిక ఉద్యమం నిర్మించాల్సిన చారిత్రక సందర్భంలో ఇలాంటి పుస్తకాలు వాతావరణాన్ని కలుషితం చేస్తాయి తప్ప ఏ ప్రయోజనం సాధించబోవు.

భారతదేశంలో పీడితులుగా దళిత, స్త్రీ,మైనారిటీవర్గాల పోరాట నేపథ్యాలు వేరు. ఉమ్మడి శత్రువు మాత్రం సంఘపరివార్ అనే మౌళికమైన విషయాన్ని అంగీకరించి ముస్లీంవాద ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచే ఏ ఒక్కరిని ముస్లీంలు వదులుకోలేరు. అది కమ్యూనిస్టులా? ఇంకొకరా? అన్నది అప్రస్తుతం. విశాల ఐక్య సంఘటనల్లో అభిప్రాయబేధాలుంటాయేమో కానీ అపనమ్మకాలు, అపోహలు కావాలని సృష్టించే విధానం మంచిదికాదు. శత్రువైరుధ్యం కంటే మిత్రువైరుధ్యమే సమాజానికి, సాహిత్యానికి మంచిదనీ, ఇచ్చిపుచ్చుకొనే ప్రజాస్వామిక లక్షణం అభివృద్ధికి తావిస్తుందని ముస్లీంవాదులు ప్రకటించాలి. ఈ దేశంలో ముస్లీంలు అనుభవిస్తున్న అన్ని రకాల అణచివేతలకు మూలాలు ఎక్కడున్నా వాటిని తుంచే ప్రక్రియ ఎవరు చేపట్టినా ముస్లీంలకు అభ్యంతరం లేదు. సమాజాన్ని సమైక్యపరిచే ఏ కోణాన్నైనా ముస్లింలు అంగీకరిస్తారు. ఏ ప్రజల ఆకాంక్షలనూ, బాధలనూ, కన్నీటి తడిని ఇవాళ ముస్లీంవాదం తన రచనా ప్రస్థానంలో వ్యక్తీకరించగలుగుతుందో ఆ ప్రజలకు నష్టం కలిగించే ఏ చర్యనైనా ముస్లీంలు హర్షించరు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి జగ్‌నేకిరాత్ వెనుకమాట అయినా, జిలుకర శ్రీనివాస్, చిట్టిబాబులు గవాయిలో చేయబూది. అదే! సాహిత్యంలో విలువలు ఇలా క్షీణించడంలో మనం పాత్రధారులమౌదామా? లేదా అందరిని కలుపుకొని విశాలమైన ప్రజాస్వామిక ఉద్యమం నిర్మిద్దామా? తేల్చుకోవలసింది ముస్లీంవాదులే?

*

వేంపెంట వైపు నుండి దళిత సాహిత్య పరిశీలన !

☆ పెద్దరామస్వామి

ఘటన సామాజిక స్థితికి వ్యక్తరూపం.

అంతమాత్రమేకాదు, దాన్ని యింకా చాలా రకాలుగా చూడవచ్చు. తీవ్రమైన సామాజిక వ్యక్తతనూ - దానికి ముందు, తర్వాత సాగిన అంతర్గత పరిణామాలనూ కలిపి చదువుకొనే పద్ధతి అందరికీ తెలిసిందే. ఘటన సంకేతంగా, ఉదాహరణగా కాక ఒక గీటురాయికావడానికి కూడా అవకాశం ఉంటుంది. ఘటనద్వారా మన అనుభవంలో, అవగాహనలో భాగమైన చైతన్యం ఒక మలుపును సూచించే చారిత్రక ప్రాధాన్యం కలిగిందిగానేగాక, ప్రతి సమకాలీనాంశాన్ని పరీక్షించుకోవడానికి దోహదపడుతుంది. అవ్యక్తంగా, చైతన్యరూపంగా ఉన్నవాటికి ఘటన ఒకానొక భౌతిక వాస్తవిక రూపాన్ని అందిస్తుంది. అప్పుడు ఘటన నిర్దిష్ట స్థలకాలాల యదార్థానికే పరిమితం కాకుండా, వాటి ఆధారంగా అనేక సమకాలీనాంశాలకు గీటురాయిగా మారుతుంది. ఒక ఘటన గురించి పదేపదే చెప్పుకుంటున్నామంటే - దాని సమకాలీన విస్తరణ రూపంగా స్వీకరిస్తున్నామని అర్థం చేసుకోవచ్చు.

యింత ఉపోద్ఘాతం దేనికంటే - వేంపెంటలో మాదిగలపై, బలహీనవర్గాలపై జరిగిన మారణకాండకు సంబంధించిన కేసును కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో (11,డిసెంబర్ 2006) దళితసాహిత్యం గురించి ఆలోచిస్తుంటే - ఒక ఘటనకూ, నడుస్తున్న కాలంలోని సామాజిక, సాహిత్య పరిణామాలకూ సంబంధం ఏమైనా ఉంటుందా? ఉంటే ఎట్లా ఉంటుంది? అనే సందేహాలు తలెత్తాయి. దాని చారిత్రక ప్రాధాన్యతను గుర్తించడంతోనే సందేహనివృత్తి జరగదుగదా.

వేంపెంటలో 1998 జూలై 16న జరిగిన ఘటనమీద కోర్టు యిచ్చిన తీర్పు ప్రకారం అక్కడ ఏం నేరం జరిగింది? నేరస్తులు ఎవరు? అనేవి యతమిద్ధంగా తేలనట్టే తాను నిర్దేశించుకున్న చట్రంలో సాక్ష్యాధారాలు దొరికితేగాని నిర్ధారణకు రాలేని న్యాయవ్యవస్థకూ - సాహిత్యానికీ ఏ రకంగానూ పోలిక ఉండదు. సాహిత్య రచనకు సంఘటన ఎంత ప్రేరణగా పనిచేసినా; ఘటనలో కనిపించే నిజానిజాలను తేల్చుకొనే విచక్షణ, వైఖరి దగ్గరే ఆగిపోకుండా అక్కడ తేలిన అంశాల ఆధారంగాసాగే జీవిత అన్వేషణ ఫలితంగానే సాహిత్యం రూపొందుతుంది. అందుకే సామాజిక అంతర్గత స్థితిని, సంఘర్షణను ప్రకటించే ఘటనలను రచయితలు ఘటనలుగానే చూచి సంతృప్తి చెందరు, జీవిత అన్వేషణలో నిగ్గుదేల్చుకోవలసి వచ్చినప్పుడల్లా ఘటనల గీటురాయిమీద అప్రమత్తమవుతూ ఉంటారు.

వేంపెంట కేసు కొట్టేయడం అనూహ్యమేమీకాదు. మానవ జీవితంలో నేరం లేదా అవాంఛనీయఘటనలు జరిగిన, జరగడానికి అవకాశం ఉన్న ఆవరణకూ - న్యాయవ్యవస్థ నేరాన్ని పరిగణలోకి తీసుకొని సాక్ష్యాధారాలతో నిర్ధారణకు వచ్చే ఆవరణకూ మధ్య చాలా ఎడం ఉంటుంది. అందువల్లనే కోర్టులు తాముకోరుకొనే పద్ధతిలో సాక్ష్యాధారాలు దొరికి నేరాన్ని గుర్తించినా, నేరస్వభావాన్ని గుర్తించలేవు. అందులోనూ నేరం జరిగిందనుకుంటున్న 'జీవిత ఆవరణ'లోకి తొంగిచూడటం తమ కర్తవ్యం కాదని కూడా కోర్టులు అనుకుంటాయి.

ఈ తరహా చర్చలోకి వెళ్ళనవసరం లేదుగాని, వేంపెంటకు సంబంధించిన రెండు కేసులను కోర్టు కొట్టేసింది. మాదిగ, బలహీన వర్గాలపై దాడికేసు, దానికి నేపథ్యంలో ఆరోజు రాత్రి విప్లవకారులు ఒక వ్యక్తిని హత్యచేసిన కేసు రెండింటిని కొట్టేస్తూ ఒకేసారి తీర్పు యిచ్చింది. తెరవెనక్కి వెళ్ళితే రెండుకేసుల్లోని ముద్దాయిలు ఎప్పుడో రాజీపడ్డారు. ఆ రకంగా వేంపెంట సమస్య పరిష్కారమైపోయింది. 'రాజీకుదరడం' అనేదాన్ని చట్టపరిధిలో చూస్తే మనమూ కోర్టు తీర్పు దగ్గరికే వచ్చి ఆగిపోతాం. ఈ ఘటనలోని సంఘర్షణ, కేసుల్లోకి వచ్చిన వాస్తవాలు - వ్యక్తీకరణలు, న్యాయవ్యవస్థకు ఉండే అగ్రవర్ణస్వభావం మొదలైన విశ్లేషణల చట్రాన్ని దాటితే యింకా ఈ 'న్యాయక్రమం' వెల్లడి చేస్తున్న అనేక సమస్యలు కనిపిస్తాయి.

* * *

ఇప్పుడు సాహిత్యానికే పరిమితమై - వేంపెంట వైపు నుండి దళిత సాహిత్య ధోరణిని చూడ్డంవల్ల ఏమనా ప్రయోజనం ఉంటుందా? అనే ప్రశ్న వేసుకోవడం అవసరం. ఎందుకంటే సామాజిక స్థితి వ్యక్తరూపమైన ఘటన వెనుక, దాని పూర్వాపరాల వెనుక ఉన్నవాటిని చర్చించడానికి సాహిత్యరంగమే బలమైనవాహిక కాబట్టి.

దళిత సాహిత్య విశ్లేషణలో కారంచేడు కేంద్రంగా ఉండటం దాని చారిత్రకతను తెలియజేస్తుంది. కారంచేడు పూర్వాపరాలు దళిత సాహిత్య క్రమంలోని అనేక చలనాలకు, చైతన్యాలకు, వ్యక్తీకరణరూపాలకు సామాజిక ఉపపత్తిని సమకూర్చాయి. దాని ప్రాధాన్యత అటువంటిది. అట్లా వేంపెంటవైపు నుండి దళితసాహిత్యాన్ని చూడ్డానికి - కనీసం కేసుకొట్టివేత అయినా ఒక సందర్భంగా నిలబడుతుందని నమ్మకం. కారంచేడు, చుండూరు ఘటనల్లోని వ్యక్తాంశాలు దళిత సామాజిక, సాంస్కృతిక జీవితంలోని అవ్యక్తాంశాల దగ్గరికి తీసుకపోయి, ఆ జీవన పునాదిని ప్రతిబింబించడంలో సాహిత్యరంగాన్ని నిర్దేశించింది. అట్లా 1998 తర్వాత దళిత సాహిత్య ప్రయాణం మీద వేంపెంట ఏమైనా ప్రభావం చూపిందా? సూటిగా ఈ ప్రశ్న వేసుకుంటే కొత్త పరిశీలనలకు ఆస్కారం ఉండొచ్చు.

అయితే వేంపెంట ఘటన జరిగేనాటికి దళితవాదంలో సామాజికంగా, సాహిత్యపరంగా జరిగిన ముఖ్యమైన పరిణామాన్ని స్థూలంగానైనా గుర్తు చేసుకోవాలి. కారంచేడు ఉద్యమంలో రూపొందిన దళితనాయకత్వం రాజకీయాల్లో, సాహిత్యంలో కూడా వేంపెంట వాటికల్లా ఫేడ్అవుట్ అయిపోయింది. కొత్తశక్తులు ముందుకు వచ్చాయి. 1985-95 దశాబ్దంలోని దళిత విశ్లేషణలు వెనక్కిపోయి, కొత్త ఆకాంక్షల మీద కొత్త సమీకరణాలను మోసుకొని కొత్తతరం ముందుకు వచ్చింది. దళితక్షేత్రం అంతా కొత్త నిర్వచనాల, వ్యాఖ్యానాల పునర్నిర్మాణానికి గురికావలసి వచ్చింది. మాదిగ దండోరా ఆవిర్భావం దళిత ఉద్యమంలో, సాహిత్యంలో అలాంటి ఒక కీలకమైన మలుపు. అది దళితసాహిత్యం అప్రమత్తం కావలసిన సందర్భం. అక్కడ నిలబడి గతాన్ని, వర్తమానాన్ని వివరించవలసి ఉండింది. కానీ ఆ పని జరగలేదు, జరగకపోవడం కూడా కొత్త ఆకాంక్షల, సమీకరణాల ప్రాబల్యాన్ని సూచిస్తుంది. అందులోని భావోద్వేగాల తీవ్రతను వేంపెంట ఘటన దిగ్భ్రాంతికరం చేసింది. దళిత సాహిత్యధోరణి సహజంగానే సృజనాత్మక సాహిత్యంలో వ్యక్తమయినంతగా సామాజిక వ్యాఖ్యానంలో మేధోశక్తిని విడుదల చేయలేకపోయింది. ఈ మాట కొంచెం నొప్పి కలిగిస్తుందేమోగాని - ఈ వైపు నుండి సహనంగా చూడ్డం వల్ల భవిష్యత్తు మాటేమోగాని, గతాన్ని లోతుగా చూడ్డానికి వీలవుతుంది. యివి ఎట్లాగూ ఆవేశావేశాలకు, ఉద్రిక్తసూత్రీకరణలకు కాలం చెల్లిన రోజులు కాబట్టి నిబ్బరంగా అన్వేషించవచ్చు.

ఈ మాట ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే - మాదిగదండోరా సృజించిన భావోద్వేగాల సన్నివేశంలో వేంపెంట ఒకానొక దిగ్భ్రాంతికరమైన అనుభవంగా మిగిలిపోయిందేకావి, సృజనాత్మకరంగంలోని మేధో అవసరాన్ని రచయితలు పట్టించుకోలేకపోయారు. ఆ డిమాండ్‌ను దళిత రచయితలు స్వీకరించలేకపోయారు. ఈ వైఫల్యం వల్ల దళితసాహిత్యకారులు వేంపెంట ప్రభావానికి లోనుకాలేకపోయారు. దాన్నుండి ఏమీ తీసుకోలేకపోయారు. నిజానికి యింకోరకంగా చూస్తే ఈ అవసరాన్ని మేధోస్థాయికి తీసుకపోనవసరం లేకుండానే అప్పటికే దళితసాహిత్యానికి నిండుగా ఉన్న జీవితానుభవ గాఢతనుండయినా ఈ దిగ్భ్రాంతికరమైన దాని వెనుక ఉన్న క్లిష్టతను అన్వేషించడానికి పూనుకొని ఉండాల్సింది. అదే జరిగి ఉండింటే దళిత సాహిత్యమేగాక, మొత్తంగా తెలుగు ప్రగతిశీల సాహిత్యశిబిరం శక్తివంతం

అయివుండేది. సాహిత్యం సామాజిక తాత్వికతను గాఢంగా ప్రకటించుకొని ఉండేది.

కారంచేడు నుండేగాక యింకా వెనక్కి వెళ్ళి కంచికచర్ల; కాటూరు ఎలమర్రుకాలం నుండి దళితులపై జరిగిన దాడులను పరిశీలిస్తే, వాటికీ - వేంపెంట ఘటనకూ అంతర్గత స్వభావరీత్యానే చాలా తేడా ఉన్నట్టు తెలుస్తుంది. తక్కినవాటికంటే వేంపెంట మారణకాండకు దారితీసిన పరిస్థితులు చాలా సంక్లిష్టమైనవి. దళితుల ఆత్మగౌరవ ప్రకటనను, ప్రతిఘటనను మన సామాజిక వ్యవస్థలోని అనేకానేక క్లిష్టతల నుండి వేంపెంట వినిపించింది.

దళితులు ఆత్మగౌరవాన్ని ప్రకటించుకుంటే తమ క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రతిష్ఠించుకుంటే, అది నిర్ణయాత్మక రూపంలో (అది సర్వామోదం పొందే రూపం కానవసరంలేదు) కూడా ఉంటే సమాజం ఎట్లా ప్రతిస్పందిస్తుంది? అనేది చాలా ముఖ్యమైన విషయం. దళితులపై జరిగిన దాడులన్నీ ఈ ప్రతిస్పందన ఫలితాలే. వేంపెంటలో అయితే ఆ నిర్ణయాత్మకత మాదిగల్లో (ఏకొంచెమో) ఉంటే మాలలు ఎట్లా ప్రతిస్పందిస్తారు? అని నిర్దిష్టంగానూ, ఏ కింది కులమైనా అలా వ్యవహరిస్తే మిగితా కులాలన్నీ ఎట్లా తీసుకుంటాయి? అనే సాధారణ స్థాయిలోనూ అనేక విషయాలను బైటికి లాగింది. అంటే వేంపెంటలో భిన్న సమాజాల ప్రతిస్పందనను చూడవలసి వచ్చింది. యిది కులవ్యవస్థ సంక్లిష్టతకు అచ్చమయిన ఉదాహరణ.

అప్పటికే న్యాయమైన ఆకాంక్షతో వచ్చిన మాదిగ దండోరా వల్ల మాదిగ - మాల సొంతదనం, ప్రత్యేకతలు, ప్రయోజనాల గురించిన సంఘర్షణ సామాజికంగా వైమనస్యానికి దారితీసినప్పటికీ, ఈ అనుభవం ఇంచుమించుగా ఏమీ లేకుండానే వేంపెంటలో ఇంతకన్నా తీవ్రమైన కులవైరుధ్యాలు బయటికి వచ్చాయి. రాయలసీమ భూసామ్యానికి అదనపు సక్షణంగా ఉన్న ఫ్యాక్షనిజం తోడై సామాజిక వ్యవస్థ క్లిష్టతనంతా విషాదంగా మన అనుభవంలోకి వంచిన ఘటన అది. అయితే దీన్ని సామాజిక ఉద్యమాలు యిట్లా చూడగలిగాయా? అనే సందేహం.

వాస్తవానికి వేంపెంట ఘటనలోని క్లిష్టతకు అక్కడి వర్గపోరాటం కారణం. అట్టడుగు శ్రేణులు వర్గపోరాటంలోకి రావడం వల్ల వాటి మధ్య ఉన్న వైరుధ్యాలను అది పట్టికుదిపింది. అప్పట్లో విప్లవకారుల అవగాహన, ఆచరణల గురించి చర్చ జరిగినంతగా (అదీ అవసరమే) ఈ అనుభవం నుండి దళిత ఉద్యమం స్వీకరించవలసింది ఏమైనా ఉన్నదా? అనే ఆలోచనసాగలేదు ఘటన నేపథ్యం రీత్యా విప్లవకారుల అవగాహన గురించి విమర్శ చేయడం తప్పనిసరైనా, వేంపెంట నుండి వాళ్ళు ఏం నేర్చుకుంటారు? అనేదానితోపాటు ముఖ్యంగా- దళిత రచయితలు విడివిడి కులాల అస్తిత్వ చైతన్యంలో ఉన్నాసరే - వేంపెంట ఘటనను కనీసం జీవితానుభవపు లోతులనుండయినా అర్థం చేసుకొనే ప్రయత్నం చేసి ఉంటే దళిత సాహిత్యధోరణి యివ్వాళ ఉన్న స్థితిలో అయితే ఉండేది కాదని చెప్పవచ్చు. విడి కులాల సాంస్కృతిక జీవిత చిత్రణతోపాటు కులచట్రంలోని వేర్వేరు పీడితకులాల మధ్య ఉన్న వైరుధ్యాలను, ఐక్యతను దళితసాహిత్యం చిత్రించి ఉండేది. ముఖ్యంగా ఆత్మగౌరవాన్ని ప్రకటించుకోవడం, కాపాడుకోవడం సంపద, అధికారం కేంద్రంగానే సాధ్యం అవుతుందని చెప్పివుండేది. వేర్వేరు అస్తిత్వనిర్మాణాలుగా ఉన్న కులవ్యవస్థలో ఒక కులం ఆ ప్రయత్నం చేయగానే మిగితా కుల ప్రజలు ఒక సమూహంగా, ఒక నిర్మాణంలోని సభ్యులుగా ప్రతిస్పందించే తీరును - దాన్ని ఐడెంటిటీ నిర్దేసించే తీరును పట్టించుకొని ఉండేది. సంపద, అధికారం నిషిద్ధమైన కింది కులాల్లో - వాటి కేంద్రంగానే సహకారాన్ని పెంచడం అనే క్లిష్టమైన క్రమంలోకంటే మానవసంబంధాలను, ఉద్వేగాలను, స్వభావాలను, గుర్తెరిగి చిత్రించే సందర్భం సాహిత్యానికి యింకేం ఉంటుంది? కంటికి కనిపించే వాస్తవాలు, గుర్తించి పోల్చుకోదగిన అనుభవాలు సామాజిక విశ్లేషణ సాధనాలు కాగలవుకాని, అనుభవంలోకి వచ్చీ నిగ్గుదేలని వాటి సారం ఏమిటో చెప్పగలిగేది సాహిత్యం మాత్రమే. దళిత సాహిత్యానికి అనుభవాన్ని గాఢంగా, తీవ్రంగా చెప్పగల నేర్పు ఉన్నా ఆ అనుభవాన్ని విశ్లేషణాత్మకంగా, సామాజికతాత్విక కోణంలో చెప్పడంలో పరిమితి ఉన్నది. దీనివల్ల చాలా సంక్లిష్టమైన జీవిత ప్రతిఫలనంగా బద్దలయిన వేంపెంట ప్రభావానికి అప్పటికే విడికులాల అస్తిత్వ చైతన్యంలోకి వెళ్ళిపోయిన దళిత సాహిత్య ధోరణి గురికాలేకపోయింది. పైగా స్వీయ అస్తిత్వ అనుభవంలో అర్థమైన, నిగ్గుదేలిన విషయాలను చిత్రించడంలో సౌకర్యం ఉంటుంది. అక్కడ వ్యక్తమయ్యే శక్తీ అపూర్వమైనదే. కానీ, అనుభవంలో నిగ్గుదేలని వాటిని తరచి చూడాలంటే మేధోస్థాయిలోకి కూడా తీసికెళ్ళవలసి ఉంటుంది. మళ్ళీ పదే పదే వేంపెంట ఘటనలాంటి గీటురాళ్ళమీద తరచి చూసుకొనే క్రమంలోనే సాహిత్యం రూపొందుతుంది, సామాజిక జీవితానుభవానికి తాత్విక స్పర్శ సమకూరుతుంది.

కానీ అప్పటికి స్వీయకుల అస్తిత్వం అనే నిర్దిష్టతను దళిత సాహిత్యం ఉక్కుచట్రంగా భావించి స్వయం సంకెలలో ఉన్నది. దానికి సమర్థనగా సిద్ధాంతరూపకల్పన చేస్తూ ఉన్నది. వేంపెంట దీనికి భిన్నమైన అనుభవాన్ని తీసుకరావడం వల్ల దళిత రచయితలు సహజంగానే దాన్ని పట్టించుకోలేకపోయిరు. పీడితకులాల (పీడిత వర్గ) ఐక్యత అనే విప్లవకారుల వ్యూహం బెడిసికొట్టిందని అనుకున్నా, విడివిడి కులాల అస్తిత్వం వైపు నుండైనా సరే దళిత సాహిత్యం నేర్చుకోవలసినంత వేంపెంటలో ఉన్నది.

మాదిగ దండోరా దళిత సాహిత్యంలోకి తీసుకవచ్చిన అపురూపమైన నిర్దిష్టతకు, వైవిధ్యానికి వేంపెంట అనేక పార్శ్వాలను సమకూర్చింది. పలు నిర్దిష్టతల మధ్య ఉండే వైరుధ్యాల స్వభావాన్ని చెప్పడమేకాగ, పీడితకులాలన్నిటి మధ్య ఏర్పడాల్సిన పరస్పర సహకార సంబంధాన్ని, ఐక్యతను - సంపదలో, అధికారంలో సమాన భాగస్వామ్యం అనే పాతిపదికలు మాత్రమే సాధ్యం చేయగలవని - ఆ ప్రాతిపదికలే ఐక్యతా క్రమంలో అనేక సంఘర్షణలకు కారణం అవుతాయని కూడా వేంపెంట ఘటన నిరూపించింది.

సామాజిక రంగంలోని ఈ సవాల్‌ను దళిత, ప్రగతిశీల శక్తులు పరిష్కరించడం - కారంచేడు, చుండూరులాంటి ఘటనల నుండి దళితుల ఆత్మగౌరవం, ప్రతిఘటనలను తీర్చిదిద్దినంత సులువైనపని కాదు. అంతమాత్రాన నిరాశపడనవసరంలేదు, దాన్ని సాధ్యం చేయడంలో సాహిత్యం పాత్ర గుర్తించవలసి ఉన్నది. కారంచేడు నుండి దళిత సాహిత్యం సృజనాత్మక ప్రకియల్లో విస్తరించడంతోపాటు, దానికి అవసరమైన సిద్ధాంతరూపకల్పన కూడా చేస్తూ వచ్చింది. దీనికి దళితులపై హత్యాకాండలతోపాటు అనేక రూపాల్లో కొనసాగుతున్న వెలి, వివక్ష, అణచివేత రూపాలవల్ల పోగుబడ్డ దళిత అనుభవం వనరుగా ఉపయోగపడింది. సామాజిక వ్యవస్థా నిర్మాణాలను సిద్ధాంత స్థాయిలో అర్థం చేసుకొనే ప్రయత్నం దళిత సాహిత్యానికి తనదైన గొంతును, చూపును అందించాయి. చారిత్రక ప్రాధాన్యంగానేకాక ఒక అనుభవంగా, గీటురాయిగా కారంచేడును వర్తమాన విస్తరణ రూపంగా స్వీకరించారు. వేంపెంటను దాని గుణాత్మకరూపంగా దళిత రచయితలు గుర్తించి ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేది.

* * *

అయిదుమంది మాదిగలను నలుగురు బలహీనవర్గాలవారిని అగ్రవర్ణభూస్వామ్య ముఠానాయకుల నాయకత్వంలో కొన్ని బి.సి.కులాలవాళ్ళు, మాలకులస్తులు హత్యచేసి, గృహదహనాలకు పాల్పడిన ఘటన అప్పటి దళిత బహుజన ఉద్యమ నిర్మాణాల్లో, పోరాటాల్లో, ఆకాంక్షల్లో ఒక ప్రధానాంశం కాలేకపోవడం ముఖ్యమైన సమస్య. అంటే కారంచేడు ఘటన దళిత ఉద్యమ నిర్మాణానికి, దళిత సాహిత్య ధోరణికి కేంద్రంగా నిలబడితే వేంపెంట ఘటన జరిగేనాటికల్లా ఆ ఉద్యమాల్లో దానికి చోటుదొరకని స్థితి వచ్చింది. సానుభూతి, ప్రతిస్పందనలతో ఆగిపోకుండా దళిత ఉద్యమ అవగాహనను, పోరాటరూపాలను బలోపేతం చేసే అంశంగా వేంపెంట ఉండాల్సింది. దళిత ఉద్యమ దశలోని మౌలికమార్పును యిది సూచిస్తుంది. కారంచేడు నుండి దళిత ఉద్యమం అనేక నిర్దిష్టతల్లోకి ప్రవహించడం ప్రజాస్వామిక పరిణామమే అయినా

(మిగతా 46వ పేజిలో....)

ఓరుగల్లు నుంచి మూడు పుస్తకాలు

☆ కృష్ణాబాయి

ఆంధ్రరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ (1956)గా ఏర్పడినా '60ల దాకా తెలుగు పత్రికా లోకానికి మద్రాసే కేంద్రస్థానంగా వుండడం వింతగా తోచినా వాస్తవ పరిస్థితి అదే. చాలా శతాబ్దాలపాటు అటు కళింగాంధ్ర కోస్తా రాయలసీమలూ ఇటు తెలంగాణా కూడా పరాయిపంచనే పడివున్నాయి. ఇదొక చారిత్రక అనివార్యత. ఇందువల్ల ఆయా ప్రాంతాల ప్రజలవి పరాధీనపు బతుకులయ్యాయి. సాహిత్య సాంస్కృతిక రంగాలలో పురోగతి ఏదో ఒక మేరకయినా కుంటుపడక తప్పలేదు. అయినా తెలుగు సాహిత్యానికి తొలి నుంచీ పత్రికలే వాహికలయ్యాయి. కొడవటిగంటి అన్నట్టు 'నేనో కథరాశానోయ్' అంటే 'ఏ పత్రికలో పడిందీ?' అనడం రివాజు. కథలు పత్రికలో పడడానికీ పుస్తకంగా రావడానికీ చాలా ఎడం వుండేది. కాగితం కొరత, ప్రెస్ ఇబ్బందులే కాక, పుస్తకాల షాపుల కొరత కూడా వుండడం వల్ల ఏ సాహిత్య పత్రికలోనో సమీక్షో, పరిచయమో వస్తేనే తప్ప ఫలానా పుస్తకం వెలువడినట్టు తెలిసేది కాదు. ఈ నేపథ్యంలో చూసినప్పుడు ఇవాళ పుస్తకాలు అపరిమితంగా వస్తున్నాయి. కథా సంకలనాలూ, కవితా సంపుటులూ, నవలలూ విరివిగా వస్తున్నాయి. కాని సాహిత్య విమర్శ మాత్రం ఆ వేగాన్ని అందుకోలేకపోతోంది. దీనికన్నా వెనకబడివుంది సామాజిక శాస్త్రాల అధ్యయనం. సామాజిక శాస్త్రాలకీ సాహిత్యానికి వున్న సంబంధం గురించిన సమగ్రమైన అవగాహన తెలుగు సాహిత్యవేత్తలకి చాలా ఆలస్యంగా కలిగింది. 'ఏదైనా రాసేదాకానే అది సాహిత్యం. ఆ తర్వాత అది సామాజిక శాస్త్రంలో భాగమవుతుంది' అన్నాడు రష్యన్ మార్క్సిస్ట్ ప్లెఖనోవ్. దీనికనుగుణంగానే సురా సంపాదకత్వంలో 'విభాత సంధ్యలు' (1986) వెలువడింది. తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు ఇది చాలా మంచి ప్రయత్నం. 'విభాత సంధ్యలు' వెలుగులో అటు సాహిత్యం, ఇటు సామాజిక శాస్త్రం పెనవేసుకుపోయాయి. దీనికి సాక్ష్యంగా ఇటీవల ఓరుగల్లు నుంచి వెలువడిన ఈ పుస్తకాలు నిలుస్తాయి.

కాకతీయ విశ్వవిద్యాలయంలోని ముగ్గురు అర్థశాస్త్ర అధ్యాపకులూ (జ్యోతిరాణి, రాములు, గిరిజారాణి), ఒక తెలుగు వుపన్యాసకురాలూ (కాత్యాయనీ విద్మహే) కలిసి స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ (1982) స్థాపించుకున్నారు. వీళ్లు సామాజిక శాస్త్రాలని ఆకళించుకున్నారు. వాటి అంతస్సారాన్ని బాగా ఇంకించుకున్నారు. ఇతర చోట్ల లేని వెసులుబాటు అధ్యాపకులకు ఉంటుంది. - అందునా విశ్వవిద్యాలయ అధ్యాపకులకి మరీను. అక్కడ జరిగే సెమినార్లు ప్రయోజనాత్మకంగా వుండేందుకు అవకాశం ఎక్కువ. సమర్పించే పత్రాలు, ఇచ్చే ప్రసంగాలు లోతైన విశ్లేషణలతో వుండేందుకు సెమినార్లు వుపకరిస్తాయి. అయితే విశ్వవిద్యాలయాల్లో గ్రాంటుల సంఘం నెలకొల్పిన మహిళాధ్యయన కేంద్రాలు నిర్వ్యాపకంగా మిగిలిపోయాయని పదేళ్ళ కిందటనే యుజిసి ఛైర్మన్ వాపోయాడని ఈ పుస్తకానికి (స్వాతంత్ర్యానంతర భారతదేశం - స్త్రీల స్థితీగతీ) ముందుమాట రాసిన రత్నమాల అన్నది. కాని కాకతీయ విశ్వవిద్యాలయం నుంచీ అలాంటి అధ్యయన కేంద్రాల అండ లేకుండానే భావసారూప్యత వున్న వ్యక్తులు కొందరు ఒక సంస్థగా ఏర్పడి మొదటి నుంచీ సామాజిక సాహిత్య అధ్యయనాన్ని ఎంతో బాధ్యతాయుతంగా చక్కగా నిర్వర్తిస్తున్నారనడానికి దాఖలాగా ఈ ఒక్క పుస్తకం చాలును.

ఈ సందర్భంలోనే ఒకమాట చెప్పుకోవాలి. శ్రీకాకుళ ఉద్యమం శత్రు నిర్బంధంలో ఒకడుగు వెనక్కి తగ్గాక ఉత్తర తెలంగాణ వూపందుకుంది. ఇక్కడ ఒక మౌలికమైన మార్పుని గుర్తించాలి. ఉత్తర తెలంగాణాలో వుద్యమం ప్రజాపంథాలో పెనవేసుకుపోయింది. ప్రజలలో చైతన్యం, వికాస వీచికలు వెల్లివిరిశాయి. అందునా ఓరుగల్లు పోరాటాల పుట్టిల్లు. కాకతీయ విశ్వవిద్యాలయం అక్కడి ప్రజల సమస్యలకీ సంచలనాలకి దూరంగా లేదు. అధ్యాపకుల్లోనూ మేధావుల్లోనూ కూడా చైతన్యాన్ని ఓరుగల్లు పరిసరాలు తీసుకురాగలిగాయి. స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ తరపున ఈ అధ్యాపకులు వివిధ సమస్యల మీద చుట్టుపక్కల గ్రామాలు పర్యటించి, 150 మందిని ఇంటర్వ్యూలు చేసి పదేళ్ళలో రాసిన వ్యాసాలు, కేస్‌స్టడీలు కలిసి ఈ పుస్తకంగా రూపొందించారు. మహిళల స్థితిగతుల మీద సెమినార్లు నిర్వహించడం ఒక ఎత్తు అయితే, స్వయంగా గ్రామీణ శ్రామిక మహిళల్ని కలిసి వాళ్ళ సమస్యల్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం మరో ఎత్తు. పల్లీయుల మీద ఎంతో శ్రద్ధ, ఆసక్తిలేకపోతే, ఆ జీవితాల్లో వస్తున్న మార్పులు, చెలరేగుతున్న సంఘర్షణలు, గ్లోబలైజేషన్ విషఫలితాలు ఇంతలా విప్పి చెప్పడం సాధ్యమయ్యేదిగాదు.

మన చుట్టూ జరిగే అనేక మార్పులకే అటు పట్నాలూ, ఇటు పల్లెలూ కూడా లోనవుతున్నాయి. 'అభివృద్ధి ఫలాలకు దూరంగా గిరిజనులు' అనే వ్యాసంలో ఓరుగల్లు సమీపంలోని గీసుకొండ మండలం మచ్చాపూర్, వంజరపల్లి తండాల స్త్రీల జీవితాన్ని వివరంగా చర్చించారు. సంవత్సరాల తరబడి కొనసాగుతున్న కరువు తెలంగాణా ప్రాంతానికి ఒక ప్రత్యేక లక్షణంగా తయారయింది. ఆ పరిణామాలు పురుషుల్ని బాధ్యతారాహిత్యుల్ని చేయడం వల్ల కుటుంబ పోషణ భారం నుంచి వాళ్ళు తప్పుకుంటున్నారు. ఆధారమంతా స్త్రీలదే అవుతోంది. ప్రపంచీకరణ విషఫలితాలు ప్రజల జీవితాలతో ఎలా చెలగాటమాడుతున్నాయో ఈ వ్యాసాలు వివరిస్తున్నాయి. వీటిని నిలవరించే వుద్యమాలకి కూడా ఓరుగల్లు నెలవుగానే వుంది. అదివరకటిలాగా పల్లెలు అణగిమణిగి వుండడం లేదు. ఉద్యమాల్లో తలమునకలుగా వున్నాయి. అయితే గ్లోబలైజేషన్‌కి వంత పాడుతున్న ప్రభుత్వాలు ఉద్యమాల మీద తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నాయి.

'ఆంధ్రప్రదేశ్‌లో పాలనాయంత్రాంగపు అణచివేత సంస్కృతి ఆదివాసీ-మహిళలు' దీనినే ప్రతిబింబిస్తుంది. పశ్చిమ గోదావరి ఏజెన్సీ గ్రామాల గిరిజన భూముల్ని గిరిజనేతరులు ఆక్రమించుకున్నారు. 1/70 చట్టం ప్రకారం కోర్టుకి పోయి గిరిజనులు డిక్రీ పొందారు. అయినా భూమి వాళ్ళకి దక్కలేదు. ఈ క్రమంలోనే కోరం పార్వతి అనే గిరిజన మహిళ భూస్వామిని నిలేసింది. రెవిన్యూ శాఖ సాయం కోరింది. అన్నీ విఫలం కావడంతో తమభూమి మీద యాజమాన్యం ప్రకటించుకున్నారు గిరిజనులు. అదే నేరంగా ప్రదర్శనకారుల మీద పోలీసులు కాల్పులు జరిపారు. పార్వతి మరణించింది (97 డిసెంబర్). ఆదివాసీల న్యాయమైన డిమాండ్ పట్ల రాజ్యం వ్యవహరించిన తీరుని బట్టబయలు చేసింది ఈ కేస్‌స్టడీ. అదిలాబాద్ జిల్లాలో గోండు మహిళ భారతీబాయి పచ్చిబాలింత. పూటగడవక అడవిలోకి కూలికి పోయి తిరిగొస్తోంది. దారిలో నక్సలైట్ వ్యతిరేకదళం ఎదురయింది. నక్సలైట్లని కలవడానికి పోతున్నావని ఆగమని అడ్డగించారు. బిడ్డకి పాలివ్వడానికి పోతున్నానంటే 'ఏదీ నీ పాలిండ్లు చూపించు' అని పిసికి చూశాడో పోలీసు. తెలంగాణా సాయుధ పోరాటానికి ముందు, విసునూరు దేశముఖ్ తన పొలంలో కూలీ మాట నమ్మక పాలు పిండించిన దానికీ, 'స్వతంత్ర్యం' తర్వాత మన రక్షక భటులు చేసిన ఈ పనికి తేడా ఏముంది? 'బ్రాహ్మణీయ భావజాలం పునాదిగా ఏర్పడిన రాజ్యాంగ యంత్రాంగపు అణచివేత సంస్కృతి ఇలాగే పరిఢవిల్లుతోంది' అని ముగించారీ వ్యాసాన్ని.

రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కుల ఉల్లంఘన స్త్రీల పట్ల అడుగడుగునా ఎలా అమలవుతోందో సోదాహరణంగా వివరించారీ పుస్తకంలో. ఉద్యమాల ఫలితంగా చదువులు, వుద్యోగాలు కొంతమేరకి స్త్రీలకి లాభించినా పితృస్వామ్య భావజాలం తన పట్టు ఇంకా బిగిస్తున్నందువలన పరిస్థితి పెద్దగా మారడం లేదు. సినిమాలు, టీవీ సీరియల్స్, అభివృద్ధి నిరోధక సాహిత్యం ముప్పేటగా గందరగోళాన్ని మరింత పెంచుతున్నాయి. ఈ విష సంస్కృతిపట్ల జాగరూకత అవసరం.

రైతాంగ ఉద్యమాలు, సారావ్యతిరేక మహిళా వుద్యమం లాంటివి ఆర్థిక

పునాదినీ అందులో భాగంగా ప్రభుత్వ ఉనికిని ప్రశ్నించేదిగా ఉండటంవల్ల ఈ ఉద్యమాలు తీవ్రమైన అణచివేతకు, నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయి', ఏ వుద్యమమైనా 'రాజకీయ ఆర్థిక వ్యవస్థను పునాది నుండి మార్చడానికి నిర్మించబడుతున్న విప్లవోద్యమ పోరాటాలలో భాగంగానే అంతిమ విజయాలను సాధించగలుగుతుంది' అని 'భారతదేశంలో మహిళా ఉద్యమాలు' వ్యాసం ముగుస్తుంది. ఈ రకమైన అధ్యయనాల ద్వారా 'స్వతంత్రం' తర్వాత కూడా స్త్రీలు ఏయే రంగాలలో ఎలాంటి స్థితిలో వున్నారో తెలిపే ఈ పుస్తకం రిఫరెన్స్‌కి చాలా వుపయుక్తంగా ఉంటుంది.

***

తెలుగునాట విరసం ఏర్పడ్డాక కొన్ని కొన్ని కొత్త ధోరణులు ముందుకి దూసుకొచ్చాయి. స్త్రీవాదం, దళితవాదం, ప్రాంతీయతా ముద్ర పోస్టు మోడర్నిజం చెప్పుకోదగ్గవి. అన్నిటికన్నా ముందు వెలుగులోకి వచ్చింది స్త్రీవాదం. ఇంచుమించు అన్ని ప్రక్రియల్లోనూ తనదంటూ ఒక బలమైన ముద్రవేసింది. కవిత్వంలో అయితే కొత్తపుంతలు తొక్కింది.

స్త్రీవాదం ఒక సైద్ధాంతిక చట్రంగా రూపొందడంకన్నా చాలా ముందే స్త్రీల ఆర్తినీ, ఆవేదనీ, అంతరంగాన్నీ చిత్రించే రచనలు రాకపోలేదు. వ్యక్తి స్వేచ్ఛావాదననీ, స్త్రీ కూడా అవకాశాలిస్తే అందుకోగలదనే భావనని సాహిత్యంలో బలంగా ప్రవేశపెట్టిన గురజాడ, శ్రీపాద, చలం, కొడవటిగంటిలది మొదటి తరం. రెండో తరంలో వాసిరెడ్డి సీతాదేవి, రంగనాయకమ్మల కృషిని గుర్తించి తీరాలి. శివరాజు సుబ్బలక్ష్మి, అబ్బూరి ఛాయాదేవి, డాక్టర్ శ్రీదేవి, పి.సరళాదేవి, పి.సత్యవతి లాంటి రచయిత్రులు తమ కథలు, నవలల ద్వారా స్త్రీల అంతరంగాన్నీ, మారుతున్న ఆలోచనల్నీ చిత్రించారు. 'జానకి విముక్తి' స్త్రీల వ్యక్తిత్వం మీదా, ఆలోచనల మీదా మంచి ముద్ర వేసింది. యువతీ యువకుల్ని గాఢంగా ఆకర్షించింది. చర్చలు రేపింది. స్త్రీవాద వచన రచనలు చెదురుముదురుగా వచ్చినా, కళ్ళు మిరుమిట్లు గొలిపే కవిత్వం మాత్రం పుంఖానుపుంఖంగా వచ్చింది. స్త్రీవాదం రాకముందు, దళితవాదం లేకముందు ఇటువంటి విషయాలు కవిత్వంలో చోటు చేసుకుంటాయని పెద్ద పెద్ద సాహిత్యవేత్తలు కూడా ఊహించి వుండరు. ఇంతకాలం ఇంతటి దుఃఖాన్నీ ఆర్తిని ఎక్కడ దాచుకున్నారా అని విస్తుపోతాం.

'తమ అనుభవాల ద్వారా స్త్రీ విముక్తి మార్గాన్ని అనుసరించిన వారు సావిత్రి, ఈశ్వరి లాంటి వారని 1992లోనే చేరా విశ్లేషిస్తూ ఈ మార్గం కవయిత్రుల్లో శిల్ప విన్యాసాలకన్నా ఆక్రోశం, ఆవేదన, కసి ఎక్కువగా కనిపిస్తాయి. వ్యక్తీకరణలో మెరుగుల కోసం శ్రమపడినట్టు కనబడదు' అని కూడా అన్నారు. అందుకనే సుప్రసిద్ధమైన 'బందిపోట్లు', 'అంతశ్శత్రువులు' మొదటి కవితా రూపాలేగాని తర్వాత వచ్చిన 'వంటిల్లు', 'గృహలక్ష్మి' మరింత తీవ్రంగా మెరుగ్గా వచ్చినట్టు విమర్శకులు అభిప్రాయపడ్డారు. తమ మానసిక వేదనల్నీ, శరీర బాధల్ని నిస్సంకోచంగా వెలిబుచ్చుతూ 'పైటను తగలెయ్యండి', 'చూపులు', 'లేబర్‌రూం', 'హృదయానికి బహువచనం', 'సర్పపరిష్వంగం', 'జుగల్‌బందీ', 'రాజీవనాలు', 'మెహందీ' లాంటి కవితలు అసంఖ్యాకంగా వెలువడడంతో విమర్శకులు కొందరు ఉలిక్కిపడ్డారు. ఖంగారు పడ్డారు. ఇప్పటిదాకా పురుషాధిక్య భావజాలంతో రాసిన శృంగార కవితలూ, భావకవిత్వము చదివి ఆనందించడానికి అలవాటు పడినవారికి స్త్రీ ప్రసవ వేదన, బహిష్టు బాధలాంటివి జీర్ణం కాలేదు. ఈ ధోరణుల మీద విరుచుకుపడ్డారు. విమర్శ ప్రతివిమర్శలు తీవ్రస్థాయిలో నడిచాయి. 'స్త్రీవాదులు పితృస్వామ్యం మీద చేసే దాడిని వర్గపోరాటంలో భాగంగానే చూడాలంటూ' "స్త్రీ శరీర ధర్మాల చుట్టూ ఒక అసహజ సాంస్కృతిక ఆవరణం రూపు కట్టుకున్నప్పుడు దానిని బద్దలు కొట్టడానికి స్త్రీల శరీర ధర్మాలను గురించి రాస్తే తప్పేమిటి?" అని వరవరరావు ప్రశ్నించాడు (1992). ఈ వాద వివాదాలన్నిటినీ ఒక సంకలనంగా తెచ్చారు ఎస్వీ సత్యనారాయణ.

ఈ వ్యాసాల్లో ఒకరిద్దరు స్త్రీ.వాదాన్ని సామ్రాజ్యవాదంతో ముడివేశారు.ఇది సామ్రాజ్యవాదుల కుట్ర అన్నారు. 'విభజించి పాలించడం' అనేది ఏనాటి నుంచో సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న విధానమే. స్త్రీవాదుల్లో కొందరు ఎన్‌జీఓలలో పనిచేస్తున్నారు. పోరాటాల పట్ల వీళ్ళ వైఖరిలో పదును తగ్గిందనేది విస్మరించలేని అంశం.

అంతే.కాత్యాయని ఒక భరోసా ఇస్తోంది - "స్త్రీ ప్రయోజనాల దృష్ట్యా ప్రపంచాన్ని.కొత్తగా వ్యాఖ్యానించగల స్త్రీవాదం సామ్రాజ్యవాద దుష్ఫలితాలను గురించి వ్యాఖ్యానించి ప్రచారం చేస్తున్న తీరుని మనం విస్మరించగూడదు. ఈ దుష్ఫలితాలకు ముందుగా బలి అయ్యే స్త్రీలు సామ్రాజ్యవాదాన్ని నెత్తికెత్తుకుని మోసే తక్కువ స్థాయిలో మాత్రం లేరనేది స్పష్టం" అని.

ఇది అలా వుంచినా ఒక సంగతి మాత్రం స్పష్టం. స్త్రీల ఉనికినీ, అస్తిత్వాన్ని గుర్తించడానికే నిరాకరించిన మానవ సమాజం స్త్రీలకెంత అన్యాయం చేసిందోనన్న స్పృహ ఇవాళ క్రమంగా బలపడుతోంది. దీనికి ఎనలేని దోహదం చేసిన స్త్రీవాద వెలుగులోనే కాత్యాయని స్త్రీవాద సాహిత్యాన్ని అంచనా వేసింది. ఈ వుద్యమానికి దోహదం చేసిన అంతర్జాతీయ పరిస్థితులు, పారిశ్రామిక విప్లవం, ఫ్రెంచి విప్లవం, స్వేచ్ఛావాదం గురించి వివరించింది.

స్త్రీల దృక్పథంలో కథలూ, కవితలు వచ్చినట్టు నవలలు రాకపోవడాన్ని విశ్లేషిస్తూ 'స్త్రీ పురుష సంబంధాల మీదనే దృష్టి కేంద్రీకరించడం వల్ల కుటుంబాల్లోనూ బయట రకరకాల కోణాల నుంచీ వాస్తవ సామాజిక జీవిత సంస్కృతిలో భాగంగా వ్యక్తమయ్యే స్త్రీ పురుష వివక్ష స్వభావాన్ని నవలకు వస్తువుగా చేయగల విస్తృతావకాశాలను ఒల్గా వుపయోగించుకోలేక పోయారు... ఈ పరిమితిని గుర్తించడం వల్లనే 'ఆకాశంలో సగం' నవల రాశారు అని విడమర్చింది కాత్యాయని. ఎరుకల జీవితాల లోతులనీ, మానవసంబంధాలని 'ఎల్లి' నవలలో అరుణ అద్భుతంగా రూపుకట్టింది. తమ జీవితానుభవాలతో వ్యక్తులుగాగాక సమష్టిగా ఈ పునాదుల్ని కదిలించి నూతన వ్యవస్థని నిర్మించే ఉద్యమంలో భాగస్వాములైన 'రాగో', 'అడవి పుత్రిక' నవలల్ని కాత్యాయని స్థూలంగా పరిశీలించింది.

'స్త్రీ వేదనని స్త్రీ రచయితలు మాత్రమే సమర్థవంతంగా రాయగలరు, రాయాలి' అనే సూత్రీకరణనీ, నిబంధనని స్త్రీవాదులు నెమ్మదిగా సడలించారు. 'స్త్రీ సమస్యలను స్త్రీల జీవిత కోణం నుంచీ నిజాయితీతో చిత్రించగలిగిన పురుష రచయితలను స్త్రీవాదులుగా గుర్తించడానికి అభ్యంతరం లేదు' అని హామీ ఇచ్చారు! అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, కేతు విశ్వనాథ రెడ్డి బజరా, కవనశర్మ మున్నగు వారిని అంగీకరించారు.

మరింత ముందుకి పోయి '.... కాని అస్తిత్వంలో వున్న సామాజిక నిర్మాణాన్ని మార్చగల కార్యక్రమం స్త్రీవాదానికి లేదు. అందువల్లనే తరుచు స్త్రీవాదం 'ఈపోరాటం ఎవరితో?' అన్న ప్రశ్నని ఎదుర్కొంటోంది... ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి ఇంతకంటే విశాలమైన పునాది మార్పుకి సంబంధించిన కార్యక్రమంగల రాజకీయ ఆర్థిక పోరాటాలతో దీనిని సమన్వయించుకోవడం అవసరమవుతుంది' అని కాత్యాయని నొక్కి చెప్పింది. మధ్యతరగతి స్త్రీలు పెంచుకోవాల్సిన శ్రామిక పక్షపాత దృక్పథాన్ని 'సౌందర్యాత్మక హింస'లో చిత్రించింది విమల అని సవిమర్శకంగా వివరించింది కాత్యాయని.

అందం పోటీ అయిన చోట
అందం సరుకైన చోట
అందాల వ్యాపారాన్ని ద్వేషిద్దాం
నిరంతర శ్రమతో పెదవులు పగిలి
చేతులు కాయలు కాచి
రేగిన జుట్టుతో అలసిన కళ్ళలో
చింకి పాతలతో అందాన్ని ఖరీదు చేయలేని
కోట్లాది మంది స్త్రీలతో కలిసిన శ్రమ
సౌందర్యాన్నీ / మానవ విలువల్ని ప్రేమిద్దాం

రమ్మని ఎంతో గొప్ప పిలుపునిచ్చింది విమల. కమ్యూనిస్టు తాత్విక దృక్పథంతో స్త్రీవాదాన్ని విలీనం చేసినప్పుడే ఇలాంటి కవిత పెల్లుబుకుతుంది.

కష్టజీవుల సమస్యలలో భాగంగా స్త్రీల సమస్యలను చూడాలనీ,

సమసమాజ స్థాపనలో పీడితులలో కెల్లా పీడితులైన స్త్రీలను కలుపుకోవాలని పాటల రూపంలో, కవిత రూపంలో 'ఆమె నడిచినంత మేరా' సంపుటిగా వచ్చింది. 'నిబద్ధత, హృదయపు లోతు, స్పందన పద్మ కవిత్వానికీ పాటకి బలాన్నిచ్చాయి'.

స్త్రీవాదం అటు యిటుగా 80ల నుంచీ వ్యాపించింది. ప్రపంచీకరణ 90లలో చాపకింద నీరులా చొచ్చుకొచ్చింది. దీనికి ముఖ్యకారణం రష్యా కుప్పకూలిపోవడం. ఆ తర్వాతే అమెరికా ఏకధృవరాజ్యంగా రూపొందింది. దాని ఆగడాలకు అంతులేకుండా పోయింది. ఫలితమే ప్రపంచీకరణ. దీని పుణ్యమా అని స్త్రీ మరీ అంగడి సరుకైపోయింది. బహుళజాతి వుత్పత్తుల్ని సొమ్ము చేసుకోవడానికి స్త్రీ అంగాంగాన్ని ప్రదర్శనకి పెడుతోంది వస్తు వినిమయ సంస్కృతి. దీనిని చక్కగా బహిర్గతం చేస్తూ పి.సత్యవతి, కుప్పిలి పద్మ లాంటి వారు కథలు రాస్తే, 'మల్టీనేషనల్ ముద్దు'ని చిత్రీకరించింది కొండేపూడి నిర్మల. ప్రపంచీకరణతో ఎలాంటి పరిస్థితులు దాపురిస్తున్నాయో స్త్రీవాదులు గుర్తించగలుగుతున్నారు. కాని యువత వస్తువినిమయ సంస్కృతికి దాసోహమఎడం దౌర్భాగ్యం.

ప్రారంభంలో అగ్రవర్ణాల మధ్యతరగతి స్త్రీల జీవితానుభవాలనే చిత్రించిన స్త్రీవాద సాహిత్యం క్రమంగా శ్రమజీవుల (దళిత, మైనారిటీ, బిసి వర్గాల) అనుభవ వ్యక్తీకరణగా పురోగమించింది. చల్లపల్లి స్వరూపరాణి, శిలాసుభద్రాదేవి లాంటి వారితో పాటు మెరుపుతీగలా దూసుకొచ్చింది షాజహానా. మైనారిటీ మహిళల పరదాచాటు దుఃఖాగ్నిని అందరి కళ్ళముందూ విరజిమ్మింది.

మొదటినుండీ, ఆక్షేపణలని లెక్కచేయకుండా స్త్రీవాదాన్ని విశ్లేషిస్తూ వచ్చినవాడు ప్రసిద్ధ సాహితీ విమర్శకుడు చేరా. అడపాదడపా మరికొందరు రాసినా, ఆగకుండా స్త్రీవాద సాహిత్యాన్ని పరిచయం చేస్తూ పరామర్శిస్తున్న విమర్శకురాలు కాత్యాయనీ విద్మహే.

1990 నుంచీ 2003 వరకూ రాసిన వ్యాసాల సంకలనం 'ఆధునిక సాహిత్యం - స్త్రీవాద భూమిక'. తానే చెప్పినట్టు పునరుక్తిదోషాల్ని పరిహరించుకుంటూ, 2003 నుంచీ వచ్చిన సాహిత్యాన్నీ కూడా త్వరలో అంచనా వేస్తుందని ఆశిద్దాం.

* * *

స్త్రీవాదం కేవలం ఒక ధోరణి మాత్రమే కాదు. దానికొక తాత్వికకోణం కూడా ఉంది. స్త్రీవాదానికన్నా చాలా ముందుగానే 'కన్యాశుల్కం'లో ఈ తాత్వికత తొంగి చూసిందని చెప్పొచ్చు. దీనిని విశదీకరిస్తూ కాత్యాయనీ విద్మహే 'కన్యాశుల్కం - సామాజిక సంబంధాలు' అని పుస్తకంగా వేసింది.

తెలుగువాళ్ళు 'కన్యాశుల్కం' చదవకపోతే, చూడకపోతే ఎట్లా? 'కన్యాశుల్కం' చదవకపోతే, చూడకపోతే తెలుగువాళ్ళు ఎట్లా అవుతారు? అని వాపోయారు ప్రముఖ రచయిత భమిడిపాటి కామేశ్వరరావుగారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి 'కన్యాశుల్కం' తలమానికం. ఆ నాటకం రాయడానికి గురజాడకి ఇరవై ఒక్క సంవత్సరాలు పట్టింది. ఇంతా చేసి గురజాడ జీవితకాలం కేవలం యాభై మూడేళ్ళ (1862 - 1915). అయితే ఆ కాలాన్నీ, ఆనాటి సమాజాన్నీ దాని గమనాన్నీ, ప్రజల స్థితిగతుల్ని, పరిసరాలని, ప్రభావాలని వీటన్నింటి సారాన్ని ఆకళింపు చేసుకుని మరీ రాశాడు. అయితే గురజాడ కవికాదనీ, కన్యాశుల్కం నాటకమే కాదని ఇటీవల మళ్ళీ గాలి దుమారాలు చెలరేగాయి. ఇప్పుడు ఏకరువు పెట్టిన కారణాలన్నిటి వలన 'కన్యాశుల్కం' ఇప్పుడు మరింత దగ్గరయింది మనకి.

మెచ్చనంటా వీవు; నీవిక
మెచ్చుకుంటే మంచిపాయెను; అని కూడా అన్నాడు గురజాడ. కాత్యాయని రాసిన ఈ వ్యాస సంపుటికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. తనకి కన్యాశుల్కం నాటక అధ్యయనం కలిగించిన ఉత్సాహం, ఉత్తేజం ఇంతింతై వటుడింతైలా పెరిగి ఒక 'నిరంతర మోహం' అయింది.

కాకరాలకి 'కన్యాశుల్కం' కంఠాపాఠం. కొట్టిన పిండి. ఆయన దీనికి ముందుమాట రాయడం సముచితంగా వుంది.

తెలుగు నాటక రచననీ, నాటక రంగాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి కొన్ని మౌలికమైన పరిశీలనలు చేసిన త్రిపురనేని మధుసూదనరావుకి దీన్ని అంకితమివ్వడంలో కాత్యాయని ఔచిత్యం పాటించింది. పైగా 'గురజాడ ఆశయాలను ఆదర్శాలను కొత్త తరంలో ప్రచారం చేయాల'ని త్రిమరా కలలు గన్నాడని కూడా గుర్తు చేసింది.

కన్యాశుల్కంలో కుటుంబవ్యవస్థ, స్త్రీలు, ఫెమినిజం అనే మూడు వ్యాసాలలో నేటి స్త్రీవాదాన్ని అనుసంధానించింది కాత్యాయని. ఇది నేటి చారిత్రకావసరం కూడా. కన్యాశుల్కానికి ఫెమినిజానికి వున్న లింకులని కాత్యాయని ఒడుపుగా పట్టుకుంది. ఇన్నేళ్ళుగా 'కన్యాశుల్కం' మీద వ్యాస పరంపర వెలువడుతూనే వుంది. కాని ఎక్కడా చోటు చేసుకోని కొన్ని మెలకువల్ని చూపించింది విమర్శకురాలు. తెలుగునాట కన్యాశుల్కాన్ని కొన్ని వందలసార్లు చదివిన వాళ్ళూ, చదువుతున్న వాళ్ళు అసంఖ్యాకంగా వున్నారు. అయితే 'కన్యాశుల్కం' ఆకాశం నుంచి వూడిపడలేదు. గురజాడ బుర్రలో మొలకెత్తలేదు. ఆనాటి సామాజిక జీవితంలోంచి పుట్టింది 'కన్యాశుల్కం'.

కాకరాల లెక్క ప్రకారం 'కన్యాశుల్కం' రచనలో గురజాడ లక్ష్యాలు మూడు - సామాజిక ప్రయోజనం, భాష, నాటకరంగం అభివృద్ధి. కాత్యాయని ఈ అంశాల మీద మూడువ్యాసాలు రాసింది. అయితే కన్యాశుల్కం నాటకానికి సినిమా ఏమీ న్యాయం చేయలేదు. అది తీసిన వాళ్ళకి గురజాడతో అభిప్రాయ బంధుత్వం లేదు. ఉంటే 'కథ అడ్డంగా తిరిగాక' గిరీశానికీ బుచ్చమ్మకి పెళ్ళి చేస్తారా?

ఇవాళ అందరికీ అందుబాటులో వున్నది 'కన్యాశుల్కం' రెండో ప్రచురణ (1909). అయితే తొలి ప్రదర్శన విజయనగరంలో 1892 ఆగస్టు 13న. ఆనాడు ఆడిన నాటకమే 1897లో అచ్చు అయింది. దీనిని నేల మాళిగల్లోంచీ తవ్వితీసి బంగోరె అచ్చు వేశాడు (1969). దీనినే కన్యాశుల్కం అనుకుంటున్నాం. కాని ప్రముఖ సాహితీవేత్త వేలూరి శివరామశాస్త్రి గారి భోగట్టా ప్రకారం మొట్టమొదటి కన్యాశుల్కం గురజాడ 1885 లోనే రాశాడు. అయితే అది ప్రబంధ గ్రాంధికంలో రాశాననీ, 'అముద్రిత గ్రంథ చింతామణి'లో అచ్చు అయిందని గురజాడ తనతో స్వయంగా చెప్పాడని 'భారతి' రజతోత్సవ ఆవిష్కరణ (1949 జనవరి) సందర్భంలో వేలూరి వారన్నారు. ఈ మొట్టమొదటి కన్యాశుల్కాన్ని పాతాళం లోతుల్లోంచీ తవ్వితీయాల్సిన పనికి కాత్యాయనే పూనుకోవాలని విజ్ఞప్తి.

పై మూడు పుస్తకాల గురించి ఆలస్యంగానైనా పాఠకులకి అందించడంలో ఉద్దేశం అవి ఎంత అమూల్యమైనవో తెలియజేయడమే.

1. స్వాతంత్ర్యానంతర భారతదేశం - స్త్రీల స్థితిగతి
   రచయితలు : తోట జ్యోతీరాణి, కాత్యాయనీ విద్మహే.
   బుర్ర రాములు, హజారీ గిరిజారాణి
   ముందుబాట : ఎం.రత్నమాల
   ప్రచురణ : స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ, వరంగల్లు
   ధర : 60/- పేజీలు 142.
2. ఆధునిక తెలుగు సాహిత్యం - స్త్రీవాద భూమిక
   రచన : కాత్యాయనీ విద్మహే
   ముందుమాట : అబ్బూరి ఛాయాదేవి
   అంకితం : డా.కొమర్రాజు అచ్చమాంబకి
   ప్రచురణ : స్త్రీ జనాభ్యుదయ సంస్థ, వరంగల్లు
   ధర : 50/- పేజీలు 122
3. కన్యాశుల్కం - సామాజిక సంబంధాలు
   రచన : కాత్యాయనీ విద్మహే
   ముందుమాట : కాకరాల
   అంకితం : త్రిపురనేని మధుసూదనరావుకి
   ప్రచురణ : జిజ్ఞాస ప్రచురణలు, వరంగల్లు, ధర 50/-, పేజీలు 122

*

తెలుగులో తొలి 'అమ్మ'

☆ చలసాని ప్రసాద్

గోర్కీ (1868 - 1936) నిరుపేద. రష్యన్ రచయిత. చిన్నప్పుడు ఒళ్ళొంచి పనిచేసి పొట్టపోసుకునేవాడు. గుడ్డిదీపపు వెలుతురుకైనా నోచుకోని బాల్యం. వెన్నెల వెలుగులో అక్షరాలు దిద్దు కునేవాడు. తన్మయత్వం చెందేవాడు. అక్షరాలని వేళ్ళతో తడిమి ఆ స్పర్శతో మైమరిచి పోయేవాడు. అక్షరం అంటేనే నశించనిది అని అర్థం. దాని శక్తి సామర్థ్యాలు క్రమక్రమంగా గోర్కీకి అవగతమయాయి. ఒంచిన నడుం ఎత్తకుండా కాయకష్టం చేసి జీవితం గడిపినా అక్షరం మీద అపారమైన ఆసక్తి పెంచుకున్నాడు. అదే ఆతన్ని రచయితగా తీర్చిదిద్దింది.

రష్యావిప్లవం 1905లో ఓడిపోయింది. అందులో గోర్కీ పాల్గొన్నాడు. పోరాడాడు, జైలుకెళ్ళాడు. శిక్ష అనుభవించాడు. విడుదలయాక, విప్లవం ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుని 'అమ్మ' కి రూపకల్పన చేశాడు. రష్యన్ భాషలో 'అమ్మ' 1906-07లో వెలువడింది. బోల్షివిక్ విప్లవం లెనిన్ నాయకత్వాన 1917లో విజయవంతం అయింది. అటు తర్వాత అమ్మ దేశదేశాలు చుట్టింది. తెలుగులో తొలి ప్రచురణ 1935 జనవరిలో వెలువడింది. అనువాదకుడు క్రొవ్విడి లింగరాజు. ప్రచురణకర్త గద్దె లింగయ్య.

ఇవాళ 'ప్రపంచీకరణ' పుణ్యమా అని కలవాళ్ళకి డబ్బుఆకలి ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. లేని వాళ్ళకి పొయ్యిలో పిల్లి లేవడమే గగనంగా వుంది. ప్రపంచ వ్యాప్తంగా నూటికి 25 మందికి రోజువారీ ఆదాయం షిల్లింగులని మించదు. ఇవన్నీ జిమ్మీ కార్టర్‌గారి లెక్కలు. కాదనలేం మరి!

అటు విదేశీ సామ్రాజ్యవాదులూ, ఇటు స్వదేశీ షావుకార్లూ, హిరణ్యాక్ష హిరణ్యకశిపుల్లా విస్తరించి దేశ ప్రజలని దోపిడీ, పీడనలకి గురిచేసి తోడు దొంగల్లాగా నంజుకుతింటున్నారు. వీళ్ళ పాలనకి స్వస్తి చెప్పాలి. వీళ్ళ పెత్తనానికి చరమగీతం పాడాలి. మనదేశంలోని విప్లవకారులందరి ఉమ్మడి లక్ష్యం ఇది. అందుకు ఉత్తేజం 'అమ్మ'.

పావెల్ కోర్టులో చెప్పిన మాటలు ఉన్నవి ఉన్నట్టుగావెయి.

ఆఖరిగా "విప్లవాల కన్నతల్లి ఆకలి" - శ్రీశ్రీ

"సోషలిజం కానేకాదు స్వప్నసీమ ఆ కలంతో సహజమది అన్నంతో అవసరమది" - చెరబండరాజు

పావెల్ ఉపన్యాసం

"మేము విప్లవవాదులం. ఎంతవరకైతే "స్వంత ఆస్తి" అనేదుంటుందో, ఎంతవరకైతే కొందరూరికే కర్రపెత్తనం చేస్తూంటే మరికొందరు చెమటోడ్చి పనిచేస్తూ ఉంటారో అంతవరకూ మేము విప్లవవాదులుగానే ఉంటాము. మీరు ఎవరిహక్కులను రక్షించడానికై నియమింపబడ్డారో వాళ్ళకు మేము సమాధానపరచుటకు వీలులేని శత్రువులం. మేము విజయం పొందేవరకూ సమాధానమనేది అసంభవం. కార్మికులమయిన మేము తప్పక జయిస్తాం. మీ నంవహానికి మీరనుకునేటంత శక్తిలేదు. మీరు దేని ఉత్పత్తి రక్షణలకోసమైతే లక్షలకొద్దీ జనం యొక్క మానప్రాణాలను బలిస్తున్నారో, దేని ఆధిక్యతవల్ల మా పైన అధికారం చలాయిస్తున్నారో, ఆ స్వంత ఆస్తే మీ సంఘంలో కలతలు పుట్టించి మిమ్మల్ని భౌతికంగానూ, నైతికంగానూ కూడా నాశనం చేస్తుంది. ఈ ఆస్తి అనే దాన్ని రక్షించడానికి చాలా బందోబస్తుకావాలి. నిజానికి మాకన్న మీరంతా అంటే అధికారం చలాయించే వాళ్ళంతా ఎక్కువ దాస్యంలో పడున్నారు. మేము భౌతికంగానే దాస్యం అనుభవిస్తున్నాం. మీరు ఆధ్యాత్మికంగా నాశనం చేస్తున్న దురలవాట్లను, దురహంకారాన్ని మీరు వదులుకోలేరు. కాని మేమో - మా ఆంతరంగిక స్వేచ్ఛను బంధించగలిగినదేదీలేదు. మీరు బుద్ధిపూర్వకంగా మా కెక్కించే విషయం కన్న అప్రయత్నంగా మా అంతరాత్మలకు మీరిచ్చే విరుగుళ్ళు చాలా రసవంతమైనవి. అందుచేత మీ విషం మాకు శాశ్వతమైన నష్టం చేయలేదు. మీరిచ్చే యీ విరుగుడు మా కార్మికుల రక్తంలో బాగా జీర్ణించింది. దీని శక్తివల్ల కలిగే తేజస్సు విజృంభించి, మీలో వుండే ఆధ్యాత్మికశక్తిని, తదితర మంచితనాన్ని కూడా ఆకర్షించేస్తుంది. ఒక్క సంగతి చూచుకోండి. మీలో ఒక్కడు కూడా ఇకముందు అధికారమే ఆదర్శంగా పెట్టుకొని దానికోసం దెబ్బలాడలేరు. ప్రపంచన్యాయానికి విరుద్ధంగా వున్న మీ ప్రవర్తనను సమర్థించుకోవడానికిదివరకే మీరు చెప్పవలసిన మాటలన్నీ చెప్పేశారు. మీరిక నూతనమైన భావాన్ని సృష్టించలేరు. భావప్రపంచంలో మీ పని సున్న. ఆధ్యాత్మికంగా మీరు గొడ్డుపోయినట్లే. కాని మా భావాలు దినదినాభివృద్ధి పొందుతున్నాయి. నానాటికి నూతనమైన తేజస్సు వృద్ధిపొంది కళ్ళు మిరుమిట్లు గొల్పుతాయి. ఈ భావాలే సామాన్య ప్రజలనందరినీ ఆకర్షించి, స్వాతంత్ర్య సమరానికి పురిగొల్పుతాయి. ప్రపంచంలో వుండే కార్మికులంతా తాము చేయదలచుకున్న మహత్కార్యాన్ని గుర్తించి ఒక్కటైపోతారు. జీవితంలో కలుగబోయే ఈ నూతన పరిణామాన్ని అడ్డుపెట్టడానికి దుర్మార్గం మూర్ఖత్వం తప్ప మీకు వేరే సాధనాలు లేవు. మీ మూర్ఖత్వం స్పష్టంగా కనుబడేపోతుంది. ఇక మీ దుర్మార్గం మాత్రం యెంతకాలం సాగుతుంది? అప్పుడే తెల్లముగం వేసింది. మీరు మిమ్మల్ని యీ రోజున యెవరిసహాయంతో మా గొంతు పిసుకుతున్నారో వారేమాకుసహచరులై మమ్మల్ని కౌగిలించుకుంటారు. మీ శక్తి అంటే మీ వెండి బంగారాల శక్తిచాలా నిర్జీవమైనది. ఆ నిర్జీవశక్తే మీ సంఘాన్ని అనేక చీలికలుగా చేసేసి ఒకళ్ళ నొకళ్ళు పీక్కు తినేటట్లు చేస్తుంది. కాని మాది జీవశక్తి. దానికి మూలం కార్మికులలో నానాటికీ వృద్ధిపొందుతూవున్న ఐకమత్యం. మీరుచేసే ప్రతిపనీ ప్రజలను బంధించిదే కనుక మహానేరం చేస్తున్నారు. మీ దురాశవల్లా, మీ ద్వేషంవల్లా పుట్టి, జనాన్ని పీడిస్తున్న పిశాచాల్ని, భ్రమల్ని అంతం చేయడానికి మేం పనిచేస్తున్నాం. మీరు మనిషిని అతని సాధారణ జీవితం నుంచి ఎడబాటు చేసి, విచ్ఛిన్నం చేసి విరజల్లిన ప్రపంచాన్నంతటినీ ఈ సాంఘికవాదమే మళ్ళీ ఒక్క బ్రహ్మాండంగా కలుపుతుంది. ఇది తప్పదు?" పావెల్ ఒక్కక్షణం ఆగి కాస్తమెల్లగా "ఇది తప్పదు!" అని రెట్టించాడు.



1935, జనవరి
గద్దె లింగయ్య
ఆదర్శ గ్రంథమండలి



మిడ్కో కథలు

☆ పి.వరలక్ష్మి

విప్లవోద్యమంలాగే విప్లవసాహిత్యమూ ప్రజల మధ్య నుండి వారి పోరాటాల నుండి, సంఘర్షణ నుండి, విధ్వంస సంస్కృతికి ప్రత్యామ్నాయంగా మానవసంబంధాలను ఉన్నతీకరించే దశలో ప్రయాణం సాగిస్తూ వస్తున్నది. విప్లవ రాజకీయాల ప్రేరణతో విప్లవోద్యమ ఆచరణ నుండే తెలుగులో అద్భుతమైన సాహిత్య సృజన జరుగుతుంది. అందులో భాగంగానే మిడ్కో కథలు. ఒక స్త్రీగా పురుషాధిపత్య భావజాలాన్ని నిరసిస్తూ అనేక కోణాల్లో కథా రచన ప్రారంభించిన మిడ్కో తన ఆచరణ క్రమంలో విప్లవోద్యమం నుండి ఒక విస్తృతమైన కాన్వాస్‌ను ఎన్నుకుంది. సుమారుగా పదేళ్ళ నుండి అనేక పేర్లతో వివిధ పత్రికల్లో ఆమె కథలు రాస్తున్నారు. ఈ కథలన్నింటినీ ఒక్క దగ్గర జేర్చి చూస్తే వీటిని రెండు రకాలుగా విభజించవచ్చునేమో. నేరుగా విప్లవోద్యమ నేపథ్యం నుండి సృజించినవీ, పితృస్వామిక సమాజంతో అడుగడుగునా స్త్రీల సంఘర్షణను ఇతివృత్తాలుగా చేసుకున్నవీ.

మిడ్కో కథలు, పురుషాధిపత్య సమాజంలో కంటికి కనిపించని హింసారూపాలను వెలికితీస్తాయి. అంతేకాక మాటల్లోనూ చేతల్లోనూ అడుగడుగునా వ్యక్తమయ్యే వివక్ష, పీడన అణచివేతలను విడివిడిగా కాకుండా వ్యవస్థలో భాగంగా చూసే దృక్పథం ఈ కథల్లో ఉన్న బలం. స్త్రీపురుష సంబంధాల్లోని సున్నితమైన పార్శ్వాలు కొన్ని కథల్లో వ్యక్తమైన తీరు అబ్బురపరుస్తుంది. ప్రకృతిని చూసి మానసికోల్లాసాన్ని పొందటంలో స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసం ఉంటుందా? వెన్నెలను, వెండి మబ్బులను, మంచు ముత్యాల్ని, వర్షపుజల్లులనూ ఆస్వాదించే భావుకత ఒక భర్తలో ఉన్నంతగా భార్యలో ఉండదా? అంటే ఆ భార్య మనసును చదివితే ఇట్లా ఉంటుంది. (భావుకత)

"మీరు సూర్యోదయాల్ని చూస్తూ పరవశించే వేళ
మీ కోసం మేం కాఫీలు కలుపుతూ ఉంటాం
మీరు వర్షాన్ని చూసి పులకరించే వేళ
మీ కోసం మేం వేడి వేడి పకోడీలు వేస్తూ ఉంటాం
మీరు హాయిగా ఆదమరచి నిద్రపోయే వేళ
మీ పిల్లలకు మేం పాలిస్తూ జో కొడుతూ ఉంటాం!"

'భావుకుడై'న భర్త అభిరుచి లేని భార్య దొరికినందుకు అసంతృప్తి వ్యక్తం చేస్తే భార్య ప్రతిస్పందన ఎలా ఉంటుంది. "నేను సరిగ్గా ఆరుగంటలకు వేడి వేడి కాఫీ ఇవ్వకపోతే తనలోని 'భావుకుడు' కిటికీ దగ్గరే పడి చచ్చిపోడూ".

సాధారణంగా కుటుంబంలో భార్య స్థానం 'పనిమనిషి' అనుకుంటూ ఉంటాం. నిజానికి పనిమనిషికి ఉండే స్వేచ్ఛలో కొంతైనా భార్యకు ఉండదు. భార్యకు జీతమూ, రాయితీలూ, హక్కులు అనేవేవీ ఉండవు సరికదా బాధ్యతలు మాత్రం ఉంటాయి. పనిమనిషికైనా ఏదో ఒక పనిలో సహకరిస్తాడేమోకాని భార్య అదే సహాయం కోరితే ఆమె బాధ్యతను గుర్తుచేసి హుంకరిస్తాడు (పనిమనిషి). స్త్రీ వేసే ప్రతి అడుగులోనూ, నడకలోనూ ప్రతీక్షణమూ ప్రయాణాల్లో, సినిమా హాళ్ళలో, ఆఫీసుల్లో, కాలేజీల్లో ఎంత సాధ్యమైతే అంత, ఎంత వీలైతే అంత అవమానపరచి మానసిక హింసకు గురిచేసి ఆనందించే వ్యవస్థీకృత దుర్మార్గం ఈ సమాజంలో ఉంది. దానిని ప్రతిఘటిస్తే సభ్య సమాజం అంతో ఇంతో సాయపడే పరిస్థితి ఉండి కూడా ఆ అవమానాన్ని పంటి బిగువున భరించే స్త్రీలే ఎక్కువ. అయితే ఇటువంటి అవమానమే భర్త చేస్తే సమాజం దృష్టిలో అతడు చేసేది అవమానం కిందికి వస్తుందా? కుటుంబంలో స్త్రీలపై జరిగే భౌతిక హింసకుచాలా సందర్భాల్లో సామాజిక ఆమోదం ఉంది. అటువంటప్పుడు ఆమె వ్యక్తిత్వాన్ని అవహేళన చేసినప్పుడో, లైంగిక హింసకు గురి చేసినప్పుడో కనీసం దానిని ఒక పీడనగానో, ఒక హింసా రూపంగానో చూడరు (సంకెళ్ళు). ప్రతిరోజూ స్త్రీలపై జరిగే అనేక అత్యాచారాలకు మూలం ఎక్కడుంది. ఒక మగవాడికి ఒక స్త్రీని అమాంతంగా ఎత్తుకెళ్ళి రేప్‌చేసే అధికారం ఎలా వస్తుంది. ఒక

చైతన్యవంతమైన విప్లవోద్యమ ఆచరణ నుండి 'పద్మ' వంటి స్త్రీలు చెప్పేది 'మనం పంటి బిగువున భరించే ప్రతి అవమానం మన అనుమానాల్ని మరింత పెంచుతుందనీ, మన ప్రతి చిన్న లొంగుబాటు కూడా ఎదుటి వాళ్ళకి పెద్ద విజయాన్నే ఇస్తుందని' (ఆమె వ్యక్తిత్వం)

ఒక అమ్మాయి ఎదిగే క్రమంలో ప్రకృతి సహజంగా జరిగే మార్పును సమాజం ఒక వింతగా చూడటం మొదలు పెడితే, కుటుంబ సభ్యుల ప్రవర్తన అసహజంగా మారిపోతే, అది ఆ చిన్నారి మనస్సులో ఎటువంటి ముద్రను వేస్తుంది? (మార్పు ఎవరిలో). స్వతంత్రంగా ఆలోచించే స్త్రీని సమాజం ఒక 'విడ్డూరపు మనిషి'గా చూస్తుంది. వ్యవస్థీకృతమైన పితృస్వామిక ఆధిపత్యపు భావజాలం స్త్రీలలోనూ ప్రతిఫలించడం, అది మాటల్లో చాలా సునాయసంగా వ్యక్తమవడం, తమకు తామే తక్కువ చేసుకొని మాట్లాడటం సాధారణమే అయినా తన హక్కుల కోసం వ్యక్తిత్వం కోసం తీవ్రంగా పోరాడిన 'లక్ష్మి' వంటి స్త్రీలలోనూ అదే లొంగుబాటు ఎందుకు కనిపిస్తుంది? సమాజం దృష్టిలో ఆమె భర్తను కొంగున ముడేసుకుంది. చిటికెనవేలు మీద ఆడిస్తోంది. మరి తన భర్త లోపాన్ని దాచి సంతానం కలుగకపోవడానికి కారణం తనే అయినట్లు లోపాన్ని తనమీద వేసుకోవడం ఎందుకు అంటే ఒక అనుభవజ్ఞురాలైన స్త్రీ ఇలా చెబుతుంది. 'మొగునికి భయపడక పోయినా ఈ మొగ ప్రపంచానికి భయపడాల్నే ఎవరైనా' (మొగ ప్రపంచం). భావజాలం ఎంతగా పాతుకుపోయిందంటే అమ్మ కోసం గిఫ్ట్‌గా మిక్సీనో, వాషింగ్‌మిషనో కొంటాము గాని ఆమె వ్యక్తిగత అభిరుచుల్ని కనీసంగా గుర్తిస్తామా అని రచయిత సూటిగా ప్రశ్నిస్తుంది. అసలు అమ్మకు సొంతంగా అభిరుచులుంటాయా? ప్రతిదీ భర్తకిష్టమని, కూతురికిష్టమని, కొడుక్కు ఇష్టమని చేస్తుంది. అందరి అభిరుచుల్ని తీరుస్తూ ఆమె అభిరుచుల్లాగే రుచుల్ని కూడా మర్చిపోతుంటుంది.(అమ్మకోసం)

విప్లవోద్యమ నేపథ్యంలో రూపుదిద్దుకున్న కథలు విప్లవం నుండి గొప్ప మానవీయ సంస్కృతిని, చైతన్యాన్ని అందిపుచ్చుకున్న ప్రజలు విప్లవకారుల్ని కడసారి చూసుకోవడానికి, శవాల్ని స్వాధీనం చేసుకోవడానికి పోరాటం చేయాల్సిన దుర్మార్గమైన రాజ్యంలో కొడుకుని పోలీసులు చంపేస్తే బిడ్డ జ్ఞాపకాన్ని ఊరి మధ్యలో కట్టడంగా నెలకొల్పడానికి గొప్ప పోరాటాలు చేసిన తల్లులు ఎంతో మంది ఉన్నారు. 'నీ కొడుకు అందరి లాంటి వాడు కాడు, వాడ్ని తలచుకోకూడదు, గోరి కట్టకూడదు, ఏడవకూడదు' అని శాసించే రాజ్యంతో తన కొడుకు ధిక్కారపు వారసత్వాన్ని తన భుజాన వేసుకొని అదే రాజ్యాన్ని సవాలు చేస్తుంది. 'వానిది అందరసువంటి సావు కాదు.. వూరి నడిమధ్యన గోరయి నిలిసే అసువంటి సావు" అని గర్వంగా చెబుతుంది. అంతేకాదు పురిట్లనే బిడ్డను పోగొట్టుకున్న తల్లిని గూడ నీకెంత మంది బిడ్డలు అనడిగితే బతికున్నోళ్ళ గురించీ సెప్తది. పురిట్లనే సచ్చిపోయిన బిడ్డల గురించీ సెప్తంది. అసువంటిది... భూమ్మీద ఇరవై యెనిమిదేండ్లు బతికిన నా కొడుకు గురించి, ఆ బతుకుని గురించి సెప్పాల్నని నాకనిపియ్యదా' అని ప్రశ్నిస్తుంది (జోలపాట)

అసహజ మరణాలు అత్యంత సహజమైపోయిన రాజ్యంలో తమ ఆత్మీయుల ఆఖరి చూపుకు నోచుకొని తల్లులు, భార్యలు, పిల్లల శోకం సామూహికమై అమరులైపోయిన వారిని తలచడానికి, ఒకరినొకరు ఓదార్చుకోడానికి ఒక సంఘంగా అవతరించిన ఒక గొప్ప రాజకీయ సంస్కృతి. శవాల్ని కూడా మాయం చేసే, దుఃఖాన్ని కూడా నిషేధించే ఫాసిస్టు పాలన నేడు మనం అనుభవిస్తున్నాం. రాజ్యం క్రూరత్వానికి బీభత్సంగా, భయానకంగా, హృదయవిదారకంగా కుమిలిపోయి, కుళ్ళిపోయి పురుగులు పట్టిన బిడ్డల దేహాన్ని తన కళ్ళతో చూడడానికి ఏ తల్లికీ వశంకాదు. ఎర్రటి పండుగా మొదటిసారి

విప్లవ కవిత్వ పరిణామం

☆ సగిలేటి

విప్లవోద్యమానికీ విప్లవ కవిత్వానికీ విడదీయరాని సంబంధం ఉంది. విప్లవ కవిత్వంలో వచ్చిన ప్రతీమార్పు, ప్రతీ అభివృద్ధి విప్లవోద్యమంతో ముడిపడి వుంది. ముప్పయ్ ఏళ్ళ పైబడి కొనసాగుతూ వస్తున్న విప్లవ కవిత్వపు ప్రభావశీలతను, దాని విస్తృతిని విప్లవోద్యమం నేపథ్యంగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నించినపుడే దానిని సమగ్రంగా వివరించగలుగుతాము.

ముప్పయేళ్ళ పైబడిన విప్లవ కవిత్వ ప్రస్థానంలో కనీసం ప్రతీ ఐదేళ్ళకొకసారిగా అది మార్పును సంతరించుకుంటూనే ఉంది. రూపంలో, నూతనత్వానికి, సారంలో విస్తృతికి చోటిస్తూనే ఉంది. కొన్ని సందర్భాల్లో విప్లవ కవిత్వం ఆగిపోయిందనీ, కొత్తదనాన్ని సంతరించుకోలేక పోయిందనీ విమర్శలకు గురైనప్పటికీ, అది చలనశీలంగా కొనసాగుతూ ఉన్నదేకానీ ఒక చోట ఆగిపోవడమో గిడసబారడమో జరగలేదు. పెద్దగా మార్పులేని సామాజిక జీవితంలో ముప్పయి సంవత్సరాలకు పెద్ద విలువ ఏమీ లేకపోవచ్చు గానీ ఒక మనిషి జీవితంలోగానీ, సంస్థ జీవితంలోగానీ ముప్పయ్ సంవత్సరాల కాలానికి గణనీయమైన స్థానమే ఉంది. విరసం ఆవిర్భావం దగ్గర నుండి ఈనాటి వరకూ ఉన్న కాలాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లయితే మొత్తంగా ఈ కాలం సమాజంలో అత్యంత చలనశీలతకు గురయిన కాలం. బహుశా జాతీయోద్యమ కాలంలో కూడా తెలుగు సమాజంలో ఇంత గాఢంగా, అనేక పొరలు కదలబారుతూ మార్పులు జరిగి ఉండకపోవచ్చు. ఇటువంటి కాలం సహజంగానే వివిధ రకాల అవగాహనలకు, వివిధ వ్యక్తీకరణలకు నిరంతరంగా సవాళ్ళు విసురుతూనే ఉంటుంది. వాటికనుగుణంగా తమనుతాము మెరుగుపరుచుకోలేనివేవైనా సహజంగానే తమ ప్రాముఖ్యతను కోల్పోతుంటాయి. ఇటువంటి ఉద్విగ్నభరిత మయిన ఈ కాలమంతటా విప్ల కవిత్వం తన స్థానం నిలుపుకుంటూ కొనసాగుతూ ఉంది. కాలానుగుణమైన వ్యక్తీకరణలోనూ, రాశిలోనూ అది ఎగుడు దిగుడులుగా కొనసాగి ఉండవచ్చుగానీ స్థూలంగా తన అవగాహనలో అది ఎన్నడూ తడబాటుకు లోను కాలేదు. ఇటువంటి గుణం ఈ ముప్పయేళ్ళ కాలంలో మరే ఇతర కవిత్వానికి కూడా ఉండే అవకాశమే లేకుండా పోయింది.

80ల తర్వాత కవిత్వం తన ప్రాధాన్యతను కోల్పోయిందనే విమర్శ విప్లవ కవిత్వం మీద ఉంది. దీన్ని కవిత్వానికుండే స్వభావం వైపు నుండి, అలాగే విప్లవోద్యమం సంతరించుకున్న మార్పుల వైపు నుండి పరిశీలించి ఒక నిర్ణయానికి రావలసి ఉంది. ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకున్నపుడే విప్లవ కవిత్వాన్ని సరిగా అంచనా వేయగలము. ఇక్కడే 'ప్రాధాన్యత' అనే అంశాన్ని కూడా కొద్దిగా వివరించవలసి ఉంది. ప్రాధాన్యత అనేది ప్రధానంగా భావజాలానికుండే సమకాలీనతను సూచిస్తుంది. అయితే భావజాలమనేది తనంతట తాను వ్యక్తం చేసుకోలేదు. కాబట్టి తనను తాను వ్యక్తం చేసుకునేందుకు భావజాలానికి వివిధ వ్యక్తీకరణ

చూసుకున్న తన బిడ్డను, ఆటపాటల, ఉరుకుల పరుగుల ప్రవాహమైన తన బిడ్డను, ఉద్యమాల ఊపిరయిన తన బిడ్డను 'చంపేశాం' నీ బిడ్డ అవునోకాదో చూసుకో పో' అని పోలీసులు అంటే... (ఈ శోకం ఎందరిది?) తీరా చనిపోయింది తన బిడ్డ కాదని తెలిశాక ఆ తల్లి సంతోషిస్తుందా....? ఏతల్లి కన్న బిడ్డ నని "కడుపు చించుకుని పుట్టిన బిడ్డ ఈడ పీనుగై పడుందన్న సంగతి రెండు రోజులైనా తల్లికి తెల్వకపోవుడు... ఎంత ఘోరం... నాకు కడుపు కోతంటే ఏందో తెలువ జెప్పినవే. నువ్వు నాకు నా కడుపుల పుట్టిన బిడ్డలెక్కనే అనిపిస్తున్నావ్ బిడ్డా" అంటో నిలువెత్తు శోకమవుతుంది. "ఈళ్ళింట్ల పీనుగెల్ల, ఒకరి బదులు ఇంకోరు పేర్లు జెప్తరా? పాపిస్టోల్లు ఈళ్ళకేం తెల్సు కడుపు కోత బాదెట్లాంటిదో" అంటూ ఆమె శోకం ఆగ్రహమవుతుంది. ఆ దుఃఖం సామూహిక మవుతుంది. నూతన సమాజ నిర్మాణం కోసం తల్లిదండ్రులకు ఆత్మీయులకు దూరమైన విప్లవకారులు ఎందరో తల్లులకు దిక్కైతే, వారి రక్తబంధువులు ఒకరికొకరు తోడైతారు. ఉద్యమం వారి మధ్య బంధమవుతుంది (ఇద్దరు తల్లులు)

రాష్ట్ర సరిహద్దుల్లో 'ఎన్‌కౌంటరైన' తన సహచరుని ఆఖరి చూపుకోసం, పోలీసులు మాయం చేసిన ఆ విప్లవకారుని శవం కోసం ఎంతగానో పోరాడిన మహిళను ఏరుదాటేకి చేతగాక భర్త బొందజాడలేకపోయిన వృద్ధురాలి దుఃఖాన్ని రెండు వేర్వేరు సందర్భాలను ఒకే మానవీయ కోణంలో అద్భుతంగా ఆవిష్కరించిన 'బొందజాడనైతి' కథ తెలుగు సాహిత్యంలోని గొప్ప కథల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు.

పితృస్వామిక అణచివేతను కుటుంబంలో ఎదిరించడం మొదలు తన వంటి ఎంతో మంది స్త్రీల విముక్తి సమాజ మార్పుతో ముడిపడి ఉన్నదని వ్యవస్థ మార్పుకొరకు విప్లవోద్యమం దాకా విస్తరించిన చైతన్యం నేడు ఉద్యమాల్లో, మహిళల స్థానాన్ని సమున్నతంగా నిలబెడుతున్నది. ముఖ్యంగా ఈ రెండు సంవత్సరాల కాలంలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లలో అమరులైన అనేక మంది మహిళలు ఈ ఆదర్శాన్ని చాటుతూనే ఉన్నారు. భర్తతో చిత్రహింసలు కాపురాన్ని తెగదెంపులు చేసుకోవడానికే వెనుకాడిన 'ఉదయ' వంటి స్త్రీలు చివరికి ఉద్యమ జీవితాన్ని ఎంచుకొనే క్రమంలో (అనగనగా ఒక అమ్మ) ఆ ఆదర్శాన్ని అంది పుచ్చుకుంటున్నారు. తల్లి ప్రోత్సాహంతో భర్త నుండి విడిపోయిన ఉదయ క్రమంగా ఉద్యమాల పట్ల సానుభూతినీ, అభిమానాన్ని పెంచుకొని స్వయంగా తనే ఉద్యమంలోకి పోతానన్నప్పుడు కూతురి క్షేమం పట్ల ఆందోళన చెందినా కూతురు తన జీవితాన్ని నిర్ణయించుకునే హక్కును కాదనలేకపోతుంది. "నీ ప్రయాణంలో ఎప్పుడన్నా నువ్వలిసిపోతే నీకో అమ్మ ఉన్నదన్న విషయం మాత్రం మర్చిపోవొద్దురా..." అని మాత్రం అనగలుగుతుంది. మిడ్కో కథల్లో ఇటువంటి అద్భుతమైన, చైతన్య పూరితమైన తల్లిపాత్రలు 'విద్దారపు మనిషి, జోలపాట, కొత్తమలుపు' వంటి చాలా కథల్లో కనిపిస్తాయి.

భర్తను అనుసరిస్తూ ఉద్యమ జీవితంలోకి అడుగుపెట్టిన స్త్రీ తన సహచరుడు లొంగిపోతే తను మాత్రం దృఢంగా నిలబడుతుంది. "అప్పుడు నేను చెబితే విన్నావు. ఇప్పుడు వినవేంది" అని అతనంటే "నువ్వొక మామూలు భర్తవయితే నిన్ను నేను ఇష్టపడేదాన్ని కాదు... నిన్నంత మంచిగా తయారు చేసింది పార్టీ అని అర్థమయిన తర్వాత పార్టీని ఇంకా ఎక్కువ ఇష్టపడ్డాను" అంటుంది. (ప్రవాహం)

లొంగిపోయిన విప్లవాకారుని మనఃస్థితిని సున్నితంగా ఆవిష్కరించిన "మెట్లమీద" కథ పీద చాలానే చర్చ జరిగింది. ఆ చర్చలోకి పోలేని పరిధి ఈ వ్యాసానిది. అయితే ఆ చర్చ విప్లవకారుల లొంగుబాటుకి కారణాల దగ్గర్నుంచి, విప్లవపార్టీలో మహిళల స్థానం వరకు ఎంతో అవసరమైన చర్చకు ఆస్కారమిచ్చినట్టయింది.

ప్రజల మధ్య, ప్రజా జీవితాల నుండి, పోరాటాల నుండి రూపుదిద్దుకున్న ఈ కథలు సంకలనంగా రావలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. ముఖ్యంగా స్త్రీ జీవితంలోని అనేక పార్శ్వాలు, కుటుంబ హింస మొదలుకొని, సాంఘిక జీవనంలో ఎదురయ్యే వివక్ష, అవమానాలలో పోరాడే మహిళల దగ్గర్నుండి వ్యవస్థతోనే పోరాటం చేసే మహిళల వరకు ఆ చైతన్యాన్ని, సంఘర్షణను నిక్షిప్తం చేయడానికి మిడ్కో కథల సంకలనం రావాలని ఆశిస్తూ మంచికథా సాహిత్యాన్ని అందిస్తున్న మిడ్కో గారికి కృతజ్ఞతలు. ✻

రూపాలు అవసరమవుతాయి. దీనిలో సాహిత్యం కూడా ఒకటి. సాహిత్యంలో అనేక ప్రక్రియా రూపాలుంటాయి. ఈ ప్రక్రియలన్నింటి ప్రధాన లక్ష్యం భావజాలాన్ని ఎత్తి పట్టడమే. అయితే సాహిత్యంలో ప్రతి ప్రక్రియా రూపానికీ కొన్ని ప్రత్యేకతలుంటాయి. ఈ ప్రత్యేకతలు వాటికుండే చరిత్ర నుండి, వ్యక్తీకరణ పద్ధతుల నుండి వాటికి సమకూరుతాయి. ఈ ప్రత్యేకతల కారణంగానే ఇవి కొన్ని నిర్దిష్ట ప్రజాసమూహాలను మాత్రమే నేరుగా ఉద్దేశిస్తాయి. నిర్దిష్టమయిన ప్రజా సమూహాలను మాత్రమే ఉద్దేశించగలిగే ప్రత్యేకత ఒకోసారి ఆయా ప్రక్రియలకు పరిమితిగా కూడా మారే అవకాశం ఉంది. సాహిత్య ప్రక్రియగా కవిత్వానికి 'మధ్యతరగతి' స్వభావం ఉంది. అవగాహనలోనూ, వ్యక్తీకరణలోనూ దీనికి ఈ స్వభావం సమాజంలో జరిగిన వివిధ సంస్కరణలు, ఉద్యమాలు, బయటి ప్రపంచపు ప్రభావం నుండి వచ్చింది. వీటి ఫలితంగానే తెలుగు కవిత్వానికి కవులు, పాఠకులు తయారయ్యారు. తొలుత విప్లవ కవిత్వానికి కూడా కవులు, పాఠకులు ఈ నేపథ్యం నుండి వచ్చారు. అయితే విప్లవ కవిత్వం తన పరిధిని అంతవరకే పరిమితం చేయలేదు. తన పరిధిని మరింతగా విస్తృతం చేసుకునేందుకుగాను, అది విశాల ప్రజాసమూహం ముందర నిలబడి గొంతెత్తి తనను తాను పరిపుష్టం చేసుకునేందుకు ప్రయత్నించింది. సంప్రదాయ సాహిత్య సిద్ధాంతాలను అణగదొక్కి ప్రజలకోసం సాహిత్యంగా తననుతాను సరిచూసుకున్నది. మొత్తం తెలుగు సాహిత్య చరిత్రలోనే ఇటువంటి కృషిని విప్లవ కవిత్వం మాత్రమే మొదటిసారిగా చేసింది. భావజాలాన్ని ఒక చైతన్యంగా ప్రజలపరం చేసేందుకు ప్రక్రియాపరమైన పరిమితులను కూడా అధిగమించేందుకు కృషి చేసింది. ఈ కృషి, కనీసం దానికి సంబంధించిన చర్చ 80ల వరకు విప్లవ కవిత్వం చేస్తూనే ఉంది.

80వ దశకం తెలుగు సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. సమాజంలో కొనసాగుతూ వచ్చిన అసమానతను ప్రశ్నిస్తూ భావజాల రంగంలో అప్పటివరకూ కొనసాగుత్తున్న భావాలకు, వ్యక్తీకరణలకు సవాళ్ళు ఎదురవ్వడం తీవ్రతరమయ్యాయి. ఈ రకమయిన సవాళ్ళు సమాజపు అట్టడుగు పొరల నుండి రావడం మొదలయ్యాయి. క్రమేపీ అనేక ముఖాలుగా విస్తరిస్తూ వివిధ అస్తిత్వాలకు సంబంధించిన వ్యక్తీకరణలుగా నేటికీ కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అసమాన అభివృద్ధికి సంబంధించిన స్పృహ భావజాల రంగంలో ఆధునికతను గురించి, విప్లవోద్యమ అవగాహనను గురించిన చర్చగా పరిణమించింది. తీవ్ర ఉద్వేగాలతో, పరస్పర ఆరోపణలతో కూడిన వాద వివాదాలతో గందరగోళానికి దారితీసింది. ఈ గందరగోళం నుండే ఆధునికత అంతం, శ్రామికవర్గ భావజాల సంక్షోభం వంటి భావనలు బౌద్ధిక రంగంలో అడుగుపెట్ట గలిగాయి. వీటికి అంతర్జాతీయంగా వచ్చిన వివిధ మార్పులు, ప్రభావాలు జతకలిశాయి. ఈ నేపథ్యం నుండే 80లలో విప్లవ కవిత్వం తన ప్రాధాన్యతను కోల్పోయిందనే విమర్శ ముందుకొచ్చింది. నిజానికి విప్లవ అవగాహన భావజాల రంగంలో తన సమకాలీనతను ఎన్నడూ కోల్పోలేదు. సమాజంలో వస్తున్న మార్పులకనుగుణంగా అది విస్తృతమవుతూ వచ్చిందేకానీ ఆగిపోవడమో గిడసబారడమో జరగలేదు. కానీ 80వ దశకంలో భావజాల రంగంలో ఏర్పడిన గందరగోళం 'మధ్యతరగతి' మీద తీవ్ర ప్రభావాన్నే వేసింది. సాహిత్య రంగంలో సృజనకారులపై, పాఠకులపై తన ముద్రను వేసింది. తీవ్రవాద వివాదాల నడుమ, ఉద్విగ్నతల నడుమ, మధ్యతరగతిలో ఏర్పడిన ఈ భావజాల గందరగోళం విప్లవావగాహనకు, విప్లవ సాహిత్యోద్యమానికి అననుకూలతను కలిగించింది. ఇటువంటి సమయంలోనే విప్లవోద్యమం మధ్యతరగతిపై ప్రభావాన్ని వేసే వివిధ కార్యస్థలాల నుండి మరలి గ్రామాలకు తరలి వెళ్ళడం జరిగింది. ఈ పరిణామం విప్లవావగాహనను వ్యాప్తి చేసేందుకు, దాని సాహిత్య వ్యక్తీకరణకు పదును పెట్టుకునేందుకు సవాల్‌గా పరిణమించింది. భావజాల వ్యక్తీకరణకు సంబంధించిన ప్రక్రియ పరంగా ఏర్పడిన ఈ అననుకూలతనే విమర్శకులు 'ప్రాధాన్యత' కోల్పోవడంగా భావించారు.

ఈ అవగాహనతో 80ల నుండి విప్లవ కవిత్వాన్ని పరిశీలించినపుడు, ఒక ప్రక్రియగా కవిత్వానికి ఉండే ప్రత్యేకతే కొన్ని నిర్దిష్టమయిన పరిస్థితులలో పరిమితిగా ఎట్లా మారుతుందో అర్థమవుతుంది. విప్లవ కవిత్వంపై కాలానుగుణంగా వచ్చిపడిన అననుకూలతల ప్రభావం తెలిసివస్తుంది. అలాగే ఈ అననుకూలతలను అధిగమించేందుకు చేసిన కృషిని అంచనా వేయడానికి కూడా వీలవుతుంది. నిజానికి విప్లవ కవిత్వం 80ల నుండే - అంతకు ముందటి దశాబ్దంతో పోల్చితే అభివ్యక్తిలోనూ, వస్తు విస్తృతిలోనూ కొత్త పోకడలకు పోయింది తనపై బయటి ప్రభావం ఉన్నప్పటికీ వాటిలోని నిర్దిష్టతకు సంబంధించిన అతిని పరిహరించి నిర్దిష్టతకూ, సాధారణీకరణకు నడుమ ఉండాల్సిన సంబంధాన్ని నిరంతరంగా ఎత్తిపడుతూ వచ్చింది. అయితే 80ల తర్వాత విప్లవోద్యమపు నూతన దశను అందుకునేందుకు, అది సాధించిన అనుభవాలను, అవగాహనా విస్తృతినీ వ్యక్తం చేసేందుకు విప్లవ కవిత్వం చేసిన ప్రయత్నం ఒకే గతిలో సాగలేదు. విప్లవోద్యమానికీ, విప్లవ కవిత్వానికీ నడుమ కొంత దూరం ఏర్పడి, అది వివిధ స్థాయిలుగా కొనసాగుతూ, మొత్తం ఈ పాతికేళ్ళలో ఎక్కువ కాలమే నడుస్తూ వచ్చింది. ఆ రకంగా అది తన కాలపు విప్లవోద్యమాన్ని ఎగుడు దిగుడులుగా మాత్రమే ప్రతిబింబించ గలిగింది. చైతన్యస్థాయిలో ఈ సమస్యను అధిగమించడానికి చేస్తూ వచ్చిన ప్రయత్నాలు కూడా ఒకేగతిలో సాగలేదు. నిర్బంధం, వివిధ ఒత్తిళ్ళు, చుట్టూ ఉన్న వివిధ రకాల ప్రభావాలు ఈ ప్రయత్నాలను ఆటంకపరుస్తూ వచ్చాయి.

దశాబ్దాలుగా విప్లవసాహిత్యోద్యమం కొనసాగుతూ ఉన్న కాలంలో పోల్చినట్లయితే 80ల తర్వాత విప్లవ కవిత్వానికున్న అననుకూలతల కారణంగానే తక్కువ మంది మాత్రమే విప్లవ కవులుగా గుర్తింపును పొందారు. వీరు తమ కవిత్వం ద్వారా విప్లవోద్యమ స్థితికి, అవగాహనకు దగ్గరకు చేరుకొని తమ కాలాన్ని ప్రతిబింబించారు. చైతన్యయుతమైన ఈ కృషి కారణంగానే విప్లవ కవిత్వం మార్పును సంతరించుకుంటూ తన స్వీయాత్మకతను నిలబెట్టుకుంటూ వచ్చింది.

విప్లవ కవిత్వంపై వచ్చిన విమర్శలో నిర్దిష్టతకు సంబంధించింది కూడా ఒకటి. విప్లవసాహిత్య అవగాహనలో నిర్దిష్టతకు తగిన స్థానమే ఉంది. అయితే అది ప్రతిపాదించే నిర్దిష్టత సమాజం నుండి వేరుపరిచేది కాదు. మరొక అస్తిత్వాన్ని ఆమోదించలేనంతగా తనను తాను వేరు చేసుకునేది కాదు. నిర్దిష్టతపై విప్లవ సాహిత్యోద్యమానికున్న అవగాహన ఇది. ఈ అవగాహనను విప్లవ కవిత్వంలో కూడ చూడవచ్చు. అయితే అస్తిత్వ వ్యక్తీకరణ జీవితానికి వెళ్ళినంత దగ్గరగా విప్లవ కవిత్వం వెళ్ళలేదనే అంగీకరించాలి. విప్లవోద్యమం చొచ్చుకుపోయిన వివిధ ప్రాంతాల, జీవితాల విస్తృతిని విప్లవ కవిత్వం పట్టుకోగలిగినట్లయితే ఈ లోపం ఒక మేరకయినా తీరి ఉండేది.

80లలో విప్లవావగాహనకు ప్రధాన సవాల్‌గా ముందుకొచ్చిన అస్తిత్వ చైతన్యం, అది ప్రయాణించగలిగినంత మేర ప్రయాణించి ఇప్పుడు పరిమితులకు లోనయింది. ఈ పరిమితి మున్ముందు తిరోగామి వైఖరులకు తావిచ్చేదిగా కూడా మారవచ్చు. ఇటువంటి వైఖరులు కొన్ని ఇప్పుడే పొడచూపుతున్నాయి కూడా. ఇటువంటి సందర్భంలో విప్లవ కవిత్వాన్ని వివిధ కోణాల నుండి సమీక్షించుకొని తన స్వీయాత్మక అననుకూలతలను అధిగమించేందుకు కృషి చేయాల్సి ఉంది. *

తెలంగాణ వాద విమర్శ: అధిగమించవలసిన పరిమితులు

☆ కె.శ్రీనివాస్

తెలుగు సాహిత్యంలో వచ్చిన వాదాలన్నీ ప్రత్యేక సాహిత్య విమర్శా మార్గాన్ని కల్పించాయా అన్నది ప్రత్యేకంగా పరిశీలించవలసిన ప్రశ్న. సమాజ పరిస్థితులకు స్పందనగా వెలువడే కొత్త సాహిత్య ధోరణులు అనివార్యంగా కొత్త పదజాలాన్ని, భావనలను తీసుకువస్తాయి. ఆరంభంలో ప్రతికొత్తధోరణీ గతసాహిత్యంతో తన సంబంధాన్ని, దూరాన్ని నిర్వచించుకోవడానికి ప్రయత్నిస్తుంది. అటువంటి నిర్వచనాలు, భావనలు అన్నివేళలా విమర్శ పరికరాలుగా మారుతున్నాయని చెప్పలేము.

తక్కిన అన్ని ఉద్యమాల సంగతి ఇక్కడ అప్రస్తుతం కానీ, గత దశాబ్దంన్నర, రెండు దశాబ్దాలుగా వేదిక మీద ఉన్న అస్తిత్వ ఉద్యమాలు ప్రత్యేక సాహిత్య విమర్శ మార్గాలను రూపొందించుకున్నాయని గట్టిగా చెప్పలేని పరిస్థితి ఉన్నది. అలాగని, దళితవాద విమర్శ, స్త్రీవాద విమర్శ, తెలంగాణ వాద విమర్శ, మైనారిటీవాద విమర్శ అంటూ విమర్శలూ పరిశీలనలూ జరగడంలేదని కాదు. సాహిత్య విమర్శలో ఆయా వాదాల పాయలు లేవనీ కాదు. కానీ, సాహిత్యాన్ని అంచనావేయడానికీ, అర్థం చేసుకోవడానికి, వ్యాఖ్యానించడానికి కావలసిన ప్రత్యేక పరికరాలను ఆయా వాదాలు రూపొందించుకున్నాయని, ఉపయోగిస్తున్నాయనీ అంగీకరించలేము. అస్తిత్వ ఉద్యమాలుగా స్థూలంగా పరిగణించే ఈ ఉద్యమాలు (స్త్రీవాదం తనను తాను భిన్నంగా చెప్పుకోవచ్చు) ప్రధానంగా తులనాత్మకమైన ప్రతిపత్తి గురించి, సాపేక్షమై నిరాకరణ / తిరస్కారణలగురించి, పోల్చదగ్గవారి నడుమ ఉండే అంతరాల (అనామలీస్) గురించి మాట్లాడుతూ వచ్చాయి. ఒక్కొక్క వాదం ఒకరాజకీయ ఉద్యమంగానో, సంస్థగానో పరిణమించి, తమ తమ ఆకాంక్షల సాధనకు పనిచేయాలనుకునే ధోరణి ఇక్కడ కనిపించదు. సమాజంలో అప్పటికే ఉనికిలో ఉన్న సంస్థలూ, ఉద్యమాలూ తమ వాదంతో ప్రభావితమై, పునర్వ్యవస్థీకరణ చెందాలని, తమ ఉనికి విషయంలో స్పృహను సిద్ధాంతంలో, ఆచరణలో అంతర్లీనం చేసుకోవాలని, ఆ మేరకు ప్రజాస్వామీకరణం చెందాలని అస్తిత్వవాదాలు ఆశిస్తాయి. అస్తిత్వవాదాలకున్న ఈ లక్షణం కారణంగా సమగ్రమైన ప్రాపంచిక దృక్పథాన్ని కలిగి ఉండడం అవసరమని అవి భావించవు. ఉనికిలో ఉన్న ఇతర సిద్ధాంతాలను విమర్శించడం, వ్యాఖ్యానించడమే ఎక్కువ. సిద్ధాంతరంగంలో ఉన్న ఈ పరిమితే సాహిత్య విమర్శలోనూ కనిపిస్తుంది. సమాధానాల కంటె ప్రశ్నలమీదే అస్తిత్వ ఉద్యమాల్లకున్న ఈ ఆసక్తి ప్రత్యేక సాహిత్య విమర్శలు అనివృద్ధి చెందకుండా అవరోధంగా నిలుస్తున్నది.

ప్రత్యేక రాష్ట్రసాధన అనే నిర్దిష్టమైన రాజకీయ లక్ష్యం కోసం పనిచేస్తున్న తెలంగాణవాద ఉద్యమం, సమైఖ్యాంధ్రవాదాన్ని బలంగా ప్రశ్నిస్తుంది. బ్రిటీష్ పాలిత తెలుగు ప్రాంతాలతో తమకు రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలోనే కాక, మనోభావాలరీత్యా కూడా తాదాత్మ్యం లేదని, వేర్పాటు చారిత్రకమని చెబుతుంది. రెండు తెలుగు ప్రాంతాల సహజీవనం - అసమానమైనది, తెలంగాణ ప్రాంతం వనరుల దోపిడీకి, అభివృద్ధి వివక్షకు, వలసీకరణకు, సాంస్కృతిక అవమనాలకు లోనవుతున్నదని భావిస్తుంది. అందుకు తగ్గట్టుగానే, సాహిత్యరంగంలో వచ్చిన ప్రశ్నలు కూడా ఉమ్మడి తెలుగు సాహిత్య చరిత్రను, చరిత్రనిర్మాణరీతిని, సాంస్కృతిక చిహ్నాల గుర్తింపును ఉద్దేశించి వచ్చాయి. గతాన్ని నిర్మించుకోవడం అన్న స్థూల జాతీయవాద సాంస్కృతిక ఎజెండా తెలంగాణ విషయంలోనూ కనిపిస్తుంది. విభజన అత్యంత ప్రాచీనమైనదని, అనూచానమైనదని చెప్పడానికి అస్తిత్వ ఉద్యమం రాజకీయంగా తహతహలాడుతుంది. ఆ ఆత్రుతలో అనేక చారిత్రక వాదనలు వచ్చే అవకాశమున్నా, వాటిని సమర్థించడమే కర్తవ్యంగా భావిస్తుంది. తెలుగులో తొలిస్వతంత్ర కావ్యరచన చేసిన పాల్కురికి సోమనాథుడే లిఖిత సంప్రదాయంలో ఆదికవి అని ప్రతిపాదించడం సహేతుకమే అయినా తెలంగాణలోనే సుమేధు నాగరికత ఆనవాళ్ళున్నాయన్న వాదనను యథాతథంగా ఆమోదించడం కష్టం. పాల్కురికిసోమన, పోతన వంటి భక్తికవులలో కనిపించిన ధిక్కారాన్ని వర్తమాన తెలంగాణ స్వభావానికి అనువర్తింపచేయడం ఆవేశాలను సంతృప్తిపరిచేదే తప్ప శాస్త్రీయమని చెప్పలేము. రాజకీయ ఉద్వేగాలు నేపథ్యంగా ఉన్న అస్తిత్వ విమర్శ - తాను సొంతంగా శాస్త్రబద్ధంగానూ ఉండదు, ఎదుటిపక్షం నుండి విమర్శనూ ఆశించదు. విమర్శను కోల్పోయే ఈ గుణం అన్ని అస్తిత్వ ఉద్యమాలలోనూ కనిపించడం విశేషం.

చరిత్రలోని అసమానతల గురించే ఎక్కువ పట్టించుకోవడం కూడా అన్ని అస్తిత్వ ఉద్యమాలలో సాధారణంగా కనిపిస్తుంది. ఫలితంగా ఆయా ఉద్యమాల ఫలితంగా సమకాలంలో వచ్చిన సృజనాత్మక రచనలను మదింపువేయడానికి కావల్సిన విమర్శ పరికరాలను సృష్టించుకోవడం మీద పెద్ద శ్రద్ధ కనిపించదు. దళితవాద సౌందర్యదృష్టిమీద, పదజాలం మీద, భావుకత మీద కొంత కృషి జరిగిన మాట నిజమేకానీ, విమర్శలో స్థిరపరిచేంతగా కొనసాగలేదు. తెలంగాణవాదం విషయంలో కూడా - అపారంగా వ్యక్తమైన, వ్యక్తమవుతున్న సృజనాత్మకతకు తగిన విమర్శ అభివృద్ధి చెందలేదు. సృజనాత్మక రచన కూడా కవిత్వరూపంలో వచ్చినంతగా, వచనరూపంలో రాలేదు. అస్తిత్వ ఉద్యమంలోని ఆవేశ, ఉద్వేగ భరిత అంశాలకు మాత్రమే పరిమితమైన అవగాహనతో స్పందించే కవులు అసంఖ్యాకంగా కనిపిస్తారు. వారి స్పందనల్లో వాళికే తెలియకుండా వ్యక్తమైన స్థానికత కనుగొనడానికి కావలసిన పరికరాలు ఇంకా రూపొందవలసి ఉన్నది.

తెలంగాణ వాద సృజనలో మూడు ముఖ్యమైన పాయలు కనిపిస్తాయి. ఒకటి - నేరుగా కోస్తాంధ్ర వలసీకరణను, ఆధిపత్యాన్ని ఉద్దేశించి రాసేది. రెండు - స్థానిక ప్రత్యేకతలను ప్రకటిస్తూ కీర్తిస్తూ రాసేది. మూడోది - తెలంగాణ గ్రామీణ గతాన్ని స్మరిస్తూ రాసేది. ఈ అన్ని రకాల సృజనల్లోనూ (ముఖ్యంగా కవిత్వంలో) తెలంగాణ స్థానికత, స్వభావం వ్యక్తమవుతుంది. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన అనేక భౌగోళిక, నైసర్గిక, సాంస్కృతిక విశేషాలు వీటిల్లో ప్రతిఫలిస్తున్నాయి. స్థలాన్ని, స్థానాన్ని, స్థానికతను తెలుగు కవిత్వంలో పరిశీలించడం తెలంగాణ ఉద్యమం సందర్భంలో మొదలుకావడం సహజం, అవసరంకూడా. గతంలోని స్థలపురాణాల దగ్గర నుంచి, స్థానిక చరిత్రలు, స్వగ్రామప్రశంసల దాకా పరిశీలించి, ప్రత్యేకవాద రాజకీయ ఉద్యమంలో ఆ ధోరణి ఏ రూపం తీసుకుంటుందో సాహిత్య విమర్శే గుర్తించాలి. తెలంగాణ వాదం కేవలం ప్రత్యేకరాష్ట్రస్థాపనతో ముగిసిపోయే తాత్కాలిక రాజకీయ సిద్ధాంతం కాదని, దానికి విశాలమైన భూమిక ఉన్నదని గుర్తిస్తే, ప్రపంచీకరణకు ప్రతిగా వస్తున్న విచ్ఛిత్తి, స్థానికీకరణల దృష్టితో ఈ ఉద్యమానికి అంతర్జాతీయమైన ప్రాసంగికతను అర్థం చేసుకోవచ్చు. గ్లోబలీకరణకు, సామ్రాజ్యవాదానికి ప్రతిగా వస్తున్న నవీన ఉద్యమాలలో తెలంగాణను అనుసంధానించి సమగ్రమైన రాజకీయ దృక్పథంగా రూపొందడానికి సహాయం చేయవచ్చు. తెలంగాణ వాద రాజకీయనాయకత్వం సిద్ధాంతాన్నే అప్రస్తుతం అంటున్నప్పటికీ, తెలంగాణవాదులకు అది అవసరం. స్థానికవనరులపై స్థానికులకే నిర్ణయాధికారం - అన్న విలువే తెలంగాణవాదానికి, గ్లోబలైజేషన్ వ్యతిరేక పోరాటానికి కీలక అంశంగా ఉంటుంది. తెలంగాణకు పరాయి అభివృద్ధిని దిగుమతి చేసుకోవడం కాక, తెలంగాణ సాంప్రదాయిక అభివృద్ధి ధోరణులను గుర్తించడం, తెలంగాణ సాంప్రదాయక ప్రజాపరిజ్ఞానాన్ని ఆశ్రయించడం చేయకపోతే, ప్రత్యేక ఉద్యమానికి అర్థం లేదు.

ఒక నిర్దిష్టమైన స్థలనామం సర్వనామంగా మారి ఆ స్థలంతో పరిచయం చేయనివారిని కూడా స్పందింపచేయడం కనిపిస్తుంది. ఒక పాటకవి - కేవలం ఏ నీటి ఆధారమూ లేకుండా, దుర్భిక్షానికి తట్టుకుని పెరిగే పూల గురించి పాటరాశాడు. నల్లతుమ్మ చెట్ల సౌందర్యం గురించి రాశాడు. వర్షాధార ప్రాంతాల భావుకత భిన్నంగా ఉంటుందని ఆ పాటల మీద వ్యాఖ్యానిస్తే - ఒక మిత్రుడు

పుస్తక పరిచయం

☆ చలసాని ప్రసాద్

ముస్లింలు - దేశచరిత్ర

ఇతిహాసం చీకటి కోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు
దాచేస్తే దాగనిసత్యం

ఈ మాటలు మరీ ఎక్కువగా మనదేశ చరిత్రకి వర్తిస్తాయి. తీగలాగితే ఎన్నెన్నో డొంకలు కదుల్తాయి. ఇక్కడికి తొలిగా వలసవచ్చిన వాళ్ళు ఆర్యులు. ఇంగ్లీషు వాళ్ళు ఆఖరికోవలోకి వస్తారు..ఆ మాటకొస్తే ఈ దేశం అసలుసిసలు ఆదివాసులదీ, మూల వాసులదీను. ఒక్క తెల్లవాళ్ళు తప్ప తక్కిన వాళ్ళందరూ దేశాన్ని తమదిగానే భావించారు. ఇక్కడే స్థిరపడిపోయారు కూడా. దీన్ని తమ దేశమనుకోకుండా మన రక్త మాంసాల్నీ, ఎముకల్నీ పీల్చి పిప్పి చేయడంలో వాళ్ళల్లో వాళ్ళే కాట్ల కుక్కల్లాగా పోటీలు పడ్డారు - డచ్చి, పోర్చుగీసు, ఫ్రెంచి, ఇంగ్లీషు వాళ్ళను ఈ దోపిడీలోనెగ్గి, వాళ్ళని తరిమేసి, తనబావుటా నెగరేశాడు ఇంగ్లీషు వాడు. ఇది సూక్ష్మంగా మనదేశపు పాతచరిత్ర. మన ఆఖరి చక్రవర్తి బహదూర్‌షా జాఫర్ (1775-1862) ఇరవైఏళ్ళపాటు (1837-57) మనదేశాన్ని పాలించాడు ప్రజానుకూల సంస్కరణలు చేస్తూ. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికి నాయకత్వం వహించాడు. దేశంలోని రాజులందరినీ ఏకమై పోరాడాల్సిందిగా జాబులు రాశాడు. మనదేశం నుంచీ ఈ ఫిరంగీలని తరిమి వేయడంలో మన శక్తియుక్తులన్నిటినీ ప్రయోగిద్దాం. వాళ్ళని పంపేసి నేను ఏలాలనుకోవడం లేదు. నా అధికారాన్ని ఒదులుకుంటాను. వాళ్ళని మనందరం కలిసి తరిమికొట్టి, బాధ్యతాయుతంగా ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దాం" ఝాన్సీలక్ష్మీబాయి, తాంతియాతోపే, నానాఫడ్నవీసు వగైరాలని ఏకతాటిమీద నడిపించి బ్రిటీషువాళ్ళకి పక్కలోబల్లెమై నిలిచాడు బహదూర్‌షా జాఫర్. బహదూర్ భాష భారతీయ కవి. 1862 నవంబర్ 7న రంగూన్ జెయిల్లో చనిపోయాడు. ఈ సంగ్రామంలో హిందూ ముస్లింల ఐక్యతని దెబ్బకొట్టి ఢిల్లీని పునరాక్రమించుకోవాలని బ్రిటీష్ వాళ్ళు కుయుక్తులు పన్నారు. బక్రీద్‌కి గోవుల్ని ఖుర్బానీ ఇస్తారు ముస్లింలు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హిందువుల్ని రెచ్చగొట్టాలని పన్నాగం పన్నారు తెల్లవాళ్ళు. ఇది పసిగట్టిన బహదూర్‌షా "పండుగ సందర్భంగా గోవుల్ని ఖుర్బానీ ఇవ్వరాదు. అలా ఇచ్చిన ముస్లిములని ఫిరంగి గొట్టంతో కాల్చివేయడం జరుగుతుంది" అని ప్రకటించి తాను స్వయంగా గొర్రెని ఖుర్బాని ఇచ్చి మార్గదర్శకుడయ్యాడు. "మా ఆశలు అడియాసలయ్యాయి" అని తెల్లవాళ్ళు తెల్లమొగమేశారు. బహదూర్‌షా ఆఖరికి బ్రిటీష్‌వాళ్ళకి బందీగా చిక్కి బర్మా జైల్లో మనదేశాన్ని కలవరిస్తూ, పలవరిస్తూ కన్నుమూశాడు.

ప్రథమ స్వాతంత్ర్య పోరాటానికి ముందే, నూరేళ్ళనాడు ప్లాసీ యుద్ధం (1757)లో విజయం సాధించి తెల్లవాడు ఇక్కడ తన జెండా పాతాడని హైందవ చరిత్రకారులు నమ్మించాలని చూస్తున్నారు. ఆ మాటకొస్తే అసలు ప్లాసీది యుద్ధమూ కాదు, తెల్లవాడిది గెలుపూకాదు. అప్పటికే పచ్చగా వున్న సిరాజుద్దౌలా మీద కళ్ళు కుట్టిన హిందూరాజులు తెల్లవాడితో లాలూచీపడి ద్రోహానికి ఒడిగట్టారు. ప్రఖ్యాత చరిత్రకారుడు కె.యం.పణిక్కర్ అన్నమాటలవి. ఇలా మనం నేలమాళిగల్లోంచి ఎన్నెన్నో తవ్వి తీయవలసి వుంటుంది. అప్పుడుగాని సత్యాసత్యాలు, చారిత్రక ద్రోహాలు వెల్లడికావు. ముఖ్యంగా మతోన్మాదులు పులిమిన మకిలిని ఒదిలిస్తేనేగాని సత్యం స్వచ్ఛంగా ప్రకాశించదు.

ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం తాత్కాలికంగా ఓడిపోయినా, అటుతర్వాత మళ్ళీ పోరాటం విజృంభించింది. అదికూడా రక్తాక్షరాలతో లిఖించదగినదే. దీనికి ఒక ఉదాహరణ కాకోరి రైలు దోపిడి (1925). ఇందులో ప్రముఖ పాత్ర వహించిన అష్ఫఖుల్లా ఖాన్ తన సహచరులు రాంప్రసాద్ బిస్మిల్, రోషన్ లాహిరిలతో పాటు దేశం కోసం చిరునవ్వుతో ఉరికొయ్యనందుకున్నాడు. కాకోరి రైలు దోపిడిలో విప్లవకారులు చేజిక్కించుకోగల్గింది 5 వేల రూపాయలు మాత్రమే. కాని తెల్ల ప్రభుత్వం ఆ కేసుకోసం ఖర్చుపెట్టింది 10 లక్షలు!

ఈ నాలుగు పుస్తకాల్లో ఇలాంటి కీలకమైన అంశాలెన్నింటినో గుదిగుచ్చారు సయ్యద్ నశీర్ అహమ్మద్. ఇలా చరిత్ర శకలాల్లోకి వెళితే, స్వాతంత్ర్య పోరాటంలో వెలుతురు సోకని కోణాలు ఇంకా ఎన్నో వున్నాయి. చరిత్ర ఏ ఒక్కరి సొత్తూ కాదు. మతోన్మాదులది అసలేకాదు.

నేటి చరిత్ర చూస్తే కూడా, ప్రపంచ పరివ్యాప్తంగా ఆనాటి ఇంగ్లీషు సామ్రాజ్యవాదుల్లాగా అమెరికన్ సామ్రాజ్యవాదులు కూడా ఈ దేశ ప్రజలకే ప్రథమ శత్రువులుగా తయారయ్యారు. విశ్వవ్యాప్తంగా అమెరికా సామ్రాజ్యవాదులకి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిలో ముస్లింలు ముందున్నారు. ఇది ఎవ్వరూ కాదనలేని సత్యం. రకరకాల వక్రభాష్యాలవల్ల ఇప్పటికే చరిత్రకి చాలా అన్యాయం జరిగింది. ఇక ముందు ఈ పొరపాట్లు జరగకుండా అందరం జాగ్రత్త పడాలి. ప్రతివిషయాన్ని వస్తుగతంగా పరిశీలించి చారిత్రక శక్తులతో జోడించి బేరీజు వేయవలసిన అవసరం వుంది. ఈ అవసరాన్ని తీర్చడానికి ఈ పుస్తకాలు చాలా దోహదం చేస్తున్నాయి. అందరూ తప్పక చదివితీరాల్సిన పుస్తకాలివి. ఎంతో శ్రమకోర్చి వీటిని ప్రచురించిన రచయిత నశీర్ అహమ్మద్‌ని అభినందిస్తున్నాను.

1. **భారత స్వాతంత్ర్య సంగ్రామం - ముస్లిం యోధులు** (ప్రథమ భాగం) - పేజీలు 318; వెల : 100/-
2. **భారత స్వాతంత్రోద్యమం - ముస్లింలు** - పేజీలు 70; వెల : 25/-
3. **అష్ఫాఖుల్లాఖాన్** - పేజీలు 72; వెల : 25/-
4. **మైసూరు పులి టిప్పుసుల్తాన్** - పేజీలు 65; వెల : 25/-

*

- సాహిత్య విమర్శలో మెట్టలూ మాగాణులూ మైదానాలూ ఉంటాయా అని వెక్కిరించాడు. కవిత్వానికి వర్గాలు లేవనేవారు, కులాలు లేదనేవారు, స్త్రీపురుష బేధం లేదనేవారూ తరువాత తరువాత తెలుసుకున్నట్టే, బహుశా ఆ మిత్రుడు కూడా కవిత్వంలో తెలంగాణ తనాన్ని గుర్తించే పరిభాషను ఆమోదించవచ్చు. తెలంగాణ రాజకీయ ఉద్యమం మరింత నిర్దిష్టమైన, ప్రత్యేకమైన తెలంగాణ వ్యక్తీకరణను కోరుకుంటుంది. పూర్తి స్థానికభాషలో, పలుకుబళ్ళతో రాయడాన్ని ఆశిస్తుంది. ఇప్పటిదాకా ప్రధానస్రవంతి సంభాషణల్లో, రచనల్లో భాగం కాలేకపోయిన కొత్త డిక్షన్‌లను ఆహ్వానిస్తుంది. వాటిని గుర్తించి, అందులోని నిర్దిష్టతను, స్థానికతను, తెలంగాణతనాన్ని ఆవిష్కరించడం, తెలంగాణవాద సృజనాత్మక సాహిత్యానికి విశాల సాహిత్య, రాజకీయ సిద్ధాంతాలతో అన్వయం చెప్పడం విమర్శకుల పని. ఫలానా సాహిత్య చరిత్రలో తెలంగాణ కవినో, రచయితనో మినహాయించారు. ఫలానా వర్తమాన సంకలనంలో తగిన ప్రాతినిధ్యం లేదు - తరహా విమర్శల హయాంను ఇక ముగించడం మంచిది. అంటే వివక్షను ప్రశ్నించే అవసరం తీరిందని కాదు. వివక్ష ఫలితంగా అసమగ్రంగా ఉండిపోయిన చరిత్రను పునర్నిర్మించవలసిందే, తెలంగాణ రాజకీయ, సాంస్కృతిక, సామాజిక చరిత్రలను ప్రత్యేకంగా రూపొందించవలసిందే, పరిశోధకులకు, విమర్శకులకు అవసరమైన సంపుటీకరణ, క్రోడీకరణ, సంకలనకృషి జరగవలసిందే. అయితే, ఆ ప్రయత్నాలతోపాటు, సాహిత్య విమర్శను వివక్ష ప్రశ్నల నుంచి తరువాతి దశకు తీసుకెళ్ళాలి. ఇప్పుడున్న సాహిత్య విమర్శ, దురదృష్టవశాత్తూ, ఇంకా ఆ ప్రయత్నంలోకి దిగలేదు.

తెలంగాణవాదం గురించి స్పష్టత ఏర్పరచుకోవడం, దాని విస్తృతిని తెలంగాణ భౌగోళిక పరిధితో నిమిత్తం లేకుండా అర్థం చేసుకోవడం, ఆ అవగాహన నుంచి తెలంగాణ ప్రత్యేకతలను గుర్తించడం, సాహిత్యంలో వాటి ప్రతిఫలనాలను అన్వేషించడం, ఈ మొత్తం ప్రక్రియ ద్వారా తెలంగాణవాద సృజనాత్మక రీతులను, ప్రత్యేక సాహిత్య సౌందర్య దృష్టులను కనుగొనడం - విమర్శకులు చేయవలసిన పని.

*

ప్రపంచీకరణ దశాబ్దిలో పట్టుసడలని మార్క్సీయ 'శ్రుతి'

☆ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

డా. బి.సూర్యసాగర్ జనసాహితీ సంస్థకు అధ్యక్షులు. సైన్సు ఉపాధ్యాయులు. తెలుగులో మార్క్సీయ సాహిత్య విమర్శకులలో ప్రముఖులు. సైన్స్ ఉపాధ్యాయులుగా ఉంటూ మార్క్సీయ భావజాలాన్ని వంటబట్టించుకుని సాహిత్య విమర్శ రంగంలో నిరంతరం కృషి చేస్తున్నారు సూర్యసాగర్. 'సాహిత్యం - సౌందర్యం' అనే మార్క్సిస్ట్ సౌందర్య శాస్త్రాన్ని ఇదివరకే ప్రచురించారాయన. మార్క్సిస్ట్ సౌందర్య శాస్త్రంమీద తెలుగులో అది గొప్ప గ్రంథం. ఇప్పుడీ "శ్రుతి" వ్యాససంపుటిని సూర్యసాగర్ ఉపాధ్యాయులుగా ఉద్యోగవిరమణ చేసిన సందర్భంగా జనసాహితి ప్రచురించింది. ఇందులో కొన్ని సైద్ధాంతిక, సామాజిక వ్యాసాలతోపాటు నవలలు, కథాసంపుటాలు, విమర్శ కావ్యాలమీద మొత్తం 23 వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాలన్నీ 1995 - 2005 దశాబ్దంలో రాసినవే. రష్యాపతనం, తూర్పు యూరప్ పరిణామాలు, అమెరికా ఏకచత్రాదిపత్య స్థాపన, ప్రపంచీకరణ పేరుతో అమెరికీకరణ నేపథ్యంలో ఒక వైపు భారతీయ భూస్వామ్య వర్గం, మరోవైపు ప్రపంచపెట్టుబడిదారీ వర్గం మార్క్సిజానికి కాలం చెల్లిందనే ప్రచారాన్ని ఉధృతం చేసిన సంక్లిష్ట సమయంలోనే సూర్యసాగర్ ఈ వ్యాసాలురాశారు. వల్లంపాటి 'సాహిత్య వ్యాసాలు', వి.చెంచయ్య, 'సాహిత్య దృక్పథం', ఎన్.వేణుగోపాల్ 'కథా సందర్భం', 'నవలా సమయం' వంటి గ్రంథాలు అనేకం ఈ నేపథ్యంలోనే వచ్చాయి. బోలెడన్ని వ్యాసాలొచ్చాయి. ఈ వరుసలోదే 'శ్రుతి'. ఈ గ్రంథంలో ప్రజా సంస్కృతిని విధ్వంసం చేస్తున్న కరువు, నింగి - నేలా, మాతృభాషలో విద్య, హింసించే ప్రాథమిక పాఠశాలలు, పోస్ట్‌మోడర్నిజం అనేవి పోగా తక్కినవి సాహిత్య విమర్శ వ్యాసాలు.

ఏ రచనను తీసుకున్నా, ఎ రచయితను తీసుకున్నా, ఏ వాదాన్ని తీసుకున్నా ముందుగా అందులోని ఆహ్వానించదగిన అంశాలను, ఆహ్వానించి, ఆ తర్వాత అందులోని పరిమితులనుగాని, తిరస్కరింపదగిన అంశాలనుగాని వివరించడం సూర్యసాగర్ విమర్శ ధోరణి. దేనిని ఆమోదించినా, దేనిని తిరస్కరించినా తనదైన భావజాలంతో నిబద్ధతతో చెయ్యడం ఈ గ్రంథంలో బాగా కనిపించే లక్షణం.

ఈ గ్రంథంలో సూర్యసాగర్ నిబద్ధతకు, భావజాలానికి ప్రతినిధి వంటిది మొదటి వ్యాసం - "1990 నుండి సామాజిక సాహిత్యనేపథ్యం - సాహిత్యం ప్రజలను ఐక్యం చేయాలి" అన్నది. గత ఒకటిన్నర దశాబ్దాలుగా, అంతకుముందు నుంచి వస్తున్న అభ్యుదయ, విప్లవ సాహిత్యాలకు తోడుగా స్త్రీ, దళిత, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వ, పోస్ట్ మాడర్నిజంవాదాలు, ఆ వాదాల సాహిత్యం మీద సుదీర్ఘమైన విశ్లేషణ ఈ వ్యాసం. అంతర్జాతీయ మహిళా దశాబ్దం స్ఫూర్తిగా స్త్రీవాద సాహిత్యం, కాన్షీరాం దళితబహుజన ఉద్యమం, మహాత్మాపూలే, డా.బి.ఆర్. అంబేద్కర్, నారాయణ గురూ, పెరియార్ సిద్ధాంతాల పునాదిమీద, కారంచేడు, చుండూరు సంఘటన పర్యవసానంగా దళితవాద సాహిత్యం, బాబ్రీ మసీదు విధ్వంసానికి రియాక్షన్‌గా ముస్లిం మైనారిటీ వాద సాహిత్యం, రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంత ప్రజల అస్తిత్వవేదనలోంచి ప్రాంతీయ, అస్తిత్వవాద సాహిత్యం పుట్టుకొచ్చాయి. ఈ వాదాలకు చెందిన రచయితలలో మార్క్సిజాన్ని కలుపుకొని పోయేవాళ్ళు, దానిని ధిక్కరించే వాళ్ళు ఉన్నారు. ఈ నాలుగువాదాలను సూర్యసాగర్ తన మార్క్సీయ వరపిడిరాయి మీద పరీక్షించారు. మొదట ఈ వాదాలు మొదలు కావడానికి గల నేపథ్యాన్ని పేర్కొన్నారు. గాట్ ఒప్పందం మీద సంతకం జరిగి ఎల్‌పిజి విధానం అమల్లోకి రావడం, ప్రభుత్వం ప్రజలపట్ల బాధ్యతలోంచి తప్పుకొని దానిని ఎన్జీవోల చేతుల్లో పెట్టడం, ఈ వ్యస్థను మార్చడానికి జరుగుతున్న విప్లవ ప్రయత్నాలలో వచ్చిన పరిణామాలు - ఇలాంటివన్నీ సృజనాత్మక సాహిత్యానికి సవాలుగా మారాయని వివరించారు. సూర్యసాగర్ స్త్రీ, దళిత, మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వవాదాలు, వాటి సాహిత్యం ప్రస్తావిస్తున్న సమస్యలను సంఘర్షణలను ఆమోదిస్తూనే, వాటికి పరిష్కాం మాత్రం ఆ వాదాలలో లేదని అది మార్క్సిజంలోనే ఉందని ప్రతిపాదించారు. 'పీడిత దేశాలు, జాతులు, ప్రజలు స్వతంత్రంకావడానికీ, విముక్తి పొందడానికీ ఒకేఒకమార్గం వున్నది. అదే భూస్వామ్య వ్యతిరేక సామ్రాజ్య వ్యతిరేక నూతన ప్రజాస్వామిక విప్లవం' అన్నది సూర్యసాగర్ స్థిరమైన అభిప్రాయం. ఎన్జీవోలు నడిపే ఉద్యమాలన్నీ కుహనా మేధావుల చేతుల్లోనే ఉన్నాయని, వాటివల్ల శత్రువు బలపడడం తప్ప మరో ప్రయోజనం లేదని సూర్యసాగర్ నిశ్చితాభిప్రాయం.

స్త్రీవాద సాహిత్యంలో గొప్ప ప్రతిఘటనా స్వరంతో ముందుకొచ్చినా, అది మధ్యతరగతి ఉన్నత మధ్య తరగతి స్త్రీ దృక్కోణం నుంచి వచ్చిందేగాని, శ్రామిక, కింది మధ్యతరగతి స్త్రీల జీవితాలకు పరాయిగానే ఉండి పోయింది. గనక శ్రామిక మహిళల దృక్కోణాన్ని తిరస్కరించే స్త్రీవాద చైతన్యం పాక్షికమైనదే కాకుండా విముక్తి స్వభావం లేనిది అని నిర్ధారించారు. కులవ్యవస్థ అత్యంత హేయమైనదని, అలాంటి సామాజిక క్రౌర్యం మరేదేశంలోనూ లేదని అంటూనే దీనిని నిర్మూలించడానికి పూలే అంబేద్కర్లు చేసిన కృషిని ఆమోదిస్తూనే కుల నిర్మూలనకు వాళ్ళ ఆలోచనలు సరిపోవంటారు. అంబేద్కర్ కులాంతర వివాహాలు, రిజర్వేషన్‌లతోపాటు, దళితులకు భూమి పంపకాన్ని కుల నిర్మూలనకు పరిష్కారాలుగా చెప్పారంటూ, విప్లవాత్మక భూ సంస్కరణల ద్వారా భూస్వామ్యాన్ని బద్దలు చేయడం వల్లనే కులనిర్మూలన జరుగుతుందన్న అవగాహన అంబేద్కర్‌కు లేదన్నారు. అగ్రకుల బూర్జువాలలాగే దళిత బూర్జువాలు వచ్చి వాళ్ళ చేతుల్లో దళితులు అణచివేతకు గురైనప్పుడు వర్గపోరాటం సుగమమౌతుందనే వాదాన్ని కూడా సూర్యసాగర్ తిరస్కరించారు. అంతేకాదు ఈ వాదం చేసే దళిత మేధావుల పట్ల దళిత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. బాబ్రీ మసీదు విధ్వంసం ముస్లిములలో అభద్రతను కల్పించిందని ఒప్పుకుంటూనే, ముస్లిములు మతపరంగా మైనారిటీ వాదులుగా ఆర్గనైజ్‌కావడం వాళ్ళకే అత్యంత హానికరం అని, శ్రామిక వర్గ పోరాటాలలోకి సమీకృతం కావడం మాత్రమే ముస్లిములకు రక్షణ కల్పించగలదన్నారు. ప్రాంతీయ అభివృద్ధి ఆకాంక్షలు ప్రజాస్వామికమైనవని ఆమోదిస్తూనే అన్ని ప్రాంతాల్లో దోపిడీవర్గ వ్యవస్థ నిర్మూలనా పోరాటాలు మాత్రమే అన్ని ప్రాంతాల సమానాభివృద్ధిని సాధిస్తాయన్నారు. వర్గం, కులం, జెండర్, జాతి అన్నీ ఆర్థిక పునాది నుంచే రూపొందినందువల్ల వర్గపోరాటమే అన్నిటికీ పరిష్కారమని సూర్యసాగర్ సిద్ధాంతం చేశారు.

ఎగిరిపోయే పేలపిండిని కృష్ణార్పణం అన్నట్లుగా. మార్క్సిస్ట్ వ్యతిరేక వ్యక్తివాదులు కుల మహిళా మైనారిటీ ప్రాంతీయవాదాలను ఉత్తరాధుని కత పేరుతో సొంతం చేసుకోవడానికి చేసిన ప్రయత్నాన్ని సూర్యసాగర్ చావు దెబ్బ కొట్టారు. ఆధునిక సమాజం ఏర్పడకుండానే భారతదేశంలో ఉత్తరాధునిక భావజాలం పుట్టడంలోని అసంబద్ధతను ఎత్తిచూపారు.

సూర్యసాగర్ పేర్కొన్న పరిమితులు పై నాలుగు వాదాలకు ఉన్న మాట వాస్తవమే. ఆయా సమస్యలకు తుది పరిష్కారం మార్క్సిజం చెప్పిన వర్గ పోరాటమేననడంలోనూ సందేహం లేదు. అయితే వీటిని యథాతథంగా తిరస్కరించడాన్ని గురించి సూర్యసాగర్ మరొక్కసారి ఆలోచించుకోవలసి ఉంది. పై నాలుగు వాదాలు, అంతకుముందటి సాహిత్యం గుర్తించని అనేక జీవిత పార్శ్వాలను, సమస్యలను ఎత్తిచూపాయి. వస్తు వైవిధ్యం పెరిగింది. అట్టడుగున పడి కన్పించని ఇతిహాసపు చీకటి కోణాలు ఎన్నో ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. ఈ వాస్తవికతను గుర్తించి ఆ నాలుగు వాదాలను ఆహ్వానించవలసి ఉన్నది. మార్క్సిజం వాటిని కలుపుకొని పోవాలి. పై నాలుగువాదాలూ ఇప్పుడున్న దోపిడీ వ్యవస్థలో భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నాయి తప్ప, దోపిడీ రహిత సమాజాన్ని అవి ప్రస్తావించడం లేదు. అయితే పై నాలుగు వాదాలు భారతీయ సమాజంలో వర్గీకరణ వేగవంతం కావడానికి దోహదం చేస్తాయి. అన్ని కులాల నుంచి స్త్రీ పురుషుల నుంచి, అన్ని మతాల నుంచి, అన్ని ప్రాంతాలనుంచి దోపిడీ వర్గం బలపడిన సమయంలో వాటిలో పీడితులుగా తేలిన వాళ్ళు సమైక్య మై తిరగబడే దాకా ఆవాదాలను మార్క్సిజం కలుపుకొని పోవాలి. ఆ వాదాల సాహిత్యాన్ని ఆదరిస్తూ పోవాలి.

మార్క్సిస్ట్ సౌందర్య శాస్త్రం అనేవ్యాసం సూర్యసాగర్ రాసిన 'సాహిత్యం-

సౌందర్యం' గ్రంథానికి సంక్షిప్త రూపమే. దానిని చదివిన వారికి మార్క్సిస్ట్ సౌందర్య శాస్త్ర రూప స్వభావాలు అర్థమై మన సాహిత్యాన్ని కొత్త దృష్టితో, వాస్తవిక దృష్టితో చూడడానికి వీలవుతుంది.

కథానికా సాహిత్యంమీద సూర్యసాగర్ రెండు వ్యాసాలు రాశారు. ఒకటి సింగమనేని సంకలనం చేసిన 'సీమ కథలు' మీద, మరొకటి సింగమనేని రాసిన కథల మీద. రాయలసీమ దుస్థితిపట్ల భారత ప్రభుత్వాల వైఖరి బ్రిటీష్ వలస పాలకుల కన్నా ఏమాత్రం భిన్నంగా లేదు అనే అవగాహనతో 'సీమకథలు'లోని కథలలో ఏది ఏ జీవనపార్శ్వాన్ని ప్రతిబింబిస్తున్నదో పరిచయం చేశారు. విమర్శకుడు స్వయంగా రాయలసీమ వ్యక్తికావడం వల్ల ఆ కథలలో పూర్తిగా మమేకమవుతూ ఈ వ్యాసం రాశారు. రాయలసీమ ప్రజల జీవన సంఘర్షణను ప్రతిఫలించడంలో సీమ కథలు చిత్రికపట్టాయని, జీవన చిత్రం వేగంగా మారిపోతున్న తరుణంలో విభిన్న జీవన కోణాల్ని, సమస్యల్ని చిత్రిస్తూ, కరువుకాటకాలు, పీడనలు, తగాదాలు లేని జీవితాన్ని నిర్మించుకోవడానికి అవసరమైన భావ విప్లవాన్ని రగిలించడంలో రాయలసీమ ప్రజారచయితలు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించగలరన్న భరోసాని సీమ కథలు సంకలనం ఇస్తున్నదని అన్నారు. అయితే 2002లో సూర్యసాగర్ రాసిన 1990 నుండి తెలుగు సామాజిక సాహిత్య నేపథ్యం అనే (ఈ గ్రంథంలో తొలి వ్యాసం) వ్యాసంలో ప్రాంతీయ, అస్తిత్వవాద సాహిత్యంమీద వ్యక్తం చేసిన అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని నేను కథల్ని చదివితే సీమకథలులో కూడా చాలా పరిమితులున్నట్లు తోస్తుంది. అలాగే సీమకథలు వచ్చి దశాబ్దం పైగా గడచిపోయింది గదా! సీమకథకులు సూర్యసాగర్‌కు కలిగిన భరోసాను నిజం చేశారా? అన్నది పరిశీలించవలసిన అంశం. "తెలుగు కథకు కొత్త ఆవిష్కరణలు జోడించిన సింగమనేని" అంటూ సింగమనేని కథలమీద సూర్యసాగర్ అందమైన వ్యాసాన్ని రాశారు. రాయలసీమకు కథ, సభ ఎలాంటి వాడో, 'అనంత' కథకు 'సింగమనేని' అలాంటి వారనడంలో సందేహం లేదు. వ్యవసాయం, విద్య, అస్పృశ్యత ఇతర సమస్యలమీద సింగమనేని రాసిన కథలను ఆయా కథల వస్తు నేపథ్యంలో గొప్పగా వివేచించారు. ఈ వ్యాసంలో సూర్యసాగర్ ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించారు. సింగమనేని కథల్లో పరిష్కారాల ఊసులేకపోవడం ఆశ్చర్యం కాదన్నదే ఆ అంశం. ఇందుకు 1980 తర్వాత సాగునీటి ప్రాజెక్టుల కోసం జరిగిన ఆందోళనలో రైతాంగాన్ని కదిలించలేకపోవడం, కమ్యూనిస్టు ఉద్యమాలు రైతాంగ అవసరాల అంచులను కూడా తడమ లేకపోవడంవంటివి కారణాలుగా పేర్కొన్నారు. రాయలసీమ సమస్యల పరిష్కారం కోసం కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అవి సూర్యసాగర్ దృష్టిలో అల్ప ప్రయత్నాలే కావచ్చు. అవైనా మన సాహిత్యంలో ప్రతిబింబించాలి కదా! మన కథకులు ఆ పనిని ఎంతవరకు చేశారో పరిశీలించవలసి ఉంది.

పాశ్చాత్య రచయితలైన జాక్‌లండన్ నవలల్ని, హోవర్డ్ ఫాస్ట్ నవల మానవధనులను పరిచయం చేసిన సూర్యసాగర్, తెలుగులో శాంతి నారాయణ రాసిన 'పెన్నేటి మలుపులు' నవల మీద, మహీధర రాసిన కొల్లాయి గట్టితేనేమి?, దేశంకోసం, జ్వాలాతోరణం - అనే మూడు నవలలమీద గొప్ప విశ్లేషణాత్మక వ్యాసాలు రాశారు. మహీధర రాసిన మూడు నవలలు 1920 - 45 మధ్యకాలపు రాజకీయ పరిస్థితులనెలా ప్రతిబింబించాయో సూర్యసాగర్ అన్వయించారు. కొల్లాయిగట్టితేనేమి 1920నాటికి దేశం కోసం 1935-39 కాలానికీ, జ్వాలాతోరణం 1939 - 45 కాలానికీ ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. సమకాలీన రాజకీయాలకు, సాహిత్యానికీ విడదీయరాని సంబంధమెలా ఉంటుందో ఈ వ్యాసం రుజువు చేసింది. సూర్యసాగర్ ఇంతటితో ఆగకుండా కొల్లాయిగట్టితేనేమి నవలలో గాంధీజీ సిద్ధాంతాల పట్ల అప్పటి కమ్యూనిస్టులకున్న ఆలోచనల పరిమితి ప్రతిబింబిస్తున్నదన్నారు. అయితే 'డోంకోసు' నవల తక్కిన నవలలకన్న ఉత్కృష్టమైన దన్నారు. బ్రిటీష్ వలసవాదుల అణచివేత కొనసాగుతున్నా విప్లవశక్తుల త్యాగమయ జీవితాలెలా ఉండాలో ఈ నవల ప్రదర్శించిందన్నారు. వెంటనే జ్వాలా తోరణం నవలలను విశ్లేషిస్తూ కమ్యూనిస్టులు బాధ్యతా రహితంగా ప్రవర్తించారని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ రాజకీయ ధోరణుల మీద కూడా సూర్యసాగర్ చాలా విమర్శలు పెట్టారు. కొన్ని సందర్భాలలో ఇటు పార్లమెంటరీ కమ్యూనిస్టులను, అటు విప్లవ పార్టీలను కూడా విమర్శించి తనదైన ఒక మార్గాన్ని సరైనదిగా చెప్పకనే చెప్పుకుంటూ వచ్చారు. దానిని నిశితంగా పరిశీలింపవలసి ఉంది.

సాహిత్య విమర్శకు సంబంధించి కెవిఆర్, రారా, రాచపాళెంల మీద మూడు వ్యాసాలు రాశారు సూర్యసాగర్. "సాహిత్య విమర్శలో మేలిమలుపురారా" అనే వ్యాసంలో అభ్యుదయ సాహిత్యం వేగం తగ్గిన సందర్భంలో రా.రా. విమర్శకుడిగా రంగ ప్రవేశం చేసి కదలిక తీసుకొచ్చాడని ప్రతిపాదించారు. 1930ల నుండి అభ్యుదయ సాహిత్యం వస్తున్నా, మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ మాత్రం తక్కువగా వచ్చిందన్నారు. సృజనాత్మక సాహిత్యంలో ప్రతిష్టంభన (నిజంగా ప్రతిష్టంబన ఏర్పడిందా అన్నది వేరే ప్రశ్న) సమయంలో రారా మార్క్సిస్ట్ విమర్శ చలనం తీసుకొచ్చిందన్నది మంచి అబ్జర్వేషన్. రారా గ్రంథ సమీక్షను గొప్ప విమర్శ స్థాయికి తీసుకుపోయాడన్నదీ నిజమే. చలం గురించి రారా అభిప్రాయాలను గౌరవిస్తూనే, చలంను రారా సుఖవాదిగా తీర్మానించడాన్ని వ్యతిరేకించారు. ఇది సాహిత్య విమర్శలో లోతైన పద్ధతి. అద్దేపల్లి సంప్రదాయ విమర్శ సూత్రాలను అన్వయించడాన్ని రారా విమర్శించిన తీరును సమర్థిస్తూనే, రారా రస శబ్ద ప్రయోగాన్ని అధిక్షేపించారు. దిగంబర కవిత్వం మీద రారా అభిప్రాయాలను ఏ మాత్రం ఆమోదించలేదు సూర్యసాగర్. దిగంబర కవిత్వం మీద రారా విమర్శ సకల విమర్శ ప్రమాణాలను తిరస్కరించింది అనేంత వరకు వెళ్ళారు సూర్యసాగర్. అయినప్పటికీ రారా కృషిని చరిత్రాత్మకమైనదిగా శ్లాఘించారు. కెవిఆర్ మీద రాసిన వ్యాసంలో దిగంబర కవిత్వం మీద రారాలాగే కెవిఆర్ కూడా మొదట పొరబడి, తర్వాత సర్దుకోగలిగారన్నారు. కెవిఆర్ మరణించిన సందర్భంగా ఆయన మీద రాసిన వ్యాసాన్ని, సూర్యసాగర్ ఎందుకో నిలకడగా రాయలేకపోయారనిపిస్తుంది. విప్లవ అభిమానం, విరసం పట్ల అసంతృప్తి, మరణించిన విప్లవ సాహిత్యకారుని పట్ల గౌరవం - వీటి మధ్య స్మృతి చిహ్నంగా వ్యాసం రాయవలసి వచ్చేసరికి సూర్యసాగర్ డైలమాలో పడ్డారా అనిపిస్తుంది. రాచపాళెం రాసిన 'ఆధునికాంధ్ర కవిత్వం - ఉద్యమాలు సందర్భాలు' ను సమీక్షిస్తూ గుణదోషాలను నిష్పాక్షికంగా ఎత్తి చూపారు.

ఛాయారాజ్ రచించిన బుదడు, దర్శని అనే రెండు కావ్యాలను విశ్లేషిస్తూ రెండు వ్యాసాలు రాశారు సూర్యసాగర్. ఈ రెండు వ్యాసాలలోనూ, కఠిన విమర్శకుడైన సూర్యసాగర్ పరవశించిపోయి - కవితో పూర్తిగా మమేకమై ఆర్ద్రంగా మాట్లాడారనిపిస్తుంది. కవి విమర్శకుడు ఒకే పట్టా మీద పయనిస్తున్నప్పుడు విమర్శలో ఈ పారవశ్యం ఆర్ద్రత సహజంగానే ప్రాధాన్యం వహిస్తాయి. 'బుదడు' కావ్యాన్ని ఉద్యమ కాల్పనికతలో అద్భుత ప్రయోగంగా, 'దర్శని'ని ప్రకృతిని సమాజాన్ని మానవత్వంతో తలంటు పోసిన కావ్యంగా చిత్రించారు. 'దర్శని' ప్రకృతి చేత మానవుడిని ప్రేమింపజేసే కవిత్వమున్న కావ్యమని, అయితే 'దర్శని' కావ్యం అందరికీ కొరుకుడు పడదు. ఈ నిజాన్ని సూర్యసాగర్ చెప్పారు. ఒకస్థాయి శాస్త్రసామాజిక పరిజ్ఞానం ఈ కావ్యం అర్థంకావడానికి అవసరమన్నారు. శ్రీకాకుళ ఉద్యమ వారసత్వంగా "బుదడు" కావ్యం వచ్చిందని పేర్కొనడం విశేషంగా ఆలోచింపచేస్తుంది. చంద్రశేఖర్ ఆజాద్ రాసిన 'నాన్న కో ఉత్తరం' రచనను ఒక కళాత్మక విజయంగా కీర్తించారు. ఈ పరిచయం చాలా బాగుంది

వర్తమాన విద్యావ్యవస్థ మీద రాసిన మాతృభాషలో విద్య - నయా వలస అడ్డంకులు, హింసించే ప్రాథమిక పాఠశాలలు అనే వ్యాసాలు ఎంతో ఆలోచనాత్మకంగా ఉన్నాయి. కరువుమీద, కరువు సాహిత్యం మీద రాసిన వ్యాసాలు తీవ్ర విమర్శపూరిత విశ్లేషణలు. చలసాని ప్రసాదరావు, విశ్వమోహన్‌రెడ్డిల మీద రాసిన వ్యాసాలు వాళ్ళను స్థూలంగా పరిచయం చేస్తాయి. తెలుగు సాహిత్యంలో చలసాని ఒక సొంత ముద్ర అన్నారు.

సాహిత్య విమర్శలో ఒక రచయితతో ఒక రచనతో పూర్తిగా మమేకమౌతూ విమర్శ రాయడం సులభం. ఒక రచయితతో ఒక రచనతో పూర్తిగా విభేదిస్తూ రాయడమూ సులభమే. ఒక రచయితతో ఒక రచనతో పూర్తిగా విభేదిస్తూ మమేకం కావడం, మమేకమౌతూ విభేదించడం అందుకనుగుణంగా విమర్శ రాయడం కష్టం. ఇది కత్తిమీద సామువంటిది. సమాన భావజాలంగల వాళ్ళ విషయంలో ఇది మారీ నిజం. ఈ కష్టమైన పనిని అనేక వ్యాసాలలో నిర్వహించారు సూర్యసాగర్.

*

కాలం - అవగాహన

సైన్స్ వ్యాసం

☆ డా.కొడవటిగంటి రోహిణీ ప్రసాద్

మనుషులకు ఉన్న అనేక సహజ లక్షణాల్లో కాలగమనాన్ని గమనించగలగడం ఒకటి. సంఘటనలన్నీ ఒకదాని వెనక ఒకటిగా జరుగుతాయని మనకు పసితనం నుంచీ తెలుస్తూ ఉంటుంది. పెద్దవుతున్న కొద్దీ కాలం గురించిన అవగాహనా, అపోహలూ కూడా పెరుగుతాయి. ముఖ్యంగా భవిష్యత్తును గురించిన ఆందోళన మొదలవుతుంది. ఇక అతీతశక్తుల గురించి చెప్పేవారి ఉత్సాహం పెరుగుతుంది. ఇలా సామాన్యులని బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించేవారిలో "త్రికాలజ్ఞులు" కూడా ఉంటారు. స్వయంగా చూడకపోయినా జరిగినవీ, జరుగుతున్నవీ, జరగబోయేవీ అన్నీ తమకు తెలుసునని వీరు బుకాయిస్తారు. మనలో చాలామంది జరగబోయేదంతా "రాసిపెట్టి" ఉన్నదని నమ్ముతారు. "రావలసిన ఘడియ" గురించి, "కాలమహిమ" గురించీ అనుకోవడం, కాలం "తీరినవారు" చనిపోతారని భావించడం మామూలే. ఇదేదో తత్వధోరణిలా అనిపించినప్పటికీ దీని వెనక కాలం అంటే సరైన అవగాహన లేకపోవడమే కనిపిస్తుంది. మామూలు పద్ధతిలో కాలం అంటే ఏమిటో మనకందరికీ తెలుసు. అయినా దానికి సరైన నిర్వచనం ఇవ్వాలంటే భౌతిక శాస్త్రవేత్తలకు కూడా అంతసులువుకాదు.

కాలానికి కొలతలు ఏర్పాటయాయి. అయితే కాలాన్ని లెక్కపెట్టేది గడియారమే కానవసరం లేదు. నక్షత్రం చుట్టూ తిరిగే గ్రహమూ, ఇసక గడియారంలోని ఇసకా, లయబద్ధమైన గుండె చప్పుడూ, సిసియంవంటి అణువులోని కంపనాలూ వీటిలో దేన్నైనా కాలగణనానికి వాడుకోవచ్చు. మనకు తెలసిన ప్రపంచానికి మూడు కొలతలున్నాయి. నాలుగోదికాలం. మూడు కొలతల 'స్థలానికి' దీన్ని చేర్చాలి. రెండువస్తువులు ఒకే స్థలాన్ని ఆక్రమించాలంటే విభిన్న సమయాల్లోనే వీలవుతుంది. ఒకదాని తరవాత ఒకేస్థలంలో రెండు వస్తువులు ఉండడం సాధ్యమే కనక మనది నాలుగు కొలతల ప్రపంచం అయింది.

కాలాన్ని గురించిన మన అవగాహనకూ, మన చైతన్యానికి, శరీరావస్థకూ చాలా దగ్గర సంబంధం ఉంది. వ్యవధి ఒకటే అయినప్పటికి, 10 నుంచి 20ఏళ్ళ వయసులో కలిగే తేడాలు 60 - 70 ఏళ్ళ మధ్య కలగడం అసాధ్యం. అలాగే సమయానికీ, మన జ్ఞాపకశక్తికీ సంబంధం ఉంది. శరీరానికి కలిగే నొప్పులూ, బాధలూ, రోగాలూ కాలవ్యవధిని బట్టి మారతాయి. ఇదికాక చీకటి వెలుగులనుబట్టి మన శరీరాలు కాలానుగుణంగా స్పందిస్తూ ఉంటాయి. మన దేహాల్లోపల ఒక గడియారం వంటిది ఉంటుంది. టైమెంతయిందో తెలియకపోయినా భోజన నిద్రాదుల అవసరాన్ని బట్టి గడుస్తున్న కాలాన్ని మనం గుర్తిస్తూ ఉంటాం. అయినా, బైటి ప్రపంచంతో సంబంధం లేకుండా చాలా రోజులు ఎవరినయినా ఏ నేలమాళిగలోనో నిర్బంధిస్తే వారికి గడిచిన కాలం గురించి సరైన అవగాహన కలగదు. కాలగమనం తెలుస్తూ ఉండాలంటే ఏవైనా సంఘటనలు జరగాలి. ఇది మన స్పృహకూ, చైతన్యానికి సంబంధించిన విషయం.

కాలాన్నీ, సమయాన్నీ గురించిన సిద్ధాంతాలు రెండున్నర వేల సంవత్సరాల క్రితం నుంచీ ఉన్నాయి. ఆకాశంలో తారల గమనాన్ని, నెలలవారీగా రుతువుల్లో జరిగే మార్పుల్ననూ కనిపెట్టసాగిన తొలిమానవులకు "కాలచక్రం" గురించి ఆనాడే కొంత అవగాహన మొదలైంది. వ్యవసాయం ప్రారంభించాక కాలగణనం మానవసమాజానికి చాలా ప్రధానమైన విషయం అయింది.

అసలు కాలం అంటే ఏమిటి? భౌతిక పరిభాషలో దానికేదైనా అర్థం ఉందా, లేక అది కేవలం మన మనసు కలిగిస్తున్న భ్రమేనా? కాల ప్రవాహం అంటే ఏమిటి? అందులో ప్రవహించేవి గంటలా, నిమిషాలా, సెకండ్లా? సంఘటనలన్నీ "నిశ్చలన" దృశ్యాలనీ, మన చైతన్యం వాటిని ఒకదాని తరవాత ఒకటిగా గుర్తిస్తుందనీ, ఆ విధంగానే కాలం గురించి మనకు అవగాహన కలుగుతుందనీ అనుకోవచ్చా? స్థలానికి లేని "దిశ" కాలానికెందుకుంటుంది? సినిమా రీలును వెనక్కి తిప్పినప్పుడు ఈ సంగతి బాగా అర్థమవుతుంది. మనుషులూ, బళ్ళూ వెనక్కి నడవడమే కాదు; టూత్‌పేస్ట్ ట్యూబ్‌లోకి వెళ్ళినట్టూ, కాఫీ నుండి డికాక్షన్ తొలిగిపోయి పాలు మిగిలినట్టూ అసంభవమనిపించే దృశ్యాలు కనిపిస్తాయి. దీన్నిబట్టి కాలాన్ని కార్యకారణ సంబంధంగా నిర్వచించుకోవచ్చు. (ముందు రాయి విసురుతాం. ఆ తరవాతే దెబ్బ తగులుతుంది). అలాగే కాలమంటే క్షణాల సముదాయం. ఈ క్షణాలన్నీ "భవిష్యత్తు"లో బయలుదేరి, ప్రస్తుత వర్తమానకాలం నుంచి గతంలోకి "వెళిపోతూ" ఉంటాయి.

కాలమంటే సంఘటనలన్నీ ఒకేచోట ఒకేసారి జరగకపోవడం. కాలమంటే ఒక వ్యక్తికి ఒకదాని తరవాత ఒకటిగా జరిగే అనుభవాల సమాహారం. మనకు మెదడూ, అవగాహనా లేని పరిస్థితిలో. కాలం అనేదానికి అసలు అర్థమేదీ ఉండకపోవచ్చునని కొందరు అంటారు. స్థల, కాలాలు శాశ్వతమైనవనీ, వాటికి పదార్థంతోనూ, సంఘటనలతోనూ సంబంధం ఉండదనీ న్యూటన్ ప్రతిపాదించాడు. ఆయనకు సమకాలికుడూ, ప్రత్యర్థీ అయిన లైబ్నిజ్ అనే మేధావి మాత్రం సంఘటనలనేవి లేకపోతే కాలమనేదానికి అర్థం ఉండదని వాదించాడు.

మన అవగాహనకు సంబంధించినంతవరకూ ఊహించడం తప్ప మనకు ఖచ్చితంగా తెలియనిది భవిష్యత్తు. ప్రత్యేకంగా చెప్పనక్కర్లేని విషయాలూ ఉన్నాయి. బుద్ధభగవానుడికి వేదాల గురించి తెలిసి ఉంటుంది కాని వేదకాలపు వారికి బుద్ధుడి గురించి తెలియదు. అలెగ్జాండర్ ఈజిప్ట్ వెళ్లి పిరమిడ్లను చూశాడు. జూలియస్‌సీజర్ అలెగ్జాండర్ విగ్రహాన్ని సందర్శించాడు. వీరందరి తరవాతా పుట్టిన మనకు ఇవన్నీ తెలుసు.

మనకు సంబంధించినంత వరకూ మన కేలండర్‌కు సూర్యచంద్రులు ఆధారం. భూమి తన చుట్టూ తాను రోజుకొకసారి గుండ్రంగా తిరుగుతుంది. కనక మన సౌకర్యం కోసం కాలగణనానికి స్థలాన్ని బట్టి కొన్ని పద్ధతులు పెట్టుకున్నాం. రోజు మారే తేది కోసమని ఏర్పాటు చేసుకున్న ఇంటర్నేషనల్ డేట్ లైన్ పసిఫిక్ మహాసముద్రంలో ఉంది. ఈ ఏర్పాటువల్ల కొన్ని తమాషాలు జరుగుతాయి. పరీక్షలు జరిపేటప్పుడు ఆ రేఖకు ఆస్ట్రేలియావైపు నుంచి అమెరికావైపుకు కొద్ది నిమిషాలపాటు ఎగిరే రాకెట్ తారీఖు ప్రకారం ఇవాళ బయలుదేరి నిన్న చేరుతుంది. దీనివల్ల నిజమైన కాలవ్యవధికి మన కాలగణనపద్ధతికీ ఉన్న తేడా తెలుస్తుంది, వీటితో సంబంధం లేకుండా జరిగే కాలాన్ని కొలిచేందుకు ఇతర ప్రక్రియలున్నాయి. భూమి రూపొందినప్పుడున్న వాటిలో యురేనియం వంటి రేడియో ధార్మికత కలిగిన పదార్థాలు కూడా మొదటి నుంచీ ఉన్నవే. అది కాలం గడుస్తున్న కొద్దీ ఖచ్చితమైన మొత్తాల్లో తరిగిపోతూనే ఉంది. యురేనియం అణువులు క్షీణించే క్రమంలో అవి చివరికి సీసంగా మారతాయి. యురేనియం గనుల్లో ఈనాడు లభ్యమౌతున్న యురేనియం, సీసం మోతాదుల నిష్పత్తిని బట్టి ఈ ప్రక్రియ ఎప్పుడు మొదలై ఉంటుందో (అంటే భూమి వయస్సు ఎంతో) శాస్త్రవేత్తలు లెక్కకట్టగలరు. కార్బన్ అణువుల్లో రేడియోధార్మికత ఉన్నవాటికీ, లేనివాటికీ గల నిష్పత్తి ఆధారంగా కొన్ని పురాతన వస్తువుల వయస్సును అంచనా కట్టవచ్చు. అలాగే అనేక శతాబ్దాల కిందట మొలిచిన కొన్ని పెద్ద వృక్షాల బోదెలను అడ్డంగా కోసి చూస్తే వాటిలో ఒకే కేంద్రంతో రూపొందిన అనేక రింగుల నిర్మాణం కనబడుతుంది. చెట్టు ఎదుగుతున్న కొద్దీ దాని బెరడు అంతకంతకూ వ్యాకోచిస్తూ ఉంటుంది. దాన్ని బట్టి చెట్టు వయస్సును తెలుసుకోవచ్చు.

కాలమంటే ఏమిటో మనకు ఎవరూ చెప్పనవసరం లేదు. నిత్యజీవితంలో మనకు అనుభవంలోకి వచ్చే కాలాన్ని గురించి శాస్త్రపరంగా నిర్వచించడంలో మాత్రం చాలా చిక్కులున్నాయి. వాటి గురించి ఎన్నో శతాబ్దాలుగా మేధావులు వాదించుకుంటూనే ఉన్నారు. అర్థంలేని వేదాంతం కన్నా ఈ ప్రతిపాదనల గురించి తెలుసుకోవడమే ఆసక్తికరంగా ఉంటుంది.

ంకా ఉంది)

దుఃఖిత ఆదిమానవుని చిత్రలిపి

☆ వరవరరావు

ఎమర్జెన్సీ (1975-77) తర్వాత వచ్చిన ఎన్నికల్లో సత్తుపల్లి శాసనసభకు అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుపై కాళోజీ పోటీ చేసాడు. ఎన్నికలు బహిష్కరించిన కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలోని సిపిఐఎంఎల్, మరికొన్ని చిన్న చిన్న ఎన్నికల బహిష్కరణ పార్టీలు తప్ప దేశం నలుమూలల నుంచి కొన్ని పెద్ద పెద్ద ఎంఎల్‌పార్టీలతో సహా కాంగ్రేసేతర పార్టీలన్నీ ఆయనను గెలిపించడానికి ప్రచారానికి తమ నాయకులను కార్యకర్తలను పంపించాయి. సత్తుపల్లిలో, గ్రామాల్లో ఎమర్జెన్సీ చిత్రహింసలకు సంబంధించిన పెద్ద పెద్ద హోర్డింగులు పెట్టారు. శ్రీకాకుళ రైతాంగపోరాట కాలం (1968) నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలం (1969) నుంచి ఎమర్జెన్సీ కాలం దాకా హోంమంత్రిగా, ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు చేసిన హత్యాచారాలు, అత్యాచారాలు తక్కువేమీకాదు కనుక హోర్డింగులకు కొదువేమీ ఉండదు.

ఎన్నికలయిపోయి కాళోజీ చిత్తుగానే ఓడిపోయాడు. ఎందుకు కావచ్చు అని అడిగినపుడు ఆయన చేసుకున్న సమీక్షలో 'మనం నిర్బంధాన్ని, హింసను ఎక్కువగా చూపి ప్రజల్లో భయాన్ని జొప్పించామేమో. కౌంటర్ ప్రొడక్టివ్ అయిందేమో' అన్నాడు. ఎందుకంటే ముఖ్యంగా విద్యావంతులైన నక్సలైట్ నాయకులను, ఎమర్జెన్సీ డిటెన్యూలను ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చివేయడం, ఎమర్జెన్సీ పేరుతో జైల్లో పెట్టడం చూసి 'అమ్మో తెల్లబట్టల్లోళ్లకే దిక్కు లేకపోతే, మన గతేంకాను' అని హోర్డింగుల ముందు నిలబడి గుండెలు బాదుకున్న గోచిపాతలోళ్లను నేను చూసాను అన్నాడు.

జీవితంలో తరాలుగా బాధలు, అణచివేత, దోపిడీ అనుభవిస్తున్న వాళ్లకు అవి అధిగమించి పోరాటం చేయగలిగే చైతన్యాన్ని ఇచ్చే ప్రయత్నం చేయాలి. కష్టం చేయడం, కష్టసహిష్ణుత కష్టజీవుల జీవితాల్లో ఒక సహజమైన పార్శ్వం. వాళ్ల జీవన విధానమే శ్రమ ఆచరణ. పోరాట ఆచరణ. దీనిని దోపిడికి, దోపిడీ కవచంగా ఏర్పరచుకున్న రాజ్యానికి ప్రతిఘటనగా ఎట్లా మలచుకోవాలో చూపే ఒక సంఘటిత చైతన్యరూపమే విప్లవం. విప్లవ సాహిత్యం అందుకు ప్రేరణ కావాలి. ఎన్నడో నలభై ఏళ్ల క్రితమే కొడవటిగంటి కుటుంబరావు అయ్యో అయ్యో సాహిత్యం ఇంక చాలు. ప్రజలకు తమ సమస్యలు తెలియకకాదు. అందుకు పోరాడాలి అని తెలియకాకాదు, పోరాటానికి శాస్త్రీయ మార్గం చెప్పగలిగే ప్రేరణకావాలి సాహిత్యంలో అన్నాడు. ఆయనయితే ముందుగా భావ విప్లవాలు కావాలన్నాడు గానీ విప్లవం ఏనాడో నక్సల్బరీలో, శ్రీకాకుళంలో ఆదివాసీ రైతాంగమే చేపట్టింది గనుక ఇవ్వాళ ఛత్తీస్‌ఘడ్ అడవులదాకా అప్రతిహతంగా సాగుతున్న ఆ విప్లవానికి దన్నుగా ఒక ధైర్యాన్ని, ఒక స్థైర్యాన్ని ఇచ్చే సాహిత్య ప్రేరణకావాలి.

'కిటికీపిట్ట' పి.మోహన్ ఖైదు కవిత్వం అటువంటి మానవీయ సున్నితప్రేరణ. ఇరాన్ విప్లవంలో మహిళా గెరిల్లాలపై జరిగిన చిత్రహింసల గురించి 'చిత్రహింసల కొలిమిలో' అని ఒక పుస్తకం వెలువడింది. శత్రువు విప్లవంలో పాల్గొనే మహిళల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికి పురుషుడు అదనంగా వారిపై లైంగిక అత్యాచారాలకు పూనుకుంటాడు. మానము, అది ప్రాణం కన్నా విలువయింది వంటి వేలాది సంవత్సరాల సంస్కృతీ శిక్షణవల్ల ఈ హింసను స్త్రీలు ఎదుర్కోవడానికి సిద్ధపడినంతగా ప్రకటించడానికి ఇష్టపడరు. నువ్వు శరీరంపై పెట్టే ఎన్నో రకాల హింసల్లో భాగంగానే దీనిని కూడా చూస్తాము, ఎందుకంటే ఇది కూడ శరీరంలో భాగమే కదా, కాకపోతే ఈ హింస ఎన్నో భవిష్యత్ విపరిణామాలకు కూడ దారితీయవచ్చు. అయినా ప్రాణి తన ప్రాణాన్ని, ఆత్మస్థైర్యాన్ని నిలుపుకుంటే అన్నిటినీ అధిగమించ వచ్చుననే అవగాహనతో ఆ మహిళా విప్లవకారులు ఆ లైంగిక అత్యాచారాలను ప్రతిఘటిస్తారు.

ఇంతకన్నా నువ్వేం చేయగలవనే బలాదూర్ ధిక్కారాన్ని శత్రువు ముందు ప్రదర్శించగలిగితే శత్రువు ఓటమి ప్రారంభమవుతుంది.

'కిటికీ పిట్ట' ఆ పని చేసింది. తెలుగులో వచ్చిన ఖైదు కవిత్వంలో ఇది ఒక వినూత్న అనుభవ ప్రయోగం. ముప్పై అయిదేళ్ళుగా రాస్తున్న ఖైదు కవిత్వంలో అక్కడక్కడా అది లేదని కాదు కాని ఒక జీవన శైలిగా, ఒక తాత్విక అవగాహనగా, ఒక మానవీయ ప్రతిఘటనగా ఆ విశ్వాసాన్ని ఇవ్వడం, అది కూడ ఇదివరకెవ్వరూ చెప్పిన పద్ధతిలో కాకుండా తాజాగా చెప్పడం దీని ప్రత్యేకత.

నిజానికిది ఖైదు కవిత్వం కాదు. డెబ్బైఏళ్ల కమ్యూనిస్టు పార్టీల పోరాటాల వల్ల తెలుగునేల మీద లాకప్‌కు, ఖైదుకు కొంచెం తేడా వచ్చింది. ఖైదు అంటే జైలు అనుకునేవాళ్ళకే ఈ వివరణ. అక్రమ లాకప్ కస్టడీకి, జుడీషియలీ (జైలు) కస్టడీకి కొంచెం తేడా ఉన్నది. ఆ అర్థంలో పి.మోహన్ జైలుకు పోవడానికన్నా ముందు పోలీసులు అరెస్టు చేసిన దగ్గర్నుంచి లాకప్‌లో జైలుకు పంపించేదాకా పదమూడు రోజులు అనుభవించిన చిత్రహింసల కాలంలో మన కళ్ళకు గట్టిన చిత్రలేఖనాలివి. ఇందులో కన్నీళ్లు, నెత్తురు, కరెంటు షాకులు, కలలు, గిత జ్ఞాపకాలు, భవిష్యదాశలు; ఖైదీ - ఖాకీల ఎదురెదురు మౌన సంభాషణలు, యూనిఫారాలు, తుపాకులు అవరోధంగా నిలిచిన మనుషులు, వ్యక్తమయ్యే భావాలు, కాని భావాలు, తాముగా చేసేవి, చేయించేవి - ఎన్నెన్నో రంగులు, ఎన్నెన్నో పరికరాలు. తాత్వికత సారూప్యంతో హోచిమిన్ సుదీర్ఘ పోరాటానుభవంతో ఎంతో సరళంగా చెప్పిన అంశాలను ప్రథమానుభవంగా యవ్వన ఉద్వేగ సాంద్రతలతో మోహన్ చెప్పాడు.

మీ ముందు ఇపుడు 'కిటికీపిట్ట' దృశ్యకావ్యాన్ని ఉంచుతాను.

మీరు చేయాల్సిందల్లా 'కాసేపు కిటికీపిట్ట రెక్కలు తెరవండి'. మీరు, నేను కిటికీపిట్ట రెక్కలు తెరవడానికీ ఆ తెరచిన రెక్కల వెనుక కిటికీకి తాళం వేళ్ళాడుతున్నా తన చిరునవ్వులు ఆకాశంలో చంద్రవంక అయి వెలుగుతున్న ప్రపంచఖైదీ ఆదివాసీ స్నిగ్ధబాలిక చిరునవ్వులు చూడడానికీ కవిత్వంలో, చిత్రంలో, భావనలో అడ్డుపడుతున్నదేమీ లేదు. అనుభవంలో అడ్డుపడుతున్న దేమిటో దానితో సంభాషిస్తున్నాడు కవి. అది వ్యవస్థ.

ఆ వ్యవస్థను ఎన్ని తీర్ల నిరాయుధం చేయవచ్చునో అన్ని తీర్ల నిరాయుధం చేసే ప్రయత్నం చేస్తాడు కవి. కవిత్వమంతా ఆయన వదలని ఆయుధం మానవీయ సంవాదం. వ్యవస్థ నుంచి మనిషిని వేరు చేసి, యూనిఫామ్ విప్పేసి, తుపాకి తీసేసి తనకు, పరాయికీ మధ్య పేరుకున్న ఎంతో వ్యవస్థీకృత హింసను ఓపిగ్గా రద్దు చేయాలని చూస్తాడు. ఈ ప్రయత్నంలో భావాల వ్యక్తీకరణకు ఎన్ని తీర్ల వైవిధ్య మార్గాలుంటాయో అన్నిటినీ ఎంచుకుంటాడు. అది పువ్వు కావచ్చు. బాణమూ కావచ్చు.

కాళ్లకు గట్టి తాళ్లే కట్టుకొని వదలండి.
రెక్కలున్నది ముడుచుకోవడానికా!

రెక్కలున్నది ముడుచుకోవడానికికాదు. స్వేచ్ఛాకాశంలో ఎగరడానికి, ఆహారాన్వేషణలో ఎగరడానికి, తన కోసమే కాదు, తన సంతానం కోసం. రెక్కలున్నది స్వేచ్ఛకోసం, ఆహారం కోసం. లిబర్టీ అండ్ బ్రెడ్.

రెక్కల టపటపలో ఈకెలెన్ని రాలినా చింత లేదు.
ముడుచుకపోయే స్థితి కంటె
ఆత్మహననమైనా
పురివిప్పడం గొప్ప కాదూ

కవి తన స్థితి, తనస్థితిలో నల్లమల విప్లవోద్యమ స్థితినీ రాశాడు కావచ్చు గానీ కేశవరెడ్డి జాగర్నాట్ గురించి చెప్పినట్లు నా కిందులో ఆత్మహననానికి పూనుకున్న పాలస్తీనా మానవబాంబు ముజాహిదీన్‌గా, హమాస్‌గా పురివిప్పడంలోని గొప్పతనం కనిపించింది. మీరు కాసేపు 'కిటికీపిట్ట' రెక్కలు తెరవండి మీకింకెన్ని దృశ్యాలు కనిపిస్తాయో. మీ మనసులో ఉన్నవి, అక్కడ

ఉన్నవి. ఎక్కడో లేకుండా, ఎప్పుడో లేకుండా, మీ భవిష్యత్ స్వప్నాల్లో కూడ లేకుండా ఉండేవి మాత్రంకావు.

ఒక తాత్విక దృక్పథం నుంచి ఏర్పడిన భావుకత ఒక మానసికస్థితిలో చిత్రించే దృశ్యంలో వస్తువును, శిల్పాన్ని ఒకేచోట చూడగలం తప్ప విడివిడిగా కాదు. ఆయన కిటికీకి ప్రాణమిచ్చి పిట్టను చేస్తున్నాడా? రెక్కలతో విహరించే పిట్టను గదిలో బంధించి కిటికీ మూసేసి గుండె రెక్కలు విరిపేయిస్తున్నాడా? ఆ కిటికీ వెనుకనే ఎగరడానికి ఆ పిట్ట సిద్ధంగా ఎదురుచూస్తోందా? నిషేధ మధ్యాహ్నకాలం (ఆగష్టు 2005 అనుకుంటాను) అది కూడ అనంతపురం ఎడారిలో కవిని పోలీసులు అరెస్టు చేసారు. కవి ఒక మామూలు మనిషి, కాకపోతే భావుకుడు, అప్పటికి చిత్రకారుడు మాత్రమే. కాకపోతే ఆయన చేసిన నేరమల్లా

బాధను ఒక భుజాన
బాధా నివారిణిని ఒక భుజానా మోస్తున్న
సాయుధ క్రీస్తును ఆరాధిస్తున్నాడు.

ఆయనవెంత చిన్న కోరికలని -

మధ్యాహ్నపు ఆవిరికాలం బస్సెక్కేటప్పుడు
ఓ జాంపండు తినింటే బావుండు -

ఆయన తనకొరకు కోరుకున్న సుఖం - ఐదారు నిమిషాల్లో నీళ్లలో ముఖాన్ని చల్లుకోవడం, ప్రయాణమంటే కిటికీ పక్క సీటు దొరకడం.

వెనక్కు వెళ్లే పొలాలూ బీళ్లూ చెట్లూ చేమలూ
చల్లని గాలులూ ముఖాన్ని ముద్దాడడమూ
ప్రయాణమంటే
పక్క సీట్లో తల్లి జడలాగుతూ
కేరింతలుకొట్టి పలకరించే పసిపాప అలుపెరుగని బోసినవ్వు
ప్రయాణం ఎపుడైనా ఇలాగే వుంటుదనుకున్నా
ప్రయాణం ఎపుడైనా ఇలాగే ఉండాలనుకున్నా

పరాయీకరింపబడని కోట్లాది మంది యువకులు ప్రపంచంలో ఇంత సహజమైన ప్రయాణాన్నే కోరుకుంటున్నారు. ఇదేం కోరిక అనుకునేంత దుర్లభ మయిందివ్వాళ ఇది.

ఏడు రోజుల చిత్రహింసల తర్వాత కూడా కవి

బైట నాకోసం పూచిన పూలన్నీ ఏమాయెనో
మిత్రుల సాయంత్రపు టీ వేళలు అలిగినవో

ఆ పూచిన పూలను, అలిగిన వేళలను చూడడానికైనా కిటికీపిట్ట రెక్కలు తెరవమన్నాడు. పదమూడు రోజుల చిత్రహింసలను ఒక డైరీలాగ చెప్పడు. ఒక్కొక్కరోజుకు ఒక్కొక్క కవితవలె సాధారణంగా పాఠకులు ఊహించే పద్ధతిలో చెప్పడు. హింస ఒక మొనాటనీ అయినా ఆ అనుభవాన్ని మొనాటనస్‌గా వర్ణించడు. ఒకసారి తనవైపునుంచి, మరొక సారి ఎదుటి వారి వైపునుంచి, ఒకసారి బయటి ప్రపంచం నుంచి, మరొకసారి తనలోంచి, ఒకసారి జ్ఞాపకం నుంచి, మరొకసారి కలలనుంచి, ఒకసారి బంధనాలనుంచి, మరొకసారి ధిక్కారంనుంచి - ఎన్ని మానసికస్థితులు మనిషిపొందగలడో అన్నిస్థితుల నుంచి చెప్పాడు.

అరెస్టు అయిన దగ్గర్నుంచీ ప్రయాణం మూడురోజులైంది. ఇవాల్టికి సరిగ్గా మూడు దినాలు / ఒక దుఃఖానికి మూడు దినాల ఆయుష్షు ఇంక రోజులు ఒకటికొకటి ఓవర్లాపింగ్‌గా వస్తాయి, తోసుకొని.

నేటికి సరిగ్గా ఏడు దినాలు -
దుఃఖం మెలాంకిలీకి మారిపోయింది
రాలిన ఈకెల లెక్కల ప్రకారమే
నేటికి సరిగ్గా పదకొండు నరకాలు -

ఈ నరకయాతన నేమీ 'అర్ధ సత్య' సినిమాలో వలె చూపడు కాని మనకొక రూపాన్ని కళ్లకు కడతాడు. అవి ఆయన పదకొండు రోజులేకాదు, దుఃఖంలో ఆదిమానవుని ఎన్ని పదకొండు గుణింతాల తరతరాలో

పెరిగిన చేతిగోళ్లు
గడచిన నిర్బంధ దినాలకు గుర్తుగా
గోడలపై చిత్తరువులేవో చెక్కుతూ
గుహ చుట్టూ క్రూరమృగాలు ముసిరినవేళ
దుఃఖిత ఆదిమానవుని
నెత్తుటి గోళ్ల చిత్రలిపి -

ఈ లిపిలోంచి ఆదిమానవుడు, కవి రూపొందించుకున్న స్వప్నమే ఆ కిటికీ వెనుక ఆదివాసి బాలిక చిరునవ్వుపై వెలిగే చంద్రవంక.

సూర్యకిరణం చంద్రశీతలం
మృగ్యమై పోయిన
పదమూడు కన్నీటి రేయింబవళ్లు
బరువు బరువైన పలవరింత -

'వారంరోజులు ఆ టార్చర్ చాంబర్‌లో ఏం కోల్పోయానో బయటికొచ్చి సూర్యుణ్ని చూసినపుడుగానీ తెలిసిరాలేదు' అన్న రవీందర్, నెలరోజులు ఒక బట్టల మూటవలె ఎమర్జెన్సీ లాకప్‌లో చిలక్కొయ్యకు వేళ్లాడిన జన్నుచిన్నాలు చెప్పిన అనుభవాలు - ఈ బరువుబరువైన పలవరింతలు ఎన్నెన్ని వేల మందివో.

ఈ స్థితి ఒక నిరామయ మానసిక స్థితికి తీసుకపోతుంది

నాకే సమూహాలూ అక్కర్లేదు ('ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహములు' అన్నపుడు శ్రీశ్రీ గత చరిత్ర వైభవాన్ని తలపోసాడు.)

ఏ పూల వనాల కోయిల పాటలూ అక్కర్లేదు (భావకవులనాటికే అవన్నీ ప్రివిలెజస్ చెల్లిపోయాయి)

మీ కట్టెదుటే
కాసేపలా నిల్చొనో కూచొనో
పాడిబారిన పగుళ్లనో
నక్షత్ర సహితమో నక్షత్ర రహితమో అయిన
నిరామయ చలిరాత్రులనో
చూస్తూ ఊరకే అలా కేవలం శ్వాసిస్తాను.

ఇవాల్టి కవి, మనిషితనం మిగిలినకవి శ్వాసించే హక్కు కోసం ఎంత పోరాటం చేయాల్సి వస్తున్నదో, ఎన్ని చిత్రహింసలు అనుభవించాల్సి వస్తున్నదో, కవి సగటు సాధారణ మనిషి ప్రతినిధి కనుక.

అవునుగానీ
ఇంతకూ
రేపటికిలా దినాలు లెక్క పెట్టే స్థితి
ఒకటంటూ ఉంటుందా మిగిలి!

జూలియస్ ఫ్యూజిక్ 'రక్తాక్షరాలు' గుర్తుకు రాకుండా మానదు. ఏ రోజుకారోజు తనసుంచిన సెల్ ఊచలకు వేళ్లాడుతున్న తన బట్టలు మళ్లా తొడిగించి ఫైరింగ్ స్క్వాడ్‌కు తీసుకవెళ్లి గోడవైపు ముఖం తిప్పి కాల్చేస్తారో తెలియదు. నాజీ హిట్లరు మిలిటరీ క్యాంపులో ఏ రోజుకారోజే ఆఖరి రోజు.

'ఊరక మాటలకే వాడడమేనా - ఎక్కడుంది ఫాసిజం - ఫాసిజమే ఉంటే ఇవ్వాళ ఈ సదస్సులో కెపిఎస్ గిల్ పక్కన కూర్చొని ఇట్లా మాట్లాడేవానివేనా - అని అడిగారు మాజీ నక్సలైటు, ప్రస్తుత పోస్ట్ మాడర్నిస్టు చరిత్రకారుడు దిలీప్ సైమన్ నన్ను. కావచ్చు, క్లాసికల్ అర్థంలో ఇది ఫాసిజం కాకపోవచ్చు. యుద్ధంలేదు. మిలిటరీ దాడులు ఇంకా కనీసం కాశ్మీరేతర, ఈశాన్య రాష్ట్రేతర భారతదేశంలో ప్రారంభం కాలేదు. కనుక హిట్లర్, ముసోలినీల కాలపు ఫాసిజం కాదు. కాశ్మీరు, మణిపూర్‌ల వంటి సైనిక ప్రత్యేక చట్టాలు కావు కాని ఒక 'ప్రపంచ ప్రజాస్వామ్యం' షియా ముసుగుతో, ముసుగులేని 'నియంత' సద్దాం హుస్సేన్‌ను ఉరితీయగలదు. మనదేశంలో ప్రజాస్వామ్యం విప్లవకారులను ఎన్‌కౌంటర్ చేసి పూలమాలవేసి సెల్యూట్ చేయగలదు. రచయితల సంఘాలను నిషేధించి, ఒక భావుకుణ్ని పదమూడు రోజులపాటు కరెంటు షాకునిచ్చి చిత్రహింసలు పెట్టగలదు.

నా తలకు చుట్టిన విద్యుత్ సర్పాన్ని

కాసేపు మీ నెత్తుటి బుట్టలో దాచండి
నాడీ మండలం కొన్ని పదాల కోసం వెతుక్కోవద్దూ -

ఆ వెతుక్కునే పదాలు ఆయనకూ, మనకూ ఎంత ఆశ్వాసాన్ని యిస్తాయో అదే కవిత్వం!

కరెంటు షాకుల్లా
సర్రున మాడ్చే పిచ్చి ముళ్ల తీగలు
ఆ ముందే ఓ వాగు పక్కన
వొళ్ళంతా పూసిన పారిజాతం చర్మంలో దిగిన కంపను
మెల్లగా తొలగించుకునేప్పుడు
తలపై జల్లులు జల్లులుగా
మోదుగపూలు

దారి ఒక్కోసారి ఎంత క్లిష్టమో ఒక్కోసారి అంత పరిమళం.
దారి నిరంతరం ఒక కుడిఎడమల ఎరుక.

దారి నిరంతరమొక ఆశ్వాసన -

'ప్రయాణం'తో మొదలయిన కవి పదమూడు రోజుల కరెంటుషాకుల, చిత్రహింసల చీకటి కుటిలో కూడ నిరంతర ప్రయాణం చేస్తూనే ఉన్నాడు - ఒక సంభాషణతో - తనలో, తనతో, ఉద్యమంతో, ఉద్యమంపై విరుచుక పడుతున్న వ్యవస్థతో, ఆ వ్యవస్థ చేతిలోని ఖాకీలతో.

చెదిరింది ముఖమూ పగిలింది పెదవులూ
చిటికెల శబ్దాలతో విరిగిన వేళ్ళూ
అమ్మా.....

కవులను, విరసం సభ్యులను నిర్బంధించినపుడు వ్యవస్థ దృష్టి చేతులపై, చేతివేళ్లపై ఉంటుంది. వరంగల్ విరసం సభ్యులను అరెస్టు చేసినపుడు కూడా అక్రమ నిర్బంధంలో ఒక జీవధారగా, దీపశిఖగా రాసే వడ్డెబోయిన శ్రీనివాస్‌తో, తోటి కవులతో పోలీసులు 'ఈ వేళ్ళతోనే కదరా రాస్తావు' అని ముణుకుల మీద లాఠీలతో కొట్టి వేళ్లు విరిచేయాలని చూసారు. ఫైజ్ అహ్మద్ ఫైజ్ నుంచి విక్టర్ యారావరకు వ్యవస్థ సైనికనియంతృత్వమైతే మరింత నిర్బంధం, మరిన్ని హింసలు, దృష్టంతా రాసే చేతులు, పాడే స్వరంమీదే.

మోహన్ చిత్రకారుడు, నిజానికి 'కిటికీపిట్ట'లోకి కవితలన్నీ కుంచెతో రాసినట్టుగానే ఉంటాయి. అందులోనూ ఆయన కన్ను సజీవ దృశ్యాలను పట్టుకుంటుంది. ఏ గురుదత్‌లాంటివాడో, ముజఫర్ అలీ లాంటివాడో అయితే దీనినొక దృశ్యరూపకంగా రూపొందించవాడనిపిస్తుంది. 'మమతల రంగుల'తో కవిత చదివితే నిజంగానే మనకు కూడ 'ఈవేళ్ళ కొసల్లో నా కళలనది ప్రవహిస్తుంద'నిపిస్తుంది.

చిత్రమంటే రంగురేఖల పొహళింపే కాదు
మనిషికి మనిషిపై గల ప్రేమ కూడ
నిజంగా నీకు తెలియదూ
నీ కనుకొనల్లో కూడ
ఓ బొమ్మల వాగు దాగుందనీ....

ఇట్లా ఎదుటివాని దుమ్ము కొట్టుకపోయిన ఆత్మను ఉద్దీపింపచేయడం ఈ కవిత్వంలో గొప్ప బలం

నా దోసిలిలో కాసిని మమతల రంగులు చల్లు
కమిలి బండబారిన నీ హృదయతలంపై
నా చేతికి సంకెళ్ళ సడిలోంచే
ఓ అపురూప ప్రేమచిత్రాన్ని
కాంతివంతంగా వేసిస్తాను.

నా చేతులకు సంకెళ్ళు వేసి, నా కలాన్ని విరిచేస్తే సంకెల ప్రతినోరూ ధిక్కారాన్ని పలుకుతుంది అంటాడు ఫైజ్ అహ్మద్‌ఫైజ్.

మోహన్ అరెస్టుకు, చిత్రహింసలకు వ్యవస్థకు ఉన్న బలమైన కారణం, ఆ నిర్బంధంలో, హింసలో ఆయన నిలుపుకున్నా ఆత్మస్థైర్యం, ఆయన స్వభావం, కళాచైతన్యం - అన్నీ సమగ్రంగా ఆకళింపు చేసుకోవాలంటే 'శోధన' అనే కవిత పెద్ద క్యాన్వాసు - అందులో ఆయన నుంచి శత్రువు రాబట్టాలనుకున్న విప్లవోద్యమ రహస్యాలు, అవి రహస్యాలు కాదు, ఆయన అమ్మనుంచి, అమ్మవంటి పల్లెనుంచి, పల్లెలోని బాధాతప్త ప్రజలనుంచి, ప్రజల మధ్యన దీపం వెలిగిస్తూ సంచరిస్తున్న విప్లవకారులనుంచి, వాళ్ల అజ్ఞాత జీవిత అడవి నుంచి ఆయన వాళ్లకు చెప్పగలిగిన రహస్యం ఒక్కటే - అది ప్రేమ - ప్రజలపట్ల, ప్రజల సేవయే విప్లవ లక్ష్యమైన విప్లవకారులపట్ల, అమ్మ నుంచి అందుకొనిపంచిన ప్రేమ.

రహస్యాలన్నీ పదాల్లోకి తర్జుమా అయితే
ఊహలన్నీ మాటల్లోనే ఒదిగిపోతే
మనిషిఎప్పుడో ఆగిపోయేవాడుగాదూ....

ఈ సంకలనం మోహన్ అమ్మకూ, అమరవీరులందరికీ.... అంకితమిచ్చాడు.

ఉద్యమమే అమ్మ రూపెత్తినపుడు
ఉద్యమ రహస్యాలు అమ్మ తీపిజ్ఞాపకాలై పోవూ
అమ్మ జ్ఞాపకాలు పంచుకోనడానికి షరతొక్కటే
మీరంతా పసిబిడ్డలై దోగాడి బోసినవ్వులు పూయండి -

తమకు వివస్త్రగా వడ్డించాలని అనసూయను విష్ణువు, బ్రహ్మ, శివుడు పరీక్ష పెటితనపుడు ఆ ముగ్గుర్నీ ఆమె పసిపాపలను చేసి వడ్డించిందట. అన్ని ఆచ్ఛాదనాలు, కుబుసాలు తొడుక్కున్న ఈ సహజాన్ని తన ఆదిమ బాల్యంలోకి తీసుకపోవడానికి కవి

అల్లెతాడుకూ విల్లుకర్రకూ మధ్య
బిర్రబిగిసిన బాణపు ప్రతిచర్యలా
దేహ చలనాన్ని కూడదీసుకున్నాడు -

మూలమనవుణ్ని మేలుకొలిపే ఇంద్రజాలమీ కవిత్వం. ఆ అర్థంలో ఇది మానవసారం. ఇక మోహన్ విస్తృత నిర్దిష్ట వర్తమాన సంఘర్షణలోకి తన ప్రయాణం మళ్లించాలి. *

(......31వ పేజీ తరువాయి)

కుల వ్యవస్థలోని, భూస్వామ్యంలోని క్లిష్టతను సవాల్‌గా స్వీకరించలేని స్థితిలోకి వెళ్ళిపోవడం వాస్తవం. నిజానికి మాదిగదండోరా ఏ వాస్తవికతను చాటిచెప్పిందో అలాంటి వాస్తవికతనే బీభత్సంగా వెల్లడిచేసిన వేంపెంట దండోరా ఉద్యమానికి, సామాజిక విశ్లేషణకు కీలక సాధనం కావలసి ఉండింది.

సామాజిక ఉద్యమాలకు ప్రాధాన్యతలు, విస్మరణలు ఉండేవే అనుకున్నా సాహిత్యకారులు, విశ్లేషకులు కులసామాజిక జీవిత చిత్రణ పరిధిని విస్తరింపచేయడానికి వేంపెంట ఘటనను ఒక అధ్యయన వనరుగా, గీటురాయిగా పరిగణించి ఉండాల్సింది. నిజానికి అప్పటికే దళిత సాహిత్య ఉధృతి తగ్గిందనీ, విస్తృతి కావడంలేదనీ అభిప్రాయాలు మొదలయ్యాయి. వాటి నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, వేంపెంట కేంద్రంగా దళిత బహుజన సాహిత్య సృజనను పరీక్షకు పెట్టి ఉంటే కుల నిర్మాణాల మధ్య వైరుధ్యాలతోపాటు అంతిమంగా మానవ సంబంధాల్లో గెలిచే అంశానికే పట్టంకట్టడం ఎలా అన్న ప్రశ్న దళితవాద సాహిత్యంలో భాగమై ఉండేది. కులవ్యవస్థలోని వివక్ష, అంతరం, అణచివేత రూపాలన్నింటినీ చిత్రిస్తూ వాటికి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ సాగే పోరాటం వైరిస్థానాలను తుడిచేసి సమస్త ఆధిపత్య నిర్మాణాల్లోని అగ్రవర్ణతత్వాన్ని ఓడించడానికి సంఘటితపడే క్రమాన్ని చిత్రించగలిగేది. అలాంటి సన్నివేశం చరిత్రలో భాగమై దూరంగా వెళ్ళిపోయింది. 'వేంపెంట ఘటన' అని వ్యవహార సౌకర్యం కోసం అనవచ్చుగాని వాస్తవానికి అదొక ఎరుక. యింకా బాగా చెప్పాలంటే ఎరుక క్రమం. ఇప్పుడు గడచిన చరిత్ర ఎలా ఉండి ఉంటే బాగుండేదో చెప్పడంవల్ల ప్రయోజనం లేకపోవచ్చు గాని. నిజంగానే అదొక ఎరుక క్రమంగా మనలో ప్రతిఫలించి ఉంటే దళిత సాహిత్యం ఎలా ఉండేది? అనే ఆసక్తినైతే తుడిచేసుకోనవసరం లేదుగదా. *

చర్చ

సాహిత్యంలో అరాచకత్వం సమర్ధనీయమేనా?

☆ డా.జి.వి.కృష్ణయ్య

2006 ఆగష్టు ప్రజాసాహితి మాసపత్రికలో శ్రీరామ కవచం సాగర్ రాసిన "మూలుగు" నవలపై నా సమీక్ష వెలువడింది. ఆ నవల సంపాదకుడుగా బరువు బాధ్యతలు నెత్తినేసుకున్న జె.వి.ఎన్ మూర్తి ఎందుకో ఒకింత అసహనానికి గురయి 'చర్చ'ను లేవనెత్తారు. వ్యాస రచయితగా చర్చకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత నాపై వుందని భావిస్తున్నాను. 'మూలుగు' నవల అద్భుత ప్రయోగంగా కీర్తిస్తూనే క్రాఫ్టింగ్‌కు సంబంధించి కొన్ని తప్పులు, చిన్న చిన్న లోపాలు దొర్లినట్లు, ఎంచుకున్న శిల్పం వల్ల ఆశించిన లక్ష్యాన్ని స్పష్టంగా చెప్పలేదని (వుక్కపోత) మీరే అంగీకరిస్తున్నారు. అదే పని ఇతరులు చేస్తే అల్పులు, అజ్ఞానులు అని నిందిస్తున్నారు. ఇదెక్కడి బాధ్యతయ్యా బాబూ! చివరి కవితలో అన్నట్లు ఈ రచన బావుందని ఎవడైతే అనడో వాడి మొగం మీద ఉమ్మేసి మీకు మీరే భుజకీర్తులు తగించుకుపోతారా? ఏమిటీ అహంభావ ధోరణి?

శైలి ఏదయినా, ప్రయోగం ఎలాంటిదయినా ఒక లక్ష్యం అంటూ వుండాలి. రచన ద్వారా ఏం చెప్పదలచుకున్నారు? ఏం చెప్పారు? చెప్పింది పాఠకుడికి ఎంతవరకు చేరింది? అన్నది ముఖ్యం. కావ్యవస్తువు జడ పదార్థం కాదు. సారమేమిటో చెప్పకుండా రూపంలో వున్న గొప్పతనాన్ని అర్థం చేసుకునే స్థాయి, జ్ఞానం విమర్శకులకు లేదని కొట్టి పారేస్తున్నారు. అంతర్జాతీయ సాహిత్యంలో మీరన్నట్లు నాకంత ప్రవేశం లేదని వినయంగా అంగీకరిస్తున్నాను. నాకున్న పరిమిత జ్ఞానంతో లేవనెత్తిన అంశాలు వాస్తవమా? కాదా? అన్నది చర్చనీయాంశం. 'లాటిన్ అమెరికా సాహిత్య ప్రయోగాలు గమనించారా, యూరప్ సాహిత్యాన్ని చదివారా? అది చదివితే గాని విమర్శకు ఉపక్రమించకండి' అంటూ బెదరగొట్టాలని ప్రయత్నిస్తున్నారా? అంతర్జాతీయ సాహిత్యకారుల కోసం తెలుగులో చేసిన ప్రయోగం అంటున్నారు. పెద్ద పనే పెట్టుకున్నారు. బాగానే వుంది! కానీ... తెలుగులో మీ ప్రమాణాలతో సరితూగేంత సాహితీవేత్తలు లేరని నిర్ధారించారు. అలాంటప్పుడు తెలుగులో వ్రాయడం, ఇంగ్లీషులోకి తర్జుమా చేసి అంతర్జాతీయ పండితులు ముందు పెట్టడం ఇదంతా ఎందుకు? డైరెక్టుగా ఇంగ్లీషులోనే రాసి ఇంటర్నెట్‌లోనో, ఇంటర్నేషనల్ బుక్ మార్కెట్‌లోనో విడుదల చేసి వుంటే అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరిగుండేది.

వ్యక్తిగత ద్వేషం, అసహనం పెంచుకోవడానికి మనమధ్య దాయాదుల పోరులేదు. మన మధ్య వున్న సారూప్యత సాహితీ ప్రియత్వమే. కథయినా, కవితయినా, నవలయినా చదివినపుడు విషయం అవగాహనకు రావాలి. ముందుమాటలు, వెనుక మాటలు గైడ్ చేస్తాయా? గైడే ముఖ్యమయితే ఇక పాఠ్యగ్రంథమెందుకు? గుర్రం బొమ్మ వేస్తే బొమ్మని చూసి గుర్రమని గుర్తించాలి గాని బొమ్మ క్రింద 'గుర్రం' అని రాయాలంటారా?

మూలుగు నవలలో కథానాయకుడు దావూద్ (ఇతని గుణ గణాలు ప్రజాసాహితి వ్యాసంలో ప్రస్తావించాను). పాకిస్థాన్ ఏర్పాటు వాదాన్ని కోరుకునే కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త. దావూద్‌ని బాంబు కేసులో అరెస్టు చేసి ఉరిశిక్ష విధిస్తారు కాని స్వాతంత్ర్యానంతరం విడుదలై తను ఏ మార్గంలో పయనించాలో ఆ మార్గంలో పోయాడు, కథను మూర్తి మూడు ముక్కల్లో తేల్చాడు. జైలు నుండి ఎలా విడుదలయ్యాడు? ఉరిశిక్షెందుకు అమలు జరగలేదు? తమ నిర్ణయించుకున్న మార్గానికి సమాజం, సామాజిక ఉద్యమాలు ఎంతవరకు దోహదం చేశాయి? దావూద్ ఊగిసలాట నుండి బయటపడ్డాడా? ఈ సందేహాలకు ఈ చర్చలో కూడా సమాధానం లేదు.

కమ్యూనిస్టు కార్యకర్తలయినంత మాత్రాన రాగద్వేషాలకు అతీతులా అని మూర్తి ప్రశ్న. కాదనే నా సమాధానం. శత్రువు పట్ల ద్వేషం మిత్రుని పట్ల అనురాగం వుంటుంది. సమాజం వైరుధ్యాల మయం. మిత్రపూరిత వైరుధ్యం పట్ల మార్క్సిస్టుల వైఖరి సానుకూలంగానే వుంటుంది. నవలలో ఒక కమ్యూనిస్టు కార్యకర్తను కథానాయకుడిగా తీసుకుని అవకాశవాదిగా, దుర్మార్గుడుగా, నీచ ప్రవృత్తిగల వాడుగా చిత్రించడంలో రచయిత ఏం ఆశిస్తున్నాడు? ఇలా చిత్రీకరించడంలో రచయిత దురుద్దేశాన్ని ప్రశ్నిస్తే, కామదృష్టితో నవల చదవారని ఆరోపించడం ఎంతవరకు సమంజసం? బూతు సాహిత్యం కావాలంటే బయటి మార్కెట్‌లో 'సరుకు' చాలా వుంది. కష్టపడి ముక్కుతూ మూలుగుతూ ఈ నవల చదవపన్లేదు. చాలా మందిలాగా మొదటి మూడు పేజీలతోనే పుస్తకం మూసి ప్రక్కన పడేయవచ్చు. అరాచకుడి అంతరంగాన్ని ప్రధాన పాత్రలో చూపించడం ద్వారా కమ్యూనిస్టు అన్నవాడు స్వాతంత్ర్యోద్యమం కాలం (దేశ విభజన) నుండి శ్రీకాకుళ పోరాటం వరకు దావూద్ లాంటి వాళ్ళేనని చెప్పడానికే ఈ పాత్రను నమూనాగా తీసుకున్నారా? అస్థిత్వవాద చట్రంలో దావూద్‌ని నిలబెట్టడానికి రచయిత ప్రయత్నించాడనేది మూర్తి వాదన. పాకిస్థాన్ ఏర్పాటువాదం ఒక రాజకీయ ఎత్తుగడగా 1940లో ముస్లింలీగ్ తీర్మానించింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదులే విభజన మూలకారకాలు. భారత కమ్యూనిస్టుల్లో విభజన పట్ల భిన్నాభిప్రాయాలున్నట్టు చరిత్రలో కనబడుతుంది. కొంతమంది అప్పట్లోనే అస్థిత్వవాద ఆలోచనలు పొడచూపాయని హీరోకి ఈ రచయితలు సర్టిఫికేట్ ఇచ్చారు కాబట్టి కాదనడానికి మనమెవ్వరం? రచయితకు స్వేచ్ఛ వుందిగదా?

"మనిషికి మనిషిగా మనుగడే ముఖ్యం. సిద్ధాంతాల రాద్ధాంతాల ప్రమేయం లేదు. తను ఎలా నిర్మించుకుంటే అలా అవుతాడు. మరే శక్తివల్లా తయారుకాడు. మనిషికి అనియతమైన యిచ్ఛ వుంది. మనిషి తన యిష్టానికే బాధ్యుడు....." సార్త్రే చెప్పిన ఈ అస్థిత్వవాద సిద్ధాంతానికి అనుగుణంగానే పాత్రని మలిచారు. ఈ నవలను ఇదే కోణంలో చదవమని మూర్తి మొదలుకుని పోస్ట్ మోడర్నిస్టు తిరుపతిరావు వరకు సెలవిచ్చారు. శ్రీరామ కవచం సాగర్ గారేమో నాది మార్క్సిస్టు దృక్పథం, పోస్ట్ మోడర్నిజాన్ని వ్యతిరేకించేవారిలో నేను ముందుంటానంటున్నారు. ఏమిటీ రెండు నాల్కల ధోరణి.

సాగర్ గారికి నా ప్రశ్న. మార్క్సిస్ట్ వాస్తవికతను ఆమోదించే వారయితే పాజిటివ్ రోల్స్‌ని చూపించడం ఎందుకు. చారిత్రకంగా చూసినా దేశ విభజనను ముస్లీములందరూ సమర్థించారా? దేశ సమైఖ్యత కోసం ప్రాణ త్యాగం చేసిన వాళ్ళు గుర్తుకు రాలేదా? ఈ సందర్భంగా అల్లాబక్ష్ సుంర్రోని జ్ఞాపకం చేసుకుందాం. సింధ్ రాష్ట్ర ప్రధానమంత్రి అల్లాబక్ష్ సమైక్యతావాది. భారతదేశం నుండి పాకిస్థాన్ ఏర్పాటు కోసం ముస్లిం లీగ్ సాగిస్తున్న ఎత్తులను ఎండగట్టాడు. మతాన్ని, మత మనోభావాలను రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకోవడం తగదన్నాడు. జాతీయోద్యమంలో సుంర్రోకి పెరుగుతున్న జనాదరణ చూసి బ్రిటీషు వాళ్ళు ముస్లిం లీగు నాయకులతో కలసి కుట్ర చేసి 1943 మే 14న కాల్చి చంపారు. దేశ విభజనను వ్యతిరేకించిన ఇలాంటి అనేక మంది శిక్షింపబడ్డారు.

* * *

ప్రయోగాలకు ఉలిక్కిపడే పరిస్థితి, గగుర్పాటు చెందే దుస్థితి వామపక్ష సాహితీ ఉద్యమాలకు లేదు. నిన్న మొన్నటి వరకు వామపక్ష ఉద్యమాల్లో పనిచేసి వచ్చిన మీకు మార్క్సిజం గిట్టనిదయ్యిందో లేక గిట్టుబాటు కానిదయ్యిందో తెలియదు. సాహితీ సాంస్కృతిక ప్రక్రియల్లో నూతన వరవడికి ఆహ్వానం పలికి అభివృద్ధి చేసిందీ వామపక్ష ఉద్యమాలేనన్న సంగతి మూర్తికి తెలియంది కాదు.

కోబ్రాలకు భయపడి నిజాన్ని, చరిత్రని సూటిగా చెప్పకుండా ఇలా

స్పందన

అరుణతార ఏప్రిల్ సంచికలో వడ్డెబోయిన శ్రీనివాస్ కథ
'ఆమె తలాక్ అన్నది' పై మరో రెండు స్పందనలు

☆ షేక్ కరీముల్లా

ముస్లిం సంస్కృతిపై అపోహల్ని పెంచే కథ

అరుణతార ఏప్రిల్ సంచికలో వడ్డెబోయిన శ్రీనివాస్ రాసిన 'ఆమె తలాక్ అన్నది' అనే కథను కొంతమంది ముస్లిం సాహితీ మిత్రుల కోరిక మేరకు చదివాను, దానికి స్పందనగా వచ్చిన అలీ వ్యాసాన్నీ, తదనంతరం బి.సైదులు, యన్.వెంకటేశ్వర్లుగార్ల ప్రతిస్పందనల్ని గమనించాక కొన్ని మాటలు రాయాలనిపించింది. శ్రీనివాస్‌గారు ఆ కథ రాయటం వెనుకు హిందూత్వ కుట్రలున్నాయని ఎవరూ భావించనవసరం లేదు. ఎందుకంటే ఆయన బహుశా విరసంకో మరే ఇతర వామపక్ష భావజాల సాహిత్య సంఘానికో చెందిన వారై ఉండవచ్చని ఆయన రచనల్ని బట్టే తెలుస్తుంది. కనుక ముస్లింలకు శత్రువుకాదు మిత్రుడే అని భావిద్దాం. కాకపోతే రాసిన కథను బట్టి ఆయనకు ముస్లిం సంస్కృతిపై పూర్తి అవగాహన లేదని స్పష్టంగా అర్థమౌతుంది.

కథ అసాంతం చదివాక నాకు 'బొంబాయి' సినిమా గుర్తుకొచ్చింది. ఇంకా చెప్పాలంటే గత కొద్ది కాలంగా వస్తున్న సినిమాల్లో ముస్లిం అమ్మాయిల కోసం హిందూ అబ్బాయిలు చేసే ప్రేమ త్యాగాలు తీసితీసి అల్సిపోయిన మన దర్శక నిర్మాతలు గుర్తుకొచ్చారు. అలాగని హిందూ అబ్బాయిలు ముస్లిం అమ్మాయిల్ని ప్రేమించడం, పెళ్ళాడటం తప్పని చెప్పటం నా ఉద్దేశ్యం కాదు. ప్రేమకు ఎల్లలు లేవు. కనుక ఒక బ్రాహ్మణ యువకుడు ముస్లిం అమ్మాయిని వివాహం చేసుకోవటం అసహజమేమీ కాదు. కాకపోతే ఆ కుటుంబం ఏ గోరా గారి కుటుంబం లాంటిదో అయివుంటే కథలో సహజత్వం కన్పించేది - కానీ ఆ కుటుంబం వైదికాచారాలు నిష్ఠగా పాటించే సనాతన బ్రాహ్మణ కుటుంబం. ఆ యువకుడు కూడా భగవద్గీతపై అపార విశ్వాసం కల్గిన సనాతనుడే. శ్రీనివాస్ కథలోని డొల్లతనం, హిందూ ఆధిపత్య భావజాలం, పక్షపాతం ఇక్కడే బయటపడింది.

ఇక కథలోకి నేరుగా వెళ్తే రజియా పాత్ర పేదరికం వల్ల నల్గురు బిడ్డల తండ్రికి రెండో భార్యగా వెళ్తుంది. తన భర్త మొదటి భార్య సంతానాన్ని కన్నతల్లిలా పెంచి తన పేగు తెంచుకుని పుట్టిన సుల్తానాను నిర్లక్ష్యం చేస్తుంది. సుల్తానా రామశాస్త్రి అనే బ్రాహ్మణ యువకుడిని పెండ్లాడుతుంది. రామశాస్త్రి గారు బొంబాయి సినిమా హీరోలా ఆమెను చాలా ప్రేమగా చూసుకుంటుంటాడు. రామశాస్త్రి తండ్రి సుబ్రహ్మణ్యశాస్త్రి మొదట్లో వ్యతిరేకించినా తన 'విశాలమైన మనస్సు'తో ఓ ముస్లిం అమ్మాయితో తన కొడుకు కాపురానికి సమ్మతిస్తాడు. ఈ వివాహంను సమ్మతించినందుకు రజియాను ఆమె కుటుంబం బయటికి గెంటుతుంది. రజియా గత్యంతరం లేక సుల్తానా దరికి చేరటంతో రామశాస్త్రి అనబడు హీరోగారు తన కుటుంబసభ్యులకు, రజియాకు మధ్య నెలకొన్న సాంస్కృతిక ఘర్షణను నివారించేందుకు పెద్దమనుసుతో పంచాయితీ పెట్టించి 'భగవద్గీత సాక్షిగా' మతం మార్తానని ప్రకటించడం, పెద్దలు అంగీకరించకపోవటం జరుగుతుంది. దీంతో మతం మనిషికి వ్యతిరేకం అని తేల్చేసి రజియా తన భర్తకు 'తలాక్' చెప్పేసి వెళ్ళిపోతుంది. ఇదీ కథ.

ఈ కథపైకి చూడ్డానికి చాలా ఆదర్శవంతంగా కన్పించినా పైకి కనబడని

ప్రయోగాత్మకంగా చెప్పి తప్పించుకుంటున్నారా? అయ్యోపాపం! అంత భయపడి మీరు రాయకపోతే చరిత్ర గమనం ఆగిపోతుందా? సాహితీలోకం స్తంభించిపోతుందా? ఏమిటండీ ఈ అడ్డుగోలు వితండ వాదన. కోబ్రాలు అక్షర జ్ఞానంలేని అమాయకులు అని భ్రమపడడం మన తెలివితేటల్ని అతిగా అంచనా వేసుకోవడమే.

ఫ్రాయిడియన్ 'సైకో ఎనాలిసిస్' అన్ని సమస్యలకు పరిష్కారం చేసుకునే వీలు కల్పిస్తుందనడం 'భ్రమ'. ఒక వ్యక్తి దొంగగా, సంఘవ్యతిరేక శక్తిగా తయారైనపుడు సైకో ఎనాలిసిస్ వివరణ ఒక్కటే సరిపోదు. సాంఘిక దృక్పథం నుంచి చూడాలి. ఆ వ్యక్తే ఎందుకు అలా తయారయ్యాడు అన్నది సైకో ఎనాలసిస్ వల్ల సాధ్యపడదు.

ఏ మానవుడైనా తన జీవితం సుఖవంతం చేసుకోవడానికి వాస్తవ ప్రపంచంలో ఒక నిర్దిష్టమైన దేశకాల పరిస్థితుల్లోనే శ్రమిస్తాడు. ఊహల్లో పొలాలు దున్ని ఆలోచనల్లో విత్తులు జల్లి కలల్లో పంటకోసుకుందామని భావించేవాడు మతి స్థిరంలేని వాడే! భౌతిక ప్రపంచంలో కృషి చేసేవాడికి ఎదురయ్యే సమస్యలు వాస్తవ ప్రపంచంలోనివే. సాహిత్యం ఎలా వుండాలి? సమాజం ఎలా వుండాలి? అన్న ప్రశ్నలకి పరిష్కారమూ అక్కడే లభించాలి. సాహిత్యమూ - సమాజమూ పరస్పరాధారంగా వున్నపుడు ఒకదానినొకటి ప్రభావితం చేస్తాయి. సాహిత్యానికి కళలకీ మానవ సమాజ జీవితవికాసానికి తోడ్పడంలో ముఖ్యమైన బాధ్యత వుంది. మానవుడు మానవుడిగా మనలేకపోవడానికి గల కారణాలు అన్వేషించాలి. సమాజాన్ని వ్యక్తినీ కదిలించడం, మార్చడం సాహిత్యం నిర్వహించాల్సిన బాధ్యత.

మూలుగు నవలకు అనుబంధంగా జె.వి.ఎస్‌మూర్తి వ్రాసిన చివరిమాట వారన్నట్లే వుక్కబోయిస్తుంది. నవలలోని సింబాలిక్ షాట్స్ గురించి బ్యాక్‌గ్రౌండ్ డ్రీమ్స్ గురించి దేవతా వస్త్రాల్లాంటి విభ్రాంతి కలిగించే విషయాలు చెప్పారు. మొత్తం మీద కథయితే అర్థం కాలేదు. నిర్మొహమాటంగా చెప్పాలంటే ఈ ప్రయోగం ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. శక్తి సామర్థ్యాలున్న రచయిత ఎందుకింత 'అరాచకంగా రాశాడా' అని దిగ్భ్రాంతి కలుగుతుంది.

మూర్తిలాంటి మేధావికి మెదడులో సవాలక్ష ఆలోచనలు సంఘర్షణ పడుతుంటాయి. కొన్ని ఆలోచనలు వికటిస్తుంటాయి. మరికొన్ని వెగటు పుట్టిస్తుంటాయి. వ్యవస్థ స్వభావ - స్వరూపం మొదలుకుని సాహితీ ప్రస్తానం వరకు తనదైన శైలిలో వివరించారు. దోపిడీ ఏఏ రూపాల్లో సాగి ఆర్థిక వ్యవస్థ మూలుగుల్ని పీల్చి పిప్పి చేస్తుందని చెప్పారు. 'బ్యూరాక్రటిక్ పెట్టుబడి', 'బ్యూరాక్రటిక్ తాత్విక ధోరణి' అన్ని వాటిని కొత్త సీసాలో పాత సారా పోసినట్లు ప్రస్తావించారు.

'బ్యూరాక్రటిక్ పెట్టుబడి' 'బ్యూరాక్రటిక్ తాత్విక ధోరణి' సాంప్రదాయ పదజాలానికి ఆధునిక నామకరణ చేశారు. ఎప్పటి నుంచో 'సామ్రాజ్యవాద భూస్వామ్య విధానాలు' అనేదాన్ని బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ విధానం అనీ, 'సామ్రాజ్యవాదసంస్కృతి' ని బ్యూరాక్రటిక్ తాత్విక ధోరణి అన్నాడు. సామ్రాజ్యవాదం అన్ని రంగాలలో అడుగుపెట్టినట్లే సాహితీ సాంస్కృతిక రంగాలలో కూడా అడుగుపెట్టిందనిన వాస్తవం మార్క్సిజంలో ప్రాథమిక జ్ఞానం వున్న వారికి కూడా తెలిసిందే. సామ్రాజ్యవాద సంస్కృతి కలిగించే వాస్తవికత యొక్క భ్రమాత్మక ప్రతిఫలనం గురించే కన్ఫ్యూజన్ లేదు. సామ్రాజ్యవాద దుర్మార్గం, సాంస్కృతిక క్రూరత్వం చవిచూస్తున్నదే.

సాహిత్య కళారంగాలలో కనిపిస్తున్న విధ్వంసక ధోరణులు ఇంప్రెషనిస్టుల ధోరణుల్లాంటి అనుభూతివాదులు ఎగసి పడడం అభ్యుదయ, విప్లవ సాహిత్యం చురుకుగా వచ్చిన కాలంలో తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం పెట్టుబడిదారీ సమాజం విజృంభిస్తూ సామ్రాజ్యవాద విషసంస్కృతిని విశ్వవ్యాపితం చేయడానికి ప్రయత్నిస్తోంది. దాని ఫలితమే వివిధ వాదాల పేరుతో వస్తున్న వ్యక్తిత్వం ధోరణులు. ఘర్షణ - ఐక్యత - ఘర్షణగా సమాజమిప్పుడు అభివృద్ధివైపే సాగుతుంది. ఆ అభివృద్ధి సాధించడానికి సాహిత్యం - కళలు భావ విప్లవ సాధనాలుగా వుంటాయి.

*

హిందూత్వ భావనలు (కుట్రలు కావు) కథ నిండా ఉన్నాయి. ముస్లిం సంస్కృతిని హిందూత్వవాదులు ఏ కళ్ళతో చూస్తారో శ్రీనివాస్‌గారు కూడా అదే కళ్ళతో చూశారు. అదేమని ప్రశ్నించినందుకు అలీని సైదులు గారు పురుషాధిక్యత వదిలిపెట్టుకోవాలని కోరారు. ఈ కథలో తండ్రి అనే అర్థంలో 'పితాజీ' అని వాడారు. ముస్లింలెవరూ 'పితాజీ' అనరు. అబ్బాజాన్ అని తండ్రిని పిలుస్తారు. కాకపోతే ఇది భాషా దోషం కనుక పట్టించుకోనక్కరలేదు. కానీ ఇటు ముస్లిం కుటుంబం చాలా కరుకైన కుటుంబం, రామశాస్త్రి కుటుంబం భగవద్గీత పారాయణం చేసే అతి నెమ్మదస్తుల కుటుంబం. నిజంగా వాస్తవ జీవితంలో ఒక ముస్లిం అమ్మాయిని సనాతన బ్రాహ్మణ కుటుంబం తమ కులంలో కలుపుకుంటుందా? ఏమో అలా శ్రీనివాస్ గారు ఎన్ని కుటుంబాల్ని చూశారో చెప్పాలి. క్రమం తప్పకుండా పూజలు చేసే రామశాస్త్రి అక్బర్ ది గ్రేట్‌లా వీళ్ళ నమాజుల కోసం ఇల్లు కూడా మార్తాడు. చివరికి పంచాయితీకి వెళ్లేటపుడు సైతం తన భగవద్గీతను వదిలిపెట్టాడు. తన అత్తగారి బాధలు చూడలేక తను ఇస్లాం స్వీకరిస్తానంటాడు. అదీ "భగవద్గీత సాక్షిగా". సరే శ్రీనివాస్‌గారు చెప్పినట్టు ఇతను త్యాగధనుడే అనుకుందాం. మతం మార్తానని చెప్పాక కూడా ముస్లిం మత పెద్దలు ఇతనిని గేలిచేయటం, కుదరదని చెప్పటం నిజమేనా? ముస్లిం సమాజంలో కల్మా చదివాక ఒక వివాహాన్ని ఆమోదించక పోవటం అనేది ఇస్లాంకు విరుద్ధం. ఏ కులానికి, జాతికి చెందిన వారైనా ఆమెతో వివాహం ఇస్లాంలో నిషిద్ధం కాదు. ఈ వాస్తవాల్ని విస్మరించి మొత్తం ముస్లిం సమాజాన్ని బోనులో నిలబెట్టే ప్రయత్నం చేశారు రచయిత. ఇంకా సూటిగా చెప్పాలంటే ముస్లిం పురుషులంతా పరమ దుర్మార్గులు, ఛాందసులు. ముస్లిం స్త్రీలు వారికి కట్టుబానిసలు అనే లోగుట్టు సందేశం కూడా ఇందులో వుంది. ముస్లింల సామాజిక వ్యవస్థను ఎంతగా వక్రీకరించాలో అంత వక్రీకరించి చివర్లో చాలా తెలివిగా మనుషుల్ని అర్థం చేసుకునే గుణం ఏ మతంలోనూ లేదని చెప్పేశారు.

ఇక సైదులు గారి ప్రతిస్పందనలోకి వెళితే "అలీ - ఇస్లాం పురుషాధిపత్యాన్ని వదులుకోవాలి".

అనే మాటే అభ్యంతరకరం. ఎందుకంటే ఒక ముస్లిం పురుషునిలో పురుషాధిక్య స్వభావం ఉంటే ఉండవచ్చు కానీ ఇస్లాంలో పురుషాధిక్యత అనేది లేనేలేదు. ప్రపంచ చరిత్రలో స్త్రీకి అత్యంత గౌరవం ఇచ్చిన ధర్మం ఇస్లాం. ఇస్లాం స్త్రీకి ఆస్తి హక్కునిచ్చింది. వితంతు వివాహాల్ని ప్రోత్సహించింది. "ధర్మం ప్రకారం పురుషులకుగల అన్ని హక్కులు మహిళలకూ ఉన్నాయని పవిత్ర ఖురాన్ స్పష్టంగా చెపుతుంది. మొత్తం పురుషాధిక్య వ్యవస్థలో స్త్రీల హక్కులు కొల్లగొట్టబడుతున్న మాట వాస్తవం. దీనికి ముస్లిం పురుష సమాజం అతీతమేమీ కాదు. కొంతమంది ముస్లిం పండితుల మత ఛాందసం కూడా ముస్లిం స్త్రీల పట్ల ఇబ్బందికరంగా మారిందనేది నిజమే. కానీ హిందూ - క్రైస్తవ సమాజాల్లో స్త్రీ ఏ విధమైన పరిస్థితులు ఎదుర్కొంటుందో ముస్లిం స్త్రీ కూడా అదే పరిస్థితిని ఎదుర్కొంటుంది. అంతేకాని ముస్లిం స్త్రీలు మాత్రమే అణిచివేయబడుతున్నారనే గోబెల్స్ ప్రచారాన్ని మేం ఒప్పుకోం. అలీ రాసిన వ్యాసాన్ని ఒక సనాతన ముస్లిం రాసిన వ్యాసంగా పరిగణించటమే తప్పు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత బలీయమైన శక్తులు ఇస్లాంపై కత్తికట్టి ముస్లిం సంస్కృతిని పై దాడి చేస్తున్న సందర్భంలో ఒక మైనార్టీ ముస్లిం తన సంస్కృతి గురించి ఆందోళన చెందడంలో విపరీతమేముంది? తెలుగు సాహిత్యంలో కొంతమంది ఆలోచనా ధోరణి ఎలా వుందంటే ముస్లిం సాహిత్యకారులు ఎప్పుడూ తమ సంస్కృతిని తిట్టుకుంటూ తమ విశ్వాసాలకు దూరంగా వుండాలనే భావనగా ఉంది. ఓ వైపు యూరప్ సాంస్కృతిక సామ్రాజ్యవాదం అన్ని ఆసియన్, ఆఫ్రికన్ సంస్కృతుల్ని తుడిచిపెడ్తుంటే పీడిత వర్గాలన్నీ తమ ఉమ్మడి సాంస్కృతిక విలువల్ని నిలబెట్టుకోవాల్సిన తరుణంలో యూరప్, జియోనిస్టు శక్తుల తరహాలో కొంతమంది ముస్లిం సంస్కృతిపై దాడి చేస్తున్నారు. దీనిని ఇస్లాం వాద కవులు, రచయితలుగా మేం ఖండిస్తున్నాం. ఇప్పుడు అమెరికన్ సామ్రాజ్యవాదంపై జరుగుతున్న పోరాటంలో ముందువరుసలో నిలబడ్డది 'ఇస్లాం' అని వీళ్లు గుర్తెరగాలి.

చివరగా ముస్లింలుగా మేం చెప్పేదొక్కటే. శ్రీనివాస్‌జీ! మీరీ కథను మాపై ద్వేషంతోనో, కుట్రపూరితంగానో రాశారని మేం భావించట్లేదు. కాకపోతే ఇస్లాం వ్యతిరేకశక్తులు సృష్టించే 'ఇస్లామోఫోబియా'ను మీవంటి రచయితలు అర్థం చేసుకోవాలనేదే మా ఆశ. ఇప్పటికీ మేం అంతో ఇంతో కొన ఊపిరితో జీవించగల్గుతున్నామంటే మీ వంటి సెక్యులర్ ఆలోచన కల్గిన మేధావులు ప్రజలవల్లే. కనుక మీరే ముస్లిం సంస్కృతిపై దాడి చేస్తే మేం ఎవరికి చెప్పుకోవాలి! అన్నట్టు మీరీ కధకు పెట్టిన పేరే తప్పు. ఇస్లాంలో స్త్రీలు తీసుకునే విడాకుల్ని 'తలాక్' అనరు. 'ఖులా' అంటారు.

ఆమె... తలాక్ అనాలి - ఇవాల్టి సందర్భం

ఇస్లాం జీవితాచరణ గల ఒక ముస్లిం స్త్రీ, తన సంక్లిష్ట జీవితానుభవంలోంచి తీసుకున్న నిర్ణయంగా 'ఆమె... తలాక్ అన్నది' అనే కథను వడ్డెబోయిన శ్రీనివాస్ మలిచాడు. ఇస్లాం మతం ప్రవచించిన 'షరియత్' స్త్రీ, పురుష సంబంధాలను ఎలా నిర్వచించింది అనే దాంతో సంబంధం లేకుండానే శ్రీనివాస్ ఈ కథను రాశాడు. కథలోని 'ఆమె'... ఒక ముస్లిం స్త్రీ కాబట్టి, ఏది ఏమైనా సరే తన నిర్ణయాధికారంగా 'ఆమె... తలాక్ అనకూడదు' అన్నది ప్రధాన అభ్యంతరం.

ముందుగా చర్చలో ప్రస్తావనకు వచ్చిన ఇతర విమర్శలను పరిశీలిద్దాం. తర్వాత షరియత్ నిబంధనలను అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.

రచయితకు స్పష్టత లేదని, సాహితీ దృక్పథం లేదని, ముస్లిం జీవిత విశ్లేషణ లేదని, హిందూ జీవిత వర్ణన అతిగా ఉందని విమర్శలో ప్రధానంగా ముందుకు వచ్చిన అంశాలు.

కథ పరంగా చూస్తే, ఆమె తలాక్ చెప్పడం పాత్రోచితమైందా? కాదా? పాత్ర సమకాలీన పరిస్థితులలో ఏ కాస్తనైనా ఎదుగులను కనబరిచిందా? లేదా? కథ ఉండవలసిన పరిమితుల్లో ఉందా? లేదా? వంటి అంశాలను పరిశీలిద్దాం. అట్లాగే భావ ప్రకటనకు సంబంధించిన లోపాలేమైనా ఉన్నాయేమో చూద్దాం. అట్లా చూసినపుడు రామశాస్త్రి పాత్ర చిత్రణ ఒక వర్గానికి నచ్చకపోవచ్చు. అట్లాగే రజియా తన సంచిలోంచి ఖురాన్ తీయడం లాంటివి మరో వర్గానికి నచ్చకపోవచ్చు. అయినా మత ప్రస్థావన వచ్చాక పదాల గారడి పనిచేయకపోవచ్చు. ఇక్కడ భావనలు ముఖ్యం. పరస్పర విరుద్ధ మత భావనలు గల సుల్తానా, రామశాస్త్రిలు మతపరమైన ఇబ్బందులున్నప్పటికి ఒక్కటయ్యారు. భౌతిక, సామాజికపరమైన కారణాలేవో ఇందుకు దోహదం చేసి ఉండొచ్చు. ఇటువంటి వివాహం 'ముస్లిం సంస్కృతిని కలుషితం చేస్తుంది' అనే విమర్శను ఎదుర్కొన్నప్పటికీ, వైషమ్యాలను పరిష్కరించుకుంటే యిది సామాజిక ప్రగతికి దోహదం చేసే ఉదాహరణ. అయితే వీరిద్దరి మధ్యగల 'విరుద్ధ భావనల ప్రకోపం' వంటిది కథాంశం కాదు. కాని ఇది కథలోని పాత్రల చలనానికి దోహదం చేస్తుంది. అసలు కథ ఒక ముస్లిం స్త్రీ కనీసం తన వయసుడిగిన తర్వాతనైనా మతాంతర వివాహం చేసుకున్నటువంటి తన స్వంత కూతురి దగ్గర స్వేచ్ఛగా ఉండలేని స్థితిలో ఉంటూ.... అట్లా ఉంటున్న దశలో భర్త చేత కుఫ్ఫార్ (విశ్వాసఘాతకి)గా చీత్కరింపబడుతున్న స్థితిలో తన భర్తకు తలాక్ చెప్పడం. అంతేకాక ఇరుమతాల పెద్దల తీర్పు కారణంగా తన కూతురి కాపురం కూలిపోతున్న సందర్భంగా, ఆ కాపురాన్ని నిలబెట్టడం కోసం కూడా ఆమె తన భర్తకు తలాక్ చెప్పింది.

ఈ కథాంశానికి సంబంధించి 'మత, భౌతికవాద తదితర దృక్పథాల సంఘర్షణ' వంటి పదాల ఘాటుతో వెల్లువెత్తిన విమర్శలో... 'దృక్పథాలన్నింటిని నిబిడీకృతం చేయడం' అంటే ఏమిటో గాని... కథలోని పాత్రల ద్వారానే రచయిత తను ఎంచుకున్న సింగిల్ పాయింట్‌ను తెరమీదికి ప్రాజెక్ట్ చేశాడు. ఇంకో విమర్శ మరోలా సాగింది. 'పితృస్వామిక లక్షణాలను సూటిగా

బహిర్గత పరచాలని' అంటూనే సెంటిమెంట్‌గా పేర్కొన్న మతాచారానికి ప్రతిపత్తి లభించాలనే ధోరణిలో ఒక 'సెల్ఫ్ కాంట్రాడిక్టరీ'గా చేసిన విమర్శ ద్వారా రచయితకు ఏం ప్రభోదించాలనుకున్నట్లు? ఆమె.... తలాక్ చెప్పడం పితృస్వామిక లక్షణాన్ని సూటిగా వ్యతిరేకించినట్లా? లేక మరుగుపరిచినట్లా? అలాగని శ్రీనివాస్ వ్యక్తీకరణలో వైరుధ్యాలు లేవని కాదు. ఆ మాటకొస్తే ప్రారంభంలోనే 'తీస్‌సాల్ జీవితం.... ఎంత తేలిగ్గా... ఏ బాధా లేకుండా' అంటూనే 'తీస్ సాల్... నేనొక బానిసను... నేనొక వెట్టి మనిషిని' అంటూ రజియా గతాన్ని నెమరు వేసుకోవడాన్ని పరస్పర విరుద్ధ పదాలతో వర్ణించాడు. అంతమాత్రాన రజియా గుండెల్లో గూడుగట్టుకున్న దుఃఖాన్ని కళ్ళకు కట్టడంలో ఏర్పడ్డ ఇబ్బందేమీ లేదు. ఈ క్రమంలో అవలోకిస్తే రచయిత ఎక్కడా స్థూలంగా స్పష్టతను కోల్పోలేదు. అంతకు మించి తన ప్రాపంచిక దృక్పథాన్ని వీడినట్లూ అన్పించలేదు. అందువల్లనే కథా వస్తువుకు తగిన న్యాయం జరిగిందనిపించింది.

ఇంతకి ఆమె.... తలాక్ చెప్పొచ్చా? లేదా? షరియత్ ఏం చెబుతోంది?

షరియత్ ప్రకారం ముస్లిం స్త్రీ, తన భర్త ఎన్ని చిత్రహింసలు పెట్టినా 'తన ఇచ్ఛగా తాను' విడాకులు ఇస్తున్నాను అని ప్రకటించకూడదు. అంతగా భర్తమీద అసమ్మతి ఉంటే, ఒక ఉన్నతాధికారికి విజ్ఞప్తి చేసుకునే పద్ధతిలో నాకు తలాక్ ఇప్పించమని ఒక 'ఖులనామా' అనబడే దరఖాస్తును చేసుకోవాలి. కాని భర్తమాత్రం యధేచ్ఛగా, భార్య తన ఇష్టానికి వ్యతిరేకంగా నడుచుకున్నట్లు అనుమానమో, అభిప్రాయమో కలిగినంతనే 'తలాక్' అనెయ్యొచ్చు. సీమాంతరాల ఆవల్నించి ఫోన్లో కూడా 'తలాక్' చెప్పొచ్చు. ఇది ఎటువంటి భావజాలాన్ని సూచిస్తున్నది? షరియత్‌లో చెప్పబడిన ఈ నిబంధన ఎవరికి ఆధిపత్యానిస్తున్నది? ఎవరికి పీడనను కలిగించే విధంగా ఉన్నది? ఇట్లా షరియత్‌లో ఏదేని ఒక నిబంధన ఇబ్బందికరంగా ఉంటే, దాన్ని మానవీయం చేసే ప్రయత్నం ఎందుకు చేయకూడదు?

ఇవ్వాళ గ్లోబల్ పులిలాగా విస్తరిస్తున్నటువంటి సామ్రాజ్యవాద పెత్తనాన్ని ఇస్లామిక్ చైతన్యం అత్యంత దృఢచిత్తంతో ఎదుర్కొంటూ సమర్థవంతంగా త్రిప్పికొడుతూ ఉన్నది. అటువంటి ఇస్లామిక్ సంస్కృతిని ప్రేమించే మనం తన సహచరిణిని పిల్లికూనను చేసే విధంగా, పురుషుడి ఎదురులేని ఆధిపత్యాన్ని సుస్థిరం చేసే నిబంధన అమలు జరగాలని అనుకోవడం న్యాయమేనా? సహజంగానే, సామ్రాజ్యవాద దురహంకారి అయిన బుష్‌ను ముస్లిం తన ఇంట్లో తానొక 'బుష్‌గాడు' కావాలని అనుకోడు. అట్లాగే హైందవ ఆధిపత్య భావజాలాన్ని ఈసడించుకునే ముస్లిం మరోరూపంలో అటువంటి ఆధిపత్య భావజాలాన్నే తన భార్యమీద ప్రదర్శించాలని అనుకోడు. అంతేకాక ఆగ్దీపేటల మీద భాజాసాబ్ సదారత్‌లో ఖయామత్ దాకా సర్వవేళ, సర్వావస్థలందు ఒక సమానత్వ ప్రాతిపదిక మీద భార్యకు తోడూ నీడగా ఉంటానని నలుగురి సమక్షంలో వకీలుసాబ్ నిఖానామాపై సంతకం చేసిన ముస్లిం షౌహర్ తన ప్రమాణాలన్నింటిని గట్టున పెట్టి పెళ్ళాం మీద పెత్తనం చెయ్యాలని అనుకోడు. షరియత్ నిబంధనకు, నిఖానామాపై తాను సంతకం చేసిన బాసలకు వైరుధ్యం ఏర్పడిన సందర్భంలో ఆమెకు గల ప్రజాస్వామిక ఆకాంక్షల్ని, సహజసిద్ధమై హక్కుల్ని అర్థం చేసుకుంటాడు. ఇట్లా ఆలోచించినపుడు ఒక అసమ సంబంధంలో ఇమడలేనపుడు - తాను కోల్పోయిన సమానత్వ హోదాను పునరుద్ధరించుకొని 'ఆమె... తలాక్ అన్నందుకు' 'ప్రపంచం తల క్రిందులు అయిపోద్ది' అని ఏ ముస్లిం మేధావి బెంబేలు పడడు. పడకూడదు.

ఈ మధ్యనే లక్నో హైకోర్టు కూడ ముస్లిం స్త్రీ తలాక్ చెప్పొచ్చునంది. షియా పెద్దలు సైతం ఆమె తలాక్ చెప్పొచ్చునని వెసులుబాటు కల్పించారు. ఇటువంటి స్థితిలో సున్ని ముస్లిం పెద్దలారా! ఫత్వాలు జారీ చేసే ముందు కాస్త ఆలోచించండి. బానిస సంబంధాల రద్దు, అలాయ్ భలామ్ సంస్కృతి, ఆత్మీయ సంబంధాల పునరుద్ధరణ వంటి భావనలే సూఫీ తత్వ సారమని గ్రహించండి.

ఎవరేమన్నా, ఇది ఇవ్వాల్టి ముస్లిం స్త్రీల అంతరంగిక ఆకాంక్ష. కాదంటే, షహ్‌నాజ్ ఫాతిమా చెప్పినట్లు 'ఆమె చేయని నేరానికి జీవితకాలం శిక్షించబడే ఖైదీ' కావాల్సిందేనా? లేదంటె మహెజబీన్ కవితలోని 'రసోమిసుర్‌లో కబాబ్‌లా'.... 'ఆమె జీవితం మాడి మసై పోవాల్సిందేనా?' ఈ 'నేపథ్యంలో 'పర్సనల్ లా' పై షంషాద్‌బేగం వేస్తున్న ప్రశ్నలను అర్థం చేసుకోవాలి.

అట్లా అర్థం చేసుకున్నప్పుడు.... సహచర ధర్మం [illegible]. సహజీవన సౌజన్యం పునరుద్ధరణ జరగనప్పుడు, సహచరిణిగా తనహోదాకు, ఆత్మగౌరవానికి భంగ కలిగినపుడు... కనీసం తన మిగతా జీవితాన్నైనా తన స్వయం నిర్ణయానుసారం జీవించడానికి ఆమెకు... తలాక్ అనే స్వేచ్ఛ ఉండాలి. అది ఇవ్వాల్టి సందర్భంలో అవసరమైనటువంటిది, అనివార్యమైనటువంటిది.

అబ్దుల్ బాసిత్,

గాజులు

మూలం : బాబా నాగార్జున్

అతను ప్రయివేటు బస్సు డ్రయివరైతే మాత్రం ఏమిటి?
ఓ ఏడేళ్ళ అమ్మాయికి ముద్దుల తండ్రి
అతని ముందు గేర్ పైన
నాలుగు గులాబీ రంగు గాజులు వేలాడుతున్నాయి
కదిలే బస్సు కదలికలకు తాళం వేస్తున్నట్టు
అవి అటూ ఇటూ ఊగుతున్నాయి

నేను కాస్తా ముందుకు వంగి
అతనివైపు చూసి అడిగాను
తిప్పివున్న మీసాల గర్వంతో కఠినంగా కనిపించే
ఆ మధ్య వయస్కుడు మెత్తని గొంతుతో చెప్పాడు
మర్యాద ఒలకబోసాడు

అవునండయ్యా! ఇది మా చిన్నారి పనే
నేను చెబితే వింటుందండీ.... మొండిపిల్ల!
తన ఖజానా అంతా తెచ్చి
నా ముందు వేలాడదీసినట్టు
ఇదిగో ఇలా కట్టింది.
తన అయ్య కళ్ళముందు, అవి ఉండాలట!
సరే, ఆ అమాయకపు గాజులేం చేశాయి?
ఉండనిమ్మని ఉంచేశాను - అన్నాడతను

డ్రైవర్ నా వైపు చూశాడు
నేను అతణ్ణి చూశాను
అతని కళ్ళలో తండ్రి ప్రేమ తళతళలాడుతోంది
ఒక చిన్న ప్రశ్న అతనిలో భావోద్వేగానికి
కారణమయ్యింది కదా? అనుకున్నాను.

అతని కళ్ళు మళ్ళీ రోడ్డెక్కాయి -
నేను మళ్ళీ ముందుకు జరిగి అన్నాను
అవును బాబూ! నేనూ తండ్రినే
ఏదో ఊరికే అడిగాలే...
చిన్ని చిన్ని లేత చేతులకు
అందాన్నిచ్చే ఆ గులాబీ రంగు గాజులు
ఏ అమ్మాయికి మాత్రం బావుండవూ ?

హిందీ ప్రజాకవి, నవలాకారుడు బాబానాగార్జున్ అసలు పేరు వైద్యనాథ్ మిశ్రా. మైథిలీలో "యాత్రి" పేరుతో సంస్కృతంలో "చాణుక్య" పేరుతో బౌద్ధం స్వీకరించిన తరువాత, హిందీలో 'నాగార్జున్' పేరుతో రచనలు చేశారు. ఆత్మీయులు ఆయనను బాబా అని, నాగబాబా అని పిలుచుకున్నారు. ఆయనకు రాహుల్ సాంకృత్యాయన్ అంటే గొప్ప ఆరాధనా భావం. రైతులు ఉద్యమాలు నడిపి మూడుసార్లు జైలుకు వెళ్ళారు.

చాలా కాలం కమ్యూనిస్టుగా బతికారు. ఆయన రచనల్లో భూస్వామ్య దోపిడీకి, పీడనకు లోనైన రైతుల, కూలీల, దళితుల పోరాటాలు; పెత్తందార్ల చేతుల్లో నలిగిపోయిన స్త్రీల కడగళ్ళు వర్ణించారు. అభ్యుదయ, ప్రగతిశీల, విప్లవ రచయితలందరూ కవిత్వంతోపాటు వచనం కూడా విరివిగా రాయాలని ఆయన యువ రచయితలకు పదే పదే ఉద్బోధించే వారు. తన ఎనభైవ ఏట *1998* నవంబర్ *5*న కన్నుమూశారు. ఈయన స్మృతిలో లోగడ 'ప్రజాసాహితి' తెలుగు సాహిత్య మాసపత్రిక ఒక ప్రత్యేక సంచికను వెలువరించింది.

పరిచయం, అనువాదం : **డా.దేవరాజు మహారాజు**

అమెజాన్ ఆదివాసులిపుడు మాట్లాడుతున్నారు

కమాలుర్రెమెహింకు : మేము మా సమస్యల్ని ప్రపంచం దృష్టికి తీసుకురావడానికి మా ప్రాంతమైన 'జింగూ'ను వొదిలి ఇక్కడ యూరప్‌కివొచ్చాం.

మా ప్రాంతంలో మేమెంతగానో ప్రేమించుకునే జీవనది 'జింగూ' ఇపుడు పూర్తిగా కలుషితమైపోయింది. దీనికంతటికీ కారణం ఆ తెల్లవాళ్ళే. వాళ్లు వ్యవసాయంపేరిట మీద మా ప్రాంతంలోకి జొరబడి మా వనరుల్ని కొల్లగొడ్తున్నారు. మా నదిలోకి చెత్తాచెదారం, రబ్బాటిళ్ళు, ఖాళీక్యాన్లూ విసిరేసి దాన్ని కలుషితంజేస్తున్నారు. వాళ్లు అడవి జంతువుల్ని చంపి, వాటి అశేషాల్ని నది ఒడ్డున వొదిలేసిపోతున్నారు.

మేము మెహింకూ ప్రాంతవాసులం, స్నానానికీ, తాగటానికీ నది నీటినే వాడుతుంటాం. మేము చేపలు పట్టేవాళ్లం. మాకు ఎర్రటి మాంసమంటే అసలిష్టముండదు. మా 'జింగూ' నదిలో అన్ని రకాల చేపలూ దొరుకుతాయి. చేపలు మాకెంతో ఇష్టం. కాని, విషాదమేమంటే అవిప్పుడు క్రమంగా చచ్చిపోతున్నాయి.

మాకిప్పుడొక కొత్త సమస్య ఎదురయింది. ఇక్కడున్న కులియన్ నది మీద ఇపుడొక పెద్ద హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు కడ్తున్నారు. దాని నిర్మాణం అప్పుడే మొదలైంది కూడా. మా ప్రాంతం వాళ్లందరం వెళ్లి బ్రెసీలియాలో నిరసన దెలిపితే, వాళ్లు తమ అశక్తతను వెలిబుచ్చారు. ఇక చేసేదిలేక మేం డ్యామ్ కట్టేప్రాంతానికి వెళ్లి నిరసనలకు దిగాం. అయితే వాళ్లు మేమున్నంత వరకు పని ఆపేసి, మేం వెళ్లగానే పనిమొదలెట్టారు. వాళ్లసలు మమ్మల్నీ మా బాధల్నీ లెక్కచేయడం లేదు.

మాకీ డ్యామ్ వొద్దు. మాకు మా భూమిగావాలె. వాళ్ళు నీటిని కలుషితం జేయకుండా, జంతువుల్ని చంపకుండా, నదిలో విషపదార్థాల్ని వేయకుండా మేం అడ్డుకుంటాం

మాటోగ్రోసో రాష్ట్రానికి చెందిన గవర్నర్ ఒక ప్రజావ్యతిరేకి. ప్రజల అభీష్టాలు అతనికెంత మాత్రం పట్టవు. అతను మా ప్రాంతంలో సోయా (Soya)ను పెంచుతున్నాడు. మా ప్రజల్ని కూడా సోయా పెంచమని ఆజ్ఞాపిస్తున్నాడు. తద్వారా తను డబ్బు బాగా సంపాదించాలని ఆశ. ఈ 'సోయా' పెంచడం ద్వారా మాకున్న వనరుల్ని సగందాకా కొల్లగొట్టాలని అతని ఆలోచన. ఎంతయినా మాకు తెల్లవాళ్లంటే గౌరవం ఉన్నా వాళ్లకు మేమంటే గౌరవం లేదు.

మీరు మా ప్రాంతానికి వొస్తే, మీరొక అద్భుతమైన అడవిని చూస్తారు. కాలాలు మారిన కొద్దీ, ఒక్కొక్క అందాన్ని సంతరించుకుంటూ, చూసే వారికొక గొప్ప అనుభూతిని ప్రసాదిస్తుందది. అయితే ఇపుడది ప్రమాదంలో పడింది. అందుకే ఇపుడుమేం మా నదుల్నీ, మా అడవుల్నీ కాపాడుకోవడానికి నిఘా విభాగాల్ని ఏర్పాటు చేసుకున్నాం.

మా 'మెహింకూ' ప్రాంత వాసులకు మా భూమ్మీద హక్కు గావాలి. మా జీవితాన్నీ, మా సంస్కృతినీ రక్షించుకోవడానికి మా భూమి, మా నదీ మాకు గావాలి. ఇది మాకు చాలా ముఖ్యం.

మేం ఆడుతాం, పాడుతాం మేం చేపల్ని పడుతాం. మేం వెంటాడుతాం. మేం మొక్కల్నినాటుతాం. మేం నిత్య చైతన్యంలో ఉంటాం. ఇదే మా జీవనశైలి.

యూరప్ ప్రజలకి, మా మనవి ఏమిటంటే, దయచేసి మాకు సహకరించండి. మా బతుకుల్ని నాశనం చేసే ఈ డ్యామ్‌లను ప్రతిఘటించడానికి మీ సహకారం గావాలి.

వనరుల సంరక్షణ మాకేగాదు, మొత్తం మానవ ప్రపంచానికే అవసరం.

కవారీ ఎనావినీ నావె : ఒకప్పుడు ఇది మా ప్రాంతమని గర్వంగా చెప్పుకునే వాళ్లం. ఇప్పుడదొక కల. పచ్చని చెట్లుమాయమయ్యాయి. ఆ చెట్ల కుండే నిండైన తేనెతుట్టెలు కరువయ్యాయి. ఎగిరే గద్దలూ, పరుగులు తీసే అడవి పందులూ, గొంతులేసే కోతులూ ఏవీ కనబడవు. 'ప్రేటో'నది పూర్తిగా మృతనదిగా మారింది. ఈ తెల్ల భూకామందులు కంటికి కనబడ్డ ప్రతిదీ నాశనం జేస్తున్నారు.

ఒకప్పుడెంతో సుందరమైన మా దేశం ఇపుడొక మురికి ప్రాంతం. అసలీ ప్రాంతమంతా 'యాకియారిటీ' అనే మా పూర్వీకులకు చెందినది. ఈ నదులూ, ఈ చెట్లూ, ఈ చేపలూ మొత్తం వాళ్లకే సొంతం. మీరు వీటిని ధ్వంసం చేస్తే మా పూర్వీకులు మీ మీద ప్రతీకారం తీర్చుకుంటారు.

మేము ఈ ప్రాంతంలో పుట్టినప్పటి నుండే జీవిస్తున్నాం. ఒకప్పుడిక్కడ ప్రాంతీయేతరులు మచ్చుకైనా కనిపించేవారుకాదు. ఇపుడు భూకామందులు గుంపులుగా వొస్తున్నారు. వొస్తూ వొస్తూ తమ 'మురికి నాగరికత'ను వెంట దెస్తున్నారు. మాకు ట్రాక్టర్లు తెలియవు. చెట్లను వరుసగా కోసే 'చైను రంపాలు' తెలియవు. మాకు పశుపోషణ సరిగా తెలియదు. ఇపుడీ పట్టణవాసులు మాప్రాంతాలకు వస్తూ వస్తూ రోగాలూ రొస్టులూ వెంబడిదెచ్చారు. వాళ్లు మా నదుల్ని కలుషితం జేసి మాపక్షుల్నీ, మా జంతుజాలాన్నీ నాశనంజేశారు.

ఒక్కొక్క దురాక్రమణ దారుడు మా ప్రాంతంలో కాలుపెట్టే సరికి, మా ప్రాంతమంతా నాశనమై పోతోంది. మాకవసరం లేని పశువుల్ని ఇక్కడకు తీసుకొచ్చారు. మాకు వాటి ఎర్రటి మాంసం పడనేపడదు.

వీళ్ళంతా దుర్మార్గులు, మా అడవుల్ని నాశనం చేసి, మా నదుల్ని కలుషితం చేసి, గనుల కోసం భూమిని లోతుగా గాయం చేసి విధ్వంసం సృష్టిస్తున్నారు. అచ్చం బందిపోట్లలా వ్యవహరిస్తున్నారు. మాకు మా చెట్లను అమ్మడంగాని, మార్చడంగాని అసలిష్టముండదు. మేము తెల్లవాళ్ల వస్తువులను ఏవీ ముట్టుకోకున్నా, వాళ్ళు మాకు సంబంధించినవన్నీ ధ్వంసం చేస్తున్నారు.

మేం 'ఫ్యూనై' జిల్లాకేంద్రాలకు చాలా ఉత్తరాలే రాశాం. కాని ఫలితం లేదు. ఇక మేం అలిసిపోయాం. అధికారులు సరైన చర్యలు తీసుకోకపోతే మేమే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. "మేం ఈ బ్రిడ్జిల్ని కూల్చేస్తాం. భూకామందుల ఇళ్ళను తగులబెడ్తాం" అంటున్నారు మా ఎనావినె యువకులు. కాని ఇది అంత క్షేమకరంగాదు. తెల్లవాళ్లు తిరిగి ప్రతీకారం తీర్చుకుంటారు.

మాటోగ్రోసో గవర్నరు బ్లేరోమాగి ఒట్టి దుర్మార్గుడు, అతడు 'సోయా'ను మాత్రమే నాటాలని సూచిస్తాడు. అది మాకెవరికీ ఇష్టముండదు. ఈ సోయా వేసేవాళ్లు చెట్లనునరికి, అడివిని ఎంతో నాశనం చేస్తారు. జంతువుల్ని చంపుతారు. విమానాల ద్వారా విషాన్ని 'స్ప్రే' చేస్తారు. గవర్నరుకు ప్రజలకన్నా డబ్బే ముద్దు.

అసలీ ప్రభుత్వ సంస్థ లేంజేస్తున్నాయి? ఏమీలేదు. వాటికి కళ్లలేవు చెవుల్లేవు.

మేం 'ఎనావినే' వాళ్లం. మా అడవినెప్పుడూ నాశనం జేసుకోం. దాన్ని రక్షించుకొని, ఈ భూమినొక సుందర దృశ్యంగా చూడదల్చాం.

ఈ స్థానికేతరులు అన్నీ మానుండి గుంజేసుకుంటారు. మాకు చేపలుండవు. మా పూర్వీకులుండరు. క్రమంగా మా జాతి అంతరించిపోతుంది.

మాకు చాలా బాధగానూ, భయంగానూ ఉంది. మేం మా ఆలోచనల్నీ, ధ్వంసమౌతోన్న మాప్రాంత చిత్రాలనూ దూర ప్రాంతాలకు పంపదలిచాం. తద్వారా కనీసం మా గోడు వాళ్లకర్థమవుతుందని ఆశ.

ఇందుకు మీ యూరప్ వాసుల సహకారం మా కెంతగానో అవసరం...

(ది హిందూ పత్రిక సౌజన్యంతో అక్టోబర్ 2006న అచ్చయింది. తేదీ గుర్తులేదు.)

తెలుగు : **ఉదయమిత్ర**

తెలుగులో మార్క్సిస్టు సాహిత్య - విమర్శ పునరాలోచనలు

☆ ఎన్.వేణుగోపాల్

తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ కనీసం ఆరు దశాబ్దాలుగా ఉనికిలో ఉంది. 1930ల మధ్య నుంచీ తెలుగు సాహిత్యంలోకి మార్క్సిస్టు భావాల ప్రవేశం ఉన్నప్పటికీ, 1930లలోనే కొడవటిగంటి కుటుంబరావు రాసిన వ్యాసాలు, జి.వి.కృష్ణారావు రాసిన వ్యాసాలు, 'కావ్యజగత్తు' పుస్తకం ఉన్నప్పటికీ, మద్దుకూరి చంద్రశేఖరరావు రాసిన 1944లో అచ్చయిన రెండు వ్యాసాలు తెలుగులో మెరుగైన మార్క్సిస్టు సాహిత్యవిమర్శకు ప్రారంభంగా గుర్తించవచ్చు. వీటిలో ఒకటి కురుగంటి సీతారామయ్య రాసిన 'నవ్యాంధ్ర సాహిత్య వీధులు' మద్దుకూరి చంద్రశేఖర రావు రాసిన 1944 మార్చిలో వెలువడిన 'అభ్యుదయ రచనల సంపుటి'లో అచ్చయిన సమీక్షావ్యాసం. రెండవది 'సాహిత్యం-రాయిస్టులు' పేరుతో మద్దుకూరి చంద్రశేఖర రావు 'తెలుగుతల్లి' పత్రికలో 1944 డిసెంబర్ సంచికలో రాసిన వ్యాసం. వీటి కొనసాగింపుగా మద్దుకూరి చంద్రశేఖర రావు రాసిన 'ఆంధ్ర సాహిత్యంలో కొత్తపోకడలు', శ్రీశ్రీ రాసిన 'ఏది విప్లవ పంథా' వ్యాసాలను కూడా చెప్పుకోవాలి. ఇవి రెండూ కూడ 1946 అక్టోబరులో ప్రచురితమైన అభ్యుదయ మొదటి సంచికలో అచ్చయ్యాయి. వీటిలో 'ఆంధ్ర సాహిత్యంలో కొత్తపోకడలు'[1] వ్యాసంలో మార్క్సిస్టు దృక్పథం సరిగా వ్యక్తం కాలేదని, యాంత్రికంగా ఉందని పుచ్చల సుందరయ్య 1947లోనే విమర్శించారు. ఆ విమర్శతో ప్రత్యేకంగా కమ్యూనిస్టు పార్టీ ఒక సర్క్యులర్‌ను పార్టీ సభ్యులకు పంపింది. అంటే తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ ప్రవేశమే దృక్పథం గురించిన వివాదంతో మొదలయింది.

ఆరు దశాబ్దాలలో మార్క్సిస్టు సాహిత్య విమర్శగా గుర్తింపు పొందిన పుస్తకాలు దాదాపు వంద వెలువడి వుంటాయి. విడిగా పత్రికలలో ఐదువేల పేజీల విమర్శా రచనలు మార్క్సిస్టు సాహిత్య విమర్శగా పేరుతెచ్చుకొని ఉంటాయి. మద్దుకూరి చంద్రశేఖరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, జి.వి.కృష్ణారావు, కంభంపాటి సత్యనారాయణ, తాపీ ధర్మారావు, పాములపర్తి సదాశివరావు, కొడవటిగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, కె.వి.రమణారెడ్డి, తుమ్మల వెంకటరామయ్య, సోమసుందర్, రాచమల్లు రామచంద్రారెడ్డి, ఆరుద్ర, చేకూరి రామారావు, త్రిపురనేని మధుసూధనరావు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, వరవరరావు, వెల్చేరు నారాయణరావు, కేతు విశ్వనాథరెడ్డి, కె.కె.రంగనాథాచార్యులు, రంగనాయకమ్మ, అద్దేపల్లి రామమోహన రావు, సాదుం రామ్మోహన్, వై.విజయకుమార్, రాంభట్ల కృష్ణమూర్తి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, సి.వి.సుబ్బారావు, ఓల్గా, కె.బాలగోపాల్, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, జె.సి, వి.చెంచయ్య, జయధీర్ తిరుమలరావు, చేకూరి శ్రీనివాసరావు, ఆర్వియార్, బి.సూర్యసాగర్, సంజీవమ్మ, టి.ఎల్. కాంతారావు, ఎస్వీ సత్యనారాయణ, కాత్యాయనీ విద్మహే, పాపినేని శివశంకర్, కె.రాంమోహన్ రాయ్, తక్కోలు మాచిరెడ్డి, తెలకపల్లి రవి వంటి తెలుగు సాహిత్య విమర్శకులెందరో మార్క్సిస్టు సాహిత్య విమర్శకులుగానో కనీసం కొన్ని మార్క్సిస్టు సాహిత్య విమర్శా పరికరాలు ఉపయోగించిన విమర్శకులుగానో గుర్తింపు పొందారు, పొందుతున్నారు. మార్క్సిస్టు సాహిత్య విమర్శ పరికరాలను వినియోగించడంలో, దృక్పథ స్పష్టతలో వీరి మధ్య తరతమ బేధాలు, భిన్నాభిప్రాయాలు ఉండవచ్చుగాని వీరందరినీ ఏదో ఒక రూపంలో తెలుగు సాహిత్య విమర్శ రంగంలో మార్క్సిస్టు వైఖరికి ప్రతినిధులుగా చూసే సంప్రదాయం ఉంది. ఏడు దశాబ్దాలకు మించని చరిత్రగల ఒక సాహిత్యవిమర్శ రంగంలో కనీసం యాభైమంది పనిచేసి ఉండడం, దాదాపు వంద పుస్తకాలు వెలుడడం గణనీయమైన విషయమే.

ఇంత ఘనమైన చరిత్ర, సంప్రదాయం ఉన్నప్పటికీ, తెలుగులో అసలు మార్క్సిస్టు సాహిత్యవిమర్శ అంటే ఏమిటి? మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా దేన్ని గుర్తించాలి. మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా గుర్తించడానికి మౌలిక ప్రాతిపదికలేమిటి అనే ప్రాథమిక విషయాలలోనే విస్పష్టమైన, సర్వాంగీకారమైన అభిప్రాయం ఏర్పడినట్టులేదు. సాహిత్య విమర్శకుడు మార్క్సిస్టుగా గుర్తింపు పొంది ఉన్నట్టయితే అతను రాసిందల్లా మార్క్సిస్టు సాహిత్య విమర్శగా చలామణీ అయిపోయిన సందర్భాలు ఉన్నాయి. మార్క్సిస్టు సాహిత్యధార నుంచి, మార్క్సిస్టు సాహిత్యకారుల సంఘాల నుంచి వెలువడిన సాహిత్య విమర్శ అంతా మార్క్సిస్టు సాహిత్య విమర్శగా పరిగణించబడింది. మార్క్సిస్టు సాహిత్యధారలో వచ్చిన పుస్తకాలపై విమర్శ మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా గుర్తింపు పొందింది. మార్క్సిస్టు రచయితలైనా సాంప్రదాయక అంశాలపైన, సాంప్రదాయక రచయితలపైన, పుస్తకాలపైన రాసినప్పుడు అది మార్క్సిస్టు సాహిత్య విమర్శగాగుర్తింపు పొందడం ఇబ్బంది అయింది. కొన్ని సందర్భాలలో కేవలం మార్క్సిస్టు సాహిత్య విమర్శలోని పారిభాషికపదాలను వాడడమే మార్క్సిస్టు సాహిత్యవిమర్శగా గుర్తింపు పొందింది. మార్క్సిస్టు సాహిత్య విమర్శ చెప్పే విషయాలనే చెప్పినప్పటికీ, ప్రత్యేక పదజాలంతో చెప్పకపోతే అది మార్క్సిస్టు సాహిత్య విమర్శగా గుర్తింపు పొందలేదు. తాము రాస్తున్నది మార్క్సిస్టు సాహిత్య విమర్శ అనుకున్నవాళ్లు కూడ తమ రచనలలో మార్క్సిస్టేతర, అమార్క్సీయ సాహిత్యవిమర్శా పరికరాల, భావనల సాయం తీసుకున్నారు. మార్క్సిస్టు సాహిత్య విమర్శకులమని తమనుతాము గుర్తించుకున్న వాళ్లలో కూడ అన్ని సందర్భాలలోనూ దృక్పథస్పష్టతలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే మార్క్సిస్టు సాహిత్య విమర్శ అంటే ఏమిటి అనే ప్రశ్నకు సూటి సమాధానాన్ని తెలుగు సాహిత్యలోకం ఇంకా తయారుచేయలేదు. ఆ దిశగా చెప్పుకోదగిన, గౌరవించదగిన ప్రయత్నాలు జరిగినప్పటికీ, ఆ ప్రయత్నాలన్నిటినీ సమన్వయపరచిన సమగ్రకృషి జరగలేదు.

ఇందుకు కారణమేమిటో గుర్తించాలంటే, అసలు మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ప్రాతిపదికలు ఏమిటో, అవి తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో వ్యక్తమయ్యాయో లేదో పరిశీలించాలి.

ఒక సాహిత్య విమర్శ రచనను మార్క్సిస్టు సాహిత్య విమర్శగా గుర్తించడానికి కనీసం ఐదు ప్రధాన ప్రాతిపదికలు ఉండాలి. అవి. 1 మార్క్సిస్టు సాహిత్య విమర్శా సిద్ధాంతం, 2. మార్క్సిస్టు సాహిత్య విమర్శా పద్ధతి, 3 సమాజ సాహిత్య సంబంధాల అవగాహన, అది విమర్శలో వ్యక్తమయ్యే తీరు 4. వస్తుశిల్పాల చర్చ, విశ్లేషణ, 5 సాహిత్యానికిగల తక్షణ - దీర్ఘకాలిక ప్రయోజనాల స్పృహ. ఈ ఐదు ప్రాతిపదికలలోనూ తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో కొంత కృషి జరిగినప్పటికీ, జరగవలసిన కృషి ఎంతో ఉంది.

మార్క్సిస్టు సాహిత్య విమర్శా సిద్ధాంతం

తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శ ఎక్కువగా పుస్తక సమీక్షల రూపంలో అనువర్తిత, అన్వయ విమర్శగానే సాగింది గాని సాహిత్య విమర్శా సిద్ధాంతం వైపునుంచి ఎక్కువ కృషి జరగలేదు. అసలు సైద్ధాంతికస్థాయిలో మార్క్సిస్టు సాహిత్యవిమర్శా పద్ధతి ఏమిటన చర్చ ఎక్కువగా జరగలేదు.

నిజానికి మార్క్సిస్టు సాహిత్య విమర్శను ఇతర సాహిత్య విమర్శల నుంచి

1. 'ఆంధ్ర సాహిత్యంలో కొత్తపోకడలు' తెలుగులో తొలి మార్క్సిస్టు విమర్శా వ్యాసమని రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి రాశారు (చర్చ పేజి.171) ఈ వ్యాసం మొదట 1946 మే-జూన్‌లలో జరిగిన పెదపూడి సాహిత్య పాఠశాలలో ప్రసంగంగా సాగి, 1946 అక్టోబర్‌లో అచ్చయింది. అయితే విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 'చంద్రం వ్యాసావళి' (1974)లో వ్యాసం అచ్చువివరాలలో పొరపాటును 1948 అక్టోబర్ అని వచ్చింది.

వేరుచేసేది దాని సిద్ధాంతం, దాని పద్ధతి. సాహిత్య సృజన గురించీ, సమాజ సాహిత్య సంబంధాల గురించీ, సాహిత్య ప్రభావం గురించీ, సాహిత్య ప్రయోజనం గురించీ మార్క్సిస్టు దృక్పథంలో ప్రత్యేకమైన సైద్ధాంతిక అవగాహన ఉంది. ఆ అవగాహన మార్క్స్ ఎంగెల్స్‌ల రచనలతోనే ప్రారంభమై గత నూట అరవై సంవత్సరాలలో ఎంతగానో విస్తరించింది. సోవియట్ యూనియన్, చైనా వంటి దేశాలలో ఆచరణలోకి వచ్చి, ఆచరణ క్రమంలో మార్పులు చేర్పులకు గురయిన సాహిత్య సైద్ధాంతిక అవగాహన ఒకవైపు ఉండగా, జర్మనీ, ఫ్రాన్స్, హంగరీ, బ్రిటన్, చెకోస్లవేకియా, అమెరికాలలో విశ్వవిద్యాలయాలలోనూ, కమ్యూనిస్టుపార్టీలలోనూ మేధావుల విశ్లేషణా కృషిలో అనేక కొత్త అంశాలు, ఆలోచనలు వెలికివచ్చాయి. ఇరవయ్యో శతాబ్ది పొడవునా అద్భుతంగా వికసించిన ఈ మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాన్నంతా మదింపు వేసి, మన సామాజిక, సాంస్కృతిక ప్రత్యేకతలతో జతజేసి మనకై మనం ఒక విస్పష్టమైన మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాన్ని రూపొందించుకోవలసి ఉంది. అందులో మార్క్సిస్టు దృక్పథంలోని సార్వజనీన, సార్వకాలీన అంశాలూ ఉంటాయి. వాటిలో అదనంగా వచ్చి చేరే అంశాలూ ఉంటాయి. మన సమాజ, సాహిత్య ప్రత్యేకతలను వివరించగల ప్రత్యేక అంశాలూ ఉంటాయి. తెలుగులో అటువంటి మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతం అభివృద్ధి చేయడానికి అవసరమయిన కృషి చాల తక్కువ జరిగింది.

అటువంటి స్వతంత్ర సాహిత్య సిద్ధాంతం రూపొందడానికి కృషి తగినంతగా జరగకపోవడం మాత్రమేకాదు. ఇతరభాషలలో జరిగిన అటువంటి కృషిని తెలుగులోకి అనువదించే ప్రయత్నం కూడ తగినంత జరగలేదు. సాహిత్యం గురించి లెనిన్ ఒక ప్రత్యేక సందర్భంలో ప్రకటించిన అభిప్రాయాలు, విముక్త ప్రాంతంలో ఎర్రసైనికులను, రచయితలను ఉద్దేశించి మావో చేసిన ప్రసంగం మినహా, మొత్తంగా సాహిత్యం గురించి మార్క్సిస్టు సైద్ధాంతిక అవగాహనలు తెలుగులోకి ఇంతవరకూ రానేలేదు. మార్క్స్ ఎంగెల్స్‌లు సాహిత్యం గురించి వెలిబుచ్చిన అద్భుతమైన విశ్లేషణలుగానీ, స్థూలంగా మార్క్సిస్టు అవగాహనా చట్రంలోనే అయినప్పటికీ విభిన్నమైన పద్ధతిలో ప్లెహనోవ్, మయకోవ్‌స్కీ, లూనాచార్‌స్కీ, క్రిష్టఫర్ కాడ్వెల్, ఎర్నెస్ట్ ఫిషర్, జార్జి లూకాచ్, అల్తూజర్, బెర్టోల్ట్ బ్రెఖ్ట్, జీన్‌పాల్ సార్త్రే, అలెక్ వెస్ట్, హోవార్డ్ ఫాస్ట్, రేమాండ్ విలియమ్స్, వాల్టర్ బెంజమిన్, టెర్రీ ఈగిల్‌టన్, ఫెడరిక్ జేమ్సన్ వంటి ఎందరో మేధావులు చేసిన సాహిత్య విమర్శ చర్చగానీ, కొత్తభావాలు గానీ, కనీసం వాటి పరిచయాలుగాని తెలుగులోకి రానేలేదు. (మాక్సిం గోర్కీ, రాల్ఫ్‌ఫాక్స్, ఇల్యా ఎహ్రెన్ బర్గ్, జార్జి థామ్సన్‌ల రచనలలోంచి కొన్ని మాత్రం తెలుగులోకి రావడం మినహాయింపు[2]. ఆయా సైద్ధాంతిక చర్చల మౌలికాంశాలు, భావనలు పరిచయం కాలేదుగాని, ఆ చర్చలలోని వివాదాలు, అనవసర అంశాలు మాత్రం పరోక్షంగా చిలవలు పలువలతో తెలుగు చర్చా సంప్రదాయంలోకి వచ్చిచేరాయి. సిద్ధాంతం మీదకన్నా ఎక్కువ పూనిక వివాదం మీద ఉండిందనేది ఒక చేదు వాస్తవం.

ఈ విధంగా తెలుగులో మార్క్సిస్టు సాహిత్య విమర్శగా పేరు తెచ్చుకున్న రచనలకు అవసరమైన తాత్విక పునాది, సైద్ధాంతిక భూమిక కొంత సమస్యాత్మకంగానే ఉంది. అందువల్ల దాదాపుగా మినహాయింపులు లేకుండా "మార్క్సిస్టు సాహిత్య విమర్శకుల" లోనూ ఎక్కడో ఒకచోట సైద్ధాంతిక పటుత్వం లేకపోవడం కనబడుతుంది. మన సమాజంలో మార్క్సిస్టులుగా మారదలుచుకున్నవారి మీద ఏదో ఒక రూపంలో హైందవ బ్రాహ్మణ్య ఆలోచనల ప్రభావం కొనసాగినట్టుగానే మార్క్సిస్టు సాహిత్య విమర్శకులు కాదలచుకున్న వారిమీద కూడా ఆలంకారిక సాహిత్యావిమర్శా పరికరాల గతకాలపు భారం కొనసాగడం కనబడుతుంది. మరొక వైపు వారే పాశ్చాత్య సాహిత్య విమర్శ ముందుకు తీసుకొచ్చిన కొన్ని మిరుమిట్లుగొలిపే పరికరాల మోజులో పడి మార్క్సిస్టు దృక్పధపు మౌలిక పునాదులను విస్మరించడం కూడా కనబడుతుంది. అందువల్ల మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంత అవగాహన పటిష్టంగా ఉండవలసిన చోట, కొన్ని మార్క్సిస్టు భావాలు, కొన్ని ఆలంకారిక సాహిత్య సిద్ధాంత భావనలు, కొన్ని పాశ్చాత్య సాహిత్య సిద్ధాంత భావనలు, కొన్ని సాదాసీదా సాహిత్య ఆలోచనలు శాంతియుత సహజీవనం చేయడం కనబడుతుంది.

మార్క్సిస్టు సాహిత్య విమర్శా పద్ధతి

మార్క్సిస్టు సాహిత్యవిమర్శ కూడ ఇతర సాహిత్య విమర్శలలాగానే ఒక సాహిత్య రచనలోని వస్తువును, శిల్పాన్ని, ఉద్దేశ్యాన్ని, ప్రయోజనాన్ని, ప్రభావాన్ని పరిశీలిస్తుంది. రచనను వివరించడానికి, విశ్లేషించడానికి ప్రయత్నిస్తుంది. అంటే రచనను ఒక నేపథ్యంలో పెట్టి పాఠకులు ఆ రచనను గ్రహించే భూమికను విశాలం చేస్తుంది. స్థూలంగా చూసినప్పుడు మార్క్సిస్టు సాహిత్య విమర్శ కూడ ఇతర సాహిత్య విమర్శలలాగానే పనిచేస్తుందని అనిపిస్తుంది. కాని, మార్క్సిస్టు సాహిత్య విమర్శ స్పష్టంగా, విభిన్నంగా ఉండేది దాని సంవిధానంలోనే.

ఆ సంవిధానాన్ని నిర్ణయించేవి చారిత్రక, రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక కోణాలు. ఇతర సాహిత్యవిమర్శా రూపాలలో వీటిలోని ఒకటో రెండో కోణాలు ఉండవచ్చుగాని అవి కూడ సమగ్రంగా ఉండే అవకాశం లేదు. ఉదాహరణకు ప్రాచీన, అలంకారిక సాహిత్యవిమర్శలో చారిత్రక, రాజకీయార్థిక, సామాజిక కోణాలు లేవుగానీ, సాంస్కృతిక కోణం ఎక్కువగానే ఉంటుంది. అయితే, ఆ సాహిత్యవిమర్శలో సంస్కృతి అంటే ఏమిటని నిర్వచించే విషయంలో, సాంస్కృతిక కోణాన్ని ఆధ్యాత్మిక అర్థంలో నిర్వచించే విషయంలో సమస్యలు ఉన్నాయి. అట్లాగే సామాజిక శాస్త్రాల స్పర్శతో సాగే ఆధునిక సాహిత్య విమర్శలో సామాజిక, చారిత్రక, రాజకీయార్థిక కోణాలు ఎంతో కొంత కనబడవచ్చుగాని అవి సమగ్రంగానూ, ఒక మొత్తంగానూ ఉండే అవకాశం లేదు. మౌలిక ప్రశ్నల దగ్గరికి వెళ్లే అవకాశం లేదు.

మార్క్సిజమంటే సంవిధానమే అనే అతివాద సూత్రీకరణ చేసిన విశ్లేషకులు కూడ ఉన్నారుగాని, దానిలోని అతివాదాన్ని పక్కనపెట్టి, మార్క్సిస్టు పరిశీలనా విశ్లేషణా, పరివర్తనా క్రమంలో సంవిధానానికి చాలా ప్రాధాన్యత ఉందని గుర్తించవలసి ఉంది. ఒక వస్తువును పరిశీలించడంలో, విశ్లేషించడంలో, దానిలో మార్పుకు పునాది అయిన అంశాలను గుర్తించి ఎత్తిపట్టడంలో, ఆ పరివర్తనా అంశాలను సమర్థించి వాటి భవిష్యత్తును సూచించడంలో ఇతర అన్ని దృక్పథాల నుంచి మార్క్సిస్టు దృక్పథాన్ని ఆ సంవిధానమే వేరుచేసి చూపుతుంది.

మార్క్సిస్టు సంవిధానం ఏమిటి అనే అంశం మీద గత నూటయాభైఏళ్ళుగా చాలా చర్చ జరిగింది. జరుగుతోంది. ప్రధానంగా రాజకీయార్థిక శాస్త్రానికి అన్వయించి జరిగిన చర్చ నుంచి ఇతర శాస్త్రాలకు ఉపయోగపడే సంవిధానాన్ని రూపొందించడానికి కూడ ప్రయత్నం జరిగింది. ఆ చర్చ గురించి ఇక్కడ వివరంగా ప్రస్తావించనక్కరలేదుగాని, రూపం - సారం, నిర్దిష్టత - సాధారణీకరణ, చారిత్రక దృష్టి, వైరుధ్యాలు అనే నాలుగయిదు ప్రమేయాలు మార్క్సిస్టు సంవిధానంలో ప్రధానమయినవి. ఈ ప్రమేయాలన్నీ కూడ సాహిత్య విమర్శకు అన్వయించగలిగినవే.

అయితే, ఆరు దశాబ్దాల తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ఈ

2. తెలుగులో మొత్తంగా మార్క్సిస్టు భావాల విషయంలోనే ఈ సమస్య ఉంది. తెలుగులోకి మార్క్స్ కాపిటల్ రావడానికి ఐదు దశాబ్దాలు పట్టింది. ఏడు దశాబ్దాల తరువాత కూడ పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ, ది జర్మన్ ఐడియాలజీ, డైలెక్టిక్స్ ఆఫ్ నేచర్, ఆంటీ డూరింగ్, ఎ కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ వంటి మౌలిక సిద్ధాంత గ్రంథాలు తెలుగులోకి రాలేదు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, ఆయా దేశాల ఉద్యమాలలోనూ జరిగిన వివాదాలకు, చర్చోపచర్చలకు సంబంధించిన పుస్తకాలు మాత్రం తెలుగులోకి వెంటనే వచ్చాయి.

మార్క్సిస్టు సంవిధానాన్ని పరిశీలించడం, విమర్శించడం, విశ్లేషించడం, భవిష్యత్ రచనకు మార్గదర్శక ప్రాతిపదికలు సూచించడం అని అనుకుంటే, ఆ అన్ని పనులూ చేయడానికి ఉపయోగపడే మార్క్సిస్టు సంవిధానాన్ని వాడుకోకుండా, మార్క్సిస్టు సాహిత్య విమర్శ సాగిందంటే అది ఉండవలసినంత సమగ్రంగా లేదనే అనుకోవాలి. తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శ చాలా వరకు మార్క్సిస్టు సంవిధానం జోలికి వెళ్లకుండానే అంటే సాహిత్య విమర్శ చేయవలసిన పనులన్నీ చేయకుండానే ముగిసిపోయింది. ఎక్కువలో ఎక్కువ పరిశీలనను, వివరణను మాత్రం చేపట్టిందిగాని విమర్శ విశ్లేషణ, భవిష్యత్ సూచనలు జరగవలసినంతగా జరగలేదు.

రూపానికి సారానికీ మధ్య అంతరంలేకపోతే ఒక వస్తువును విశ్లేషించడానికి శాస్త్రం అవసరమే లేదని మార్క్స్ చేసిన మౌలిక ఆలోచనాస్ఫోరక సూత్రీకరణను తెలుగు సాహిత్య విమర్శకులలో చాలా మంది గుర్తించినట్టు కనబడదు. రూపం గురించీ, సారం గురించీ తగినంత లోతులకు వెళ్లకుండానే, ఉపరిశోధనలతోనే విమర్శ రాసి, అదే మార్క్సిస్టు సాహిత్య విమర్శ అనుకున్నవాళ్లు చాల మంది ఉన్నారు. సారం జోలికి పోకుండా రూపాన్ని తిరగరాసే సంప్రదాయం, రూపం గురించి ఎంతమాత్రం పట్టించుకోకుండా సారాన్ని వివరించే సంప్రదాయాలు తెలుగు విస్తృతంగానే ఉన్నాయి. మార్క్సిస్టు సాహిత్య విమర్శకులుగా పేరుతెచ్చుకున్న వాళ్లలో కూడ చాల మంది ఈ పనే చేశారు.

నిర్దిష్టత - సాధారణీకరణ,గురించి, వాటి అంతస్సంబంధాన్ని గురించి మార్క్సిస్టు సంవిధానం చేసిన అద్భుత సూత్రీకరణలెన్నో ఉన్నాయి. స్వయంగా మార్క్స్ ఈ ప్రమేయాన్ని పరిశోధనా పరికరంగానూ, వివరణ పరికరంగానూ ఎట్లా వాడుకోవచ్చునో చెప్పాడు. తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ఈ అంశం పొందవలసినంత గుర్తింపు పొందలేదు. ఒక రచన అనే నిర్దిష్ట వస్తువును తీసుకుని సాధారణీకరణ ఎట్లా చేయవచ్చును. ఆ సాధారణీకరణను మళ్లీ ఎట్లా నిర్దిష్టవస్తువులకు అన్వయించవచ్చును. అసలు సామాజిక నిర్దిష్టత సాహిత్య సాధారణీకరణగా ఎట్లా మారుతుంది. సాహిత్యంలోనూ, సమాజంలోనూ నిర్దిష్టతలకూ సాధారణీకరణలకూ ఉన్న గతితార్కిక సంబంధం ఎట్లా వ్యక్తవుతుంది అనేవైపు నుంచి సాహిత్య విమర్శ సాగిస్తే అద్భుతమైన నిర్ధారణలకు రావచ్చు.

అట్లాగే చారిత్రక దృక్పథం అనేది మార్క్సిస్టు సంవిధానంలో చాలా ప్రధానమైనది. అది ఏ పరిశీలనా వస్తువునైనా ఒక పూర్వరంగంలో ఉంచడానికి ఉపయోగపడుతుంది. అదే సమయంలో సాహిత్య విమర్శకు అత్యవసరమైన సాహిత్యానికి వనరుగా నిలిచే సామాజిక, రాజకీయార్థిక, సాంస్కృతిక నేపథ్యాన్ని గుర్తించడం చారిత్రక దృక్పథం సహాయంతోనే సాధ్యమవుతుంది. తెలుగు సాహిత్య విమర్శలో ఈ సంవిధాన పరికరాన్ని తగినంతగా వాడుకోలేదని అనిపిస్తుంది.

ఇక వైరుధ్యాలు, ఒకే వస్తువులో విరుద్ధాంశాల ఐక్యత, ఘర్షణ ప్రధానంగా తాత్విక ప్రమేయాలుగా కనిపించినప్పటికీ, ప్రకృతిలోనూ, సమాజంలోనూ, మానవమేధలోనూ జరిగే పరిణామాలన్నిటినీ అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే ప్రమేయాలు అవి. ఆ ప్రమేయాల్నీ సృజనాత్మకంగా ఉపయోగిస్తే ఒక సాహిత్య రచనను ఇంకా ఎక్కువగా అర్థం చేసుకోవడమూ, చేయించడమూ సాధ్యమవుతుంది. కాని తెలుగు సాహిత్య విమర్శలో ఈ ప్రమేయాన్ని వాడుకున్నప్పుడు యాంత్రికంగా వాడుకోవడమూ లేకపోతే అసలే వాడుకోకపోవడమూ జరిగింది.

సమాజ సాహిత్య సంబంధాలు

మార్క్సిస్టు సాహిత్యవిమర్శలో ప్రధానశక్తి సమాజ సాహిత్య సంబంధాలను అర్థం చేసుకోవడంలోనే, వివరించడంలోనే ఉంది. మిగిలిన అన్ని సాహిత్యవిమర్శ పద్ధతులూ సమాజానికి ఇవ్వవలసినంత ప్రాధాన్యం ఇవ్వవు. సాహిత్యానికి ఇవ్వవలసిన స్థానం కన్న ఎక్కువ స్థానం ఇస్తాయి. మార్క్సిజం మాత్రమే సమాజంలోని విభిన్న పార్శ్వాల మధ్య అంతస్సంబంధాలు ఏ పద్ధతిలో రూపొందుతాయో, వాటి మధ్య ఏయే రంగాలకు ఎంత స్థానం ఉంటుందో సరిగా వివరిస్తుంది. ఎ కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ ముందుమాటలో సుప్రసిద్ధమైన సూత్రీకరణలో పునాది - ఉపరితలం అనే ప్రతీకల ద్వారా మార్క్స్ ఈ అంతస్సంబంధాన్ని వివరించాడు. తర్వాత కాలంలో ఈ సూత్రీకరణకు తప్పుడు వ్యాఖ్యానాలు వచ్చినప్పుడు, స్వయంగా మార్క్స్ ఎంగెల్స్‌లు, ఆ తర్వాత ఎందరో మార్క్సిస్టు సిద్ధాంతవేత్తలు, సాహిత్య విమర్శకులు దాన్ని వివరించడానికి ప్రయత్నించారు.

ఆ చర్చలోకి ఇక్కడ పోనక్కరలేదుగాని, ఆ సూత్రీకరణను తెలుగు సమాజ ప్రత్యేకతకు అన్వయించి ఇక్కడ పునాది ఏమిటో చారిత్రక క్రమంలో ఆ పునాది ఎట్లా మారుతూ వచ్చిందో, ఆ మార్పులు వివిధ ఉపరితల రంగాలలో ఎట్లా ప్రతిఫలించాయో, అవి సాహిత్యంలో ఎట్లా వ్యక్తమయ్యాయో వివరించడానికి ఎంతో అవకాశం ఉంది. ఆ దిశగా చాలా తక్కువ ప్రయత్నం జరిగింది. తెలుగు సమాజ ప్రత్యేకతలు అన్నప్పుడు ఇక్కడి సమాజంలోని కుల, స్త్రీ - పురుష ప్రాంతీయ భాషా అస్తిత్వాల మధ్య అంతరాలు, అద్భుతమైన మౌఖిక సాహిత్య వారసత్వం, వెయ్యి సంవత్సరాలపాటు సాగిన రాజాస్థాన, మార్గ, అగ్రవర్ణ సాహిత్యం, రాజాశ్రయ సంప్రదాయానికి భిన్నంగా, సమాంతరంగా సాగిన దేశి, ధిక్కార, ప్రజా సంప్రదాయం, ఆధునికతా భావాల వల్ల రెండువందల సంవత్సరాల కింద ప్రారంభమై వేర్వేరు పాయలుగా సాగుతున్న ఉద్యమ సాహిత్యం వంటి అనేక అంశాలున్నాయి. వీటిలో ఏ విధమైన మార్క్సిస్టు సాహిత్య విమర్శను గొప్ప ముడిసరుకు కాగలదు. ఆరు దశాబ్దాల మార్క్సిస్టు సాహిత్య విమర్శా కృషి తర్వాత కూడ ఆ దృక్పథం నుంచి తెలుగు సాహిత్య చరిత్ర రచన జరగలేదంటే, సమాజ సాహిత్య సంబంధాల అధ్యయనంలో తెలుగు సాహిత్య విమర్శకుల అనాసక్తి కనబడుతుంది[3].

సమాజ సాహిత్య సంబంధాల గురించి మాట్లాడేటప్పుడు తప్పనిసరిగా వస్తుశిల్పాల చర్చ అవసరమవుతుంది. సాహిత్యానికి వస్తువును సమాజమే సమకూరుస్తుంది. శిల్పం ఒక చారిత్రక క్రమంలో, సామాజిక పరిణామ ఉత్పత్తిగా రూపొందుతుంది. అది ప్రయోగాల ద్వారా కొత్త అభివ్యక్తిని సంతరించుకుంటుంది. అందువల్ల సమాజ సాహిత్య సంబంధాల చర్చ, వస్తు శిల్పాల చర్చ ఒకదానితో ఒకటి అవినాభావంగా సాగవలసినవే. తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ఎక్కువ భాగం వస్తుశిల్పాల చర్చ తగినంత లోతుగా, విస్తృతంగా జరగలేదు గనుక, అది సమాజ సాహిత్య సంబంధాల చర్చదాకా విస్తరించలేదు. మార్క్సిస్టు సాహిత్యవిమర్శ వస్తువును మాత్రమే పట్టించుకుంటుందనే అపోహ వచ్చేంతగా వస్తువు మీద శ్రద్ధాసక్తులు, చర్చ, విశ్లేషణ జరిగాయి. మార్క్సిజం రూపవాదాన్ని వ్యతిరేకిస్తుందిగాని రూపాన్ని కాదు అని మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతకారులందరూ పదే పదే చెప్పిన విషయాన్ని పక్కనపెట్టి, రూపాన్ని వ్యతిరేకిస్తున్నారేమోనని అనుకునేస్థాయిలో రూపంపట్ల వ్యతిరేకత, వస్తువు మీద పూనిక కొనసాగాయి. నిజానికి, వస్తువు మీద పూనిక కూడ శిల్పం మీద పూనికతో కలిసి సాగకపోతే, అది వస్తువుకు కూడ ఏమీ మేలు చేయదు.

అటు సమాజ సాహిత్య సంబంధాల మీద తక్కువ శ్రద్ధ, ఇటు వస్తు శిల్పాల ఐక్యత మీద చిన్న చూపు కలిసి సాహిత్యానికి మరొక రెండు అంశాల పట్ల తెలుగు మార్క్సిస్టు సాహిత్యవిమర్శకు చిన్నచూపు కలిగించాయి. అవి సాహిత్యకత, తాత్వికత. ఒక సాహిత్య రచనను యితర రచనలలో వేరుచేసేది ఏమిటి? కరపత్రానికీ కవితకూ తేడా ఏమిటి? ఒకటి గొప్ప ఒకటి తక్కువ

3. ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యం'ను మార్క్సిస్టు సాహిత్య విమర్శగా గుర్తించడం చాలా కష్టం కాని, ఆ దిశగా జరిగిన ప్రయత్నాలక వెల్చేరు నారాయణరావు తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, త్రిపురనేని మధుసూదనరావు మధ్యయుగ సాహిత్యం మీద చేసిన కృషి వంటి వాటిని ఉదాహరణలుగా చెప్పవచ్చు.

అనుకోకుండానే, సాహిత్య రచనల ప్రత్యేకతను గుర్తించవలసి ఉంటుంది. ఈ చర్చలో భాగంగా సాహిత్య విమర్శలో సాహిత్యకత అనే ఒక కొత్త భావన అభివృద్ధి అయింది. ఆ సాహిత్యకత సమాజాన్ని విడిచి సాముచేయగూడదనడం వరకూ పరవాలేదుగాని, అసలు సాహిత్యకత లేని రచను సాహిత్యంగా అంగీకరించడం కష్టం. అట్లాగే, జీవితాన్ని ఉన్నతీకరించే ఒక సాధనంగా సాహిత్యం తప్పనిసరిగా తాత్వికతను తనలో భాగం చేసుకుంటుంది. సాహిత్యంలో ప్రాపంచిక దృక్పథం, తాత్వికత ఉంటాయి. మార్క్సిస్టు సాహిత్య విమర్శ కర్తవ్యాలలో ఈ సాహిత్యకతను, తాత్వికతను వెలికితీసి ప్రదర్శించడం, విశ్లేషించడం కూడ భాగమే. తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శ ఈ పనిని చేయవలసినంత సమగ్రంగా చేసిందా అనేది అనుమానమే.

తక్షణ - దీర్ఘకాలిక ప్రయోజనాలు

బహుశా తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శ లోపాల గురించి మాట్లాడుకునేటప్పుడు, తక్షణ - దీర్ఘకాలిక ప్రయోజనాల మధ్య తేడాను విస్మరించడం ఒక ప్రధానాంశంగా గుర్తించవలసి ఉంటుంది. సాహిత్యానికీ, సాహిత్య విమర్శకూ, ఆ మాటకు వస్తే ఏ ఆలోచనకైనా, ఏ ఆచరణకైనా తక్షణ, దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. ఆ ఆలోచనాపరులకూ ఆ కార్యకర్తలకూ ఈ అవగాహన ఉండడం తప్పనిసరి. తమ ఊహ, తమ పని ఇవాళ్టికివాళ సాధించగలిగినదీ ఉంటుంది. ఎప్పుడో భవిష్యత్తులో సాధించగలిగినదీ ఉంటుంది. ఈ వర్తమాన భవిష్యత్తులమధ్య దూరం సమీపమైనదీ కావచ్చు. సుదూరమైనదీ కావచ్చు. కళలకూ, సాహిత్యానికీ ఐతే ఈ తక్షణ, దీర్ఘకాలాల మధ్య దూరం వేల సంవత్సరాలు కూడ ఉండవచ్చు. గుహల మీద వేటచిత్రాలు గీసుకున్న ఆదిమానవులు తమ తక్షణ వేట అవసరంకోసమే వాటిని గీసుకుని ఉండవచ్చు. ఆ చిత్రాలు ఇవాళ్టికి ఆదిమ చిత్రకళగా మన అనుభవంలోకి రావచ్చు. సాహిత్యకారులు కూడ తమ నిర్దిష్టవర్తమానాన్ని అక్షరీకరించి ఉండవచ్చు. ఆ రచనలు వేల వందల ఏళ్ళ తర్వాత సమాజానికి ఉపయోగపడుతుండవచ్చు. సామాజిక అనుభవాన్ని ఉన్నతీకరిస్తుండవచ్చు. సాహిత్యానికీ, సాహిత్య విమర్శకూ ఈ చారిత్రక విహంగావలోకనా దృష్టి ఉండడం చాలా అవసరం. తెలుగు సాహిత్యంలోనూ, తెలుగు సాహిత్య విమర్శలోనూ ఈ దృష్టి కొంత తక్కువే. సద్యోరచన. సద్యోవిమర్శ ఎక్కువ. మార్క్సిస్టు సాహిత్యవిమర్శలోకి కూడ ఈ తాత్కాలికత ప్రవేశించింది.

తెలుగులో ఉద్యమ సాహిత్య సంప్రదాయం చాల ఎక్కువ గనుక ఆయా ఉద్యమాలకు తక్షణ అవసరాలు ఉంటాయి గనక, సాహిత్యంలో కొంతభాగం ఈ తాత్కాలిక అవసరాలు తీర్చడానికి వినియోగపడితే అర్థం చేసుకోవచ్చు. కొంతభాగం సాహిత్య విమర్శ కూడా ఆ తాత్కాలికత అవసరాలు తీర్చడాన్ని అర్థం చేసుకోవచ్చు. కాని మొత్తంగా సాహిత్య సంప్రదాయం, సాహిత్య విమర్శా సంప్రదాయం తాత్కాలికతకు గురికావడం సమస్యలకు దారితీస్తుంది.

ముగింపు

ఈ లోపాలు గుర్తించడం మార్క్సిస్టు సాహిత్యవిమర్శ లోపభరితంగా ఉన్నదని చెప్పడానికి కాదు. అద్భుత ప్రజాపోరాటాలతో గొప్ప సామాజికానుభవం, ఆ అనుభవాన్ని కళలో సాహిత్యంలో అనితరసాధ్యంగా గ్రహించిన కళా సాహిత్య సంప్రదాయం ఉన్నచోట ఆ అనుభవానికీ ఆ సంప్రదాయానికీ తగినంతగా సాహిత్య విమర్శ సంప్రదాయం అభివృద్ధి చెందలేదని గుర్తించడానికి ఎప్పటికైనా తెలుగు సాహిత్య విమర్శకులందరూ ప్రత్యేకించి మార్క్సిస్టు సాహిత్య విమర్శ రంగంలో పనిచేస్తున్న వారు ఈ అంశాల మీద దృష్టి పెట్టి పనిచేయాలని గుర్తు చేయడానికి. *

పుస్తక పరిచయం ☆ ఆర్.శశికళ

దున్నేకొద్దీ దుఃఖం

అతని కలలు - రేపటి సత్యాలు. కవి వెంకటకృష్ణ తాత్విక సాహితీ చింతన 'పల్లెల్లో అదృశ్యమైన పచ్చని జీవితాన్ని, బీడుబారిన భూముల్లో కల్సిపోయిన రైతుల ఆర్తనాదాలను ఆయా జీవితాల్లో మట్టితో అనుభవాన్ని మొక్కలపై ఆత్మీయతను, సగటు రైతు బ్రతుకు పోరు సంఘర్షణను, నిస్సహాయతను వ్యక్తీకరించే ప్రయత్నం చేస్తూ విప్లవ సాహితీ సాంస్కృతిక యోధుడైన కౌముదికి సాహితీ నివాళులు అర్పించే దిశగా సాగింది. 'మన ముంగిట ఒక క' కవితలో ఈ సత్యాన్వేషణ సాగుతుంది. ఆత్మహత్యలను నిరసించటమేకాక సమస్యల నుండి బయట పడాలని సూచిస్తూ హక్కుల ఉద్యమాన్ని కూడా ఆత్మీయంగా హత్తుకొంటుంది అతని కలం. ప్రజా ఉద్యమాల ఆవశ్యకత అంతర్లీనంగా సూచించే ప్రయత్నం చేశాడు. ఈ స్పార్క్‌ను మనం 'సాహితీ సాయుధుడు'లో చూడవచ్చు. 'చేత తుపాకీ లేకుండానే భుజకూణీరంలో తూటాలు మోస్తున్నవాడు'.

నేటి సామ్రాజ్యవాదుల గ్లోబల్ వైరస్ రెండు ముఖాల, రెండు నాల్కల ధోరణిని 'డాలర్ కవిత' ద్వారా దాడి చేశాడు. మతోన్మాదాన్ని నిరసించి, అది సృష్టించిన గాయాలను ఆర్తితో ఆవిష్కరించాడు.

సృజనాత్మకత సరళమైన భాషతో కలిసిపోయి ఒక తాత్విక నిరాసక్తతను వ్యక్తీకరించిన కవితలు మన దృష్టిని ఆకర్షిస్తాయి. ఉదాహరణకు :-

గాయపడిన బాగ్దాద్
ఒక లూటీ అయిన మ్యూజియం
చే జారిన కళాఖండం
ఒక క్షతగాత్ర బాల్యం
నిర్వాసిత వృద్ధాప్యం
ఒక మట్టి కలిసిన ప్రతిఘటన
పునర్నిర్మాణ నెపంతో
ధ్వంసమైన నాగరికత ..... పేజీ - 49

ప్రధానంగా అతని కవిత్వం 'రాయలసీమ' రైతుల కూలీల జీవన చిత్రాన్ని హృద్యంగా స్పృశించింది. ఈ సామాజిక బాధ్యతతో తనో గాయమై స్రవిస్తాడు, జ్వలిస్తాడు, పలువరిస్తాడు. అతని కవిత్వం పీడితుల కొత్త గొంతు, దుఃఖంతో కూడిన ఆశాకిరణం, మన్నుతిన్న మట్టి మనుషుల ఆశలు మొలకెత్తిన తీరును అలవోకగా సహజంగా తన కవిత్వంలో ప్రకటించాడు. "సద్దిమాటల్ని చంకన బిడ్డల్ని పొలం గట్లకో వేలడగట్టి" పేజీ - 23

'ఎన్నటికీ తెరుచుకోని ఆమె ఆశల వాకిలి, నీ పళ్ళెంలోకి అమరిన ఆమె ఆకలి' సేద్యం బ్రతుకుల అప్పుల వ్యథలను విప్పి చెప్తూ తన వంట్లో సత్తువ ఆకాశంలో మేఘానికి కుదువపెట్టి ఎండిన బ్రతుకు సాక్షిగా ఎకరాలు ఎకరాలు పండిన ఒకప్పటి పంటను తల్చుకొంటాడు. రాజ్యపు కుటిల రాజకీయం సాక్షిగా తడవని తమగొంతుల తడి ఆరిపోతున్న ఆకాంక్షలను 'ఆఖరిదాహం' కవిత ద్వారా వారి ఆగ్రహావేశాలను ప్రకటించాడు. మట్టి కోకలకు కవితాశ్రువులనద్ది ఆకాశం, భూమి మధ్యలో వ్రేలాడుతున్న ఉరితాళ్ళను బ్రతికులను బీభత్స దృశ్యాలను వెంకటకృష్ణ కవిత్వంలో ప్రతిఫలించాయి.

"మట్టిని విత్తి, విత్తులై తానే పండాలని,
దుమ్మురేగిన బతుకులో, దున్ను చేసిన నేలలో
మట్టి మోసగించిందో, మేఘం ద్రోహం చేసిందో"

'దున్నే కొద్దీ దుఃఖం' ఒక నిశ్శబ్ద దుఃఖానుభవ భావ ప్రకటనా విస్ఫోటనం ఈయన గొంతు నిస్సందేహంగా పీడితుల గొంతు. ఆయన ప్రకటించిన దుఃఖం నేటి సమాజ వాస్తవ చిత్రం. ఇటువంటి కవితా వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవటం, అనుభూతి చెందటం - వ్యక్తీకరించటం కేవలం సాహసమనే చెప్పాలి. అందుకే వెంకటకృష్ణ కవిత్వాన్ని మీరంతా ఆత్మీయంగా స్పృశించాలని కోరుకున్నాను. *

విమర్శలో చేరా

☆ వి.చెంచయ్య

ఒకరి విమర్శ స్వరూప స్వభావాలు తెలుసుకోడానికి అతని సిద్ధాంత, దృక్పథాలతో బాటు అతని స్వభావం, అభిరుచులు, ఇష్టాయిష్టాలు కూడా తెలిసుండడం మంచిది. ముఖ్యంగా చేరా లాంటి విమర్శకుల సాహిత్య విమర్శను అర్థం చేసుకోడానికి అవి తప్పనిసరిగా తెలియాలి.

"రాజకీయంగా నాది అభ్యుదయ కవుల పక్షం. రచనాపద్ధతిలో భావకవిత్వం మీద ప్రీతి. ఈ రకమైన ద్వంద్వ ప్రకృతి నాలో ఉండి ఉండాలి" తన గురించి చేరా చెప్పుకున్న ఈ మాటలు అక్షరాలా నిజం. అమెరికాలో తన గురువు జెరాల్డ్ కెలీ ప్రభావం తనపైన ఎలా ఉందో వివరిస్తూ - "ఏ ప్రశ్నకయినా ఆయన అవును, కాదు అనే రీతిలో సమాధానం చెప్పరు. కొంత అవును, కొంత కాదు అంటారు. ప్రపంచం ఆయనకు తెలుపో నలుపో కాదు. సర్వ వర్ణచ్ఛాయా బేధాల సమాహారం, ఈ దృక్పథమే నా పరిశోధనలోనూ, ఇతర ఆలోచనల్లోనూ కనిపిస్తుంది" అంటారు.

చేరాకు అభ్యుదయవాదులతో ఎంత స్నేహం ఉంటుందో, సంప్రదాయ వాదులతోనూ అంత స్నేహం ఉంటుంది. ఇది కేవలం వ్యక్తిగత స్నేహం మాత్రమే కాదు, సాహిత్య స్నేహం కూడా. ఒక రచయిత సాహిత్య ప్రవర్తనకు సాహిత్య బంధువుల అవసరం అంటారు చేరా. సాహిత్య బంధువులంటే ఎవరనేది ఏ శాస్త్రమూ నిర్వచించలేదని కూడా అంటారు. సాహిత్య బంధువులంటే ఎవరనేదే కాదు, సాహిత్య బంధుత్వం అంటే ఏమిటనేది కూడా ఏ శాస్త్రమూ నిర్వచించలేదు. తన సాహిత్య వ్యాస సంపుటి 'రించోళి'ని బేరాకు అంకితం ఇస్తూ చేరా ఒక పద్యం రాశారు. అంకితం పుచ్చుకుంటూ బేరా మరొక పద్యం రాశారు. ఇలాంటి సాహిత్య సరదాలు - అందులోనూ పద్యంలో సరదాలంటే చేరాకు చాలా ఇష్టం. చేరా సంపత్కుమారలు వచన పద్య లక్షణంపై చేసిన చర్చను ఒకే పుస్తకంగా అచ్చువెయ్యడం ఇలాంటి సరదాల్లో ఒకటి. ఇది సరదాయే కాదు. శ్రుతిమించి పక్కదారి పట్టకుండా, సత్యాన్వేషణే లక్ష్యంగా గల వాదవివాదానికి ఒక ఉదాహరణగా కూడా నిలుస్తుంది.

రచయితలకులాగే విమర్శకులకూ ఇష్టాయిష్టాలుంటాయి. ఇది వ్యక్తిగతమైనవిగానూ, సమాజగతమైనవిగానూ రెండు రకాలుగా ఉంటాయి. వ్యక్తిగతమైన ఇష్టాలు ఆరాధనగానూ, అయిష్టాలు ప్రైజుడిస్సుగానూ పరిణమిస్తాయి. అభిమానం ముదిరితే ఆరాధన అవుతుందనీ, అది సత్యాన్వేషణకు ఆటంకమవుతుందనీ చేరాకు తెలుసు. "నేనూ చాలా విషయాల్లో ప్రెజుడిస్సును దాటి చూడగలిగాననుకుంటాను" అని తనను తాను అంచనా వేసుకున్నారు కూడా. సమాజగతమైన ఇష్టాయిష్టాలు దృక్పథం మీదా, సిద్ధాంతాలపైనా ఆధారపడి వుంటాయి. "మార్క్సిజం నాకు నిషిద్ధం కాదు, నాకు సరిగ్గా తెలియదంతే. తెలిసినంతవరకు మార్క్సిజం మీద నాకు గౌరవమే" అని చేరా అన్నమాటలో పాక్షిక సత్యంతోబాటు కొంత గడుసుదనం కూడా కనిపిస్తుంది. తొలిదశలోని చేరా విమర్శలో మార్క్సిజం ప్రభావం కనిపిస్తుంది. ఆ తర్వాత క్రమంగా మార్క్సిజం ఆయనకు దూరమయ్యిందా మార్క్సిజానికి ఆయన దూరమయ్యారో తెలియదుగానీ, మార్క్సిజం గుర్తొస్తే రుసరుసలాడిన సందర్భాలు లేకపోలేదు. విమర్శ చేసే సందర్భంలో ఏ వాదం వైపూ మొగ్గుచూపకుండా తనకు అందుబాటులో ఉన్న పద్ధతుల్ని ఉపయోగించుకున్నానంటారు. వాటిలో కొన్ని మార్క్సిస్టు ధోరణులూ ఉండొచ్చు. ప్రధానంగా భాషాశాస్త్ర పద్ధతుల్ని ఏ మాత్రం అవకాశం ఉన్నా అన్వయించడం కనిపిస్తుంది. మార్క్సిజం, భాషాశాస్త్రం రెండూ శాస్త్రాలే కాబట్టి వీటి మధ్య వైరుధ్యం లేదనే చేరా అభిప్రాయం. అయితే ఆయన అనుకొనే మార్క్సిస్టు ధోరణుల పరిధి ఏమిటనేది సందర్భానుసారంగా అర్థం చేసుకోవలసిందే.

"మనిషిమీద అహేతుకత ఎప్పుడూ రాజ్యం చేస్తూనే ఉంటుంది. సహేతుకత కష్టంతో అలవరుచుకోవలసిన లక్షణం" అనే విషయాన్ని గుర్తించిన చేరా తన సాహిత్య విమర్శలో అహేతుకతను తొలగించుకోడానికీ, సహేతుకతను కలిగించుకోడానికీ తపన పడ్డారనే అనిపిస్తుంది. మళ్ళీ ఈ అహేతుకత, సహేతుకతల నిర్వచనాలేమిటో చేరా వివరించలేదుగానీ, కామన్‌సెన్స్‌తో అర్థం చేసుకోవలసిందే.

"నా దృష్టిలో చేరా ఒక స్థితప్రజ్ఞుడు" అని బేతవోలు రామబ్రహ్మం గారు (బేరా) అన్నారు. అంతటితో ఆగక "నాస్తికుల్లోనూ స్థితప్రజ్ఞులుంటారు" అని ఒక సన్నాయి నొక్కునొక్కారు. చేరాతల సందర్భంలో ఈ స్థితప్రజ్ఞతను ప్రదర్శించడానికి ప్రయత్నించారుగానీ, కొన్ని సందర్భాల్లో అది సాధ్యంకాలేదు. రచయితగానీ, విమర్శకుడుగానీ మరీ అంత స్థితప్రజ్ఞుడుగా ఉండవలసిన అవసరం లేదు. స్థితప్రజ్ఞత అనేది అన్ని సందర్భాల్లోనూ ఉండదగిన గుణం కూడా కాదు. భిన్నాభిప్రాయాలు ఉన్న వాళ్ళందరూ శత్రువులు కారు. వాళ్ళలో కొందరు శత్రువులు కూడా ఉండొచ్చు. స్పష్టమైన శత్రువు పట్ల స్థితప్రజ్ఞత అనవసరం. శత్రువు అంటే వ్యక్తిగతంగా కాదు, సమాజానికి. విమర్శకుడికి కూడా కొంచెం కోపం, తాపం, కాస్త వేడి, వాడి అవసరం అసలు వర్గ వ్యవస్థలో రాగద్వేషాలు లేకుండా ఏ మానవుడూ ఉండలేడు. ఒక వేళ ఉంటే అతడు ఎందుకూ పనికిరాడు, పదిమందీ పొగడ్డానికి తప్ప. మళ్ళీ రాగద్వేషాలంటే వ్యక్తిగతమైనవి కావని అర్థం చేసుకోవాలి. సామాజిక పురోగమనం దృష్ట్యా సాహిత్యంలోని మంచి చెడ్డల్ని విశ్లేషించేది సాహిత్య విమర్శ. సామాజిక పురోగమనాన్ని కోరుకునేవారు ఏ రంగంలో ఉన్నా, దయ, ప్రేమ, అభిమానం, పాక్షికత, నిష్పాక్షికత, ద్వేషం, వైరం అన్ని భావాలూ కలిగి ఉండాలి. ఎందుకంటే సమాజంలో ఉన్న ఈ వైవిధ్యమంతా సాహిత్యరంగంలోనూ ఉంటుంది కాబట్టి. అభిమానించాల్సిన సాహిత్యం ఉన్నట్టే, ద్వేషించాల్సిన సాహిత్యం కూడా ఉంటుంది. నిష్పాక్షికత చూపాల్సిన సందర్భాలున్నట్టే, పాక్షికత చూపాల్సిన సందర్భాలు కూడా ఉంటాయి. స్నేహం ప్రదర్శించాల్సిన అవసరాలున్నట్టే, వైరం ప్రదర్శించాల్సిన అవసరాలూ అనివార్యంగా ఎదురౌతాయి. అయితే సమాజంలో ప్రజల పట్ల ప్రేమాభిమానాలు చూపించినట్టు, సాహిత్యవిమర్శలో పాఠకుల పట్ల మాత్రం ప్రేమాభిమానాలే ప్రదర్శించాలి. పాఠకుల విషయంలోనే స్థితప్రజ్ఞత అవసరం అవుతుంది.

నాస్తికుల్లోనూ స్థితప్రజ్ఞులుంటారని బేరా అన్నమాట చేరాకు కాంప్లిమెంటు అవుతుందిగాని, నాస్తికులకు కాదు. నాస్తికుల నుంచి చేరాను వేరు చేసే ప్రయత్నంలోని ఆంతర్యం చేరాకు అర్థమయిందో లేదో తెలియదు. సిద్ధాంత రీత్యా మార్క్సిజం పట్ల చేరాకు అభిమానం ఉంది. మార్క్సిజాన్ని వ్యతిరేకించే సిద్ధాంతాలపట్ల గౌరవం లేదు. అయితే సాంప్రదాయికుల పట్ల ఉన్న సానుభూతి మార్క్సిస్టుల పట్ల ఉన్నట్టు కనిపించదు. "నాకు నచ్చిన రాజకీయ లక్ష్యాల ప్రేరణతో రాసిన కవిత్వమే, మెచ్చలేకపోతున్నాను. ఎంతకాదనుకున్నా రాజకీయాలు కవిత్వానికి బరువేనన్న అభిప్రాయం రాను రాను బలపడుతున్నది" అని చేరా అన్న మాటలు గమనింపదగినవి. ఆయనలో వచ్చిన ఈ మార్పు మార్క్సిస్టులకు నచ్చకపోయినా, తనలో వచ్చిన ఈ పరిణామాన్ని నిజాయితీగా, నిర్భయంగా చెప్పగలిగే స్థితప్రజ్ఞత అర్థమవుతుంది. రాజకీయాలు కవిత్వానికి మేలు చెయ్యవని చేరా స్థిరాభిప్రాయం. అయితే కవిత్వం రాజకీయాలకు మేలు చేస్తుందా? అలా చేస్తున్నట్టు తనకు కనిపించడం లేదని చేరా అంటారు. ఒక వేళ కవిత్వం రాజకీయాలకు మేలు చేస్తే, తనకభ్యంతరం లేదనే చేరా అభిప్రాయంగా తెలుస్తుంది. ఒక సందర్భంలో అంటారు కూడా - కవిత్వానికున్న అనేక ప్రయోజనాలలో రాజకీయం ఒకటని. సాయుధ విప్లవానికి పిలుపునిస్తూ రాసిందే కవిత్వమనీ, మిగతాదంతా అకవిత్వమనీ అర్థం వచ్చేటట్టు తీవ్రవాద కవులూ, విమర్శకులూ చాలా జబర్దస్తీగా ప్రచారం చేశారనీ, చేరాగారు దీన్ని సమర్థంగా ఎదుర్కొన్నారని నండూరి రామమోహనరావుగారికి అనిపించడంలో నండూరికి ఉన్నంత వ్యతిరేకత లేకపోయినా ఎంతో కొంత చేరాలోనూ ఉండి ఉండాలి. తీవ్రవాద కవులూ,

విమర్శకులూ అనడంలోనే నండూరికి విప్లవ రచయితల పట్ల ఎంత ద్వేషం ఉందో తెలుస్తోంది. తెలుగులో అభ్యుదయ సాహిత్యం, విప్లవ సాహిత్యం ఉన్నాయిగానీ, తీవ్రవాద సాహిత్యం లేదు. రాజకీయంగా కూడా మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం అనే సిద్ధాంతం ఉంది గానీ, తీవ్రవాద సిద్ధాంతం లేదు. ఇలాంటి సందర్భాల్లో మార్క్సిస్టుల్లో కనిపించే పాటి స్థితప్రజ్ఞత కూడా నండూరిలాంటి వారిలో కనిపించకపోవడం ఎలా అర్థం చేసుకోవాలో చేరాగారికే వదిలేస్తున్నాను. చేరా ఎప్పుడూ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని తీవ్రవాదం అనలేదు. కమ్యూనిస్టులపై చేరా చురకలు వెయ్యకపోలేదు. అందులో కొంతయినా అర్థం ఉంటుంది. భారతదేశంలో కమ్యూనిస్టు గ్రూపుల సంఖ్య పోలీసులకు తప్ప ఎవరికీ అర్థంగాని పరిస్థితి ఏర్పడిందని ఒక సందర్భంలో అంటారు. ఈ చురకలో ఒక చారిత్రక సత్యం ఉంది. "మార్క్స్ అయితే నేమి? మతం అయితే నేమి?" అని అఫ్సర్ అన్న మాటను ఉటంకిస్తూ అలా అనడాన్ని సోషలిస్టు వ్యతిరేకతగా వ్యాఖ్యానించటం 'మొద్దుపద్ధతి' అంటారు చేరా. చేరాగారికి అఫ్సర్ అన్న మాటకు కోపం రాలేదుగానీ, దాన్ని సోషలిస్టు వ్యతిరేకత అని వ్యాఖానించి నందుకు కోపం వచ్చింది. అందుకే మొద్దు పద్ధతి అన్నారు. చేరా తనను మాట అంటే పడతారుగానీ, తాను అభిమానించేవాళ్ళని అంటే మాత్రం ఊరుకోరు. అలాంటప్పుడు 'మొద్దుపద్ధతి'ని ఆశ్రయించాల్సి వస్తుంది.

చేరా వ్యతిరకత, అసహనం మార్క్సిజంపైన కాదు, మార్క్సిజాన్ని అన్వయించే 'వాళ్ళపైన. మార్క్స్ పుస్తకాలు చదివితే ప్రపంచమంతా అర్థమయిపోతుందనుకునేవాళ్ళున్నారని, అటువంటి వాళ్ళనుద్దేశించి అఫ్సర్ రాస్తే తప్పేమిటని చేరా ప్రశ్న. మార్క్స్ పుస్తకాలే కాదు, ఏ పుస్తకాలు చదివినా ప్రపంచమంతా అర్థం కాదు. అయితే ప్రపంచం సరైన పద్ధతిలో అర్థంగావడానికి మార్క్స్ పుస్తకాలు పనికొచ్చినంతగా ఇతర పుస్తకాలు పనికిరావు. ఈ విషయంలో చేరాగారికి కూడా భిన్నాభిప్రాయం లేదనుకుంటాను. అఫ్సర్ మార్క్స్‌నీ, మతాన్నీ ఒక గాట కట్టేశాడు. మార్క్సిజం అర్థంగాని వాళ్ళను అలా మతం పక్కన చేర్చడం గాదు. అమాంతం మార్క్స్‌నే మతం పక్కన చేర్చేశాడు. అఫ్సర్ పైన ఉన్న విపరీతమైన అభిమానం వల్ల చేరా అఫ్సర్‌లోని అశాస్త్రీయతను చూళ్ళేకపోయారు. పైగా ఒక సిద్ధాంతం గురించో, దాని అన్వయం గురించో ఒక కామెంట్ చేస్తే సరిపోదు. దాన్ని వివరించాలి. అది శాస్త్ర విషయం. శాస్త్ర విషయాన్ని ఖండించడానికి ఒక పద్ధతి ఉంటుంది. ఆ పద్ధతిని అనుసరించకుండా, ఒక చురకవేసి వదిలేస్తే చాలదు. దానివల్ల ఆ సిద్ధాంతం పట్ల ద్వేషం మాత్రమే ఉన్నట్టు తెలుస్తుంది. ఆ ధోరణి కొంత చేరాలో కూడా ఉండబట్టే అఫ్సర్ మాటల్లోని అశాస్త్రీయత అర్థంగాలేదు. ఇలాంటి స్వీపింగ్ కామెంట్లు చేసే ధోరణి చేరాలో కూడా కొంత ఉంది. సాంప్రదాయికుల్నీ, మార్క్సిస్టుల్నీ పక్కపక్కన జేర్చి, వారిద్దరికీ సమస్యలుంటాయిగానీ, సందేహాలుండవనీ, అన్నిటికీ రెడీమేడ్ పరిష్కారాలు సిద్ధంగా ఉంటాయనీ అంటారు. ఇటువంటి అభిప్రాయాల సిద్ధాంతపరంగా మిడిమిడి జ్ఞానం ఉన్నవాళ్ళను దృష్టిలో పెట్టుకుని అనేవి. కానీ వాటిని జనరలైజ్ చేసి చెప్పడం వల్ల చేరా కమ్యూనిస్టు వ్యతిరేకి అని ముద్రపడిపోయే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదం చేరాకు•ఉచితంగా వచ్చింది కొంతయితే, కొని తెచ్చుకున్నది మరికొంత.

"సాహిత్య లోకంలో ఒక భయంకర పరిస్థితి ఉంది. విమర్శిస్తే సహించలేరు. ప్రశంసిస్తే చాలదు. పదిసార్లు ప్రశంసించి ఒకసారి విమర్శిస్తే దీర్ఘకాల శత్రువు" అని చేరా భయపడడానికి సాహిత్యలోకంలోని కలుషితమైన వాతావరణమే ప్రధానకారణం. రచయితలూ మనుషులే కాబట్టి ప్రశంసలకు పొంగిపోవడం, విమర్శకులకు కుంగిపోవడం కొంతవరకు సహజమే. ప్రశంసలు సరే, చేరా చేసిన విమర్శలు చాలా వరకు సున్నితంగానే ఉంటాయి. ముఖ్యంగా చేరాతల ద్వారా కొత్త రచయితల్ని పరిచయం చేసే సందర్భాలలో వారి కవిత్వంలోని లోపాల్ని ఎత్తిచూపుతూనే, తగిన సలహాలిస్తూ ప్రోత్సహిస్తారు. విమర్శిస్తే సహించలేని వారిని చూసి ఒక విమర్శకుడుగా చేరా తాను అసహనానికి గురికానవసరం లేదు. చేరా కూడా మనిషే కదా, తప్పకుండా అసహనానికి గురవుతారు.

మార్క్సిస్టు విమర్శకులు చాలా మంది సిద్ధాంత ఉద్ఘాటనలు చేశారనీ, కొందరు శాపనార్థాలు పెట్టారనీ, మరికొందరు ఎత్తిపొడుపులు, ఎగతాళులు చేశారనీ చేరా అన్నారు. శాపనార్థాలూ, ఎత్తి పొడుపులు, ఎగతాళులూ సాహిత్య విమర్శలో భాగం కావు. కానీ 'సిద్ధాంత ఉద్ఘాటనలు' సాహిత్య విమర్శలో నిస్సంశయంగా భాగమే. సిద్ధాంతాలు చెప్పడం ఒక్కటే సాహిత్య విమర్శ కాకపోయినా, సిద్ధాంతాలు కూడా సాహిత్య విమర్శలో చోటుచేసుకోకుండా ఎలా ఉంటాయి? సిద్ధాంతాలు లేకుండానే ప్రపంచం అర్థం అవుతుందా? సాహిత్యం అర్థం అవుతుందా? సిద్ధాంతం లేకపోతే ప్రపంచాన్ని దానిపరిణామాన్నీ, అందులో భాగంగా వస్తున్న సాహిత్యం తదితర అంశాల్నీ అర్థం చేసుకోవడం ఎలా? ఒక ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పర్చుకోవడం సాధ్యమవుతుందా? సిద్ధాంతాలు అవసరమని భావించే చేరాగారు ఒక్కోసారి పూనకం వచ్చినట్టు సిద్ధాంతాల విషయంలో ఎందుకు మాట్లాడతారో తెలియదు. సందర్భశుద్ధి లేకుండా ఎవరైనా సిద్ధాంతాల్ని వల్లిస్తే ఆ ధోరణిని తప్పుపట్టొచ్చు. సిద్ధాంతాలు గుర్తుకురాగానే 'సిద్ధాంత రాద్ధాంతాలు' అంటారు. ఒకసారి చేరాతలలో 'స్త్రీ శక్తి' అనే పత్రిక గురించి రాస్తూ, అందులో సిద్ధాంత రాద్ధాంతాలు, రాజకీయ వాగ్వాదాలు ఉండవని, అదొక ఆదర్శ పత్రిక అనీ ప్రశంసించారు, అంటే చేరా గారి దృష్టిలో ఆదర్శ సాహిత్య విమర్శలో సిద్ధాంతాలకు చోటుండకూడదన్న మాట. చేరా సాహిత్య విమర్శలోపెద్దలోటు ఈ విషయంలోనే కనిపిస్తుంది.

చేరా విమర్శను రెండు విధాలుగా వర్గీకరించారు.- నిబద్ధ విమర్శ, అనిబద్ధ విమర్శ అని. ఒక సిద్ధాంతం ఆధారంగా చేసేది నిబద్ధ విమర్శ అనీ సిద్ధాంతం లేనిది అనిబద్ధ విమర్శ అనీ అన్నారు. చాలా గ్రంథాలు చదివి రచనలో సొగసుల్ని తమబుద్ధి బలంతో గ్రహించి చేసేదిగా అనిబద్ధ విమర్శను వివరించారు. ఆధునిక కాలంలో అనిబద్ధ విమర్శే ఎక్కువగా వస్తున్నదనీ అన్నారు. చేరా విమర్శ ఆయన పరిభాషలోనే చెప్పాలంటే ఈ అనిబద్ధ విమర్శే. విమర్శ లోతు ఉండాలని భావించిన చేరా తన విమర్శలో లోతు లేదనీ, వెడల్పు ఉందనీ అంటారు. వెడల్పు అంటే ఎక్కువ విషయాలు చెప్పడమనీ, లోతు అంటే కొత్త విషయాలు చెప్పడమనీ వివరణ ఇచ్చారు. చేరా విమర్శలో వెడల్పు అన్నమాట నిజమేగాని, లోతు కూడా కొంత ఉంది. వెడల్పుకు వివరణగా ఇచ్చిన ఎక్కువ విషయాలలో కొన్ని కొత్త విషయాలు కూడా ఉన్నాయి. ఉద్యమకాలంలో భావతీవ్రత కవితా లక్షణమయితే, ఇతర కాలాల్లో భావగాఢత లక్షణంగా కనిపిస్తుందని చేరా అన్నమాట మంచి అబ్జర్వేషన్. ఉన్న విషయాన్నే కొత్తగా సూత్రీకరించడం కొత్త విషయమే అవుతుంది. శతక లక్షణాలుగా చేరా చెప్పినవి నిజంగా కొత్తగా ఉన్నాయి. సంబుద్ధిని, ప్రధాన భావధారను ప్రధాన శతక లక్షణాలుగా చెప్పారు. ఇంతవరకూ విమర్శకులందరూ మకుటం, సంఖ్యా నియమం, ఒకే ఛందస్సునుపయోగించడం మొదలయిన వాటిని శతక లక్షణాలుగా పేర్కొన్నారు. కానీ చేరా వీటిన్నిటినీ కంటికి కనిపించే బాహ్య లక్షణాలుగా మాత్రమే చెప్పారు. పాఠకులతో మాట్లాడుతున్నట్లుండడం (సంబుద్ధి), ఒక భావోద్వేగం శతకానికి గల బూర్జువ లక్షణాలని వివరించడం కొత్త ఆలోచనే. బూతుల అతిని కొంచెం తగ్గిస్తే తెలుగు కవిత్వంలో భాషా సంకోచాలను వదలగొట్టడంలో దిగంబరకవిత్వపు పాత్ర చాలా ఉందన్న విషయం దిగంబర కవుల భాష గూర్చిన కొత్తకోణం.

చేరా కొన్ని అస్పష్ట ప్రతిపాదనలు కూడా చేశారు. ప్రాచీన ఆధునిక సాహిత్యాలను సమదృష్టితో పరిశీలించగల విమర్శకులు మనకిప్పుడు అవసరమని అన్నారు. 'సమదృష్టి' అంటే ఏమిటో వివరించలేదు. బహుశ ఆధునికులు ప్రాచీన సాహిత్యాన్ని ఆసక్తితో పరిశీలించకపోవడం, సాంప్రదాయికులు ఆధునిక సాహిత్యాన్ని చిన్నచూపు చూడడం వంటి ధోరణుల్ని వదులుకోవడం ఆయన దృష్టిలో 'సమదృష్టి' అవుతుందేమో. సమదృష్టి, నిష్పాక్షికత లాంటి మాటలు సహజంగానే అస్పష్టమైనవి. వాటిని వివరించకుండా వాడితే ఆ అస్పష్టత పాఠకులకు కూడా చేరిపోతుంది. ఇది వర్గ వ్యవస్థ అనీ, వర్గ సమాజంలో సాహిత్య కళారంగంలో కూడా వర్గస్వభావం ఉంటుందనీ, వర్గ దృష్టితో చూసినప్పుడు

సమదృష్టి నిష్పాక్షికత వంటి మాటలు తేలిపోతాయనీ అర్థమవుతుంది. అలాగే నగ్నముని 'కొయ్యగుర్రం' వచనకావ్యాన్ని 'ఆధునిక మహాకావ్యం' అనడం ఒక ప్రధాన వస్తువుతో, ఒక తాత్విక చింతనతో, సందేశంతో, అనేక భావాలతో, మూడ్స్‌తో, కథ లేకుండా, ఆర్ఫనిటీ అనే లక్షణం కలిగి ఉండి, తగినంత విస్తారంతో ఉన్న దీర్ఘ కవితను ఆధునిక మహాకావ్యం అంటున్నానని నిర్వచించారు. మూడ్స్, ఆర్ఫనిటీ, కథలేకపోవడం మొదలైనవి ఆధునిక కవిత్వంలో చాలామందిలో కనిపించేవే. తాత్విక చింతన, సందేశం, ప్రధాన వస్తువు మొదలైన లక్షణాలు ప్రాచీన, ఆధునిక కవిత్వాలలో ఉండేదే. కొయ్యగుర్రాన్ని మంచికావ్యం అనడానికి ఆధునిక మహాకావ్యం అని ఒక పరిభాషగా, ఒక ప్రక్రియగా చెప్పాల్సిన అవసరం లేదు. పైగా 'కొయ్యగుర్రం' లోని లక్షణాలను చెప్పి, వాటి ఆధారంగా 'ఆధునిక మహాకావ్యం' అని ఒక కొత్త ప్రక్రియను కృత్రిమంగా సృష్టించినట్టుంది. ఆ తర్వాతికాలంలో ఇటువంటి మహాకావ్యాలు వచ్చాయా? ఈ ఆధునిక మహాకావ్య ప్రక్రియను ఎవరైనా అనుసరించారా? సాహిత్య విమర్శకులు దాన్ని పట్టించుకున్నారా? ఆ ప్రతిపాదన చేరాలోనే ఎందుకు అంతరించింది? ఇవన్నీ శేష ప్రశ్నలు.

విమర్శకులంటే ఎవరనే దాన్ని నిర్వచిస్తూ, "విమర్శకులు నచ్చిందాన్ని ఇట్లా ఉందని చెప్పేవారేగాని ఇట్లా ఉండాలని శాసించేవారు కాదు" అన్నారు. ఇందులో ఒక అనుకూల అంశం, ఒక ప్రతికూల అంశం రెండూ ఉన్నాయి. ప్రాచీన అలంకారికులు కావ్యం ఇట్లా ఉండాలని శాసించారు. అయితే ఆ నియమాల ప్రకారం ఎక్కువ మంది కవులు కావ్యరచన చేసినా, కొందరైనా కొన్ని సందర్భాల్లోనయినా ఆ నియమాలను అతిక్రమించాల్సి వచ్చింది. ఆధునికులు కవిత్వం ఇలా ఉండాలని శాసించినట్టే చెప్పారు.

"కదిలేదీ, కదిలించేదీ
మారేదీ, మార్పించేదీ,
పాడేదీ, పాడించేదీ,
మునుముందుకు సాగించేదీ,
పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి"

అని శ్రీశ్రీ అన్నాడు. ఈ అనడంలో ఇలాగే ఉండాలని ఉందికాని, ఇలా ఉంది అనికాదు. ఏ కవి అయినా సహజంగా కవిత్వం ఇలా ఉండాలని చెబుతాడు. అలాగే ఆధునిక విమర్శకులు కూడా చాలా మంది కవిత్వం ఇలా ఉండాలనే చెప్పారు. అలా ఉండాలని శాసించినా అది ఆయా కవుల, విమర్శకుల అభిప్రాయాలు మాత్రమే. ప్రాచీన అలంకారికుల నిర్వచనాల్ని కొంతవరకు అప్పటి కవులు శాసనాలుగా భావించారుగాని, ఆధునిక కాలంలో నిర్వచనాలు శాసించినట్టు చెప్పినా, వాటిని శాసనాలుగా ఎవరూ భావించడం లేదు. వాటిని వాళ్ళ అభిప్రాయాలుగా మాత్రమే భావిస్తున్నారు. ప్రాచీనకాలంలో అలంకారికులు (ఆనాటి సాహిత్య విమర్శకులు) నాలుగు రకాల నాయకులను, ఎనిమిది రకాల నాయికలను పేర్కొన్నారు. శృంగార, వీర రసాలలో ఒకటి కావ్యంలో ప్రధానంగా ఉండాలన్నారు. శృంగారం రసరాజం అన్నా ప్రబంధంలో అష్టాదశ వర్ణనలుండాలన్నారు. రసాభాస (నాయిక ప్రతినాయకుల ప్రేమ మొ.) పని రాదన్నారు. ఇలా ఎన్నో నియమాలు విధించారు. కవులు ఈ నియమాలను గౌరవించారు. కానీ అవసరమైన చోట నిర్భయంగా అతిక్రమించారు. మనుచరిత్రలో వరూధినీ ప్రవరుల ప్రేమ సన్నివేశంగానీ, వరూధినీ మాయా ప్రవరుల ప్రేమ సన్నివేశంగానీ రసాభాసకు ఉదాహరణలే. కానీ ఆ సన్నివేశాలువి ఇష్టపడి రాశాడు, పాఠకులూ ఇష్టపడుతున్నారు. ఎందుకంటే వరూధినీ ప్రవరుల ప్రేమ ఘట్టంలో వైరుధ్యం ఉంది. సంఘర్షణ ఉంది. జీవితంలోని వైరుధ్యాలే కథకు బలాన్ని చేకూరుస్తాయి. పాఠకులకు ఆసక్తిని కలిగిస్తాయి. జీవితంలో ఎదురయ్యే వైరుధ్యాలకు కావ్యంలో పరిష్కారాలు దొరకొచ్చు. ఒకవేళ దొరక్కపోయినా, ఆ ఆశ పాఠకుల్ని చదివిస్తుంది. ప్రాచీన సాహిత్యంలో ఇలాంటి సన్నివేశాల్ని ఎన్నైనా చూపించవచ్చు. ప్రాచీనులు చెప్పిన నియమాల్ని అన్వయిస్తే ఆధునిక సాహిత్యంలో చాలా రచనలు సాహిత్యం కాకుండా పోవాలి. ప్రాచీన కాలంలో కొంతకాలమైనా కావ్యనియమాల్ని శాసనాలుగా భావించారేమోగానీ, ఈ కాలంలో అలా చెప్పినా అవి శాసనాలు కానేకావు. సాహిత్యం ఇట్లా ఉందని చెప్పే విమర్శకులు ఆధునిక కాలంలోనే ఉన్నారు. ఇది ముఖ్యంగా అన్వయ విమర్శలో కనిపిస్తుంది. కె.వి.ఆర్.రాసిన కవికోకిల, మహోదయం ఇలాంటివే. ఆధునిక సాహిత్య విమర్శలో ఇలాంటివి ఎన్నైనా చూపించవచ్చు. సిద్ధాంతపరమైన సాహిత్యావిమర్శలో సాహిత్యం ఇట్లా ఉండాలి అనే ధోరణే ఎక్కువగా కనిపిస్తుంది. దాన్ని ఆవిమర్శకుని అభిప్రాయంగా పాఠకులు గ్రహిస్తున్నారేగాని, పాఠకులుగానీ, రచయితలుగానీ శాసనాలుగా తీసుకోవడం లేదు. అవసరమైతే వాదోపవాదాలు చేస్తారు. చర్చలు జరుపుతారు. ఇతరుల వాదాన్ని ఖండిస్తారు. ఈ ఖండన మండనలన్నీ సాహిత్య విమర్శలో భాగమే. ఆ మాటకొస్తే ప్రాచీన విమర్శకులు కూడా ఒకరి సిద్ధాంతాన్ని మరొకరు ఖండించుకున్నారు. పూర్వుల వాదాన్ని పూర్వ పక్షం చేసి, తమవాదాన్ని ప్రతిపాదించారు. అయితే ఈనాటిలాగా ఒకే కాలంలో ఈనాడు జరుగుతున్నంత విపులమైన చర్చ ఆనాడు జరిగినట్టు కనబడదు.

కాబట్టి చేరా అభిప్రాయాన్ని అన్వయిస్తే చాలా మంది విమర్శకులు కాకుండా పోతారు. ఇది చేరా మాటలోని ప్రతికూలాంశం. అనుకూలాంశం ఏమిటంటే విమర్శకులు శాసకులు కాదనే విషయం. శాసించడమనే మాటే ఇవాళ వ్యతిరేకార్థంలో ఉంది. శాసించడమంటే నియంతృత్వం అనే అర్థం వస్తుంది. విమర్శకులు కవుల పాలిట నియంతలుకాదు, కారాదు. అసలు కవులు తక్కువ విమర్శకులు ఎక్కువ అనే తరతమబేధంతో ఆలోచించడమే సరైనదికాదు. చేరాయే ఒక సందర్భంలో అన్నట్టు నిగూఢంగా చెప్పిన విషయాలను పాఠకులకు అందించాలి విమర్శకులు. అంతేకాదు, చేరా వివరించినట్టు శిల్ప విశేషాలను వివరించడంతోబాటు, ఆ రచన పాఠకులలో ఎలాంటి అవగాహన కలిగిస్తుందో ఆ అవగాహన సరైనదో కాదో కూడా విమర్శకులు వివరించాలి. ఈ మాట అన్నప్పుడు విమర్శకుడు న్యాయనిర్ణేతా అని సందేహం రావచ్చు. నిర్ణయించే శక్తి, శాస్త్రీయమైన దృక్పథం, వ్యక్తిపరమైన రాగద్వేషాలుగాకుండా, సామాజిక పరమైన రాగద్వేషాలు ఉన్న విమర్శకుడు న్యాయనిర్ణేత కావడంలో తప్పులేదు. ఈ న్యాయ నిర్ణేత పని చేరా కూడా చేశాడు. అయితే ఆయన శిల్పం విషయంలో చేశాడు. సైద్ధాంతిక దృక్పథంతో, రచనలను పరిశీలించే పని పెట్టుకోలేదు. దృక్పథంతో విమర్శ చెయ్యడాన్నే శాసించడం అని ఎవరనుకున్నా అది సరైనది కాదు

ఈ సందర్భంలో రచయితల్ని, విమర్శకుల్నీ వేరుచేసి మాట్లాడాల్సి అవసరం లేదు. విమర్శలపైన మళ్ళీ విమర్శలు కూడా రావచ్చు. ఒక విమర్శకుడిలో ఉన్నాయనుకున్న లోపాల్ని ఇంకో విమర్శకుడు బయట పెట్టొచ్చు. ఈ రోజుల్లో ఉన్న విమర్శ సంప్రదాయమే ఇది. ఇక్కడ ఒకర్ని మరొకరు శాసించడమనే ప్రసక్తే లేదు. ఎవరి అభిప్రాయాలు వాళ్ళు కుండబద్దలు కొట్టినట్టు చెప్పడమే. ప్రాచీన కావ్యాలన్నీ పండిత సంప్రదాయంలో వచ్చినవే. ఈనాటి సాహిత్యం ప్రజాసంప్రదాయంలో కొనసాగుతోంది. పండిత సంప్రదాయంలో నియమాలకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రజా సంప్రదాయంలో అవసరాలకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థతాలూకు స్వభావం కూడా ఈనాటి విమర్శపై ఉంటుంది. ప్రతిఒక్కరి అభిప్రాయాన్ని ఒక అభిప్రాయంగా చూడవలసి ఉంటుంది. నచ్చకపోతే వదిలెయ్యడం కాదు. ఎందుకు నచ్చలేదో చెప్పాలి. ఎలా ఉండాలని విమర్శకుడనుకుంటాడో వివరించాలి. ఇలా భావాల సంఘర్షణ నుండే ఆలోచన, అవగాహన రాటుదేలుతాయి.

శాసించేవారు విమర్శకులు కాదని చెబుతూ చేరా అలా శాసించే పని రాజకీయనాయకులు చేస్తారనీ, రచయతల సంఘాలు చేస్తాయనీ అనడంలో ఆయన దృష్టిలో విప్లవ రచయితల సంఘం తప్పక ఉండి ఉంటుంది. 'సంఘం' అంటేనే చేరా గారికి పడకుండాపోయింది. ఆధునికసమాజమే ఒక సంఘం. సంఘ దృష్టి, సమిష్టి కృషి లేకుండా ఈ రోజుల్లో ఏ పనీ జరగదు. ఎవరో కొద్ది మంది వ్యక్తులు సంస్థల్లాగా పనిచేవాళ్ళు ఉంటే ఉండొచ్చేమోగాని, సంఘటిత కృషి లేకుండా సమాజం ముందుకుపోదు. ఈనాటి సమాజానికి ఇది కనీసపు

సూత్రం. విప్లవ రచయితల సంఘం కవితా శిల్పం గూర్చి పట్టించుకోలేదనే ఆరోపణ చేరాగారు చాలాసార్లు చేశారు. శిల్పం అనగానే విప్లవరచయితలు ఉలిక్కిపడనవసరం లేదని అదొక ప్రత్యేక తరహాలో అంటుంటారు. విప్లవ రచయితల సంఘం శిల్ప వ్యతిరేకికాదు. కాకుంటే శిల్పం గురించి ఎక్కువగా మాట్లాడలేదు. అదొక వాస్తవం. శిల్పం గురించి విప్లవ రచయితలు మాట్లాడవలసిన అవసరం ఉండి మాట్లాడకపోతే చేరా లాంటి వాళ్ళు విప్లవ రచయితలతో చేరి వాళ్ళచేత మాట్లాడించే ప్రయత్నం చెయ్యొచ్చు. ఒక వ్యక్తి చేసేపని, ఒక సంస్థ చేస్తే ఫలితం ఎక్కువుంటుందిగదా.

చేరా విమర్శలో ప్రధాన వస్తువు శిల్ప చర్చే. భాషా శాస్త్రవేత్త కూడా కావడం వల్ల భాషాశాస్త్రకోణం నుండి కూడా శిల్ప విశేషాలను విశ్లేషించడానికి అవకాశం ఏర్పడింది.

చేరా వివరించిన శిల్ప విశేషాలు కొత్తగా కవిత్వం రాసేవాళ్ల నేర్చుకోవడానికీ, కవులుగా స్థిరపడ్డవాళ్ళు తమ కవిత్వాన్ని మెరుగులు దిద్దుకోడానికీ ఉపయోగపడతాయనడంలో సందేహం లేదు. పదాల కూర్పు, వాక్యనిర్మాణం ఎలా ఉంటే అది కవిత్వంగా మారుతుందో చేరా కొన్ని టెక్నిక్స్ నేర్పిస్తారు. రెండు రకాల వాక్యాలను ఒకజంటగా చేసి పేర్చుకుంటూపోతే వచనంలోని వాక్యాలకు కవిత్వపు రూపం వస్తుందని ఉదాహరణలతో సహా వివరిస్తారు.

"అక్షరాన్ని బూటుతో అదిమి చూడు
ఒక నెత్తుటి చుక్క చిందుతుంది
సత్యాన్ని కత్తితో కోసిచూడు
ఒక బాధా కుసుమం బైటపడుతుంది.

ఇవి పతంజలి భాష్యంపేరుతో పతంజలికాలమే రూపంలో రాసిన రచనలోని వాక్యాలు. వచనానికీ, కవిత్వానికీ సరిహద్దులు చెరిగిపోయే క్రమంలో పతంజలి భాష్యానికి ప్రాధాన్యం ఉందని అంటారు.

కవిత్వంలో సాధారణ భాషా సూత్రాల ఉల్లంఘన ఉంటుందనీ, ఆధునికంగా అది ఇంకా ఎక్కువగా ఉంటుందనీ చెప్పడంలో భాషా శాస్త్ర కోణం నుండి శిల్పాన్ని వివరించే ప్రయత్నం కనిపిస్తుంది. భౌతిక ప్రపంచానికుండే కొన్ని నియతమైన సూత్రాలకు కవిత్వం అతీతంగా ఉండే సన్నివేశాలు కొన్ని కనిపిస్తాయంటారు.

"అతని పాట వినిపిస్తుంది
మెల్లగా కదిలి
తుఫానై చుట్టుముడుతుంది జ్ఞాపకంలా
నడుస్తున్న నిన్ను వెంటాడి వేధిస్తుంది
రాత్రిలోంచి రాలిపడ్డ స్వప్నంలా"

అని సైగల్ గురించి అఫ్సర్ రాసిన వచన కవితాపాదాలను ఉదహరించారు. ఇందులో పాట వినిపించడం వరకే భౌతిక నియమం. అది మెల్లగా కదలడం, తుఫానై చుట్టుముట్టడం, వెంటాడి వేధించడం మొదలయినవన్నీ భౌతిక నియమాలకు అతీతమైనవే, ప్రపంచంలోని భౌతిక నియమాల్ని భాషలో అతిక్రమించడం ద్వారా కవితా రూపాన్నివ్వడం ఒకరకమైన టెక్నిక్. ఇలాంటి కవిత్వపు టెక్నిక్కులను తెలుసుకోవడం ద్వారా స్వతంత్రంగా కొన్నిటిని ఊహించవచ్చు.

అంత్యప్రాసలు, గారడీ వాక్యాలు, సింబాలిజంపేరిట అయోమయపు సంకేతాలు, క్రియాపదాల్ని వాక్యాల మొదట్లో పెట్టడం, తమ్ముడూ, నేస్తం వంటి సంబోధనలు వచన కవితలో పెద్దగా ఇమడవన్న మాట వాస్తవమే. చాలా మంది కొత్తగా కవిత్వంరాసేవాళ్ళు ఇలాంటి తక్కువ స్థాయి పద్ధతులనే అనుసరిస్తుంటారు.

1978లో చెరబండరాజు జన్మహక్కు పేరుతో ప్రకటించిన కవిత్వానికి 'పదునెక్కిన ప్రజాకవి' పేరుతో చేరా రాసిన పీఠికలో మంచి సూచనలిచ్చారు. 'గింజెవడిదిరో, గంజెవడిదిరో' అని అనగలిగిన కవి, 'మేడెవడిదిరో, గెడిసెవడిదిరో' అనడం కంటె 'మేడెవడిదిరో, గూడెవడిద్దిరో' అని ఉంటే లయ సమతూకంగా ఉండేదని అనడం చెరలాంటి కవికి కూడా చేరా చేసిన గొప్ప సూచన. అలాగే ప్రజల భాషలో రాసేటప్పుడు వర్గపోరు, వర్గకసి వంటి మాటలను రానియ్యకుండా జాగ్రత్తపడాలని, ఆమాటలు వాడకుండా ఆ స్ఫూర్తిని కలిగించడం కవికి కష్టం కాదనీ సూచించారు.

ఇలా కవితా శిల్పాన్ని గురించి చేరా చేరాతలలోనేగాక, ఇతర వ్యాసాలలో కూడా ఎన్నో విషయాలు చర్చించారు. ఈ పని విప్లవ రచయితలు చెయ్యరనీ, చేసిన వాళ్ళను ఫార్మలిస్టులు (రూపవాదులు) అని నిందిస్తారనీ చేరా ఆవేదన, అభియోగం చేరా వంటి విమర్శకులవైపు నుంచి చూస్తే ఈ ఆవేదనలో, అభియోగంలో కొంత న్యాయం ఉంది.

దీన్నే విప్లవ రచయితల సంఘం వైపు నుండి కూడా ఆలోచించి చూద్దాం. కావ్యకళ గురించీ, శబ్దసౌష్టవం గురించీ, పద్యనిర్మాణం గురించీ మాట్లాడ్డం నేరమైనట్టు కొందరు కామ్రేడ్స్ మాట్లాడ్డం విచిత్రంగా ఉందని అది పనికిరాదనీ, పైగా ప్రమాదకరమని చేరా హెచ్చరించారు. శబ్దాలకూ శబ్దసంయోజనాలకూ ఉన్న కవితాంశ, వాక్య నిర్మాణపుటెత్తుగడల విశిష్టత వగైరా గురించి చెప్పటం మార్క్సిజానికి తలకు మించిన పని అనీ కవితా వస్తువును దాటి మాట్లాడితే చాలా మంది మార్క్సిస్టు విమర్శకులకు గిట్టదనీ కూడా అన్నారు.

పై చేరా మాటల్లో గమనించాల్సినవి రెండు అంశాలు. 1. మార్క్సిస్టు విమర్శకులు కావ్యకళ గురించి మాట్లాడరు, మాట్లాడనివ్వరు. 2. కావ్యకళ గురించి వివరించడం మార్క్సిజానికి తలకుమించినపని. మార్క్సిస్టు సిద్ధాంత సహాయంతో చేసే విమర్శను మార్క్సిస్టు సాహిత్య విమర్శ అంటారని కూడా మరొక సందర్భంలో అన్నారు. ఈ విషయాలన్నిటినీ సమన్వయించుకుంటే ఒక వైరుధ్యం కనిపిస్తుంది. కావ్యకళ గురించి వివరించడం మార్క్సిజానికి సాధ్యం కాదంటూనే, ఆ సిద్ధాంత సహాయంతో విమర్శ చేసే మార్క్సిస్టు విమర్శకులు కావ్యకళ గురించి మాట్లాడరనడం ఆ వైరుధ్యం. చేరాలో ఈ వైరుధ్యం ఉందని తప్పుబట్టడం నా ఉద్దేశంకాదు. విషయాన్ని అవగాహన చేసుకోడానికే ఈ చర్చ. ఆ దృష్టితో చూస్తే అది వైరుధ్యంగా కనిపించేమాట నిజమేకాని దానికి పరిష్కారం లేకపోలేదు. (ప్రతి సమస్యకు రెడీమేడ్ పరిష్కారాలు అటు సాంప్రదాయికులకూ, ఇటు మార్క్సిస్టులకూ ఉంటాయని చేరా అన్న విషయాన్ని గుర్తుపెట్టుకునే పరిష్కారం ప్రస్తావన తెస్తున్నాను.) మార్క్సిజానికి కావ్యకళ గురించి వివరించడం తలకు మించిన పనే అయినా, అది మార్క్సిస్టు విమర్శకులకు తలకు మించినపని కాకపోవచ్చు. మార్క్సిస్టు విమర్శకులయినంత మాత్రాన వాళ్ళకు మార్క్సిజం తప్ప ఇంకే శాస్త్రాలలోనూ ప్రాథమికపరిజ్ఞానం కూడా ఉండదని అనుకోవలసిన అవసరం లేదు. అసలు మార్క్సిస్టు సాహిత్య విమర్శ అంటే మార్క్సిజం తప్ప ఇతర శాస్త్రాల పరిజ్ఞానాన్ని ఉపయోగించరని అనుకోవడం సరైనది కాదు. సామాజిక అభివృద్ధి క్రమంలో విజ్ఞాన శాస్త్రంతోబాటు ఇతర సామాజిక శాస్త్రాల సహాయంతోనే మార్క్సిజం అభివృద్ధి చెందింది. "మార్క్సిజం ఒక శాస్త్రం. అన్ని శాస్త్రాలకూ కొన్ని సామర్థ్యాలుంటాయి. కొన్ని పరిమితులుంటాయి. ఇది గ్రహించకపోవటం మార్క్సిజాన్ని శాస్త్రంగా గ్రహించ నిరాకరించటమే" అన్న చేరా అభిప్రాయాన్ని నిరాకరించవలసిన అవసరం లేదుగానీ, ఒక చేర్పు చెయ్యాలి. ఇతర శాస్త్రాలకున్న సామర్థ్యాలూ, పరిమితులూ ఉన్నప్పటికీ, మార్క్సిజానికి అదనంగా ఒక గుణం ఉంది. ఏ విషయాన్నైనా వర్గ వ్యవస్థలో భాగంగా, పరిణామ గతిలో భాగంగా మార్క్సిజం అర్థం చేయిస్తుంది. ఈ గుణం ఇతర సిద్ధాంతాలకు, ఇతర జ్ఞానాలకూ లేదు. చేరాగారే అన్నట్టు గ్రాంధికభాష ప్రాచీనులకూ, వ్యావహారిక భాష ఆధునికులకూ కేటాయించి పెట్టలేదు. ఈనాడు వ్యవహారిక భాష కమ్యూనిస్టులకూ, భూస్వాములకూ, పెట్టుబడిదారులకూ, అన్ని వర్గాల రచయితలకూ పనికొస్తుంది. భాషకు దానంతట దానికి వర్గ స్వభావం లేదు. చూసేవాళ్ళ చూపును బట్టి ఆతేడా కొంత కనిపిస్తే కనిపించొచ్చు. అలాగే భాషాశాస్త్రం, విజ్ఞానశాస్త్రం - ఏవర్గం వాళ్ళైనా తమ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. కాబట్టి మార్క్సిజం కూడా ఒక శాస్త్రమే అయినా, ఇతర శాస్త్రాలకంటే భిన్నమైనది.

కవిత్వం విషయంలో చెత్తను నిర్మొహమాటంగా నిరాకరించాలనీ, అన్నిటికీమించి మంచిచెడుల్ని విడదీసే అభిరుచిని పెంచుకోవాలనీ 'చైతన్య

కవిత' పత్రికను తెలుగు కవిత్వ పత్రికగా చెబుతూ చేరా అన్నారు. ఈ మంచి చెడులు కవితాశిల్పానికి చెందినవా? లేక విషయానికి చెందినవా? ఎంత గొప్ప విషయమైనా శిల్పం లేకపోతే చేరా దాన్ని అంగీకరించరు. శిల్పం ఉంటే ఎలాంటి విషయం ఉన్నా దాన్ని గొప్ప కవిత్వంగా భావించడం దీనికి మరో కోణం. పాఠకుల్ని పక్కదారి పట్టించే విషయం గొప్ప శిల్పంతో ఉంటే వారిని చెడగొట్టే అవకాశం ఉంది. శిల్పం గొప్పగా లేకపోయినా విషయం సామాజిక చైతన్యానికి సంబంధించింది అయితే అది గొప్ప కవిత్వం కాకపోయినా దానివల్ల నష్టంలేదు. క్షుద్రశక్తుల గురించిన నవలలూ, డిటెక్టివ్ నవలలూ, పచ్చి శృంగార సాహిత్యం ఎంతగొప్ప శిల్పంతో ఉంటే అంతనష్టం. వర్గవ్యవస్థ, కుటుంబవ్యవస్థ, స్త్రీ పురుష సంబంధాలు మొదలైన విషయాలలో సాంప్రదాయకభావాలుగలిగిన విశ్వనాథ సత్యనారాయణ రచల సమాజాన్ని వేదకాలం నాటికి తీసుకుపోయే ప్రయత్నం చేసినవే. ఆచరణలో అది అసాధ్యం కావచ్చు. కానీ ఆయన ప్రయత్నం అదే. అందుకే ఆధునిక కవి బాలగంగాధర తిలక్ "విశ్వనాథ వారు వెళ్ళగా వెళ్ళగా వేదకాలం ఇంకా వెనక్కి పోయిందట" అన్నాడు. అయితే విశ్వనాథలో ఒక సుగుణం ఉంది. సామాజిక పరిజ్ఞానాన్ని చిత్రిస్తూనే వాటిని వ్యతిరేకిస్తాడు. 'ఏకవీర' నవలలో ఇష్టంలేని పెళ్ళిళ్లు చేసుకున్న రెండు జంటలు వైవాహిక వ్యవస్థతో సర్దుకుపోలేక జీవితాంతం ఘర్షణకు లోనవుతూ ఉన్నట్లు విశ్వనాథ చిత్రించాడు. ఇష్టంలేని పెళ్ళైనా ఒకసారి జరిగాక దాన్ని ఆమోదించాలనే సిద్ధాంతమే ఆయనది. అలా ఆమోదించినట్టు చిత్రించవచ్చు. కానీ అలా రాయలేదు. ఇష్టంలేని పెళ్ళితో జీవితంలో సహజంగా ఏర్పడే ఘర్షణను చిత్రించకుండా సర్దుకుపోయినట్టు రాయకపోవడం ఒక రచయితలో ఉండవలసిన లక్షణం. ఈ లక్షణం లేనివాడు యండమూరి వీరేంద్రనాథ్. ఒకనాడు కుక్క వంటి గొప్ప నాటికలు రాసిన యండమూరి, ఆ తర్వాత తులసి, తులసీ దళం వంటి క్షుద్రశక్తుల నవలలు రాశాడు. ఆ వ్యాపారం ఎంతోకాలం జరగలేదు. తర్వాత వేరే ఫ్యాక్టరీ పెట్టాడు. మైండ్ పవర్, విజయానికి పదిమెట్లు లాంటి పుస్తకాలు రాశాడు. ఈనాడు దీనికి యువతలో మంచి గిరాకీ ఉంది. ఎప్పుడు ఏ వస్తువు అమ్ముడుపోతుందంటే ఆ వస్తువును తయారు చెయ్యడం పెట్టుబడిదారుడి స్వభావం. సాహిత్యాన్ని కూడా అమ్మకపు సరుకుగా తయారుచెయ్యడం ఇతనికి తెలిసిన విద్య. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే మార్క్సిజం తప్పనిసరి. మార్క్సిజం ఒక్కటే ఈ మంచి చెడుల్ని వేరుచేసి చూపిస్తుంది. ఆ విధంగా మార్క్సిజం ఇతర శాస్త్రాలకంటే భిన్నమైనది. మార్క్సిజాన్ని ఇలా అర్థం చేసుకోవడం, దాన్ని పరిమితులు లేని శాస్త్రంగా ప్రశంసించడం కాదు. దానికి రెడీమేడ్ సమాధానాలు ఉంటాయనీ కాదు.

కవితా శిల్పం గురించి విప్లవ రచయితలు పెద్దగా చర్చించక పోవడానికి ఒక కారణం ఉంది. పాఠకులు ఎలాగూ కవితా శిల్పం ఉన్న కవిత్వాన్ని అనుభవించి ఆనందిస్తారు. శిల్పం గురించి తెలియకపోయినా శిల్పం ద్వారానే కవిత్వం పాఠకుల అనుభవంలోకి వస్తుంది. కాకుంటే కొత్తగా రాసే కవులకు ఈ శిల్ప విశేషాలు ఉపయోగపడతాయి. వస్తువిశ్లేషణ పాఠకులకు కూడా ఉపయోగపడుతుంది. విప్లవ రచయితలు చేసే సాహిత్య విమర్శ ప్రధానంగా పాఠకులలోనూ, రచయితలలోనూ విషయ సంబంధమైన అవగాహనను పెంపొందించడానికే. అంతేగాని శిల్పం గురించి మాట్లాడకూడదన్న నియమమేమీ లేదు.

సాహిత్య పరిధి జీవితం అని అంటూ జీవితం అంటే భౌతిక జీవితం ఒక్కటే కాదనీ, ఆలోచనలూ, అభూతకల్పనలూ, అతీత జీవితం కూడా మానవ జీవితంలో భాగమేనని అంటారు చేరా. వీటిని గుర్తించకపోతే సాహిత్య పరిధి సంకుచిత మవుతుందనీ, ఎన్నో రకాల అద్భుత అవాస్తవిక పాత్రలతో జీవిత సత్యాలను చెప్పిన కథలకు ప్రమేయం లేకుండా పోతుందనీ, దీనివల్ల వ్యంగ్య హాస్య రచనలన్నా, సైన్స్ ఫిక్షన్ వంటి వాటిని వదులుకోవాల్సి వస్తుందనీ చేరాగారిలో అప్పుడప్పుడూ కొన్ని అనవసర భయాలు చోటు చేసుకుంటుంటాయి. అలాంటివాటిలో ఇదొకటి. మానవ జీవితాన్ని కేవలం భౌతిక జీవితంగానే కుదించి ఆలోచించేవాళ్ళు ఎవరూ ఉండరు. కవిత్వంలోనే గాక. సాహిత్యంలోని అన్ని ప్రక్రియలోను. చేరా చెప్పిన అన్ని ధోరణులు ఉంటాయి. మనిషి ఆలోచించే జంతువని అంటారు. ఆలోచించకపోతే మనిషేకాదు. ఆ ఆలోచన భౌతిక విషయాల గురించేకాదు, అభౌతిక విషయాల గురించి కూడా సాగుతుంది. ఊహలకు రెక్కలొస్తాయి. ఎక్కడెక్కడికో ఎగిరిపోతుంటాయి. అనంతవిశ్వంలో వ్యాపిస్తాయి. అయితే వాటి మూలాలు ఈ భూమ్మీదనే అనే విషయం రచయిత మర్చిపోగూడదు. రచయిత మర్చిపోతే విమర్శకుడు గుర్తు చెయ్యాలి. ఇక్కడ మార్క్సిస్టు విమర్శకుడి అవసరం ఉంటుంది.

విస్తృతమైన పాండిత్యం, లోతైన పరిశీలన, ఊహకు స్పందించే రసజ్ఞత విమర్శకులందరికీ ఉండాల్సిన లక్షణాలని ఒక సందర్భంలో అన్నారు. ఇవన్నీ అస్పష్టమైన మాటలు. ఆ పాండిత్యం, పరిశీలన, రసజ్ఞత - ఇవన్నీ దేనికోసం? వాటి లక్ష్యం ఏమిటి? అవి ఉండి సాధించవలసినదేమిటి? వీటికి స్పష్టమైన సమాధాలు చేరా విమర్శలో పెద్దగా దొరకవు. కేవలం శిల్పానికో, అనుభూతికో పరిమితమైన విమర్శలో ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరకనప్పుడే మార్క్సిస్టు విమర్శకుడి అవసరం ఉంటుంది.

మార్క్సిస్టు సాహిత్య విమర్శపైన చేరాకు కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి. సాహిత్య నేపథ్యాన్ని వివరించడంలో కమ్యూనిస్టులు చాలా విలువైన విమర్శ చేశారని అంగీకరిస్తారు. కానీ సమకాలీన సాహిత్యాన్ని విశ్లేషించడంలో, నిర్దేశించడంలో, అంచనా వెయ్యటంలో చాలా క్రూరంగా ఉన్నారంటారు. అభ్యుదయ సాహిత్య కాలంలోగానీ, విప్లవ సాహిత్యంలోగాని ఇదే జరిగిందంటారు. ఈ విమర్శ చాలా మంది చేస్తున్నదే. ఇందులో కొంత నిజం లేకపోలేదనిపిస్తుంది. అయితే అకారణంగా క్రూరంగా ఉన్నారా? లేక క్రూరంగా ఉండవలసిన అవసరం ఏర్పడిందా? ఇది జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయం. విషయాన్ని నిర్మొహమాటంగా ముఖం మీద కొట్టినట్టు చెప్పడం, నిర్దాక్షిణ్యంగా తప్పుల్ని చూపించడం క్రూరమైన విమర్శే అయితే, అభ్యుదయ సాహిత్యోద్యమంలో రాచమల్లు రామచంద్రారెడ్డి, విప్లవ సాహిత్యోద్యమంలో త్రిపురనేని మధుసూధనరావు అలాంటి క్రూరమైన విమర్శకులే.

"గురజాడ ప్రభావం లేకుండా శ్రీశ్రీ లేడు. శ్రీశ్రీ లేకుండా సుబ్బారావుపాణిగ్రాహి, శివసాగర్, గద్దర్, వంగపండు లేరు. సామాజిక శక్తులగమనం లేకుండా అసలు వీళ్ళెవరూ లేరు. సాహిత్య పరిశీలనలో సామాజిక దృష్టి విడవకూడదు" అన్న శ్రీశ్రీ మాటల్ని ఉదహరించి, ఇలా పాఠాలు చెప్పే పద్ధతి మానుకుంటే మంచిదని చేరా సలహా ఇచ్చారు. చెప్పడం మానుకోక పోయినా కనీసం తగ్గించుకోవాలట. ఇక్కడ సమస్య పాఠాలు చెప్పడం, చెప్పకపోవడం కాదు. శ్రీశ్రీ తన అభిప్రాయాలు సూటిగా, స్పష్టంగా చెప్పాడు. వాటిలో లోపాలున్నాయనుకుంటే చర్చించాలి అంతేగాని అసలు చెప్పడమే తప్పనే నిర్ణయానికి రాకూడదు.

"ప్రజల భాషలో ఉండే పదాలు, నుడికారాలు, వాళ్ళకి పరిచితమైన ఇమేజెస్ వాడగల్గితే అది ప్రజాకవిత్వం అవుతుంది"

"ఈనాడు ఆత్మాశ్రయ, అనుభవవ్యక్తి విమర్శలు కరువయ్యాయి. ఇవే పాఠకులకు ఉపయోగపడతాయి".

"తెలుగులో ఏ ధోరణీ ఎప్పటికీ అంతంకాదు. ఇప్పటికీ పురాణాలు, ప్రబంధాలూ, భావకవిత్వాలు వస్తున్నాయి."

'దళితకవిత్వం దళిత భాషలోనే ఉండాలనడం ఆలోచనలేని మొండితనం. భాషా సంపద ఏ ఒక్కరి సొత్తుకాదు. అది అందరిదీ"

ఈ చేరా వాక్యాలు కూడా పాఠాలు చెప్పే పద్ధతిలోనే ఉన్నాయి. వీటిలో వాస్తవాలుండొచ్చు లేదా చర్చనీయాంశాలుండొచ్చు. ఇవి చేరా అభిప్రాయాలు. ఇది సత్యం. అభిప్రాయాలు స్పష్టంగా ఉండడంలో తప్పులేదు. ప్రతివిషయాన్నీ అనుమానాస్పదంగా, బహుశా, ఏమో పదాలుపయోగిస్తూ చెబితే పాఠకులకు ఆ విమర్శకుడిపైనే నమ్మకం పోతుంది. పైగా పాఠాలు చెబుతున్నానన్న అహంకారం లేకపోతే పాఠాలు చెప్పడం తప్పు కాదు. కొందరు చెబితేనే గదా,

చాలామంది నేర్చుకునేది. భాషా శాస్త్రంలో చేరా పాఠాలు చెప్పలేదా? పాఠకులు నేర్చుకోలేదా? అసలు విషయం చేరాకు మార్క్సిస్టు సాహిత్య విమర్శపైన తేడా లేదా విమర్శకులపైన ఉన్నకోపం ఆయనచేత అలా అనిపిస్తుంది. ప్రతివ్యక్తీ ఉపాధ్యాయుడే, ప్రతివ్యక్తీ విద్యార్థే. ఎవరు ఎవరినుంచైనా నేర్చుకోనే విషయం ఒకటైనా ఉంటుంది. సాహిత్యంలోనూ, సాహిత్య విమర్శలోనూ కూడా ఈ నియమం వర్తిస్తుంది.

సాహిత్యంలో మాండలిక భాషకు కూడా గౌరవ ప్రదమైన స్థానం కల్పించడంలో మాత్రం విరసం కృషిని చేరా అంగీకరించారు. వ్యక్తుల కృషివల్లగాక, సంస్థాగతమైన కృషివల్లనే మాండలిక భాషలకు సాహిత్య గౌరవం వచ్చిందనేది నిర్వివాదాంశం. ఒకసారి ఆ గౌరవం ఏర్పడ్డాక వ్యక్తుల కృషి కూడా దానికి తోడవుతుంది. దీనికి ఒకటీ అరా అపవాదులుంటే ఉండవచ్చు. ఇది వాస్తవం అనే విషయంలో సందేహం లేదు.

మొత్తం మీద మార్క్సిస్టు సాహిత్య విమర్శ సాహిత్యానికిగల నేపథ్యాన్ని బాగా వివరించిందని చేరా ఒప్పుకున్నారు. అయితే నేపథ్యం నేపథ్యం అవుతుందేగాని, సాహిత్య విమర్శ కాదంటారు. నేపథ్యాన్ని వదిలేసి కేవలం విషయాన్ని విశ్లేషించడమే సాహిత్య విమర్శగా చేరాగారు భావిస్తారని ఎలా అనుకోగలం? పైగా ప్రసిద్ధ మార్క్సిస్టు విమర్శకులు కూడా ఈ నేపథ్యాన్నే సాహిత్య విమర్శగా భ్రమిస్తున్నారని అంటారు. సాహిత్య విమర్శలో రెండు భాగాలుంటాయని అనుకుంటే అందులో మొదటి భాగం నేపథ్యం. రెండో భాగం ప్రత్యేకంగా ఒక కవికో, ఒక రచనకో సంబంధించింది. ఉదాహరణకు బ్రిటీష్ పరిపాలనా కాలంలో తెలుగులో వచ్చిన సంఘ సంస్కరణ సాహిత్యాన్ని తీసుకుందాం. కందుకూరి, గురజాడ అనే ఇద్దరు రచయితలూ ఈ రకమైన సాహిత్యాన్ని సృష్టించిన వారిలో ముఖ్యులు. సంఘ సంస్కరణ సాహిత్యానికి ఉన్న నేపథ్యాన్ని వివరించడం సాహిత్య విమర్శలో మొదటి భాగం. ఆ తర్వాత కందుకూరి, గురజాడల ప్రత్యేకతల్నీ, తారతమ్యాల్నీ విశ్లేషించడం రెండో భాగం. ఒక మతంలోగాని, ఒక కులంలోగాని, లేదా ఒక వర్గంలోగాని మానవజాతిని పట్టిపీడిస్తున్న సాంఘిక దురాచారాన్ని నిర్మూలించడం సంఘ సంస్కర్తల ప్రధానకార్యక్రమం. వరకట్నం, కన్యాశుల్కం, స్త్రీవిద్య, వితంతు వివాహాలు, మూఢ విశ్వాసాలు మొదలైనవి వారి కార్యరంగాలు. ఆంగ్లేయుల రాకతో దేశంలో సాంఘిక ఆర్థిక రాజకీయరంగాలలో పెనుమార్పులు సంభవించాయి. ఆంగ్లభాషద్వారా ప్రపంచాన్ని మరింత అర్థం చేసుకోవడానికి ప్రయత్నం జరిగింది. ఈ చైతన్యంతోనే కందుకూరి, గురజాడలాంటి సంస్కరణ భావాలుగల రచయితలు వచ్చారు. వీరి భావాలకు ఆంగ్లేయులు ప్రోత్సాహం ఇచ్చారు. రాజకీయాధికారాన్ని వీరుకోరుకోవడం లేదు కాబట్టి ఆంగ్ల పాలకులకు వచ్చిన ఇబ్బంది లేదు. రాజకీయ స్వాతంత్ర్యం కోరుకోనంతవరకు వీరి సంస్కరణభావాలను ప్రోత్సహించినందువల్ల వారికొచ్చిన సమస్యలేదు. తరతరాల మూఢ విశ్వాసాల నుండి, సాంఘిక దురాచారాల నుండి ఒక్కసారిగా ఆధునిక సమాజంలోకి అడుగు పెట్టడానికి సిద్ధంగా ఉన్న కాలం అది. సంఘ సంస్కరణ భావాలుగల రచయితలందరికీ ఈ నేపథ్యం సామాన్యం అవుతుంది. ఈ నేపథ్యాన్ని వివరించకుండా కేవలం కందుకూరి, గురజాడల రచనల్ని మాత్రమే ఆధారంగా విమర్శ చేస్తే అది మార్క్సిస్టు సాహిత్య విమర్శ మాత్రం కాదు. ఆ తర్వాత కందుకూరి, గురజాడల ప్రత్యేకతల్ని వివరించడం రెండో భాగం. కందుకూరి, గురజాడ ఇద్దరూ వితంతు వివాహాల్ని చెయ్యడం కోరుకున్నవారే. ఏదో రకంగా ఒక వితంతువుకి ఎవరితో ఒకరితో వివాహం అయితే చాలు అన్నట్టు కందుకూరి తపన పడ్డాడు. ఆ వితంతువుల్ని చేసుకునేవారు గిరీశం లాంటి వాళ్ళు కాకుండా జాగ్రత్త పడాలని గురజాడ భావించాడు. నేపథ్యాన్ని పట్టించుకోకుండా కేవలం కన్యాశుల్కాన్నే చూస్తే గురజాడకు వితంతు వివాహాలపైన నమ్మకం లేదేమో అనిపించకపోదు. వితంతు వివాహాలు చేసుకోడానికి సిద్ధపడే వాళ్ళందరూ గిరీశాలే అని గురజాడ భావించినట్టు పొరబడే అవకాశం ఉంది. నేపథ్యం తెలియకపోతే ఒక రూపాయిని దొంగతనం చేసినవాడూ, కోటి రూపాయలు దోచుకున్న వాడూ ఇద్దరూ దొంగలే అని ఇద్దర్నీ ఒకేగాట కట్టెయ్యడానికి అవకాశం ఉంది. కాబట్టి సాహిత్యా విమర్శలో నేపథ్యాన్ని చిన్నచూపు చూడడం వల్ల రచయితల అభిప్రాయాల్నీ, ఉద్దేశాల్నీ అపార్థం చేసుకునే ప్రమాదం ఉంది. అందుకే నేపథ్యానికి మార్క్సిస్టు విమర్శకులు అంత ప్రాధాన్యం ఇస్తారు. నేపథ్యం అర్థమయితే ఆయా రచయితల్ని అర్థం చేసుకోవడం తేలిక. నేపథ్యం అర్థంగాకపోతే ఆయా రచయితలు సరిగ్గా అర్థం గారు. తెలుగు సాహిత్య విమర్శలో మార్క్సిస్టులు కానివారు కూడా ఈ నేపథ్యాన్ని వివరించడానికి ప్రయత్నించడం మనం గమనించొచ్చు.

మార్క్సిస్టు విమర్శకు నమూనాగా గ్రహించదగిన గ్రంథంగాని, ప్రక్రియా విమర్శగాని తెలుగులో ఇంకా రావలసే ఉందని, ఈ విషయంలో అభ్యుదయ సాహిత్యంకన్నా, విప్లవ సాహిత్యం సాధించిందేమీ లేదని చేరా గారి అభిప్రాయం. అసలు అభ్యుదయ రచనకూ, విప్లవ రచనకూ స్పష్టమైన భేదం లేదని కూడా చేరా భావించారు. చెరబండరాజు పాటల్లో కొన్ని చరణాలను మననం చేస్తే కొన్ని చరణాలను మినహాయిస్తే అన్ని రకాల మార్క్సిస్టులకు అంగీకారం అవుతాయంటారు. ఆ కొన్ని చరణాలను ఎందుకు మినహాయించాలో చేరా చెప్పరు. చెరబండరాజు రాసిన 'కొండలు పగలేసినం' పాటలో

> "కారణాలు తెలిసినం
> ఆయుధాలు పట్టినం
> మా యుద్ధం ఆపకుండ
> విప్లవాలు నడిపెదం
> చావు మీదిరో
> గెలుపు మాదిరో"

అన్న చివరి చరణాలను కాస్త మార్చుకొని ఆంధ్ర ప్రజానాట్య మండలి వారు పాడుకున్నారు. ఆ పాటలో అంతకు ముందున్న చరణాలలోని విషయంతో చాలా మందికి పేచీ ఉండదు - ముఖ్యంగా కమ్యూనిస్టులకు. కాని ఈ చివరి చరణాలు కమ్యూనిస్టులకు కూడా అభ్యంతరకరంగా ఉంటాయి. ఆయుధం పట్టడం, శత్రువు చావు కోరుకోవడం అన్నదొక్కటే విప్లవ సాహిత్యానికి సంబంధించిందని తీర్మానిస్తే అది కుతర్కం అవుతుంది. జీవితంలోని వైరుధ్యాన్ని వివరించిన నేపథ్యంలో ఆయుధాలు పట్టడమన్న ప్రసక్తి వస్తుంది. ఈ ఒక్కటి తప్ప తేడా ఏముంది. అనడం - పెట్టుబడిదారులూ అన్నం తింటున్నారు, కార్మికులూ అన్నం తింటున్నారు, ఇద్దరికీ తేడా ఏముంది అని అన్నట్టుంటుంది.

మార్క్సిస్టు విమర్శకు నమూనాగా ఒక ప్రామాణిక గ్రంథం లేని మాట నిజమే. లేదని చేరా అన్నంతమాత్రాన ఉందని వాదించాల్సిన అవసరం లేదు. కానీ అలా ఒక ప్రామాణిక గ్రంథం ఉంటుందా, ఉండదా, ఉండకపోవడానికి కారణాలేమిటి అని పరిశీలించాలి. ఆధునిక సమాజంలో ఒక ప్రామాణికం ఉండదు. ఒక వ్యక్తి ఆదర్శప్రాయం అనే అభిప్రాయం కుదరదు. ఆ లెక్కన ప్రాచీన భారతీయ లాక్షణికులు (అప్పటి సాహిత్యా విమర్శకులు) అందరూ ఒక విషయాన్ని అంగీకరించారా? ఎంతమంది ఎన్ని రకాలుగా కావ్యాన్ని నిర్వచించలేదు? కావ్యానికి శరీరం ఏది? ఆత్మ ఏది అనే విషయంలో ఎన్ని భిన్నాభిప్రాయాలు లేవు? రసాలు ఎనిమిదనీ, తొమ్మిదనీ, పదనీ, చివరకు అనంతం అనికూడా అన్నారు గదా? క్రీ.పూ.రెండో శతాబ్దంలో వచ్చిన భారతుడి దగ్గర నుంచి, క్రీ.శ. 18వ శతాబ్దంలో వచ్చిన విశ్వేశ్వరుడి వరకు 20 శతాబ్దాలపాటు వచ్చిన అలంకార శాస్త్రాలన్నిటినీ కలిపి ప్రాచీన అలంకారికుల అభిప్రాయాలు అంటున్నాము. ప్రాచీనకాలపు పరిస్థితి ఇలా ఉంటే ఇక ఆధునిక కాలంలో సమాజంలో ఏర్పడిన ఎంతో వైవిధ్యం, ఎన్నో సిద్ధాంతాలు, ఎన్నో విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణల రాజకీయార్థిక పరిణామాల నేపథ్యంలో మార్క్సిజం కూడా అందరికీ ఒకే రకంగా అర్థం అవుతుందా? అలా అర్థంగావడానికి కొంత సమయం పట్టదా? ఒకటిన్నర శతాబ్దాల చరిత్ర మాత్రమే ఉన్న మార్క్సిజం ఇప్పటికే ప్రపంచాన్ని ఒక ఊపు ఊపింది గదా. ఇతర అన్ని శాస్త్రాలలోని గురుదోషాలను చాలావరకు అర్థం చేయించే సిద్ధాంతంగా రూపొందిందనడం నిజంకాదా? అలాగే మార్క్సిస్టు సాహిత్య విమర్శ ఒక రూపం తీసుకున్నట్టు

కనబడకపోవచ్చు. మద్దుకూరి చంద్రశేఖరరావు దగ్గర నుండి ఇప్పటిదాకా ఎందరో మార్క్సిస్టు సాహిత్య విమర్శకులు వచ్చారు. వీరందరికీ అనుసరణీయమైన సిద్ధాంతం మార్క్సిజమే అయినా, ఈ అరవై సంవత్సరాల మార్క్సిస్టు సాహిత్య విమర్శలో ఎన్ని మార్పులు వచ్చాయో, ఒకరి తర్వాత ఒకరు మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ఎన్ని మార్పులు, చేర్పులు చేశారో తెలుసుకోలేమా?

ఊహల్లో కలలుగనే శక్తినే కాల్పనికత అంటున్నాననీ, ఇది ఉన్నవాడు మంచి కవి అవుతాడనీ, ఈ శక్తి విప్లవకవికి తప్పనిసరిగా ఉండాలని హోచిమిన్, శివసాగర్‌లు రుజువు చేశారనీ చేరా భావించారు. ఊహల్లో కలలుగనే ఈ కాల్పనిక శక్తి విప్లవ కవులకే కాదు, అన్ని రకాల కవులకూ ఉంటుంది. అయితే ఎవరి ఊహలు వారివి. ఎవరి కలలు వారివి. సోషలిస్టు ప్రపంచం గురించి కలలు గనేవారు విప్లవకవులవుతారు. ఇంతకూ విప్లవకవుల్లోని కలలుగనే శక్తినే చూస్తున్నారుగాని, చేరాగారు ఆ కలలు ఎవరికోసం కంటున్నారో పట్టించుకోవలసిన విషయంగా భావించడం లేదు.

చేరా ఆత్మాశ్రయ అనుభవవాద విమర్శకులు. అలాంటి విమర్శలు కరువయ్యాయని బాధపడతారు. సాహిత్యానుభవ వ్యక్తీకరణకే ప్రాధాన్యం ఇస్తారు. సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఇవ్వరు. సాహిత్యం ఆహ్లాద కారకంగానూ, మనో వికాసకారకంగానూ ఉండాలి. రాజకీయ ప్రయోజనం కూడా ఉంటే పెద్దగా అభ్యంతరం లేదు. మొదట మార్క్సిజం పరిధిలో ఆలోచించారు. ఆ తర్వాత దానికి పరిమితులున్నాయని భావించి అంతకంటే విశాలం అనుకున్న ఆత్మాశ్రయ వ్యక్తి అనుభవవాద విమర్శా ప్రపంచంలో స్థిరపడ్డారు. సాహిత్య విమర్శలో భాషా శాస్త్ర నియమాలను అన్వయించినవారిలో తొలి తెలుగు సాహిత్య విమర్శకులు, ఛందశ్శాస్త్రం పట్ల మక్కువ ఎక్కువ. భావ ప్రకటనకు ఆటంకం కలిగించే ఆలంకారిక శైలి సాహిత్య విమర్శలో పనికిరాదని గట్టిగా నమ్ముతారు. కవిరాసిన పద్యంలో కవిత్వం స్వతహాగా ఉండదంటారు. దాన్ని విన్నవారిలో లేదా చదివినవారిలో కలిగిన అనుభూతిలో కవిత్వం ఉందంటారు. అనేక రకాల ఆలోచనల సమ్మేళనంతో కూడిన విమర్శకుడిలా చేరా కనిపిస్తారు. చాలా వరకు సహనంతోనే ఉంటారు, కమ్యూనిస్టులు, విప్లవ రచయితలు గుర్తొచ్చినప్పుడు మాత్రమే కాస్తసహనాన్ని కోల్పోతారు. ఇది ఆయన ప్రయత్న పూర్వకంగా సంపాదించుకున్న గుణం కాకపోవచ్చు.

మొత్తంమీద చేరా సాహిత్య విమర్శలో మార్క్సిస్టు సాహిత్య విమర్శకులు నేర్చుకోవలసిన లక్షణాలు ఎన్ని ఉన్నాయో, నేర్చుకోకూడని లక్షణాలూ అన్ని ఉన్నాయి. చేర వర్గ సంఘర్షణకాలంలో వచ్చిన వర్గాతీత అనుభవవాద సాహిత్య విమర్శకులు. ఎప్పటికైనా ఆయన్ను సరిగా అంచనా వేయగలవారు మార్క్సిస్టు సాహిత్య విమర్శకులే.

స్పందన

☆ జయంతి పాపారావు

'ప్రపంచీకరణ - కొత్త కోణాలు - కథాప్రక్రియ' అనే వ్యాసాన్ని చదివాను. ఆ వ్యాసం సూచించినట్లు సాహిత్యం వస్తే, అది మేధోవర్గానికి పరిమితమైపోయే సాహిత్యమే వస్తుంది. కొందరు పాఠకులకు సంతృప్తి నిచ్చే సాహిత్యమూ అది కావొచ్చు. అంతేకాదు, దానివల్ల సాహిత్యాన్ని తప్పుదారిపట్టించే అవకాశమూ, ప్రమాదమూ కూడా ఏర్పడవచ్చు.

బ్రిటీషు సామ్రాజ్యవాదం ఏరోజున విరుచుకుపడ్డం ప్రారంభించిందో, ఆరోజే ప్రపంచీకరణ రాజకీయ ఆర్థిక సామాజిక సాంస్కృతిక విధ్వంసం ప్రారంభమైంది. అది 'ప్రత్యక్ష' వలస రాజ్యాధికారం కావడం వల్ల, ఆ విధ్వంసమంతా అంతగా బయటకు రాలేదు. అది 'ప్రత్యక్ష' దోపిడీ, విధ్వంసం కావడం వల్ల, దానికి ప్రపంచీకరణ సాధనంగా అవసరం లేకపోయింది. ఇది మనదేశానికి మాత్రమే పరిమితంకాదు; సామ్రాజ్యవాద దురాక్రమణకు బలైన అన్ని దేశాలకూ వర్తిస్తుంది. ప్రజల త్యాగాలతో, ప్రజల రక్త ప్రవాహాలతో బలమైన ప్రజా ఉద్యమాలు రావడం వల్ల, సామ్రాజ్యవాద 'ప్రత్యక్ష వలస రాజ్యాధికార' వ్యవస్థపోయింది.

ఆ సందర్భంలో సామ్రాజ్యవాద దురాక్రమణ చేతులు మారింది. అమెరికా సామ్రాజ్యవాదం చేతుల్లోకి వెళ్లిపోయింది. సామ్రాజ్యవాద దురాక్రమణ రూపం, విధానం మారింది. 'ప్రత్యక్ష' దురాక్రమణ 'పరోక్ష' దురాక్రమణగా మారింది. ఈ 'పరోక్ష' దురాక్రమణ పలువ్యూహాల్లో పనిచేస్తోంది. ప్రపంచీకరణ ప్రపంచబ్యాంకు వస్తు వినియోగ ఆధారిత ఆర్థిక వ్యూహాలూ, మార్కెట్ విధానాలు - బహుళ జాతి సంస్థల - వంటి పలు సాధనాలు ఉపయోగిస్తూ వస్తోంది. 'పరోక్ష' వలస రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఆ లక్ష్యం కోసం, ప్రజలు ఎన్నుకున్న 'రాజ్యాన్నీ', ఆ రాజ్యంలోని పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థనీ, ఆర్థిక విధానాలనూ, తమ దురాక్రమణకూ, దోపిడీకీ ఉపయోగపడే 'మధ్యవర్తులు'గా, 'మధ్యవర్తుల వ్యవస్థ'గా దిగజార్జడమే వ్యూహంగా పనిచేస్తోంది.

ఈ నేపథ్యంలోంచే, ప్రజలు ప్రజ ఉద్యమమార్గాల్లో విముక్తి పోరాట వ్యూహాలూ, పోరాటాలూ నిర్మించుకోవాల్సి వుంది.

ఈ పరిస్థితిలో ఇప్పుడు ఏం జరుగుతోంది? ప్రజలకు 'ఇద్దరు శత్రువులు' వ్యవస్థ ఏర్పడిపోయింది. సామ్రాజ్యవాద 'పరోక్ష' దురాక్రమణ ప్రజలకు 'పరోక్ష' శత్రువు. మరి ప్రత్యక్ష శత్రువు ఎవరు? ప్రజలు ఎన్నుకున్న 'రాజ్యం' ఏం చేస్తోంది? 'పరోక్ష శత్రువు' దురాక్రమణనూ, దోపిడీని ప్రజల నెత్తిమీద రుద్దుతున్నప్పుడు, 'రాజ్యాన్ని' ప్రజలు 'ప్రత్యక్ష శత్రువు' గానే పరిగణిస్తారు. ఈ పరిస్థితిని రాజ్యమే సృష్టిస్తోంది.

ఈ 'ఇద్దరు శత్రువులు' వ్యవస్థ సృష్టిస్తున్న ప్రపంచీకరణ రాజకీయ ఆర్థిక సామాజిక సాంస్కృతిక విధ్వంసంవల్ల ప్రజా జీవితం తమ సర్వస్వాన్నీ, తమ బతుకు తెరువులనూ, తమ అన్ని మూలాలనూ, తమ అన్ని జీవనశైలులనూ, తమ అన్ని జీవన విలువలనూ కోల్పోతూ అస్తవ్యస్తం, అతలాకుతలం అయిపోతోంది. ఇది అంతిమంగా ఎక్కడకు దారి తీస్తుంది? ప్రజలు తమస్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోయే పరాధీన స్థితికి దారితీస్తోంది.

పలు విధాలుగా, పలుమార్గాల్లో, పీడనకు బలైపోతున్న ప్రజలకు ఆ పీడన గురించి బాగా తెలుసు. దాన్నుంచి బయటపడడమే ప్రజలకు తెలీదు. ఇక్కడే సాహిత్యం బలంగా వ్యూహాత్మకంగా పనిచేయాల్సి వుంది. ప్రజలు ఏ శత్రువుతో పోరాడాలి? ఇదీ ఇప్పుడు ప్రజల ముందున్న ప్రశ్న? జవాబు స్పష్టంగానే వుంది. 'పరోక్ష శత్రువు' పట్ల ఎంత వ్యతిరేకత పెల్లుబికినా, శత్రువుపట్ల శత్రుత్వం ఉరకలు వేసినా, అది ఉద్యమంగా విజృంభించలేదు. మన ప్రజలూ, ప్రజా ఉద్యమాలూ 'పరోక్ష శత్రువు'తో ఎలా పోరాడగలరు? పోరాడలేరు. ఎందుకంటే - మనదేశంలో ఇప్పటివరకూ రూపుదిద్దుకున్న ప్రజా ఉద్యమాలన్నీ, సాయుధ పోరాట ప్రజా ఉద్యమాలతో పాటు అన్ని ఉద్యమాలూ కూడా 'ప్రజాస్వామిక ప్రజా ఉద్యమాలే' ఇటువంటి ఉద్యమాలు 'పరోక్ష శత్రువు'తో పోరాడలేవు. పోరాడినా, సాధించగలిగే ఫలితం ఏమీ వుండదు. బలమైన 'ఉగ్రవాద సంస్థలు' మాత్రమే పరోక్ష శత్రువుతో పోరాడగలవు. ఈ చారిత్రక సత్యాన్ని మనం విస్మరించలేం.

ఇటువంటి పరిస్థితిలో పరోక్ష శత్రువు పట్ల వ్యతిరేకత, ప్రజల శత్రుత్వం అవసరమే అయినప్పటికీ, దాని వల్ల 'ప్రత్యక్షశత్రువు'ని విస్మరించడమో, లేదా రాజ్యమే అటువంటి పరిస్థితిని సృష్టించడమో, జరిగే అవకాశమూ, ప్రమాదమూ లేదని చెప్పుకోలేం.

అందువల్ల ప్రజలు 'ప్రత్యక్షశత్రువు' మీదే ఉద్యమించి పోరాడాల్సివుంది. 'పరోక్షశత్రువు' సృష్టిస్తున్న సమస్త విధ్వంసాలనూ 'ప్రత్యక్షశత్రువు' సృష్టిస్తున్న సమస్త విధ్వంసాలనూ 'ప్రత్యక్షశత్రువే' అడ్డుకునేలా, అంతిమంగా 'పరోక్షశత్రువు'తో పోరాడాలి. అంతిమంగా రెండు శత్రుత్వాలూ నిర్మూలనం కావాలి. ఈ దిశలోనే బలమైన సాహిత్యం రావాల్సి వుంది. వ్యాసంరాసేముందు, ఇటువంటి పలు అంశాలనూ, అవసరాలనూ, అనివార్యతలనూ, వ్యూహాలనూ పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఎన్.వేణుగోపాల్ గుర్తించినట్లు లేదు.

*

గురజాడ సాహిత్యం

☆ ఉ.అ.నరసింహ మూర్తి

బ్రిటీష్ పరిపాలనలో భారతదేశమంతా ఇంచుమించుగా ఒక గొడుగు క్రిందకు చేరింది. ఆధునిక విద్య భారతీయ మేధావులలో ఆలోచనా వినిమయానికి దారితీసింది. సంస్కరణవాదుల ప్రయత్నాలు త్వరితగతిని దేశమంతా వ్యాపించాయి. భావసారూప్యంగల మేధావులలో భావ వినిమయం జరిగి ఆధునిక సాహిత్య వికాసం మొదలయింది. గురజాడ ఆధునిక మేధావి అయిన కారణంచేత సంస్కరణవాద దృక్పథం గల ఆధునికుల రచనలను తొలిదశ నుండి విమర్శదృష్టితో అధ్యయనం చేసాడు. ఆ అధ్యయన ఫలితంగా గురజాడ సాహిత్యం వెలువడింది. ఆయన రాయదలచుకొన్నది ఎక్కువ అయినా రాసినది తక్కువ. ఆయన తక్కువ కాలం జీవించాడు. రాచకార్యాలు, అనారోగ్యం ఆయన కాలాన్ని ఎక్కువగా హరించాయి. అందుచేత మునివ్రేళ్లలో ఇమిడిపోగల ప్రమాణంతో కూడిన సాహిత్యాన్నే ఆయన సృష్టించగలిగాడు. అది రాశిలో చిన్న, వాసిలో మిన్న.

గురజాడ తెలుగు సాహిత్యానికి కనువిప్పు. మన ధర్మాన్నీ, జాతినీ, సంస్కృతినీ సంరక్షించే గ్రంధాలన్నీ తెలుగులో కొన్ని శతాబ్దాల క్రిందటే వచ్చాయి. ఆ తరువాత వచ్చిందంతా మన ధర్మాన్నీ, జాతినీ, సంస్కృతినీ సంరక్షించే దృష్టితో వచ్చినది కాదు. అదంతా సాహిత్యకళ. సామాజిక దృష్టి కంటే కళాదృష్టి పెచ్చరిల్లి కళపేరుతో నకళ్లకు నకళ్ళు అబద్ధాల పుట్టలు బూతులబుంగలు చలామణి అవుతున్న రోజుల్లో ఘూకం కేకా బాకం బకాలతో దద్దరిల్లుతున్న సాహిత్య నిశీధికి మానవతాకేతనమెత్తిన వెలుగు కిరణమై గురజాడ ఉదయించాడు. తనకాలంలో తన చుట్టూ దేశ విదేశాలలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి, దానిని సాహిత్య వస్తువుగా మలచుకోవడానికి ప్రయత్నించిన మొదటి రచయితలు గురజాడ, కందుకూరి. అందులో ఆధునిక భారతీయ రచయిత స్వరం మారిందని గుర్తించిన వాడు గురజాడ. తెలుగువాడు ఆ స్వరంతో తన స్వరం కలిపి కాలంతో పాటు ముందడుగు వేయవలసిన చారిత్రక అవసరాన్ని గుర్తించిన వాడు గురజాడ. వస్తువు - భాష - భావం- ప్రక్రియ - కళాచైతన్యం అన్నీ ఎలా ఆధునిక రూపాన్ని సంతరించుకున్నాయో తెలుసుకొని విస్తృతమైన అధ్యయనం, విశాలమైన అవగాహనతో సమర్థంగా, సమగ్రంగా ముందుగా ఆకళించుకొని తెలుగు సాహిత్యానికి సమకాలీన చైతన్యాన్ని అందించి "వెనుక బడితే వెనుకేనోయ్" అని తెలుగువాణ్ణి హెచ్చరించి ఒక బాధ్యత గల రచయితగా 'మందగించక ముందు కడుగెయ్' అని హితోపదేశం చేసిన అడుగుజాడ గురజాడ.

ఈనాడు గురజాడ కాల్పనిక సాహిత్యంలో 'కన్యాశుల్కం', 'కొండుభట్టీయం', 'బిల్హణీయం' అనే నాటకాలు; ఆణిముత్యాలు అనే ఐదు కథలు; 'ముత్యాల సరాలు' అనే కవితా సంపుటి లభిస్తున్నాయి. ఆంగ్లంలోను, తెలుగులోను కలిపి రాసిన మూడు పదులు పైబడిన వ్యాసాలు లభిస్తున్నాయి. ఆంగ్లంలో ఆయన వ్రాసిన లేఖలు - డైరీలు తెలుగులో కావ్య గౌరవాన్ని అందుకొన్నాయి. "మాట - మంతి", "అవీ-ఇవీ" అనే పేర ఆయన అప్పుడప్పుడు ఇంగ్లీషులోను, తెలుగులోను వ్రాసుకొన్న కొన్ని ఆలోచనలు, లఘురచనలు, టీకా టిప్పణిలు ప్రచురింపబడ్డాయి. అందులో "ఆనంద గజపతి దర్బారు ముచ్చట్లు" "ప్రకృతి అనే పుస్తకము" అనే రచనలు చెప్పుకోదగ్గవి. "సౌదామిని" అనే అసంపూర్ణ నవలా ప్రణాళిక లభిస్తోంది. సాహిత్యం వ్యక్తిగతానందం కోసం కాదు. అది సామాజిక రుగ్మతలను రూపుమాపే బలమైన ఆయుధం కావాలి అని గురజాడ ప్రగాఢంగా విశ్లేషించి తన సాహిత్య రచన కొనసాగించాడు. ఆయన చేపట్టిన ప్రక్రియలు తెలుగు సాహిత్యానికీ క్రొత్త గానీ ప్రపంచ సాహిత్యానికీ, సమకాలీన భారతీయ సాహిత్యానికీ క్రొత్తకాదు. ఆ సాహిత్యం పైన ఇతరేతర శక్తుల ప్రభావాలెన్నో ప్రకటంగా కనిపిస్తాయి.

'కన్యాశుల్కం'లోని ఇతివృత్తం భారతీయ సమాజానికి కొత్తదికాదు. భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన సమస్యలే ఈ నాటకేతి వృత్తంలో ఉన్నాయిగానీ కొత్త సమస్య ఒక్కటీ లేదు. కన్యావిక్రయం, బాల్యవివాహం, వితంతువు పునర్వివాహం, వేశ్యాగమనం, మూఢాచారాలు, అవినీతి, సనాతన నూతన వ్యవస్థల మధ్య ఏర్పడిన సంఘర్షణ - అనే ప్రధాన సమస్యలు కన్యాశుల్కంలో కనిపిస్తాయి. వివిధ భారతీయ భాషల్లో నాటకకర్తలు ఈ సమస్యల మీద గురజాడ కంటే ముందుగానే నాటకాలు రాసారు. అయితే ఇన్ని సమస్యలను ఏ నాటకకర్తా స్వీకరించలేదు. ఇందులో ఒకటి లేదా రెండు సమస్యలను మాత్రమే వారు ప్రధానంగా ఎంచుకున్నారు. సమస్యా బాహుళ్యం కారణంగానే కన్యాశుల్కంలోని ఇతివృత్తం విస్తరించి అది అచ్చులో 226 పేజీల నాటకమైంది. భారతీయ నాటకాలలో ఇంత పెద్ద నాటకం ఇంకొకటి లేదు. ఆధునిక భారతీయ నాటకాలలో ప్రదర్శన యోగ్యమైన నాటకాల సంఖ్య ఎక్కువ. అవి ఎక్కువ పఠనయోగ్యమైనవి కావు. పఠన యోగ్యమైన నాటకాల సంఖ్యతక్కువ. అందులో సార్వకాలిక పఠన యోగ్యత మరీ తక్కువ. కన్యాశుల్కం ఈ రెండు రకాల నాటకాల కంటే పరిపూర్ణంగా భిన్నమైనది. గురజాడ కన్యాశుల్కం మొదట 1872లో సంపూర్ణంగా ప్రదర్శన యోగ్యమైన నాటకంగా సృష్టించాడు. సంవత్సరాల తరబడి కృషి చేసి ఆ నాటకాన్నే 1909 నాటికి పఠనయోగ్యమైన సారస్వత నాటకంగా తీర్చిదిద్దాడు. కన్యాశుల్కం నాటకాన్నే పూర్తిగా ప్రదర్శించడానికి వీలుపడదని కొందరు విమర్శకులు భావించిన మాటలలో వాస్తవం ఉన్నా అందులో ప్రదర్శన యోగ్యం కాని సన్నివేశం ఒక్కటీ లేదు. పఠన పాఠనాలలో నిలువని సన్నివేశం కూడా ఒకటీలేదు. అందులోని ఏ సన్నివేశానికా సన్నివేశం విడివిడిగా ప్రదర్శించినా రక్తి కడుతుంది. నాటకాన్ని పరిమిత కాలంలో ప్రయోగించడానికి తగినరీతిగా సంక్షేపించి ప్రదర్శించినా నాటకం సాధించదలచుకొన్న ప్రధానలక్ష్యం కొంచెం కూడా భంగపడదు. అందులో ప్రతి సంభాషణా దైనందిన వ్యవహారంలో తెలుగువారి జీవితంలో ఎక్కడో ఒకచోట ఇమిడి పోతుంది.

మన తెలుగులో అనేక నాటకాలు ప్రదర్శన కారణంగా విశేష ప్రచారాన్ని పొందేయి. అవి బతికి బట్ట కట్టిన రోజులలోనైనా వాటికి ప్రేక్షకులే కాని పాఠకులు లేరు. కన్యాశుల్కం పుట్టిన దగ్గర నుండి ఈనాటి వరకు దానికి కావలసినంతమంది ప్రేక్షకులూ ఉన్నారు, పాఠకులూ ఉన్నారు. ఈ భాగ్యం తెలుగులో ఎన్ని నాటకాలను దక్కింది? ఇందుకు కారణం ఏమిటి? కన్యాశుల్కం అనే ప్రధాన సమస్య లేనప్పుడు కూడా ఆ నాటకాన్ని తెలుగుదేశంలోని అన్ని వర్గాలవారు ఆదరించేరు. అభిమానించేరు, శ్లాఘించేరు, పరవశించేరు. అనుక్షణం పలవరించేరు. కట్టమంచి, రాళ్ళపల్లి, వేటూరి, వేదం మొదలైన పండిత ప్రకాండులు, విమర్శక శ్రేష్ఠులు కన్యాశుల్కాన్ని హృదయ పూర్వకంగా స్వీకరించేరు. ఆ నాటకంలోని లోపాలను ఎంచిన వారు కూడా ఆ లోపాలను విస్మరించి ఆమోదించదగిన రచనగా కన్యాశుల్కాన్ని గుర్తించారు. రెండవ దశలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, భమిడిపాటి కామేశ్వరరావు వంటి వెర్రి అభిమానులు కన్యాశుల్కాన్ని - గురజాడను ఆకాశానికెత్తారు. ఆ తర్వాత వచ్చిన భావకవులు, అభ్యుదయ కవులు, కథకులు, నవలాకారులు, నాటకకర్తలు కూడా గురజాడకు కైమోడ్పు చేసినవారే. విశ్వనాథ "Sri Gurajada Appa Rao Reralded a new Era in Telugu literature - The Era of Colloqnlalism - Gurajada was a genius" అన్నారు. ఇలా చూస్తే నూరేళ్ళూ కన్యాశుల్కం మీద ధారాపాతంగా ప్రశంసా వర్షం కురుస్తోందన్న నిజం తెలుస్తుంది. గురజాడ కాలంలో ఈ నాటక ప్రదర్శన పత్రికా ప్రశంసలను పొందింది. ఆ తర్వాత గోవిందరాజుల సుబ్బారావు దగ్గర నుండి జొన్నలగడ్డ సోదరుల వరకు ఎన్ని సమాజాలో ఈ నాటకాన్ని వందలసార్లు ప్రదర్శించాయి.

ఆధునిక భారతీయ భాషలలో తెలుగులో కంటే ముందే చిన్న కథ పుట్టింది. తెలుగులో మాత్రం గురజాడ మొదటి కథకుడని ఎన్నో తర్జన భర్జనల తరువాత ఇప్పటికీ అనుకొంటున్నారు. గురజాడ కథల వెనుక ఒక జీవిత కాలపు చింతన ఉంది. అది పరిపరివిధాల సాగిన చింతన కాదు, ఏకముఖమైనది. పరిపూర్ణమైన ఆధునికత నిండినది. అందులో రాజీపడే తత్వం లేదు. ఆషామాషీ కబుర్లకు చోటులేదు. శుష్క-కర్కశ తర్కానికి తావులేదు. గతానికి చోటులేదు. అంతా వర్తమానంతో ముడిపడ్డ భవిష్యత్తు. వర్తమానం వస్తువు, భవిష్యత్తు లక్ష్యం. గురజాడ శిల్పం విలక్షణమైనది. తన జీవిత చరమాంకంలోనే ఆయన కథ రాసాడు. గురజాడ రాసినవి ఐదు కథలు. అందులో నాలుగు తెలుగు కథలు.

అవి 1. దిద్దుబాటు, 2.మీ పేరేమిటి? 3.మెటిల్డా, 4)పెద్ద మసీదు ఐదవ కథ ఆయన 'స్టూపింగ్ టు రైజ్' అన్న పేరుతో రాసిన ఇంగ్లీషు కథ 'సంస్కర్త హృదయం' అనే పేరుతో ఇది తెలుగులోకి అనువదింపబడింది.

ఆదర్శ దాంపత్యం గురజాడ సాహిత్యస్వప్నం. అదే కవితలో ప్రతిధ్వనించింది. అదే కథలుగా కరువు తీర్చింది. స్త్రీలకు సమానత్వం కావాలి, స్వేచ్ఛ కావాలి, గౌరవం కావాలి. అంత మాత్రమే కాదు, ఇవన్నీ పురుషునితో స్నేహ పూర్వకంగా సాధించాలి. 'దిద్దుబాటు' కథలో గోపాలరావుకి హృదయం ఉండి మెదడు లేదు. 'మెటిల్డా' భర్తకి మెదడు ఉంది హృదయం లేదు. 'సంస్కర్త హృదయం' కథలో రంగనాథయ్యకు రెండూ వున్నాయి. కానీ ధైర్యంలేదు. 'హృదయం, మెదడు ఉన్న భర్త దృష్టిలో మాత్రం భార్య సౌందర్యం ఎన్నటికీ తరుగదు' అన్నాడు గురజాడ. పిరికివాళ్లు ఈ రెండు ఉండి కూడా కళ్ళ ఎదుట సౌందర్యానికి అంధులౌతారు, అది కుహనా సంస్కారం. నాంచారమ్మకు ఇవన్నీ ఉన్న సంసారం దొరికింది. అందుకే ఆమె జీవితం సమగ్రమయింది. అందుకే ఆమె జయపతాకనెగురవేసింది. ఇది గురజాడ కథా సూత్రం. 'పెద్ద మసీదు' ఇందుకు భిన్నమైన రచన. అది గురజాడ కథగా కనబడదు. అదొక భావ వీచిక. అదొక జ్ఞాపకశకలం. ఎంతటి కఠినమైన స్థితికైనా ఒక మృదుత్వాన్ని ఆపాదించడం గురజాడ సారస్వత కళలోని ఒక రహస్యం. "ముత్యాల సరాలు" చిన్న కవితా సంపుటి. అంత చిన్న కవితా సంపుటిలోనూ ఏ ఇతర కవితా సంపుటిలోనూ లేనన్ని ప్రక్రియా బేధాలున్నాయి. ఆయన మచ్చుకొకటిగా అన్ని ప్రక్రియలను ఇందులో చూపించాడు. తెలుగు కవిత్వం ఆయన చివర దశలో రాసాడు. కాని అందులో కూడా "కొత్తపాతల మేలు కలయిక క్రొమ్మెఱుంగులు" చిమ్మింది. ముత్యాలసరాల మీద పారశీగజల్ల ప్రభావం ఉందని ఆయన అన్నాడు. ముత్యాలసరాలు ఛందస్సు కొత్తది కాదని కందుకూరి రుద్రకవి 'సుగ్రీవ విజయం'లో గురజాడ వాడిన ముత్యాలసరం ఛందస్సు ఒక మాత్ర కూడా తేడా లేకుండా ఉందని శ్రీ రామకోటి చెప్పారు. అది నిజమే. తనవరకు ప్రచారంలోలేని ముత్యాలసరానికి గురజాడ ఆధునికమైన విశేష ప్రచారాన్ని కలిగించాడు. ఆయన చెప్పకపోయినా పాశ్చాత్య కవితా ప్రక్రియ మీద కూడా ఆయన దృష్టి నిలిచింది. అందులో ప్రయోగాలు చేసేరు.

గురజాడ కవితలలో 'పూర్ణమ్మ కథ' - కన్యక - డామను పితియసు - లవణరాజుకల కథనాత్మకమైనవి. పూర్ణమ్మ కథను లిటరరీ బాలెడ్ అనవచ్చును. 'లవణరాజుకల'ను గాథ అనవచ్చును. నాయకుడి వీరకృత్యాలను వర్ణించడం గాథా లక్షణాలలో ఒకటి. కన్యక కథన రీతికి చెందిన రచన. గురజాడ దీనిని 'పదం' అన్నాడు. లిటరరీ బాలెడ్‌కి, పదానికీ గల బేధాన్ని చూపడానికి గురజాడ ఈ రచన చేసాడు. "డామను పితియసు" విదేశీయమైనది. గ్రీకుకథ. "ముత్యాల సరాలు", "కాసులు" అనే రచనలు రెండూ నాటకీయ ప్రక్రియకు చెందినవి, 'ముత్యాల సరాలు' అనే ఖండికలోని పురుషపాత్ర మనోలక్షణావిష్కారం భారతీయ నాటక శిల్పాన్ని అనుసరించినదికాదు. పాశ్చాత్యమైన 'సోలివాక్వే' (Soliloquy) లక్షణాలను ఎక్కువగా కలిగి ఉంది. 'కాసులు' అనే ఖండిక 'డ్రమేటిక్ మోనోలాగ్' (Dramatic Monologue) ప్రక్రియకు చెందుతుంది. 'దేశభక్తి', 'మనిషి', 'దించులంగరు', 'లంగరెత్తుము' అనేవి భావగీత ప్రక్రియకు చెందినవి. 'దేశభక్తి' సమాజం విషయంగా కొనసాగిన ప్రభోదగేయం. దీనిని 'సాంగ్' అనే ప్రక్రియగా గుర్తించవచ్చును. 'మనిషి' సామాజిక లక్ష్యంతో కూడిన చిన్న పద్యం. దీని మీద 'సానెట్' (Sonnet) ప్రభావం ఉంది. 'దించు లంగరు', 'లంగరెత్తుము' అనే రచనలు ఓడ్ (Ode) అనే ప్రక్రియకు సంబంధించినవి, 'దించులంగరు' గేయంలో తప్ప ఇంకే పద్యంలోను గురజాడ సమచ్ఛందంతో కలిపి విషమచ్ఛందాన్ని వాడలేదు. అందుచేత ఆయన దీనిని 'ఇర్రెగ్యులర్ ఓడ్' గా భావించి రాసేడని ఊహించే అవకాశం కనిపిస్తుంది. 'లంగరెత్తుము' హోమోస్ట్రోఫిక్ ఓడ్' అనే ప్రక్రియా బేధానికి చెందినదిగా కనిపిస్తుంది. గురజాడ ఆధునిక పద్యరచనలలో చివరిది 'ఛోట్టు' అనే సప్తపది. ఇది తెలుగు లేక సంస్కృత సంప్రదాయానికి సంబంధించిన పద్యం కాదు. పాశ్చాత్య ప్రక్రియలలో ఇది దేనికైనా చెందుతుందా! లేక దీనికిదిగా ఒక ప్రత్యేక రచనా అన్నది ఆలోచించాలి. ఈ గేయంతో 'ముత్యాల సరాలు' అనే కవితా సంపుటిలోని కొత్త అంతా ముగిసినట్లే.

పాతప్రక్రియలలో మార్గ ప్రక్రియలు, దేశి ప్రక్రియలు అని రెండు ప్రధాన బేధాలకు సంబంధించిన రచనలు 'ముత్యాల సరాలు' అనే సంపుటిలో ఉన్నాయి. "మిణుగురులు" జానపదుల తత్త్వ ప్రక్రియకు చెందినది. 'అరటికాయ బజ్జీ - మినపప్పు సొజ్జి' అనేది బాలగేయము, "నీలగిరిపాటలు" దేశి సంప్రదాయాన్ననుసరించిన కృతులు. "మాటల మబ్బులు" అనే రచన ముక్తక ప్రక్రియకు సంబంధించినది. ఇవి స్వతంత్ర రచనలు. 'మెరుపులు' అన్నవి కూడా ముక్తకాలే, కాని ఇవి అనువాద ప్రక్రియకు చెందినవి. 'పుష్పలావికలు' అనే రచన ఖండకావ్య ప్రక్రియకు చెందినది. 'సుభద్ర' అనే రచన కావ్య ప్రక్రియ ననుసరించింది. 'ఋతుశతకము' అనే రచన శతక సంప్రదాయానికి చెందినది. ఇలా పరిశీలించి చూస్తే 'ముత్యాల సరాలు' అనే కవితా సంపుటిలోని ఒక్కొక్క రచన ఒక్కొక్క ప్రక్రియకు ఉదాహరణ ప్రాయంగా రచింపబడిందని అనిపిస్తుంది.

ప్రక్రియా బేధాన్ని బట్టి కవి ఉపయోగించే భాషలో కూడా బేధం ఏర్పడుతుంది. గురజాడ రచనలు ఈ విషయానికి లక్ష్యాలుగా ఉన్నాయి. ఆయన కన్యాశుల్కం నాటకంలో వాడిన భాష ఒకటి. కథానికలలో వాడిన భాష వేరొకటి. వ్యాసాల భాష వేరొకటి. వ్యాసాల భాష తీరు వేరు. ఆధునిక కవితా ప్రక్రియలలో ఉపయోగించిన ఛందము, భాష వేరు. దేశి ప్రక్రియలలో ఇంకొక తీరు. ముక్తకాలు - ఖండకావ్యము, కావ్యము - శతకము అనే ప్రాచీన ప్రక్రియలలో ఉపయోగించిన భాష బాగా పాత సంప్రదాయానికి, గ్రాంధిక ప్రక్రియలకు చెందినది. 1897 నాటి వ్యవహారిక భాషోద్యమ తీవ్రతకు 1913 నాటి అరసున్నలకు, యతిప్రాసలకు, పడికట్టుపదాలకు పొత్తు కుదరడం కష్టం. ఈ ముందు వెనుకలలో 'విరిగి పెరిగితి పెరిగి విరిగితి' అన్న మహాకవి ఆంతర్యం అన్వేషించదగినది. అంతవరకు ప్రక్రియలే ఇందుకు కారణమని అనుకోవాలి.

నాటకము - కవిత్వము - కథలు అనే వేర్వేరు ప్రక్రియల నెంచుకున్నా గురజాడ వస్తువు ఒకటే. (1) పాశ్చాత్య నాగరికతా వ్యామోహం (2) బాల్యవివాహాలు (3) విధవా వివాహ సమస్య (4) వేశ్యా వ్యవస్థ నిర్మూలన (5) కులమత సంప్రదాయాలు (6) విద్యావ్యవస్థ (7) మూఢాచారాలు (8) అవినీతి అనే అంశాలు కన్యాశుల్కంలోను, అసంపూర్ణ నాటకాలైన కొండుభట్టీయం, బిల్హణీయాల్లోను, కవిత్వంలోను, కథలలోను ఒక్కలాగే కనిపిస్తాయి. కొన్ని కొన్ని పాత్రల మధ్య కూడా అతి సన్నిహిత సంబంధాలు కన్పిస్తాయి. గురజాడకు కాల్పనిక ప్రతిభ తక్కువ. అందుకే పాత్రలను విస్తృతంగా కల్పించలేకపోయాడు. వాస్తవ జీవితం నుండి గ్రహించిన పాత్రల మనస్తత్వాన్నే ఆయన విశ్లేషించి ప్రదర్శించగలిగాడు. జీవితమే ఆయన వస్తువు. అందుకే తెలుగులో ఆయనతో వాస్తవిక మానవతావాదం మొదలయింది.

గురజాడకు, ఆయన సాహిత్యానికి అనవసర ప్రాధాన్యాన్ని కల్పించి ఇప్పటికీ ఆయనను మహాకవి అని ఆకాశానికెత్తడం తప్పని కొందరు భావిస్తున్నారు. ఇది అభిరుచి బేధాన్ని బట్టి ఏర్పడిన అభిప్రాయ బేధం. భారతీయ కళాధర్మాన్ని, కళాసూత్రాలను త్రోసిరాజనడం, వాడుకభాషలో రచనలు చేయడం, ఇంగ్లీషు వారిని - వారి సంస్కారాన్ని - వారి సామ్రాజ్యాన్ని ప్రశంసించడం వంటి లక్షణాలు గురజాడలో వారికి నచ్చనివి. ఆ లక్షణాల నాధారంగా చేసుకొని గురజాడను మానసిక రోగి, కులద్రోహి, దేశద్రోహి వంటి తీవ్రపదజాలంతో అభిశంసించడానికి వారు జంకలేదు. అభిప్రాయ బేధాలను గూర్చి చర్చించే సందర్భంలో సంయమనాన్ని కోల్పోకుండా ఉండడం నాగరిక లక్షణం, విశ్లేషించడం పండిత లక్షణం. అనివార్యమైన మార్పునకు ఆహ్వానం పలకడం విజ్ఞత అని గురజాడ భావించాడు. ఆయనకొక అర్ధశతాబ్ది ముందుగానే ఆధునిక భారతీయ సాహిత్య స్వరూపంలో, స్వభావంలో గణనీయమైన మార్పు ప్రారంభమయింది. కాలజ్ఞానం కలిగిన గురజాడ ఆ నూత్నసంస్కారానికి తెలుగులో మేలుకొలుపు పాడాడు. అందుకు గురజాడను అభిశంసించడం న్యాయం కాదు. కన్యాశుల్కం రచన ద్వారా గురజాడ బ్రాహ్మణ కులాన్ని అందులో ప్రత్యేకించి ఒక శాఖను కించపరచి కులద్రోహి అయ్యాడని ఆయనను నిందించేవారు తెలుసుకోవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. బెంగాలీలో రామనారాయణ తారకరత్న రాసిన "కులీన కుల విహాహ" నాటకాన్ని, అస్సామీలో గుణాభిరామ్ బారువ రాసిన 'రామనవమి' నాటకాన్ని, గుజరాతీలో

కవిదళపత్ రామ్‌రాసిన 'మిథ్యాభిరామ్' నాటకాన్ని, కన్నడంలో కర్కి వెంకటరమణశాస్త్రి రాసిన 'ఇగ్గప్ప హెగ్గడె వివాహ ప్రవాసన', మరాఠిలో గోవిందభల్లాల్ దేవల్ రాసిన 'శారద' నాటకాలను చదివితే బాగుంటుంది. ఈ నాటకాలన్నింటిలోను కన్యాశుల్కంగానీ దానికి సన్నిహిత రూపంలో ఉన్న బాల్యవివాహ కథనంగానీ ప్రధానమైన విషయం. ఈ నాటకాలు రాసిన వారందరూ బ్రాహ్మణులే. ఆ నాటకాలు ఆయా భాషలలో ఇప్పటికీ గౌరవాన్ని పొందుతున్నాయి. దీనిని బట్టి చూస్తే 19వ శతాబ్ది ఉత్తరార్థంలో కన్యాశుల్కం వంటి బాల్యవివాహ సమస్యలను స్వీకరించి సాహిత్య సృష్టి చేయడం అనేది సమకాలీన ఆలోచనా ధోరణిగా కనిపిస్తుంది. తోటి రచయితలు నడిచిన మార్గంలో నడిచినందుకు గురజాడను మనం దోషి అనలేము. రామప్ప పంతులు వంటి శాక్తేయులతోను, కరటకశాస్త్రి వంటి కర్మిష్ఠులతోను, గిరీశం వంటి ఆషాఢభూతులతోను, అగ్నిహోత్రావధాన్లు వంటి మూర్ఖులతోను నిండిన బ్రాహ్మణసమాజాన్ని సంస్కరించి ఉద్ధరించాలనుకోవడం ఎన్నటికీ నేరం కాదు. కందుకూరి ప్రారంభించిన విధవా వివాహమనే సంస్కరణోద్యమాన్ని గురజాడ వేళాకోళం చేసాడని ఒక అభియోగం ఉంది. పునర్వివాహమనే పేరుతో బుచ్చమ్మ వంటి అమాయకులైన విధవలను, గిరీశంలాంటి అయోగ్యులకిచ్చి పెళ్లి చేసే సంస్కరణవాదాన్ని గురజాడ వ్యతిరేకించాడు గానీ ఆయన కందుకూరి సంస్కరణోద్యమానికి వ్యతిరేకి కాదు.

"దేశమంటే మట్టికాదోయ్ / దేశమంటే మనుషులోయ్"

అన్న చరణాలలో కొందరికి దేశద్రోహం కనబడింది. భౌతిక, ప్రాదేశిక, స్వాతంత్ర్య సముపార్జన కంటే మానవాళికి స్వేచ్ఛా సౌభాగ్యాలను సంపాదించడం శ్రేయస్కరమని బోధించే ఈ చరణాలు మానవతావాద ప్రాథమిక సూత్రాలు, "దేశభక్తి జీవితం కంటే గొప్పది. కాని మానవత్వం దేశభక్తి కంటే గొప్పది" అని "మేవాడు పతనం" అనే నాటకంలో ద్విజేంద్రలాల్ రాయ్ సృష్టించిన "మానసి" అనే పాత్ర దృఢంగా పలికిన పలుకులను వింటే గురజాడ వాక్యాలు సమకాలీన ఆలోచనా ధోరణి నుండి పుట్టినవని ఎవరికైనా తెలుస్తుంది. జాతి శీలాన్ని పునస్సృష్టి చేయడానికి మార్గదర్శకమైన ప్రణాళిక అంతా గురజాడ దేశభక్తిగేయంలో ఉంది.

"కన్నుగానని వస్తుతత్త్వము - కాంచనేర్చరు లింగిరీజులు
వారి విద్యల గరచి - సత్యము నరసితిన్"

అన్న భావం గురజాడ వ్యక్తిగతాభిప్రాయం మాత్రమే కాదు, 19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఉదారవాద వైఖరి ననుసరించి, సంస్కరణాభిలాషను ప్రకటించి జాతీయతా స్ఫూర్తితో ఉద్యమించిన మహా నాయకులెందరిలోనో ఈ అభిప్రాయం బలంగా కనిపిస్తుంది. జాతీయోద్యమకాలం నాటి భారతీయ మేధావులంతా పరస్పర విరుద్ధమైన రెండు మార్గాలలో పయనించారు. వారిలో భారతదేశంలో బ్రిటీష్‌పాలన పట్ల వ్యతిరేకత ఏర్పడింది. దానితోపాటు పాశ్చాత్య సంస్కృతిలోని ఉదారభావాల పట్ల, పాశ్చాత్య సాహిత్యంలోని వున్నత విలువలపట్ల వారిలో ఒక ఆరాధ్య భావం వృద్ధి పొందింది. ఆ కారణంగా దేశానికి బ్రిటీష్ పాలన నుండి విముక్తిని సాధించాలని, దేశీయ సంస్కృతిలోని లోపాలనన్నింటిని వదులుకొని మేలు గుణాల నన్నింటిని మెరుగు పరచుకోవడానికి పాశ్చాత్య సంస్కృతీ మార్గాన్ని అనుసరించాలని వారు భావించారు. ఆరోజుల్లో వారికి ఇంగ్లండు స్వర్గభాండంగా కనిపించింది. ఒక జాతి తన ఆత్మాభిమానాన్ని సంరక్షించుకొని తన భాషను, సంస్కృతిని, స్వేచ్ఛను పెంపొందించు కోవడమెలాగో ఆంగ్లేయులు తమకు తెలియజేసారని వారు భావించారు.

"To England we look for inspiration and guidance"

"English history has taught us those principles of freedom which we cherish with our life blood".

"We should be unwornthy of owerselves and of our preceptors"

అన్న భారత జాతీయోద్యమ పితామహుడుగా పరిగణింపబడిన సురేంద్రనాథ బెనర్జీ అభిప్రాయాల సారాంశమే పై గురజాడ కవితలో కనిపిస్తుంది. 1870 ప్రాంతానికి పూర్వమే ఆరంభమైన స్వదేశీ ఉద్యమ భావజాలం కూడా ఇంగ్లండు కారణంగానే విస్తరించినట్లు "England is the august mother of free nations" అన్న సురేంద్రనాథ్ బెనర్జీ మాటలలో స్పష్టపడుతుంది. ఈ అభిప్రాయాన్ని బెనర్జీ మాటలలో స్పష్టపడుతుంది. ఈ అభిప్రాయాన్ని బెనర్జీ అనంతర కాలంలో వచ్చిన నాయకులు కూడా విశ్వసించారు. "The wave of western civilisation, however with its unifying influences, is levelling down these differences and exeting a community of interest and feeling which is the precursor of a new down in our life". "The spirit of swadeshi ought to prevail in all departments of life, subject to the one condition that whatever they had to learn from the west in order to maintain progress and secure prosperity, they need not be ashamed to learn, There was no used in going back. They could only go back consistently with their national interest; otherwise it would be suicideal" అన్న లాలా లజపతిరాయ్ వాక్యాలను మననం చేసుకోగలవారిని "వెనుక జూచిన కార్యమేమోయి - మంచి గతమున కొంచెమేనోయి" అన్న గురజాడ పలుకుల వెనుక నిండిన భావజాలానికి ప్రేరక శక్తులేవో స్పష్టపడు తుంది. దేశనాయకులే కాదు ఉత్తర దేశంలోని భారతేందు మండలిలోని సాహిత్యకారులు, గుజరాత్‌లోని నర్మద్, దల్పత్ రామ్ వంటి కవులు - ఇంకా ఎందరెందరో దేశవ్యాప్తంగా ఈ మార్గంలో పయనించిన వారున్నారు. వారందరినీ ఇప్పటికీ దేశభక్తులుగానే దేశం గౌరవిస్తుంది. మనం మాత్రం గురజాడను దేశద్రోహిగా ఎందుకు భావించాలి?

బ్రిటీష్ రాజ్యంలో 'విధేయుడు - విధేయులకు విధేయుడు' వంటి వాడుకలు ఒక అధికారిక సంప్రదాయంగా చలామణి అయ్యాయి. విజయనగర సంస్థానాధీశులు బ్రిటీష్ సామ్రాజ్యానికి విధేయులుగా ఉండడం ఒక రాజనీతి. బొబ్బిలియుద్ధం పద్మనాభయుద్ధం నేర్పిన చేదు పాఠాలతో వారు బ్రిటీష్‌వారిపై కత్తిదువ్వడం మానుకొన్నారు. వైజ్ఞానిక శక్తితో చిత్తస్థైర్యంతో బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదిరించగల స్థితికి ప్రజలను చేర్చడానికి వారికి విద్యా వివేకాలు తోడ్పడగలవని ఒక దీర్ఘకాలిక ప్రణాళిక వేసారు. అందుకే మహారాజ కళాశాల, వేద పాఠశాల, మహారాజ సంస్కృత కళాశాల, విజయరాయ గాన పాఠశాల వంటి సంస్థలను నెలకొల్పారు. మహా రాజ కళాశాల తొట్ట తొలిసారిగా తెలుగువారికి ఆధునిక విజ్ఞానంతోపాటు సమకాలీన చైతన్యాన్నీ స్వేచ్ఛా - స్వాతంత్ర్యాల పట్ల ఆసక్తిని పెంపొందించి జాతి వికాసానికి తోడ్పడింది. సంస్కృత కళాశాల ఒకటిన్నర శతాబ్దాల కాలం ఆంధ్రదేశానికి సంప్రదాయభిక్షను పెట్టింది. ఈ మహత్కార్య సాధన కోసం విజయనగర సంస్థానాధీశులు తమ సర్వస్వాన్నీ త్యాగం చేసారు. అయినా బ్రిటీష్ వారికి విధేయులుగా తెరవెనుక నిలచిపోయారు. ఇది ఒక రాజనీతి. మానవతావాద భూమిక నుండి వెలికి వచ్చిన గురజాడ సాహిత్య నేపథ్యంలో విజయనగర సంస్థానాధీశుల ప్రజాహిత బుద్ధి, దేశభక్తి, సంప్రదాయ ప్రవణత, ఆధునిక చైతన్యం ప్రచ్ఛన్న శక్తులుగా ఉన్నాయి. పారమార్థిక సత్యాన్ని గుర్తించినవారు వ్యావహారిక సత్యానికి విలువనివ్వరు. గురజాడ కాంగ్రెస్ వ్యవహారశైలిని విమర్శించాడు గానీ వారి ఆశయాల్ని ఖండించలేదు.

తన ఆశయానికీ, ప్రబోధానికి విరుద్ధంగా గురజాడ తన కుమార్తెకు 11ఏండ్ల వయస్సుతో పెళ్లి చేయడం తప్పని కొందరు ఎత్తి చూపిస్తున్నారు. స్థూలదృష్టికి ఇది తప్పిందంగానే కనిపిస్తుంది. ఈశ్వర చంద్ర విద్యాసాగర్, కేశవ చంద్రసేన్, మహాదేవ గోవిందరెనడే వంటి మహానాయకులే ఇటువంటి తప్పిదాలకు పాల్పడ్డారు. ఆశయం ఆచరణగా రూపొందడానికి మధ్య నుండే వ్యవధిలో ఇటువంటి తప్పిదాలు జరగడానికి అవకాశముంది. హనుమంతుడు చిన్నకాలవ దాటలేదనడం ఎలాంటిదో గురజాడకు ఛందో వ్యాకరణాలంకార పరిజ్ఞానం లేదనడం అలాంటిది. సాహిత్య శిల్ప మర్మాన్ని గ్రహించడానికి చదువొక్కటే చాలదు, కొంచెం రసజ్ఞత కూడా ఉండాలి. గురజాడ దుర్బల శరీరంలో దృఢమైన మనస్సు ఉంది. దానికి ఏ దశలోనూ జబ్బు అంటలేదు. ఆ మనస్సు పూర్ణ ఆరోగ్యవంతమైనది. "స్వంత లాభం కొంత మానుకో - పొరుగువారికి తోడు పడవోయ్" అన్న గురజాడ తెలుగువారికి ఆ మానసిక దార్ఢ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని తన వారసత్వంగా అందించి కృతకృత్యుడయ్యాడు.

*

ముస్లిం అస్తిత్వ వ్యక్తీకరణ - అలావా

☆ షఫి

తెలుగు సాహిత్యం రోజు రోజుకు సుసంపన్నమవుతుందనే చెప్పాలి. అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో సూక్ష్మ దృష్టి పెరిగి అవగాహనలో విస్తృతికి దారితీస్తుంది. ఒక వస్తువు లేదా ఒక పదార్థంలో మొదటగా బాహ్యరూపాన్ని దర్శించడం.జరుగుతుంది. తర్వాత అణువణువునూ అధ్యయనం చేయడం సమగ్ర పరిశీలనకు ఉపకరిస్తుంది. ఇప్పుడు వస్తువు అంటే అణువుల సంఘటిత రూపంగా పేర్కొనాలి: తెలుగు సమాజంలో సుదీర్ఘంగా కొనసాగుతున్న వర్గపోరాటం అందించిన చైతన్యంతో వివిధ సామాజిక వర్గాలు మేల్కొని తమను తాము దర్శించుకుంటున్నాయి. ఆ క్రమంలో దళిత, స్త్రీవాద, ప్రాంతీయవాదం, ఇప్పుడిప్పుడే ప్రారంభమైన ముస్లింవాదం తెలుగు సామాజిక రంగంలో తమతమ అస్తిత్వాలను ప్రకటిస్తున్నాయి. ఇదంతా కూడా వర్గచైతన్యం అనేక పాయలుగా విస్తృతిని పొందడమే అవుతుంది. వర్గపోరాటం రగిలించిన జ్ఞానం మరింత లోలోతులకు చొచ్చుకొనిపోయి అస్తిత్వవాదాల అభివ్యక్తికి దారితీసింది. ఈ విషయంలో చాలా మందికి భిన్నాభిప్రాయాలు ఉండవచ్చును. అస్థిత్వవాదానికి వర్గదృక్పథమే పునాదులు వేసిందనడంలోనూ అతిశయోక్తిలేదు. ఇపుడు మనం ఈ అస్తిత్వ అకాంక్షలను ఒక విశ్వజనీనతతో కలిపి వర్గపోరాటంలో భాగస్వామ్యం చేయాల్సి ఉంది. అందులో భాగంగా ఈ సమూహాలతో నిరంతర చర్చను, సంభాషనను కొనసాగిస్తూ ఉండాలి.

ఒక చైతన్యం పలు చైతన్య రూపాలు తీసుకొని తిరిగి సార్వజనీన సమస్యపై సాపేక్షతతో ఐక్యతను సాధించేక్రమాన్ని జ్ఞానానికి ఆచరణకు మధ్యగల సంబంధంలో ఇలా చూడవచ్చు. మావో "ఆచర ద్వారా సత్యాన్ని కనుగొను, తిరిగి ఆచరణద్వారా సత్యాన్ని సరిచూసుకొని, అభివృద్ధిచేయి. అనుభూతి జ్ఞానం నుండి బయలుదేరు, దాన్ని క్రియాశీలంగా హేతుబద్ధ జ్ఞానంగా అభివృద్ధిచేయి. అపుడు హేతుబద్ద జ్ఞానం నుండి బయలుదేరు, స్వీయాత్మకతను, భౌతిక ప్రపంచాన్ని మార్చే విప్లవాచరణకు క్రియాశీలంగా దారిచూపు" (మార్క్సిజం, లెనినిజం, మావోయిజం, పే.132) అన్న విషయం ఈ సందర్భంగా గుర్తొస్తుంది.

ప్రస్తుతానికి ముస్లిం వాదం వరకు పరిమితమైతే... ఏకకాలంలో ఒక మనిషి (ముస్లిం) వివిధ అస్థిత్వాలను కలిగి ఉంటాడు. పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో అస్తిత్వంతో తనను ప్రకటించుకుంటూ ఉంటాడు. జాతీయత పేరున - ఇండియన్‌గా, ప్రాంతీయత వచ్చేసరికి రాయలసీమ, తెలంగాణ; అణచివేత విషయంలో దళిత, మైనార్టీ; ఆర్థికం విషయంలో వెనుకబడిన వర్గాల అస్తిత్వం ప్రదర్శించబడుతుంది. ఏ అస్తిత్వమైన ఇంకో అస్థిత్వాన్ని అణచి ఉంచడంగానీ, రద్దు చేసుకోమనడం కానీ సరైంది కాదు. "భారతీయత పేరున, జాతీయవాదం పేరున సెక్యులరిజం పేరునా రకరకాల ఐడెంటిటీలను (అస్తిత్వాలను) రద్దు చేసుకోమనటం ఎంతమాత్రం ఆమోదయోగ్యంకాదు. ఈ డిమాండు సమాజంలో ఫాసిస్టు ధోరణులు పెచ్చురిల్లటానికి తప్ప మరిదేనికీ ఉపకరించదు" - (ఖాదర్ మొహియుద్దీన్,'అలావా' ముందు మాట-'సూఫీతత్వం సరైన మార్గం'. పే-8).

ఇలా ఒకే మనిషి వివిధ అస్థిత్వాలతో ముందుకు రావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. "వస్తుగత పరిస్థితులే అస్థిత్వాల ప్రాధాన్యాన్ని నిర్ణయిస్తాయి" - (ఖాదర్ మొహిద్దీన్, పే-8) ఇక్కడ ముఖ్యంగా అగ్రవర్ణాలకు అభివృ చెందిన ప్రాంవారికి ఒక ప్రశ్న రావచ్చు - దళితులు, బలహీనవర్గాలు, స్త్రీలు, ముస్లింలు, తమ తమ అస్తిత్వ మూలాల్ని ప్రకటించుకుంటూ, ప్రాంతీయ వాదాలను లేవనెత్తుతుంటే మరి తమ అస్తిత్వం ఏమి కావాలి? తమ ప్రాంతీయ వాదం వినిపించడం న్యాయ సమ్మతమే కదా?అని. ఆక్రమంలో అగ్రవర్ణ అహంకార పూరితంగా వచ్చినవే ఓ.సి.సంఘం, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, రెడ్డి తదితర సంఘాలు, ఆంధ్రరాష్ట్ర సమితి లాంటి వలసవాద దోపిడిదారుల ప్రాంతీయవాదం. ఇది అగ్రవర్ణ హిందుత్వ అంశకు, ప్రాంతీయ ఆధిపత్యానికీ నిదర్శనం.

అసలు అస్తిత్వ సమస్య ఎప్పుడు లేవనెత్తబడుతుంది? ఎప్పుడైతే అస్తిత్వం ప్రశ్నార్థకమౌతుందో, లేదా అస్తిత్వం అణచివేతకూ, నిర్మూలనకూ గురౌతున్నప్పుడు అస్తిత్వాన్ని ప్రకటించుకోవలసిన సందర్భం వస్తుంది. ఆ సందర్భం నుంచి వెలువడిందే 'అలావా' ముస్లిం సంస్కృతి కవిత్వం. ఈదేశ పౌరులై ఉండి కూడా ముస్లింలు తమ అస్తిత్వం ప్రకటించుకోవలసిన దుర్భర స్థితిలో ఉండటం చాలా విషాదకరం. ఎంత విషాదమైనా కూడా ముస్లిం రచయితలు ప్రకటించిన తీరు ఒక ధిక్కారానికి, ఒక చైతన్య శీలతకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. అది ఒక సాహిత్య వ్యక్తీకరణ రూపంలో కావడం తెలుగు సాహిత్యానికి కొత్త ఒరవడిని అందించినట్లు అయ్యింది. ముస్లిం సంస్కృతి కవిత్వంగా వ్యక్తపరచడం తాము కొనసాగిస్తున్న అంతర బహిరంగ పోరాటానికి ఒక ముందడుగు.

తెలుగు సాహిత్యంలో ముస్లిం కవిత్వం ఒక ప్రవాహ గతిలో సాగుతున్నది. ఇరు శత్రువుల నుండి దాడిని అంతే బలంగా ఎదుర్కొంటుంది. ఈ మధ్య 'నఖాబ్', 'జగ్‌నేకిరాత్' కవితా సంపుటాలపై జరిగిన దాడి ముస్లిం రచయితల కలాలకు పదును పెట్టాల్సిన సందర్భాన్ని ముందుకు తెచ్చింది. ఉదారవాదులుగా చెప్పుకొనే జయప్రభ (ముస్లిం రచయితల భాష విషయంలో) మొదలు మార్క్సిస్టుగా తనసుతాను చెప్పుకొనే డి. చంద్రశేఖర్ రెడ్డిదాక హిందుత్వ అంశ ఏ ఏరూపాల్లో దాగి ఉందో గుర్తించలేనంతగా ముస్లిం వాదం చుట్టూ కలాలు ఎక్కుపెట్టి సిద్ధంగా ఉన్నారు. హిందూ ఆధిపత్య రాజ్యం ముస్లింలను ఐ.ఎస్.ఐలుగా ముద్రవేసి చంపుతుంటే ఇలాంటి అభ్యుదయ ఉదారవాద ముసుగులో ముస్లిం రచయితల్ని మతోన్మాదులుగా చిత్రించే కుట్ర జరుగుతుంది. ఛాపకింద నీరులా ముస్లిం రచయితల సంఘం(?) ప్రధానకార్యదర్శిగా చెప్పుకుంటున్న షేక్ కరీముల్లాలు ముల్లాల సంస్కృతిని ప్రవేశపెట్టడానికి అలిఫ్ బేలు వల్లిస్తున్నారు. ఇస్లాం వాదం పేరుతో ముస్లింవాదం గొంతునొక్కాలని చూస్తున్నారు. ఇస్లాం వాదం చెప్తున్న సాహిత్యానికి సంఘపరివార్ కాషాయ సాహిత్యానికి రూపంలోనే తప్ప సారంలో ఎలాంటి తేడా ఉండదు. రెండూ సమాజాన్ని వెనక్కు తిప్పి చదవాలనేవే. అంతిమంగా వీరు అభ్యుదయ విరోధులు. సర్వం దైవసంకల్పయామి / సబ్ ఊపర్ వాలేకే హాతో మే హై. అనే యథాతథవాదులు. ఇస్లాం అంటే ఒక మతం. దానికి కొన్ని మత విశ్వాసాలు ఉన్నాయి. ఇస్లాం, సాహిత్యంలో సృజనాత్మక ప్రక్రియలపై ఆంక్షలు విధిస్తుంది. ఇస్లాం దృష్టిలో సాహిత్యమంటే అల్లాను స్తుతించడం, ప్రవక్త ప్రవచనాలను ప్రచారం చేయడమే సాహిత్య ప్రయోజనం. ఈ సందర్భంగా సుపరిచితమైన తస్లిమా (లజ్జా)ను దేశ బహిష్కరణ చేసింది ఒక ఇస్లాం దేశమనే విషయం మరువకూడదు. మస్లిం జీవితాల్లోని చీకటి కోణాల్ని తెలుగు సాహిత్యానికి అందించిన 'వతన్' లాంటి కథా సంకలనం ఇస్లాం రచయితల కలాల నుండి వెలువడే అవకాశమే లేదు. ఒక వేళ రాసినా పరిష్కారం అల్లాదయపై వదిలి అవార్డులకు, సన్మానాలకు పీఠాలెక్కుతారు.

సంఘపరివార్ ప్రచారం చేస్తున్న అఖండ భారత (ఏక) సంస్కృతిలాంటిదే ఇస్లాం వాదులు చెప్పే సంస్కృతి. ముఖ్యంగా అరబ్బులో ఉన్న ఇస్లాం సంస్కృతిని భారతదేశంపై రుద్దాలని అరబ్బుదేశాలకు వెళ్లి వచ్చిన కొందరు ముస్లింలు భావిస్తున్నారు. వీరి దృష్టిలో ఇప్పుడున్న 'ముస్లిం సంస్కృతి' ఇస్లాంకు విరుద్ధమైనది. వీరు దర్గాల సంస్కృతిని (విగ్రహారాధనను) వ్యతిరేకిస్తారు.

ముస్లింలు ఈ దేశ మూలవాసులుగా పేర్కొనడానికి ముస్లిం సంస్కృతే ఒక నిదర్శనం. దర్గాల సంస్కృతి (విగ్రహారాధన) హిందూ కులవ్యవస్థ నుంచి ప్రసరించిన సంప్రదాయం. నిచ్చెన మెట్ల కులవ్యవస్థ అట్టడుగు కాళ్లకింద

నలిగిపోయిన ప్రజల బ్రతుకులకు సమానత్వాన్ని, సోదరభావాన్ని అందించి గుండెకు హత్తుకున్న మత ప్రచారకుల (సూఫీలు) ప్రతిరూపాలే ఈ దర్గాలు. వారి సమాధు (దర్గాలు)లను దర్శించడంలో, వారిని స్మరించడంలో ఈ దేశ ముస్లింల సంస్కృతి అరబ్బు దేశాల సంస్కృతి నుండి విడువడి దేశీయ సాంస్కృతిక రంగంలో భాగంగా కొనసాగుతుంది. ఈ విషయాన్నే సంపాదకుల్లో ఒకరైన స్కైబాబ - 'దేశీ ముస్లిం సంస్కృతుల్ని కాపాడుకోవాలి' అనే ముందుమాటలో చెప్పాడు. "ముస్లింల ఆచార వ్యవహారాలు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఉన్నాయి. దేశదేశాలకు ఇస్లాం వ్యాప్తి చెందుతున్న క్రమంలో ఆయా దేశాల సంస్కృతుల్ని తనలోకి ఇముడ్చుకోవడం. ఇస్లామిక్ (అరేబియన్) సంస్కృతిని ఆయాదేశాలకు వ్యాప్తి చేయడం జరిగింది. జరుగుతున్నది. ఈ క్రమాన్ని అర్థం చేసుకుంటే ప్రపంచమంతటా ముస్లింల సంస్కృతి ఒకే రకంగా ఉండదని అర్థమవుతుంది" - స్కైబాబ (పే.15)

'అలావా' సంకలనం సంఘపరివార్ సాంస్కృతిక దాడికి సమాధానంగా, ఇస్లాం మత మౌఢ్యానికి విరుగుడుగా ముందుకు వచ్చింది.

తెల్లని షేర్వానీ - ఆకుపచ్చ తలపాగా
దర్పంగా నిలబడి చూస్తుంటది దర్గా!
గుడి అంటని
ఇక్కడి మట్టిబిడ్డల కాడికే
నడిచొచ్చిన దేవుళ్ళు సూఫీలు! - స్కైబాబ (కాలీచుప్పీ, పే-30-31)

సంకలనం విషయానికొస్తే, ముస్లిం కవిత్వ విస్తృతికి అద్దం పడ్తూ 'అలావా' ముస్లిం సంస్కృతి కవిత్వం / దూదేకుల కవిత్వం / ముస్లిం స్త్రీల కవిత్వం ముస్లిం కవిత్వం / గుజరాత్ / సామ్రాజ్యవాదంపై కవితలుగా ఒకే సంకలనంలో వివిధ అంశాలపై దృష్టి సారించింది.

ఈ దేశ ముస్లిం సంస్కృతిలో పీర్లపండగ సంఘ సాంస్కృతిక సమ్మేళనానికి ప్రతీక. రహమతుల్లా 'బీకా అలం' కవితలో పీర్ల వెంట హస్సయిదూల ఉస్సయిదూల ఆడుతూ, పాడుతూ కదిలే బహుజనుల్ని, సాంస్కృతిక సంఘటిత సవారీని ఇలా వర్ణిస్తాడు...

"ఊర్ల పీర్లపండగ అన్ని కులాల పండగే
ఎర్రమన్నుతో అలుక్కుంటాం.
ముగ్గెయ్యం బొట్టెట్టం తాలింపులుండన్
పలావు పచ్చి పులుసు బెల్లం నీళ్ళ పాయితాలు
తెలుగోల్లు కూడా పీర్లెత్తుత్తారు.
....
చాకలోల్లు దిగిటీలు గండజ్యోతులు బద్దరు
దూదేకులోల్లు మంగలోల్లు మాలోల్లు సన్నాయిల్తో
ఫకీరోల్ల కంజర్ల ఖవాలీలు నాత్‌లు
మాదిగోల్ల డప్పులయితే పగుల్తుంటయి.
హస్సయిదూల ఉస్సయిదూల............
-రహమతుల్లా (బీకా అలం, పే.50-51)

ఇలా కులమతాలకతీతంగా, ముఖ్యంగా కింది శ్రామిక వర్గాలు 'అలావా' చుట్టూ తిరుగుతూ ఆడుతుంటే సంఘపరివార్ అసత్య ప్రచారాలు అలావా మంటల్లో కాలి బూడిదవుతాయి. అందుకే ఈ సాంస్కృతిక సంఘటిత్వాన్ని పరివార్‌సేన సహించలేదు. అందుకే ప్రజల మధ్య కాషాయ చిచ్చు రగిలిస్తుంది. ఇక ఇస్లాంవాదులకు (ముల్లాలకు) పీర్లపండగతో ఏకీకృత ఇస్లామీకరణను మంటగలుపుతున్నారనే కోపం ఉండనే ఉంది. ఇరు మత ఛాంధసవాదుల కుట్రలను భగ్నం చేస్తూ అంతరిస్తున్న ఈ సంస్కృతిని, నృత్యరూపకాలను దేశీయ సంస్కృతిగా కాపాడుకోవాలి.

సామూహిక స్పృహతో దూదేకుల కవిత్వం ముస్లింవాదంలో తన ప్రత్యేక జీవిత నేపథ్యాన్ని చిత్రిస్తూ వచ్చింది. దూదేకుల కవిత్వంలో ఖాజా (ఏకేకులం), షాజహాన్ (లద్దాఫ్ని) తమ గొంతుల్ని బలంగా హృద్యంగా వినిపిస్తున్నారు.

"మసీదుని నాలుగు గుమ్మటాలతో భాగించినట్టు
అందర్నీ పోగులుగా కలిపి నేసిన మతం తానుని
ఎక్కువ తక్కువ ముక్కలుగా చింపిన
మనుముల్లాల సంగతి యిది.
....
నేనిప్పుడు ముసల్మాన్ని.......
కాదు సాయెబుని............
కాదుకాదు పింజారీని............
అహహహహా..   నూర్‌బాషాని
ప్చ్........ ఊహూ........... దూదేకులవాణ్ని - ఖాజా (ఏకేకులం, పే-70-71

షాజహానా 'లద్దాఫ్ని'గా ముస్లిం సాంప్రదాయవాదుల నుండి ఎదుర్కొనే వివక్షను దూదేక స్త్రీల ధిక్కార స్వరంతో -

"అందరూ నన్ను మనిషిలా కాక
ఏకిపెట్టిన దూదికుప్పలా చూస్తూ
మాటల్లోనే ఊదిపారేయాలని ఉబలాటపడతారు
మా పుట్టింటోళ్ళుమాత్రం అచ్చం తురకదాన్నయిపోయానని
ఖరారు చేసుకున్నారు
తెలియని రీతిరివాజుల గురించీ
పలుకని దురూద్ సూరాల గురించీ
కట్టతెగిన వీళ్ళ కొశ్చన్ మార్క్‌ల మొహాలకి
ఎందుకు ఇన్‌వర్టెడ్ కామాల్లో జవాబునవ్వాలి?
....
అబ్ సాబార్ సబ్‌కే సామ్‌నే చిల్లావుంగీ
హాఁ......మైఁ లద్దాఫ్ని హుఁ.........!
లద్దాఫ్నిహీ రహూంగీ!!   - షాజహానా (లద్దాఫ్ని, పే.73)

మొదటి నుండీ ముస్లిం స్త్రీల గొంతును పురుషులే వినిపిస్తూ వస్తున్నారు. మహెజబీన్, షాజహానాకు తోడుగా మున్వరున్నిసా (గుడియా), షంషాద్ బేగం (ప్రాణమున్న లాష్) జవేరియా (ముస్లిం వనిత), వాజిదాఖాతూన్ (పర్దా), షహనాజ్‌ఫాతిమా (ఔరత్), షంషాద్ బేగం (పర్సనల్‌లా) పరదాచాటు చీకటి వెతల్ని కవిత్వీకరించారు.

గుజరాత్ గుండెల్ని మండిస్తూనే ఉంది. ముస్లింల అస్తిత్వాన్ని ప్రశ్నించడమే కాదు ఏకంగా నిర్మూలనకే గుజరాత్ ఒక ప్రయోగం. ఇలాంటి ప్రయోగం పునరావృత్తం కాకుండా సామాజిక చైతన్యాన్ని పెంపొదిస్తూనే హిందుత్వ కుట్రలను ఎదుర్కొనడానికి దళితులను, ముస్లింలను హిందూ ఆధిపత్య రాజ్యానికి వ్యతిరేకంగా సంఘటిత పరచి వర్గపోరాటాల్లో భాగస్వామ్యం చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ఆ దిశగా నిరంతర కృషి చేయాలి.

ముస్లిం రచయితల్లో సామ్రాజ్యవాద వ్యతిరేకత రాసిలో తక్కువ అయినా అంతర్జాతీయ ఐక్యతను ప్రకటిస్తున్న తీవ్ర ధిక్కార కవిత్వ వ్యక్తీకరణలను చూడవచ్చు. అమెరికా సామ్రాజ్యవాద ప్రత్యక్షదాడులకు గురౌతున్న ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ ప్రజలకు సంఘీభావంగా, అలాగే సామ్రాజ్యవాదానికి వినసొంపుల దళారీతనాన్ని బహిర్గతం చేస్తూ ఇనాయతుల్లా "అసలే బూషాడు..... ఆపై పెట్రోల్ తాగాడు" కవితలో

బస్రాలో, నసీరియాలో
చమురు బావిమండింది
దెబ్బకు వంటింట్లో
మా తిరగమాత మాడింది   (పే.154)

మానవ సంబంధాల విధ్వంసంపై దిలావర్ "రేష్మా! మెరీ నవాసీ!" కవిత మంచి వ్యక్తీకరణ. అలాగే సాంస్కృతిక విధ్వంసరచనతో బూషాడు వస్తుంటే వాడితో చేయి ఎలా కలపను అంటున్నారు షాజహాన.

"చుట్టూ సముద్రాల సెటిల్లో కడిగినా
వాడి చేతుల రక్తం పోదు
ఆ చేతులతో కరచాలనం ఎలా చేస్తా?

వేయి నాలుకలు చాస్తూ
వస్తున్న వింత జంతువు

వాడికెలా స్వాగతం పలుకుతాం?! మన రాష్ట్రానికి వచ్చిన బుష్‌ను నిరసిస్తూ ద్వేషిస్తూ బూషాడా... గోబ్యాక్! అంటున్నారు షాజహాన్ (బూషాడా... గో బ్యాక్, పే-162)

మొత్తంగా ముస్లిం కవిత్వాన్ని పరిశీలిస్తే వస్తువుకు శిల్పానికి మధ్య చక్కటి సఖ్యత కనబడుతుంది. అనుభవ సారాన్ని తమ సొంత భాషలో వ్యక్తీకరించడం ద్వారా ఈ అభేద్యం సాధించారనిపిస్తుంది. వస్తు శిల్పాల సమతుల్యతకు భాష ఎంత దోహదపడిందో అంతగానే కొత్తకొత్త ప్రతీకలకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు తోడ్పడింది. మొత్తంగానే ఈ కొత్త ప్రతీకలు, మధుర భాషా పదాలు తెలుగు సాహిత్యంలో చలనానికీ కవిత్వంలో కొత్త ఒరవడికి దారితీసాయి. తెలుగు సాహిత్యం వస్తు, శిల్పపరంగా, భాషాపరంగా మరింత గాఢతను సంతరించుకుంది. ఈ వాతావరణం ముస్లిమేతరులను కూడా ముస్లిం జీవితాల్ని కవిత్వీకరించేలా చేసింది. ఆ మేరకు ముస్లిం సాహిత్యం తెలుగులో తన ప్రభావాన్ని బలంగానే వేసింది.

"ఇంతకాలం ప్రపంచాన్ని హైందవ ఆధిపత్య దృక్కోణం నుంచే చూడటం జరిగింది. ముస్లింవాదం ఈ దృక్కోణాన్ని ఛేదిస్తుంది. ముస్లింవాద దృక్కోణం నుంచే ప్రపంచాన్ని చూస్తుంది. హిందూ ఆధిపత్యవాదాన్ని ఛేదించడం అంటే ఆ స్థానంలో ముస్లిం వాదాన్ని స్థాపించడం కాదు. ఎటువంటి ఆధిపత్యాలకు ఆస్కారం లేని మానవీయ సమాజాన్ని స్థాపించడం. నిజమైన సామాజిక ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడం - (ఖాదర్ మొహియుద్దీన్, పే-10; సూఫీతత్వం సరైన మార్గం).

ఇండియాలో ముస్లింల పరిస్థితి వెనుక నుయ్యి ముందుగొయ్యిలా ఉంది. అణచివేతకు గురౌతూ వెనకబడిన వర్గాల్లో ఇతర బలహీన, దళితవర్గాల కంటే ముస్లింల పరిస్థితి చాలా దుర్భరమైనది. స్వాతంత్ర్యం పూర్వం నుండి ముస్లింల ఆర్థిక రాజకీయ జీవితం ఎంత దయనీయంగా ఉన్నదో అందరికీ తెలిసినా ఎవరూ వారి తరుపున బలంగా వాదించిన వారు లేరు. దారిద్ర్యం, అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతుంటే చెయ్యిచాచి అభివృద్ధి ఫలాలను అందిపుచ్చుకోవడంలో సాయపడిన వారు లేరు. ఈ రోజు సచార్ కమిటి ముస్లింల పరిస్థితి ఎస్.సి, ఎస్.టిల కన్నా భిన్నంగా లేదని ప్రపంచానికి చాటెంత వరకూ ముస్లింల చీకటి జీవితాలు మేధావుల మెదుళ్లకు సోకనేలేదు. ఈ నివేదికను చూసి ముక్కున వేలు వేసుకొని అయ్యోపాపం ఇంత దయనీయ పరిస్థితి ఉందా? అని సానుభూతి కురిపిస్తూ అభ్యుదయాన్ని ప్రదర్శిస్తున్నారందరు.

ముస్లింలు కొన్ని సందర్భాలలో ఆర్థికంగా దళితులకన్నా భిన్నంగా లేకపోవడం వాస్తవమైతే, దళితులపై అమలవుతున్న వివక్షకంటే దారుణమైన అవమానాల్ని, అపవాదుల్ని ముస్లింలు దినదినము క్షణక్షణమూ ఎదుర్కోవలసి వస్తుంది. ఇది ముస్లింలపై అదనంగా అమలవుతున్న హిందూ ఆధిపత్య రాజ్య అణచివేత. దళితుల విషయంలో కాలి కింది నేల జారిపోతుందనే అభద్రతకు తావులేదు. వివక్షకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసి తమ ఆత్మగౌరవాన్ని చాటుకుంటున్నారు. కానీ ముస్లింలకు ఈ నేలపై జీవించాలంటేనే తమనితాము ఈ దేశపౌరులుగా తమ విశ్వసనీయతను చాటుకోవాల్సిన ఒక దుర్మార్గ పరిస్థితి అమలవుతుంది. 'ఈ దేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందే' నని గోడమీద రాతలు ముస్లింల గుండెల్ని ఎంతగా గాయపరుస్తున్నాయో మాటల్లో చెప్పడం కష్టం. చుట్టూ జరుగుతున్న సంఘటనల పట్ల ప్రతిస్పందన లేకుండా మౌనంగా తలదించుకొని, చూపుల్ని కాలి కింది నేలకు అదిమిపట్టి బతుకు సాగదీస్తున్న ముస్లింల అసహాయత, అశక్తతలకు కారణం అస్తిత్వ నిరాకరణ సమస్యనే. ఎప్పటికీ ప్రశ్నించలేనంతగా తన అస్తిత్వాన్ని ప్రకటించుకోవడానికే సాటి ముస్లిం జీవితం అంతర్గతంగా ఎంతో ఘర్షణకు గురౌతుంది. ఈ అస్తిత్వ నిరాకరణను అధిగమిస్తే ముస్లింలు సాటి బహుజన దళిత వర్గాలతో సమానంగా ఈ దేశంలో జరిగే పోరాటాల్లో భాగస్వాములవుతారు.

జీవితాన్ని వెతుక్కుంటూ
శబ్దమై ప్రతిధ్వనించినప్పుడల్లా
నా పౌరసత్వం గొలుసుల్లా ఒరుసుకుంటుంది
ప్రమేయం లేకుండానే నేను నిందార్హుణ్నవుతాను

- ఎస్.షమీ ఉల్లా (విశ్వాస ప్రశ్న, పే - 102)

ముఖ్యంగా ఇండియాలో ముస్లిం సమాజం ఏకశిలా సాదృశ్యం కాదు. ముస్లింలలో ఆర్థికంగా అనేక సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ఉన్నారు. అలాగే మతపరంగా విశ్వాసాల్లో భిన్నత్వమున్నది. మొదటి నుండీ ముస్లిం రచయితలు చెప్తున్నట్లు ఏకకాలంలో ముస్లింలు రెండు పోరాటాలను చేయాలి. ఒకటి అంతర్గతంగా తమ మత ఆధిపత్యాన్ని, మత మౌఢ్యాన్ని ఎదిరించడమైతే అదే క్రమంలో అంతకంటే బలమైన బాహ్య శత్రువుతో పోరాటం కొనసాగించాలి. ఈ బాహ్య శత్రువు హిందూ ఆధిపత్య రాజ్యరూపంలో ఉన్నది. ఈ హిందూ ఆధిపత్య శక్తులు అనుక్షణం వెంటాడుతూ అస్తిత్వ ప్రశ్నను లేవనెత్తుతూ ముస్లింలను ఒక అభద్రతకు గురిచేస్తూ పోరాటతత్వాన్ని ఎప్పటికప్పుడూ తన రాజ్యయంత్రాంగంతో నియంత్రిస్తున్నాయి. దీంతో ముస్లింలు సమకాలీన పోరాటాలకు సంఘీభావం ప్రకటించి వాటిలో భాగస్వాములు కాలేకపోతున్నారు. అలా పోరాటాలకు దూరంగా ఉండిపోయిన ముస్లింలను సామాజికోద్యమాలు అంతే నిర్లక్ష్యంగా చూస్తున్నాయి.

ఇదే నేను జీవించ వతన్ అని
ఇదే నేను సమాధినై నిలిచే ఖబరస్తాన్ అని
నిజం చెప్పు - ఎన్నిమార్లు చెప్పను నీకు!?

- ఎస్.బి.రహమతుల్లా (శశిశ్రీ) (అస్తిత్వం, పే-122)

ఏ వర్గమైనా ఆర్థికంగా వెనకబడి అణచివేయబడ్డా పోరాట రహితంగా ఉండటమనేది సాధ్యంకాదు. అయితే ముస్లింలు యిలా ఉండటానికి వారినే కారణంగా చూపుదామా? స్వాతంత్ర్యం వచ్చి అరవై ఏళ్ళు కావస్తున్న ఇంకా కాందిశీకుల ముద్రను మోస్తున్నందుకు ముస్లింలనే ప్రశ్నిద్దామా? తాము ఈ దేశ వాసులమేనని ఎంతకాలం తమ అస్తిత్వాన్ని ప్రకటించుకుంటూ ఉండాలి? ముస్లింలు ఇంకా ఈ అపవాదుకు గురౌవుతున్నందుకు దళిత బహుజన ఉద్యమం మొదలు సామాజికార్థిక రాజకీయ మార్పుకై పోరాటం చేస్తున్న ఉద్యమాలు బాధ్యత వహించవలసి ఉంటుంది. ఇలాంటి ఉద్యమాల్లో ముస్లింలు భాగస్వాములు కావాలన్నా, లేదా తమ సమూహం కోసం తామే పోరాడాలన్నా ముందుగా అపవాదులను, అసత్య ప్రచారాలను తిప్పికొట్టడం కాదు, పూర్తిగా నిర్మూలించాల్సి ఉంటుంది. సామాజిక చైతన్యంతో ప్రజాపోరాటాల్లో భాగస్వాములు కావాలంటే ముఖ్యంగా ముస్లింల అభ్యున్నతికి ఉద్యమించాలంటే రాజ్యం వేసే ఐ.ఎస్.ఐ. ముద్ర నుంచి తప్పించుకోవడం సాధ్యంకాదు. ఐ.ఎస్.ఐ. బూచితోనే ముస్లిం మేధావులు, చైతన్యపరులు వెనకడుగు వేస్తున్నారు. ఐ.ఎస్.ఐ బూచితో రాజ్యం చేస్తున్న హత్యలపై హక్కుల సంఘాల, ప్రగతిశీలుర ప్రతిస్పందన ఏమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానాలు వెదుకుతూనే, ముస్లింల రాజకీయ వెనుకబాటును గుర్తించి రాజకీయంగా చైతన్యపరచాలి. ఈ విషయంలో ముస్లిం సాహిత్యం నిరాశనే మిగిల్చిందని చెప్పాలి. ముస్లిం రచయితలు హిందూ ఆధిపత్యాన్ని ప్రశ్నించినంతగా రాజ్యాన్ని నిలదీయడంలో వెనకబడి ఉన్నారు. హిందూ ఆధిపత్యాన్ని, రాజ్యాన్ని వేరు వేరుగా చూడ్డం వల్లనే నిరంకుశ రాజ్యాధికారాన్ని నిలదీయలేక పోతున్నారు. రాజ్యం హిందూమత ఆధిపత్య రూపంలో ఉన్నప్పుడు ముస్లింల పోరాటం రాజ్యానికి వ్యతిరేకంగా కూడా కొనసాగించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇతర వర్గాలతో కలిసి ఉమ్మడిగా వర్గపోరాటంలో భాగమై అణచివేతనూ అధికారాన్ని చెలాయిస్తున్న రాజ్యాన్ని నిర్మూలించే దిశగా సాగాలి. ఆ పోరాటంలో పీడితులుగా ముస్లింలూ చేతులు కలిపి ఆ దిశగా ముస్లిం రచయితలు ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా కలిసి నడుస్తారని ఆశిద్దాం.

*

వీరుని జననం

వి. స్వేఛ్ఛ

సూర్యుడు ఉన్నాడనడానికి నువ్వు సాక్ష్యం కావాలన్నావు
రాత్రంతా దానికోసం మాట్లాడుతూ గడిపావు
అటు సూర్యోదయం అవుతుండగా
ఇటు నువ్వు నిద్రపోయావు
– జెలాలుద్దీన్ బల్ఖ్'రూమి'

వైట్‌హౌజ్ నుంచి రహస్య ఆదేశాలు పంపించి
ఎలిబీ కోసం క్యాంప్ డేవిడ్‌కు విశ్రాంతికి వెళ్లావు
తెల్లవారదు హుజూర్ అని చెప్పంపాడు తైనాలే
కాళ్ల కింద భూకంపమూ
కళ్ల ముందు తుఫానూ భయపెట్టాయి
భూగోళమూ వ్యోమమూ చక్రం తిప్పిన నువ్వు
పారిపోయి బులెట్ ప్రూఫు కారులో దాక్కున్నావు
ఈ రాత్రెట్లా గడిచేను అని.

చీకటి ముసుగు తలారీలకు తెలియదు
సద్దాం వెలుగుతున్న మొహాన
ప్రజలు సూర్యోదయాన్ని పోల్చుకున్నారని;
గొర్రెలను తోలుకొని త్యాగాల పండుగకు
ప్రజలు తరలిపోతున్నారని
ఆశన్నూషన్నన్నదమ్ములని ఇప్పటిదాకా
మొహర్రం పండుగకు ధూలా ఆడేవాళ్లం
హుస్సేన్ హసన్‌ల వలెనే మొహర్రం బక్రీదులు

షియా సున్నీలు కవల పిల్లలని
నిప్పుల గుండంలో దూకి చెప్తుతాం

నేనయితే నాగరికంగా ఉరితీసేవాణ్ని
ఇరాక్ షియా పాలకులు
ఇషారా గ్రహించలేని
అనాగరికులని చెప్పదలుచుకున్నావు
నీకు సాక్ష్యాలు మిగిలినందుకు భయంగా ఉన్నది
ప్రజాస్వామ్యం ముసుగుకు ప్రతిఘటన
తన నేలమీద గాలిపై ప్రేమతో వేళ్లాడిన దేహం
తన మట్టిలో నిద్రపోతున్న అధ్యక్ష భౌతిక కాయం
ఆఖరి సందేశం
నిన్ను భయపెడుతున్నాయి

నిజానికి మరణశయ్యపై ఉన్నది నువ్వు
ఏదో సాజిష్ చేస్తూ సాకులు వెతుకుతూ

'ఇరాక్ జిందాబాద్ పాలస్తీనా జిందాబాద్
ముజహిదీన్ జిందాబాద్' అంటూ
మరణించిన అరబ్ వీరుడు
ఒడిలో మానవ బాంబు కట్టుకున్న
తల్లి కడుపులో మళ్లా పుట్టిండు.

BC1

KRSA10IM106



ARUNATARA
RNI REGISTERED NO. 21152/72 DECEMBER-2006

సద్దాం హుస్సేన్ : విల్లు - సంకల్ప పత్రం

- వరవరరావు

నేను సద్దాం హుస్సేన్‌ని వీరుణ్ని
నేను సదర్‌ని ఇరాక్ అధ్యక్షుణ్ని
అమెరికా సామ్రాజ్యవాద మరణశాసనం రచిస్తున్నాను
పదిహేనేళ్లుగా జంగ్‌లో జైల్లో ఫాంసీపై దఫన్‌లో

మృత్యువు ముందు మొహం దాచేదేముంది
నన్ను ప్రజాస్వామ్యం ముసుగేసుకున్న
ప్రపంచ తలారీ కళ్లల్లోకి ఆఖరిసారి చూడనీండి
నన్ను తాకడానికి వాని చేతులెట్లా వణుకుతున్నాయో
వాడు మిలిటరీ కోర్టు జాగ్రత్త చెప్పిన
సూర్యోదయం అవుతుందేమోనని హైరానయ్యాడు

నేనింకా సైనికునిగా గాలిలో వేళ్లాడుతుండగానే
నాడు ఫామ్‌హౌజ్‌లో పరేషాన్ అయిన సంగతి విన్నారు కదూ

మూడేళ్ల క్రితం వాడు ఇరాక్ మీద దాడి చేసినపుడు
ఆకురాలు కాలంలో ఒక ఇసుక తుఫాను వీచింది
ఆగామి వసంతానికి సంకేతమన్నాను జ్ఞాపకముందా
నేను ఉరికంబం ఎక్కినపుడు హంతక అధ్యక్షుని ఫామ్‌హౌజ్‌లో
భూమి కంపించింది తుఫాను వీచింది
నేలమీద ఎక్కడా దాక్కోలేక
బులెట్‌ప్రూఫ్ కారు బుష్‌లో ప్రాణాలరచేత పట్టుకున్నంత
కాలం కూడ పట్టలేదు నాదువా
ప్రపంచమంతా వ్యాపించడానికి

నేను ఖురాన్ విప్పీ విప్పక ముందే వాడు తాడు లాగాడు
నేను పదిహేనేళ్లుగా విప్పుతున్న వాని పాపాల చిట్టాను
ఏ ముసుగులో దాస్తాడు
నేను అరబ్బును నేను సిపాయిని నేను సదర్‌ను
ఆ లిబాజ్‌లోనే జీవించాను.

చావు దుస్తులు వేసుకోవడానికి
నేను సామ్రాజ్యవాదిని కాను
మార్కెటును కాను మనిషిని

అవును అధికారంలో
షియాలకు కుర్దులకు అన్యాయమేమైనా చేసానేమో
యాంకీలెవరు వాళ్ల ప్రాక్సీలెవరు
నన్ను నా ప్రజలు విచారించాలి
ఐక్యంగా ఉండమని చెప్పింది
ఆ నా ప్రజలకే

ఇరాక్ విముక్తమయి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకునేదాకా
నేనే ఇరాక్ అధ్యక్షుణ్ని
అహ్వాజ్ మట్టిపొరలనుంచి
అరబ్ దేశాలన్నిటిని ఐక్యం చేస్తాను
నిన్న అమెరికాకు వియత్నామ్ వినిపించిన
గుణపాఠాన్ని
రేపు మేము వినిపిస్తాం
ఇరాక్ పాలస్తీనా జిందాబాద్
ముజాహదీన్ జిందాబాద్
ఇన్‌ఖిలాబ్ జిందాబాద్

Printed Published Edited and Owned by CHALASANI PRASAD 33-13-3, Seetharamapuram, Vijayavada-520002.
Printed at Nagendra Printing Press, Govinda Rajulu Naidu Street, Vijayavada-2. Editor : Chalasani Prasad.

BC

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA101M106
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	73
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Vedavathi
పేజీలు విడదీసినది	Vedavathi
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good